సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 80

బుధవారం 11-6-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



*బడి తెరిచే వేళ



తమిళనాడు ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో పఠన విధానంపై తాజాగా జి.ఓ తెచ్చింది. దీని ప్రకారం ప్రతి వారం స్కూల్ బుక్స్‌తో పాటు సాహిత్యం, జి.కె, కళ, క్రీడా పుస్తకాలు చదవాలి. ఇప్పటికే అక్కడ 'పఠన ఉద్యమం' పేరుతో ప్రతి క్లాస్‌లో లైబ్రరీ పెట్టి ఎంచిన 120 పుస్తకాలు ఉంచారు. ఈ సంవత్సరం టాపిక్ వైజ్ చదువు పెట్టి దానికి సంబంధించిన మెటీరియల్ ఇస్తారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బడులలో పిల్లలకు లైబ్రరీలు, పఠన విధానంపై ఇలాంటి అడుగు పడాల్సి ఉంది.

ఇవి కూడా క్లాస్ పుస్తకాలే!

స్కూళ్లో లైబ్రరీ ఉండటం బ్లాక్‌బోర్డ్ ఉండటం అంత సహజం. కాని స్కూళ్లలో లైబ్రరీల నిర్వహణ చాలా నిర్ల క్ష్యంగా ఉంటుంది. లైబ్రరీ గదులు ఉండవు. ఉన్నా ర్యాక్స్ ఉండవు. ఉన్నా వాటిలో పుస్తకాలుండవు. ఉన్నా విద్యార్థు లకు పనికి వచ్చేవి ఉండవు. శాస్త్రీయమైన విధానంతో పిల్లలు చదవడానికి అవసరమైన పుస్తకాలు ప్రతి స్కూల్ లోని ప్రతిక్లాసులో విధిగా ఉండాలని వివిధ రాష్ట్ర ప్రభు త్వాల విద్యాశాఖలు కృషి చేయాలి. తెలుగు రాష్ట్రాల్లో ఈ పని అంతంతమాత్రంగానే సాగుతుండగా తమిళనాట ఉధృతంగా జరుగుతోంది.

బడులు తెరిచిన వేళ తమిళనాడు ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన జీవో ప్రకారం 1 నుంచి 8 తరగ తుల వారికి పఠన విధానం అకడమిక్ పుస్తకాలు, నాన్ అక డమిక్ పుస్తకాలుగా సాగాలని నిర్ణయించారు. అంటే చదు వుకు సంబంధించినవి, లోకజ్ఞానాన్ని, సృజనను ఇచ్చే సాహిత్య సంబంధమైనవి సమానంగా చదవాలన్నమాట. ఇందుకుగాను వారానికి ఒక టాపిక్ ఇచ్చి ఆ టాపిక్‌కు సంబంధించిన పుస్తకాలు క్లాస్‌రూముల్లో విద్యార్థులు చదవ డానికి ఉంచుతారు. ఉదాహరణకు: ఈ వారం మహనీ యులు అనే టాపిక్ ఇస్తే చరిత్రలో, స్వాతంత్ర్య పోరా టంలో, తమిళ సంస్కృతిలో గొప్ప గొప్ప పనులు చేసిన వారి గాథలు ఉన్న పుస్తకాలు క్లాసుల్లో ఉంచుతారు. పిల్లల కోసం ప్రతివారం ఎంచదగ్గ టాపిక్కులుగా కథలు, జంతు జాలం, పర్యావరణం, క్రీడలు, సైన్సు తదితరాలను నిర్ణ యించారు. క్లాసు పుస్తకాలు చదువుతూనే పై టాపిక్కుల్లోని ఒకోదానిని ఒకోవారం చదవాలన్నమాట. ఇవి కాకుండా కథలు చెప్పడం, కథలు పెద్దగా చదవడం, ఉపన్యాసం, గ్రూప్ డిస్కషన్ వంటి వాటికి సబ్జెక్ట్‌లతో సమానంగా ప్రాధాన్యం ఇవ్వనున్నారు.


తమిళనాడు క్లాస్ రూమ్‌లో పాఠ్యేతర పుస్తకాలు చదువుతున్న పిల్లలు

క్లాసులోనే లైబ్రరీ

2024లో తమిళ ప్రభుత్వం 'వాసిప్పు ఇయక్కం' (పఠన ఉద్యమం) పేరుతో పాఠశాల విద్యార్థులు నాన్ అకడెమిక్ పుస్తకాల్లో క్లాసుల్లో చదివేందుకు ప్రతి క్లాసులో లైబ్రరీలు ఏర్పాటుకు నడుం బిగించింది. 1 నుంచి 8 తరగ తుల్లో వివిధ కేటగిరీల్లో ప్రత్యేకంగా ఎంచిన 250 పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సంకల్పం. ఇప్పటికే వివిధ జిల్లాల్లోని బడుల్లో ప్రతి క్లాసులో 120 పుస్తకాలు ఉంచారు. ఇవి మొత్తం కోటీ ముప్పైలక్షల పుస్తకాలు అయ్యాయి. వీటిని వివిధ దశలుగా విభజించారు. అవి:

1. దోగాడు: ఈ కేటగిరిలో బొమ్మలు ఎక్కువ ఉండి ఒకటి రెండు వాక్యాల వచనం ఉంటుంది.
2. నడు: ఈ కేటగిరిలో బొమ్మలతోపాటు ఒక పారా గ్రాఫ్ అంత టెక్స్ట్ మాత్రమే ఉంటుంది. దోగాడులో, నడులో ఏ పుస్తకమైనా 33 పేజీలకు మించదు. ఎందు కంటే చిన్నపిల్లలకు సౌకర్యంగా ఉండాలి కాబట్టి.
3. పరుగు: ఈ దశలో వచనం ఎక్కువగా ఉన్న పుస్త కాలు ఉంటాయి.
4. ఎగురు: ఈ దశలు అన్ని రకాల పెద్ద సైజు పుస్త కాలు ఉంటాయి.

కథలు రాయించారు

ఒకవైపు పుస్తకాలు చదివిస్తూనే విద్యార్థుల చేత కథలు రాయించడం కూడా చేస్తున్నారు. రాసిన కథ లను విద్యాశాఖకు పంపితే వాటిలో మంచివాటిని ఎంపిక చేసి పుస్తకాలుగా వేస్తామన్నారు. ఈ ప్రతిపాద నకు కూడా వేల మంది విద్యార్థులు స్పందిస్తున్నారు. అలాగే టీచర్లు కూడా రాస్తున్నారు.

కావలసిన మార్పు

ఒకప్పుడు ప్రభుత్వ బడులలో పి.టి. పిరియడ్ అనీ, క్రాఫ్ట్స్ పిరియడ్ అనీ, ఎన్.సి.సి అనీ, రెడ్‌క్రాస్ అనీ.. ఇలా అనేక పిరియడ్స్ ఉండేవి. కాలక్రమంలో సబ్జెక్టులు తప్ప ఇంకేమీ మిగల్లేదు. అయితే దీనివల్ల విద్యార్థుల్లో వికాసం, సృజన, ఆలోచనా శక్తి, వివేచన పెరగడం లేదని గ్రహించిన వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు పుస్తకాలకు ప్రాధాన్యం ఇస్తు న్నాయి. కేరళలో, కర్నాటకలో ఈ పని సమర్థంగా జరుగు తుండగా తమిళనాడులో కూడా ఊపందుకుంది.

పుస్తకమే స్నేహితుడు

పిల్లలు చదువును ప్రేమిస్తారు. నిజమే. కాని చదువును మాత్రమే నేర్పిస్తూ ఉంటే బోర్ ఫీలవుతారు. వారికి కథలు కావాలి. బొమ్మలు కావాలి. అనేకానేక కబుర్లు కావాలి. ఊహను ఇచ్చే ఊసులు కావాలి. వాటిని వినడానికి, చదవ డానికి ఇష్టపడి సంగతులను ఆకళింపు చేసుకునే శక్తిని పెంచుకుంటారు. తమిళనాడులోలాగా ప్రతి ప్రభుత్వ బడి లోని ప్రతి క్లాసులో లైబ్రరీని ఏర్పాటు చేసే ఆలోచన తెలుగు రాష్ట్రాల్లో అమలు కావాలని కోరుకుందాం. •

లీగల్

మీ సెంటిమెంట్లకు ఇతరులను బలి చేయకండి!

ఇటీవలే ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో మాకు పాప పుట్టింది. మా ఆవిడ గర్భవతి అయినప్పటినుంచి ఒకే డాక్టరు వద్ద చూపిస్తు న్నాము. మా పంతులుగారిని అడిగి కాన్పుకు ముహూర్తం పెట్టుకున్నాము. హాస్పిటల్ వారికి చెప్పగా అలా చేయాలి అంటే 'ముహూర్తం చార్జెస్'గా 10 వేల రూపాయలు ఎక్కువ కట్టాలి అని చెప్పారు. సరేలే అని అది కూడా కట్టాను. కానీ, డాక్టరు మరొక ఎమర్జన్సీ సర్జరీ ఆలస్యం అవటం వలన మా డెలివరీ ఆలస్యం చేశారు. మరొక ముహూర్తం కోసం ఆ రోజు సర్జరీ కూడా ఆపటం కుదరదు అని చెప్పారు. అందువల్ల మా పాప దుర్ముహూర్తాన పుట్టింది. దుర్ముహూర్తంలో పుట్టటం వలన పాపకి జీవితాంతం కష్టాలే ఉండవచ్చు. అయితే పరిహా రాలు చేస్తే కొంతవరకు ఉపశమనం ఉంటుంది అని అంటు న్నారు. వీటంతటికీ కారణం అయిన హాస్పిటల్ మీద, డాక్టరు మీద చర్యలు ఎలా తీసుకోవాలో సలహా ఇవ్వగలరు.

– విక్రాంత్, సికింద్రాబాదు

బాగుందండి. చాలా బాగుంది. కేసు వేయటానికి కూడా ముహూర్తం పెట్టుకుంటారా? జడ్జిగారిని కూడా మీరు పెట్టు కున్న ముహూర్తానికే జడ్జిమెంట్ ఇమ్మని కూడా చెప్తామా? ఒకవేళ కేసు ఓడిపోతే ముహూర్త వైఫల్యం అంటారా లేక నా సలహా వైఫల్యం అంటారా? లేక ఏకంగా జడ్జి గారికి గ్రహణం పట్టింది అంటారా?

సెంటిమెంట్లు మీ వ్యక్తిగతం. మీ నమ్మకాన్ని మీరు పాటించవచ్చు, కాపాడుకోవచ్చు. అయితే అది చట్టానికి, న్యాయానికి, వ్యక్తిగత స్వేచ్ఛకి వ్యతిరేకంగా ఉండకూడదు! అదేవిధంగా ప్రకృతి విరుద్ధంగా కూడా ఉండకూడదు. ఎవరు ఎప్పుడు జన్మించాలి అనేది దేవునిపై నమ్మకం ఉన్న వారు దైవ నిర్ణయంగా భావిస్తే మంచిది. ఆధునిక వైద్య విధానం – సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో మీ నమ్మ కాన్ని జోడించి కాన్పు సమయాన్ని నిర్ణయించుకున్నారు. కానీ అదే సమయంలో ఇంకొక మనిషికి సహాయపడుతున్న డాక్టర్‌గారిని శిక్షించాలి అనుకుంటున్నారు. ఇది ఎంతవరకు సమంజసం?

మీకు ఇచ్చే జవాబు ద్వారా కార్పొరేట్ ఆసుపత్రి వారికి అలాగే ప్రభుత్వాలకి కూడా ఒక సూచన చేయాలి అనుకుం టున్నాను. రాజ్యాంగంలోని 51ఎ(జి) ఒకసారి చదవండి. ప్రభుత్వాలు శాస్త్రీయతను, మానవ విలువలను, తర్కాన్ని పెంపొందించాలి తప్ప మూఢనమ్మకాలను కాదు. వ్యక్తిగత నమ్మకాల కోసం మరొకరి జీవితాలను, హక్కులను కూడా లెక్కచేయను అనే ధోరణిని అరికట్టవలసిన అవసరం ఉంది. అధిక డబ్బు వసూలు చేసి మరీ ఇలాంటి ముహూర్తాలు పెట్టి కాన్పులు చేసే ప్రైవేటు ఆసుపత్రుల ,ధోరణిని నియంత్రిం చాలి.

ఇక మీరు అడిగిన విషయానికి వస్తే... మీ కేసులో ముహూర్తానికి 10,000 వసూలు చేసిన ఆసుపత్రి పై దావా వేసినా, కన్స్యూమర్ కోర్టును ఆశ్రయించినా మీరు కట్టిన డబ్బులు తిరిగి వచ్చే ఆస్కారం ఉంది. మీరు కేసు వేసి హాస్పి టల్ వారిపై ఫైన్ కూడా విధించాలి అని కోరండి. మీ కేసులో డబ్బులు తిరిగి వచ్చినప్పటికీ, మరొకసారి ఇలాంటి మతి లేని పనులు చేయడం మానేస్తారు హాస్పిటల్ వారు! మ్యాజిక్ రెమిడీస్ యాక్ట్, 1954, పరిధిలోకి ఇలాంటి హాస్పి టళ్లను తీసుకురావాలి.



– శ్రీకాంత్ చింతల,
హైకోర్టు న్యాయవాది

మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.com కు మెయిల్ చేయవచ్చు.

ఆర్ట్ అండ్ కల్చర్

ప్రపంచానికి పచ్చబొట్టు

ఒకప్పుడు చేతిపై బైగ పచ్చబొట్టు కనిపిస్తే... 'పక్కా పల్లెటూరు వాళ్లు' అని వెక్కిరించేవాళ్లు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఆదివాసీ పల్లెల్లో ఒక వెలుగు వెలిగిన బైగ టాటూ ఆర్ట్ మిణుకు మిణుకుమంటూ ఆరిపోయే స్థితికి చేరుకుంది. ఆ కళ మళ్లీ ఉజ్వలంగా వెలిగేలా గల్లీ నుంచి ఢిల్లీ వరకు కృషి చేస్తోంది ఆదివాసీ మహిళ మంగళ బాయ్. మధ్యప్రదేశ్‌లోని మారుమూల పల్లె లాల్‌పూర్ నుంచి సిడ్నీ వరకు బైగ టాటూ ఆర్ట్‌ను తీసుకువెళ్లిన మంగళ బాయ్...


మంగళ బాయ్

మధ్యప్రదేశ్‌లోని దిందోరీ జిల్లాలోని చిన్న గ్రామం అయిన లాల్‌పూర్‌లో పుట్టింది మంగళబాయ్. తల్లి శాంతి బాయ్ బైగ టాటూ ఆర్టిస్‌గా గొప్ప పేరు పొందింది. తల్లి నుంచి బైగ ఆర్ట్‌ను నేర్చుకుంది మంగళ.

శాంతిబాయ్ ఎవరికైనా టాటూ వేస్తుంటే 'నేను వేస్తాను' అంటూ తల్లిని బతిమిలాడేది.

'అలాగే' అంటూ ఒకటి, రెండు గీతలు వేసే అవకాశం ఇచ్చేది శాంతి బాయ్. ఈ మాత్రం దానికే మంగళ ఏనుగు ఎక్కినంత సంబరపడిపోయేది.

ఏడు సంవత్సరాల వయసు నుంచే బైగ టాటూ వేయడం మొదలు పెట్టింది మంగళ. పదకొండు సంవత్సరాల వయసులో తన బైగ ఆర్ట్‌ను నేషనల్ ఎగ్జిబిషన్‌లలో ప్రదర్శించే స్థాయికి చేరుకుంది.

పాత కళకు కొత్త కళ

బైగ టాటూ ఆర్ట్‌లో చెట్ల నుంచి పక్షుల వరకు, ఆదిమ చరిత్ర నుంచి పురాణాల వరకు ఎన్నో ప్రతీకలు కనిపిస్తాయి. వాటికి అర్థం ఏమిటి? అనేది తెలుసుకో వడం గురించి ఎంతో శోధన చేయడమే కాదు నుదురు, మెడ, భుజాలు... శరీర భాగాలకే పరిమితం అయిన 'బైగ'ను కాగితం, కాన్వస్ పైకి తీసుకురావడం ద్వారా ఆ కళకు కొత్త వెలుగు తీసుకువచ్చింది మంగళ. కాగితం, కాన్వస్‌పైకి తీసుకురావడం ద్వారా బైగ టాటూ ఆర్ట్ పునర్జీవానికి కొత్త మార్గాన్ని కనిపెట్టింది.

అంతర్జాతీయ స్థాయిలో... ఆహా!

మారుమూల ఆదివాసీ పల్లెలకే పరిమితమైన బైగ టాటూ ఆర్ట్‌ను అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లి ఆహా అనిపిస్తోంది మంగళ. 'యూనివర్శిటీ ఆఫ్ సిడ్నీ'లో జరి గిన గ్లోబల్ ఎగ్జిబిషన్‌లో మంగళ ఆర్ట్‌వర్క్‌కు మంచి స్పందన లభించింది. 'మా సంప్రదాయ కళని అంతర్జా తీయ స్థాయికి తీసుకెళ్లడం గర్వంగా ఉంది. ఇది మా కళ అని ప్రతి ఆదివాసీ గర్వ పడేలా చేసింది' అంటుంది మంగళ.



అనేక అంశాల ప్రతీక... బైగ

మోడ్రన్ బాడీ ఆర్ట్‌తో పోల్చితే బైగ డెకరెటివ్ కాదు. రియలిస్టిక్‌గా ఉంటుంది. ఆధ్యాత్మిక స్ఫూర్తి, ప్రకృ తిలో తమకు ఉన్న అనుబంధం, జీవి తంలోని వివిధ దశలు ఈ కళలో ప్రతి ఫలిస్తాయి.

మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లోని ఆది వాసీ పల్లెల్లో అమ్మాయిలలో కొందరికి 'బైగ'పై ఆసక్తి ఉన్నప్పటికీ తల్లిదం డ్రులు ప్రోత్సహించడం అరుదు. 'బైగ' వల్ల పిల్లల చదువు దెబ్బతింటుందని వారి భయం. 'ఈ కాలం పిల్లలు మోడ్రన్‌గా ఉండాలనుకుంటున్నారు. సంప్రదాయ కళలలోని గొప్పదనం వారు గ్రహించడం లేదు' అంటుంది మంగళ.

గల్లీ నుంచి ఢిల్లీ వరకు 'బైగ' కళ గురించి విస్తృత ప్రచారం చేస్తున్న మంగళకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారమూ అందలేదు. అయితే దాని తాలూకు అసంతృప్తి ఏదీ ఆమె మాటల్లో వినిపించదు.

ఎంతోమంది దృష్టికి వచ్చేలా...

నిరాశపరిచే మాటలు ఎన్ని వినబడినా బైగ కళపై ఎప్పుడూ నమ్మకం కోల్పోలేదు మంగళ. తాను ఊహించని స్థాయిలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో బైగకు ఆదరణ లభిం చింది. అంతర్జాతీయ ఎగ్జిబిషన్ లలో పాల్గొనడం వలన 'బైగ' ఆర్ట్‌ను విద్యావంతులు, ఆంత్రో పాలజిస్టులు, ఆర్ట్ కలెక్టర్‌ల దృష్టికి వచ్చేలా చేసింది.

'నా లక్ష్యం బైగకు సంబంధించి ఘనమైన గతాన్ని గుర్తుకు తేవడం కాదు. భవిష్యత్ తరాలకు దాని విలువ తెలియజే యడం. దాన్ని కాపాడుకునేలా చేయడం' అంటుంది మంగళ.

'మన దేశంలో బైగ ఆర్ట్ అంతరించిపోకుండా ఉండడానికి మంగళ ఎంతో కృషి చేశారు. ఈ కళను బతికించుకోవడానికి ధైర్యం, శక్తి కావాలి. అవి మంగళలో ఉన్నాయి' అంటున్నాడు మంగళ బాయ్ అసిస్టెంట్ అమిత్.

మార్పు వస్తుంది

మోడ్రన్ టాటూలు ఆకర్షణీ యంగా ఉన్నప్పటికీ సంప్ర దాయ టాటూలకు ఉన్న విలువ వేరు. అవి మన చరిత్ర, సంస్కృతి, పురాణాలతో ముడిపడి ఉన్నవి. ప్రతి ప్రతీకకు ఒక అర్థం ఉంటుంది. బైగ అనేది మన మూలాలను గుర్తుకు తెచ్చే కళ. నా చిన్న ప్పుడు అమ్మ ఊరూరికీ వెళుతూ మహిళలకు బైగ టాటూ వేసేది.

ఒంటిమీద బైగ టాటూ ఆర్ట్ కనిపిస్తే ఎవ రైనా వెక్కిరిస్తారేమో అనే భయం ఉండేది. బైగను ప్రపంచ స్థాయికి తీసుకువెళ్లడం వలన వారిలో మార్పు వస్తుందని, 'ఇది మా కళ' అని గర్వంగా చెప్పుకునే రోజు వస్తుంది అని ఆశిస్తున్నాను.

– మంగళ బాయ్

● కిచెన్ టిప్



బ్రెడ్ టోస్ట్ చేసేటప్పుడు వచ్చిన పొడిని, మిగిలిపోయిన బ్రెడ్‌ను పొడి చేసుకుని ఫ్రిజ్‌లో ఉంచుకుని కూర పలుచగా ఉన్నప్పుడు కలుపుకుంటే చిక్కబడుతుంది.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) జూన్ 10న ముగింపు రూ.లలో

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	97,210
బంగారం (22 క్యారెట్లు)	90,157
వెండి	1,05,300
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	98,800
బంగారం (22 క్యారెట్లు)	89,450
వెండి	1,09,400
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	97,580
బంగారం (22 క్యారెట్లు)	89,450
వెండి	1,19,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	98,800
బంగారం (22 క్యారెట్లు)	92,130
వెండి	1,09,400
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	96,450
బంగారం (22 క్యారెట్లు)	88,730
వెండి	1,04,000
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	97,580
బంగారం (22 క్యారెట్లు)	89,450
వెండి	1,19,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

పద్నాలుగేళ్లలోపు పిల్లలు సోషల్ మీడియా యాప్‌ల వాడకంపై, పరిమితులు విధించాలని ప్రభుత్వం పరిశీలిస్తోంది. ఆన్‌లైన్ భద్రతా చట్టాల విషయంలో వివిధ దేశాలు కచ్చితమైన విధానాలనూ అమలుపరుస్తున్నాయి. కానీ, సోషల్ మీడియా మంచి చెడులు పిల్లల విషయంలో ఎప్పుడూ ప్రశ్నార్థకమే. పిల్లలపై సోషల్ మీడియా తీవ్ర ప్రభావం చూపుతున్న తరుణంలో, తల్లితండ్రులే తప్పనిసరి జాగ్రత్తలు తీసుకోవాలంటున్నారు నిపుణులు.

సోషల్ మీడియా పరిమితులు

పిల్లలకు ఫోన్‌పై స్మార్ట్‌చెక్



పిల్లలు సోషల్ మీడియాలో గడపగల సమ యాన్ని పరిమితం చేయడానికి, కఠినమైన ఆన్ లైన్ భద్రతాచర్యలను ప్రవేశపెట్టాలని ప్రభు త్వాలు పరిశీలిస్తున్నాయనే వార్తలు కొంత ఊరట నిస్తున్నాయి. పాశ్చాత్య దేశాలు పిల్లలు వ్యక్తిగత సోషల్ మీడియా యాప్‌ల వాడకంపై రోజుకు రెండు గంటల పరిమితి విధించి, ఇరవై రెండు గంటల పాటు బంద్ విధించాలనే ప్రతిపాదనలు ఉన్నట్టు నివేదికలూ సూచిస్తున్నాయి.

స్మార్ట్ వ్యసనంపై టాక్ షో

బీబీసీ నిర్వహించిన సండే విత్ లారా కుయెన్స్‌బర్గ్ నిర్వహించిన టాక్‌షో లో పాల్గొన్న యూకే టెక్నాలజీ కార్యదర్శి పీటర్ కైల్‌ను 'సో షల్ మీడియా పిల్లల సమయ పరిమితుల గురించి అడిగినప్పుడు, కైల్ స్పందిస్తూ 'కొన్ని యాప్‌లు పిల్లలను స్మార్ట్‌ఫోన్‌కు అంటిపెట్టుకుని, ఫోన్ వ్యసన పరులయేలా చేస్తున్నాయి. వాటి బారి నుంచి పిల్లలను రక్షించడానికి ఆన్‌లైన్ భద్రత చట్టాల అమలుకు కృషి జరుగుతోంది' అన్నారు.

ఆన్‌లైన్‌లో హానికరమైన కంటెంట్‌ను చూసి, తన 14 ఏళ్ల కూతురు మోలీ ఆత్మహత్య చేసుకుం దని, ఆన్‌లైన్ భద్రతా చట్టాలను తీసుకురావ డంలో ప్రభుత్వం ఆలస్యం చేస్తోందని, సరైన నియంత్రణ లేకపోవడం, సాంకేతికత దుర్విని యోగం వల్ల ఎక్కువమంది యువత ప్రాణాలు కోల్పోవడాన్ని, ఆరోగ్యాలు దెబ్బతినడాన్ని చూశాం' అని ఇయాన్ రస్సెల్ అనే వ్యక్తి వేద నతో తెలిపారు. దీనికి కైల్ స్పందిస్తూ– 'పిల్లలు ఆన్‌లైన్‌లో ఎదుర్కొంటున్న హాని సునామీని అరి కట్టడానికి ప్రభుత్వం నిర్ణయాత్మకంగా వ్యవహ రించడాన్ని చూసి దేశంలోని తల్లిదండ్రులు సంతోషిస్తారు. కానీ స్మార్ట్ ఫోన్లకు ప్లాస్టర్‌లను అతికించలేం. పరిమితులను విధించడం వల్ల మేలు జరగదు. ఆరోగ్యకరమైన ఆన్‌లైన్ జీవితం ఎలా ఉంటుందో పిల్లలు అర్థం చేసుకునేలా అవ గాహన కల్పించాలి' అంటూ అనిత ఈ షోలో తెలిపారు.

మనం పరిమితులను ఎంచుకోవచ్చు

యాప్స్‌కి, డిజిటల్ పరికరాలను నియంత్రిం చేందుకు ఇప్పటికే తల్లిదండ్రులకు కొన్ని వెసులు బాట్లు ఉన్నాయి. టిక్‌టాక్ 2023లో 18 ఏళ్లలోపు వారికి డిఫాల్ట్‌గా 60 నిమిషాల స్క్రీన్ సమయ పరిమితిని ప్రవేశపెట్టింది. ఇన్‌స్టాగ్రామ్ అన్ని వయసుల వినియోగదారులను వారి స్వంత పరిమితిని సెట్ చేసుకోమంటుంది. ఎంత సమయం బ్లాక్ చేయవచ్చో కూడా ఎంచుకో వచ్చు. 2021లో, చైనా ఆన్‌లైన్ గేమింగ్‌పై కఠిన మైన ఆంక్షలు విధించింది. వారాంతాల్లో, సెలవు దినాల్లో మాత్రమే 18 ఏళ్లలోపు గేమర్స్‌ను రోజుకు ఒక గంటకు పరిమితం చేసింది. సెలవు దినాల్లో మూడు గంటలకు పెంచింది. యువతపై గేమింగ్ ప్రభావం గురించి తన ఆందోళనలను ఉదహరించి, మరీ ఈ నిబంధనలను విధించింది కేంద్రం. కానీ గత సంవత్సరం డ్రాఫ్ట్ అప్‌డేట్ ప్రభుత్వ వెబ్‌సైట్ నుండి అదృశ్యమైంది.

ప్రభుత్వాలు అమలు చేయాలనే కఠిన నిబం ధనలకన్నా ముందు కౌమారదశలో ఉన్న పిల్ల లకు డిజిటల్ సేవలు ఎలా పొందాలో అవగా హన కల్పించడం ముఖ్యం అనేది స్పష్టంగా అర్థం అవుతుంది.

తల్లిదండ్రులూ ఇవి అమల్లో పెట్టండి

- టెక్నాలజీని బ్లాక్ చేయవద్దు. పిల్లలకు సురక్షి తంగా సాంకేతికతను ఎలా ఉపయోగించాలో నేర్పించాలి.
- పిల్లలకు ఇష్టమైన యాప్‌లు, సైట్లు గురించి ఆసక్తి చూపుతూనే, వారు వాటిని ఎలా ఉప యోగిస్తున్నారో కూడా తెలుసుకుంటూ ఉండాలి..
- పేరెంట్స్ స్మార్ట్‌ఫోన్ వాడకంలో పరిమితులు నిర్దేశించాలి. ఫిల్టరింగ్ సాఫ్ట్వేర్ వాడేలా జాగ్ర త్తపడాలి.
- కుటుంబ మీడియా ఒప్పందం అంటే.. ప్రయాణం, భోజనం, పడక సమయాలు వంటి ప్రదేశాలను టెక్నాలజీ ఫ్రీ జోన్లుగా మార్చాలి.
- ఆన్‌లైన్‌లో వ్యక్తిగత సమాచారం గురించి ఏమాత్రమూ వెల్లడించకూడదు అనే విష యాన్ని బోధించాలి.
- ఆన్‌లైన్‌లో సమాచారాన్ని ఫిల్టర్ చేయడం, నిజం – అబద్ధం మధ్య తేడా తెలుసుకోవ డంలో సహాయపడాలి.
- ఆరుబయట పచ్చదనం, స్క్రీన్ టైమ్ మధ్య సమతుల్యతను పాటించాలి. వారి శారీరక అభివృద్ధిపైన దృష్టి పెట్టాలి.
- 14 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియా యాప్స్ సైన్ అప్ చేయడంలో సహాయం చేయవద్దు.
- సోషల్‌మీడియాలో నమ్మదగిన వనరులను అన్వేషించి, వాటిని అందుబాటులో ఉంచాలి.

పిల్లలకు ఇంటర్నెట్ సేఫ్టీ

- చాలా సైట్లు, వెబ్ టూల్స్ 13 ఏళ్ల పై వయ సున్న యూజర్ల కోసం ఉంటాయి. ఇవి ఆన్ లైన్‌లో కాపీరైట్‌తో భద్రపరిచి ఉంటాయి. ఆన్‌లైన్‌లో చేస్తున్న వర్క్ గురించి తల్లిదం డ్రులకు పిల్లలు చెప్పాలి. తాము చూస్తున్న సైట్‌లో తప్పుగా ఏమైనా అనిపించిన ప్పుడు, ఉపయోగించడంలో మెళకువలు తెలియనప్పుడూ టెక్నాలజీ తెలిసిన పెద్ద వారిని అడగాలి.
- ఆన్‌లైన్‌లో స్నేహితులను తల్లిదండ్రుల అనుమతి లేకుండా యాడ్ చేయవద్దు. అవ తలి వారు చెప్పిన ప్రతిదాన్నీ నమ్మవద్దు.
- వ్యక్తిగత సమాచారాన్ని ప్రైవేట్‌గా ఉంచాలి. పేరు, చిరునామా, ఫోన్ నంబర్, పాస్‌వ ర్డ్‌లు, ప్లానింగ్‌లు, పుట్టినరోజు.. వంటివి షేర్ చేయవద్దు.
- ఏది బడితే అది పోస్ట్ చేయకూడదు. అది ఒక్కోసారి భవిష్యత్తుకు ప్రమాదంగా మారవచ్చు.
- మీరు లేదా మీకు తెలిసినవారు బుల్లీ యింగ్‌కు గురైనట్లయితే వెంటనే ఆ విష యాన్ని పెద్దవాళ్లకు తెలియజేయాలి.



– అనీల్ రాచమల్ల,
డిజిటల్ వెల్‌బీయింగ్ ఎక్స్‌పర్ట్,
ఎండ్ నౌ ఫౌండేషన్

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 18
సంచిక: 80

బుధవారం 11-6-2025

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'



అఖిలపక్ష బృందాలకు ప్రశంస

పాక్ ఉగ్రవాదాన్ని ప్రపంచం ఎదుట ఎండగట్టిన అఖిలపక్ష బృందాలను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు.

వివరాలు 6లో ▸



పాక్ నడిబొడ్డున దాడి చేస్తాం

ఉగ్రదాడులతో రెచ్చగొడితే పాక్ నడిబొడ్డున దాడి చేస్తామని విదేశాంగ మంత్రి జైశంకర్ హెచ్చరించారు.

వివరాలు 6లో ▸



ఎన్ఎస్ఏ సభ్యునిగా జి.సతీష్‌రెడ్డి

డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ జి.సతీష్‌రెడ్డిని జాతీయ భద్రతా సలహా మండలి సభ్యుడిగా కేంద్రం నియమించింది.

వివరాలు 6లో ▸



టీడీపీ మూకలు నిప్పు పెట్టడంతో ఏలూరులోని సాక్షి కార్యాలయం ఆవరణలో తగలబడుతున్న ఫర్నిచర్

సాక్షి కార్యాలయాల వద్ద పచ్చ మూకల విధ్వంసం

- ఏలూరు ఆఫీస్ ఆవరణలో ఫర్నిచర్ తగులబెట్టి బీభత్సం
- రాజానగరం కార్యాలయం వద్ద సాక్షి బోర్డు పీకేసి దౌర్జన్యం

2లో

ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ఎలా వర్తిస్తుంది?

- కొమ్మినేనిపై నమోదు చేసిన సెక్షన్లపై న్యాయమూర్తి ఆగ్రహం
- ఎస్సీల గురించి మాట్లాడకుండానే ఆ యాక్ట్ పెట్టేస్తారా?.. గతంలో మెమో జారీ చేసినా మీ వైఖరిలో మార్పు రాలేదంటూ డీఎస్పీపై ఆగ్రహం
- ఈ కేసులో మీకు, ఎస్పీకి మెమో జారీ చేస్తా..
- ఎస్సీ, ఎస్టీ యాక్ట్.. 356(2) సెక్షన్‌ను తొలగించాలని ఆదేశం
- కొమ్మినేనికి 14 రోజుల రిమాండ్.. గుంటూరు జైలుకు తరలింపు

2లో

న్యూస్‌రీల్

గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలు విడుదల



గ్రూప్-1 మెయిన్స్ ఫలితాలను ఏపీపీఎస్సీ విడుదల చేసింది. మొత్తం 224 మంది ఇంటర్వ్యూలకు ఎంపికైనట్టు ప్రకటించింది. ఈనెల 17 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన చేసి.. 23వ తేదీ నుంచి 30 వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు తెలిపింది.

వివరాలు 14లో ▸


గిరిజన ఔట్‌సోర్సింగ్ టీచర్ల సమస్య పరిష్కరించండి



ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ టీచర్ల సమస్య పరిష్కరించాలని కూటమి ప్రభుత్వాన్ని జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశించింది. వారిని డీఎస్సీ నుంచి మినహాయించి.. కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి.. ఉద్యోగ భద్రత కల్పించాలని స్పష్టం చేసింది.

వివరాలు 14లో ▸

ఖరీఫ్ ముందుకు జరగాలి



ఖరీఫ్ పంటలను తుపాన్ల నుంచి రక్షించేందుకు వీలుగా పంటకాలాన్ని ముందుకు తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. 365 రోజులూ పంటలు పండించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏటా 3 పంటల విధానం తీసుకురావాలని చెప్పారు.

వివరాలు 11లో ▸

పీఎస్ఆర్‌కు తీవ్ర అస్వస్థత



రెడ్‌బుక్ అక్రమ కేసులో రిమాండ్‌లో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఆయనకు హృద్రోగ, ఊపిరితిత్తుల సంబంధ సమస్యలు ఉన్నాయని.. శస్త్ర చికిత్స చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు.

వివరాలు 10లో ▸

ఇదండీ సంగతి



కేవలం నకిలీ కరెన్సీ, నకిలీ సర్టిఫికెట్స్‌లాంటి కేసుల కోసమే ఏర్పాటు చేశారట... ఏదో నకిలీ కేసు పెట్టి వదిలేయమంటున్నార్సార్!

ఏడాది కూటమి పాలనలో ప్రభుత్వ విద్య నిర్వీర్యం

చదువు చతికిల'బడి'ంది

వ్యవస్థ అస్తవ్యస్తం.. దిగజారిన సర్కారు బడుల ప్రగతి

పాఠశాలల్లో అటకెక్కిన నాడు-నేడు అభివృద్ధి పనులు



- అమ్మ ఒడికి వీడ్కోలు.. ఇంగ్లిష్ మీడియానికి మంగళం
- డిజిటల్ క్లాస్‌రూమ్‌కు బైబై.. టోఫెల్ క్లాసులకు టాటా
- సీబీఎస్ఈ, ఐబీ బోధన ఎత్తివేత.. సబ్జెక్ట్ టీచర్లపై వేటు
- ఘోరంగా మారిన గోరుముద్ద.. దారుణంగా పడిపోయిన ఫలితాలు
- దీంతో ప్రభుత్వ బడులను వీడి విద్యార్థుల ప్రైవేటు బాట
- ప్రైవేటు యాజమాన్యాలకు మేలుచేసేలా కూటమి నిర్ణయాలు
- కార్పొరేట్ స్కూళ్లలో 10 నుంచి 30 శాతం పెరిగిన ఫీజులు
- దీనికి పుస్తకాలు, యూనిఫాం ఖర్చులు అదనం
- రాష్ట్రంలో 13 వేల ప్రైవేటు స్కూళ్లలో ఇదే పరిస్థితి
- పిల్లల చదువులపై తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన
- రాష్ట్రంలో రేపటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

10లో

> విజయనగరంలోని నారాయణ స్కూల్‌లో గత ఏడాది 3వ తరగతికి స్కూల్ ఫీజు రూ.48 వేలు, పుస్తకాలకు రూ.7,500, రిజర్వ్ నగదు రూ.1,000 (మొత్తం రూ.56,500) వసూలు చేశారు. ఈ ఏడాది స్కూల్ ఫీజును రూ.55 వేలు చేశారు. పుస్తకాలకు రూ.8,500 కట్టించుకున్నారు. రిజర్వ్ నగదు రూ.వెయ్యితో కలిపి రూ.64,500 వసూలు చేస్తున్నారు.
> ఇదే స్కూల్లో నిరుడు 4వ తరగతికి స్కూల్ ఫీజు రూ.50 వేలు, పుస్తకాలకు రూ.8,500, (రిజర్వ్ నగదు రూ.1,500) మొత్తం రూ.60 వేలు తీసుకున్నారు. నేడు స్కూల్ ఫీజును రూ.60 వేలకు పెంచారు. పుస్తకాలకు రూ.9,500 తీసుకున్నారు.

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

రైతులు, రేషన్ వాహనాల డ్రైవర్లకు వైఎస్ జగన్ భరోసా

- తాడేపల్లిలో వైఎస్సార్‌సీపీ అధినేతను కలిసి గోడు వెళ్లబోసుకున్న బాధితులు
- పంటలకు గిట్టుబాటు ధర లేదని వాపోయిన అన్నదాతలు.. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయిందని ఆవేదన
- వైఎస్సార్‌సీపీ రైతుల పక్షాన పోరాడుతుందని అభయమిచ్చిన జగన్
- ఇంటింటికీ సరుకులివ్వాలన్న గొప్ప ఉద్దేశంతో రేషన్ వాహన వ్యవస్థను తెచ్చింది మీరే
- కానీ, కూటమి ప్రభుత్వం అన్యాయం చేసింది.. జీవనోపాధి లేకుండా చేసింది
- జగన్‌తో మొరపెట్టుకున్న రేషన్ వాహన డ్రైవర్లు

2లో



నేడు ప్రకాశం జిల్లా పొదిలికి వైఎస్ జగన్

2లో

తెనాలిలో నడిరోడ్డుపై పోలీసుల చర్య అనాగరికం

- బహిరంగంగా కొట్టడం పెద్ద తప్పు
- చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం తగదు.. ఈ విషయాన్ని ఎల్లో మీడియా వక్రీకరించడం బాధాకరం
- తిమ్మిని బమ్మి.. బమ్మిని తిమ్మి చేయడంలో ఎల్లో మీడియా దిట్ట
- మాజీ సీఎస్ ఐ.వై.ఆర్ కృష్ణారావు

10లో



'ఐస్' మంటలు

లాస్ ఏంజెలెస్‌లో మరింత చెలరేగిన ఆందోళనాగ్ని



- దావానలంలా ఇతర నగరాలకూ వ్యాపిస్తున్న నిరసన జ్వాలలు
- రణరంగాన్ని తలపిస్తున్న అమెరికాలోని రహదారులు
- నిరసనజ్వాలల్ని బుల్లెట్ల వర్షంతో ఆపేస్తామన్న ఆ దేశ అధ్యక్షుడు ట్రంప్

- వివరాలు 6లో

అనంతపురంలో అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళలు



సేవ్ ఉమెన్.. సేవ్ ఆంధ్రా

- రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నిరసనలు
- ఆందోళనకు స్వచ్ఛందంగా తరలివచ్చిన మహిళలు
- అంబేడ్కర్ విగ్రహాలకు వినతిపత్రాల సమర్పణ
- హోంమంత్రి వెంటనే రాజీనామా చేయాలంటూ నినాదాలు

11లో

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం

రైతులు, రేషన్ వాహనాల డ్రైవర్లకు వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ భరోసా



వైఎస్ జగన్‌కు వినతిపత్రం అందజేస్తున్న రేషన్ వాహనాల డ్రైవర్ల యూనియన్ కృష్ణా జిల్లా నాయకులు



వైఎస్ జగన్‌ను కలిసిన ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కోకో, ఆయిల్‌పామ్ పొగాకు రైతులు

సాక్షి, అమరావతి: 'మీరు ఎవరూ అధైర్యపడొద్దు... వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుంది' అని రైతులు, ఇంటింటికీ రేషన్ వాహనాల(ఎండీయూ) డ్రైవర్లకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయనను ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన కోకో, ఆయిల్ పామ్, పొగాకు రైతులు, రేషన్ వాహనాల(ఏపీ ఎండీయూ–మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్) డ్రైవర్ల యూనియన్ కృష్ణా జిల్లా ప్రతినిధులు కలిశారు. 'మేం పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మా పరిస్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది' అని రైతులు వాపోయారు. దీంతో అన్నదాతలకు వైఎస్సార్‌సీపీ ఎప్పుడూ భరోసాగా ఉంటుందని, వారి పక్షాన పోరాడుతుందని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

- ఇంటింటికీ నిత్యావసర సరుకులు అందించాలన్న గొప్ప ఉద్దేశంతో రేషన్ వాహనాల వ్యవస్థను ఏర్పాటు చేసి... 9,260 మంది కుటుంబాలకు ఉపాధి కల్పించి, తమను ఆదుకున్నది మీరేనంటూ వైఎస్ జగన్‌కు రేషన్ వాహనాల డ్రైవర్లు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం తమకు అన్యాయం చేసిందని, రేషన్ వాహనాల డ్రైవర్లను తొలగించి జీవనోపాధి లేకుండా చేసిందని వాపోయారు. తమతోపాటు దాదాపు 10 వేలమంది హెల్పర్ల కుటుంబాలు కూడా కూటమి ప్రభుత్వ నిర్వాకంతో రోడ్డున పడ్డాయని గోడు వెళ్లబోసుకున్నారు. దీంతో వారికి అండగా ఉంటామని వైఎస్ జగన్ ధైర్యం చెప్పారు.

నేడు ప్రకాశం జిల్లా పొదిలికి వైఎస్ జగన్

- పొగాకు రైతుల కష్టాలు తెలుసుకునేందుకు పర్యటన
- పొగాకు బోర్డును సందర్శించి రైతులతో ముఖాముఖి

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బుధవారం ప్రకాశం జిల్లా పొదిలిలో పర్యటించనున్నారు. పొగాకు రైతుల కష్టాలను స్వయంగా తెలుసుకోనున్నారు. పొదిలి పొగాకు బోర్డును సందర్శించి.. రైతులతో ముఖాముఖి చర్చించనున్నారు. వైఎస్ జగన్ బుధవారం ఉదయం 10 గంటలకు తాడేపల్లి నివాసం నుంచి పొదిలికి బయల్దేరుతారు. పొగాకు బోర్డును సందర్శించి పొగాకు రైతులతో ముఖాముఖి అనంతరం మధ్యాహ్నం తాడేపల్లి నివాసానికి చేరుకుంటారు.

ఆయిల్‌పామ్ రైతులకు ఏమీ మిగలడం లేదు

నాకు నాలుగెకరాల ఆయిల్‌పామ్ తోట ఉంది. గతంలో సీజన్ లేనప్పుడు పామాయిల్ టన్ను రూ.21,400 ఉండేది. ఇప్పుడు రూ.18,600కు పడిపోయింది. పెట్టుబడి ఖర్చులు పెరిగాయి. గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులకు ఏం మిగలడం లేదు. ఇంకా ధర తగ్గితే మేం పూర్తిగా నష్టపోతాం. దయచేసి టన్నుకు కనీసం రూ.20 వేల మద్దతు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. మా సమస్యలను వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లాం. అండగా ఉంటానని ఆయన భరోసా ఇచ్చారు.

– అన్నవరపు గణేష్, రైతు, రావికంపాడు, చింతలపూడి నియోజకవర్గం, ఏలూరు జిల్లా

ధర్నాలు చేస్తున్నా పట్టించుకోవడం లేదు

మేం కోకో రైతులం. వైఎస్ జగన్‌కు మా సమస్యను వివరించాం. కోకోను ప్రైవేట్ కంపెనీలు గతంలో కేజీ రూ.వెయ్యికి కొనుగోలు చేశాయి. ఈసారి సీజన్ ప్రారంభంలో కేజీకి రూ.750 ఇచ్చి.. ఇప్పుడు రూ.400కి తగ్గించేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో మాత్రం కేజీ రూ.850కి అమ్ముతుంటే ఇక్కడ మాత్రం సిండికేట్ అయి రూ.300–400 మధ్య కొంటున్నారు. అదికూడా టీడీపీకి చెందిన రైతుల దగ్గరే కొంటున్నారు. పైగా నిరుడు ధర పలికిందని ఈ ఏడు కౌలు రేట్లు కూడా పెంచడంతో తీవ్రంగా నష్టపోతున్నాం. రైతులంతా ధర్నాలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇలాగైతే ఏం కావాలి? వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులం అని మా దగ్గర కొనడం లేదు. ఇవన్నీ వైఎస్ జగన్‌కు వివరించాం. మా సమస్యలు విన్న ఆయన తప్పనిసరిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

– తాతా రవి, రైతు, బాదరాల గ్రామం, ఏలూరు జిల్లా

కూటమి ప్రభుత్వం నిలువునా ముంచేసింది

కూటమి ప్రభుత్వం రేషన్ వాహనాల డ్రైవర్లను నిలువునా ముంచింది. వేలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. రేషన్ వాహనాలు ఉన్న సమయంలో బియ్యం పక్కదోవ పట్టాయన్నారు. కానీ.. ఈ నెలలో రేషన్ షాప్‌ల ద్వారా పంపిణీ చేస్తున్నా రాష్ట్రంలో అనేకచోట్ల బ్లాక్ మార్కెట్‌కు తరలుతూ పట్టుబడ్డాయి. ప్రభుత్వ పెద్దలు ఇప్పుడేం సమాధానం చెబుతారు? మాకు వాహన రుణాలు క్లియర్ చేస్తామని చెప్పి కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టింది. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. ప్రజలు రేషన్ షాప్‌ల వద్ద క్యూలైన్లలో నిల్చోలేకపోతున్నామని వాపోతున్నారు. పైగా సర్వర్లు పనిచేయడం లేదని డీలర్లు మళ్లీమళ్లీ తిప్పించుకుంటున్నారు. మేం వైఎస్ జగన్‌ను కలిసి సమస్యలు వివరించాం. తప్పకుండా మిమ్మల్ని ఆదుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు.

– పి.శ్యాంబాబు, రేషన్ వాహనాల డ్రైవర్ల యూనియన్ కృష్ణా జిల్లా ప్రెసిడెంట్

వీళ్లా మహిళల గౌరవాన్ని కాపాడేది?

చంద్రబాబు కూటమి ప్రభుత్వంపై వైఎస్ జగన్ ఆగ్రహం

- కోడలు మగ బిడ్డను కంటానంటే అత్త వద్దంటుందా.. అన్నదెవరు?
- అమ్మాయి కన్పిస్తే వెళ్లి ముద్దైనా పెట్టాలి.. కడుపైనా చేయాలని అనిందెవరు?
- అమ్మాయిలతో అసభ్య నృత్యాలు చేసిందెవరు?

సాక్షి, అమరావతి: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో రాష్ట్రంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అత్యాచారాలు, అఘాయిత్యాలను ఎత్తిచూపుతూ.. మహిళలపై గతంలో చంద్రబాబు, బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలు, లోకేశ్ వ్యవహరించిన తీరుకు సంబంధించిన వీడియోలను జత చేస్తూ.. వీళ్లా మహిళల గౌరవాన్ని కాపాడేదంటూ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.. సీఎం చంద్రబాబుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'మహిళల గౌరవం కాపాడటం' అనే ముసుగులో కూటమి నేతలు రాష్ట్ర వ్యాప్తంగా సాక్షి మీడియా కార్యాలయాలపై చేస్తున్న దాడులను, సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని అరెస్టును ఖండిస్తూ 'ఎక్స్'లో మంగళవారం ఆయన పోస్టు చేశారు. అందులో ఏం చెప్పారంటే..

అది రాజకీయ దురుద్దేశంతో జరిగిన అరెస్టు

'పారదర్శకత, అవినీతి రహిత, న్యాయబద్ధమైన, విప్లవాత్మక సంక్షేమ పథకాలతో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థవంతంగా పాలన చేసింది. కానీ.. చంద్రబాబు ప్రభుత్వ ఏడాది పాలన మోసాలతోనే కొనసాగింది. రెడ్ బుక్‌తో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేస్తూ నిరంకుశ పాలన సాగుతోంది. తన గొప్ప వాగ్దానాలను అమలు చేయలేని అసమర్థతతో ప్రజలను మోసగించిన చంద్రబాబు.. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు.. ప్రజల దృష్టి మళ్లించేందుకు అలజడి సృష్టిస్తున్నారు. సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు ఎప్పుడూ చేయని వ్యాఖ్యలను తప్పుగా చిత్రీకరించి తప్పుడు కేసు పెట్టి అరెస్టు చేయించారు. ఇది చట్టబద్ధంగా జరిగిన అరెస్టు కాదు. రాజకీయ దురుద్దేశంతో జరిగిన అరెస్టు. ఆయన చర్చను నిష్పక్షపాతంగా నిర్వహిస్తారు. ఆయన చేయని వ్యాఖ్యలను చంద్రబాబు ప్రభుత్వం వక్రీకరించి కొమ్మినేనిని బాధ్యులుగా చేయడం ఎంత అన్యాయం? వాస్తవాలను వక్రీకరించి ఒక పథకం ప్రకారం మహిళల గౌరవాన్ని కాపాడటం అనే ముసుగులో సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులు చేస్తున్నారు. కోడలు మగ బిడ్డను కంటానంటే అత్త వద్దంటుందా? అంటూ చంద్రబాబు, అమ్మాయి కన్పిస్తే వెళ్లి ముద్దయినా పెట్టాలి.. కడుపైనా చేయాలి.. అంటూ బాలకృష్ణ అన్న మాటలు.. అమ్మాయిలతో లోకేశ్ నృత్యం చేస్తున్న వీడియోలు.. వీళ్లా మహిళల గౌరవాన్ని కాపాడతామని చెప్పేది? ఈ వీడియోలు వారి నిజ స్వరూపాన్ని బట్టబయలు చేస్తున్నాయి. మహిళల పట్ల వారికి ఉన్న గౌరవాన్ని, విలువను చాటిచెబుతున్నాయి.

హామీ ఇచ్చిన భద్రత ఇదేనా?

రాష్ట్రంలో ఏడాదిలోనే 188 అత్యాచారాలు, 15 అత్యాచార హత్యలు జరగడం కూటమి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనం. ఇటీవలే అనంతపురం జిల్లాకు చెందిన ఇంటర్మీడియట్ గిరిజన విద్యార్థినిని హత్య చేసి, ఆమె మృతదేహాన్ని అడవిలో పడేశారు. ఏడుగుర్రాలపల్లిలో 9వ తరగతి చదువుతున్న దళిత బాలికను టీడీపీకి చెందిన 14 మంది ఆరు నెలల పాటు సామూహిక అత్యాచారం చేశారు. ఆమె గర్భవతి అయింది. తీవ్రమైన రాజకీయ ఒత్తిడి, పోలీసుల నిష్క్రియాపరత్వాల మధ్య ఆ బాధితురాలి కుటుంబం అదృశ్యమైంది. మహిళలకు వారు హామీ ఇచ్చిన భద్రత ఇదేనా? వారు కాపాడిన గౌరవం ఇదేనా? మహిళల పట్ల వారి చర్యలు, వైఖరి రెండూ అవమానకరంగా ఉన్నాయి. మహిళల గౌరవం కాపాడటం ముసుగులో కూటమి నేతలు పగ పెంచుకున్న వారిపై కేసులు నమోదు చేయడం అసహ్యకరం.

ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ఎలా వర్తిస్తుంది?

కొమ్మినేనిపై నమోదు చేసిన సెక్షన్లపై న్యాయమూర్తి ఆగ్రహం



వైద్య పరీక్షల అనంతరం గుంటూరు జీజీహెచ్ నుంచి బయటకు వస్తున్న కొమ్మినేని

సాక్షి ప్రతినిధి, గుంటూరు/నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావుపై ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద ఏ విధంగా కేసు నమోదు చేస్తారని గుంటూరు జిల్లా మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి (ఇన్‌చార్జ్) కె.సురేష్‌బాబు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలు ఆ సెక్షన్‌ను ఎందుకు పెట్టారని తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆ డిబేట్‌లో అసలు ఎస్సీ, ఎస్టీల గురించి చర్చే జరగనప్పుడు ఆ చట్టం కింద కేసు ఎలా పెడతారని ప్రశ్నించారు. 'ఫిర్యాదుదారు ఎస్సీ అయినంత మాత్రాన కేసు పెట్టేస్తారా? అసలు ఈ చట్టం కింద కేసు నమోదు చేసేటప్పుడు దర్యాప్తు అధికారిగా డీఎస్పీ స్థాయి అధికారిని ఎందుకు పెడతారో తెలుసా? ఆ చట్టం దుర్వినియోగం కాకూడదని.. అటువంటిది ఒక డీఎస్పీగా ఉండి కనీసం ఎవరి సలహా తీసుకోకుండా ఈ చట్టం కింద కేసు ఎలా నమోదు చేశారు?' అని నిలదీశారు. 'మీ వైఖరి మొదటి నుంచి ఇలానే ఉంది. గతంలో కూడా ఇలానే వ్యవహరించారు. అప్పుడు మెమో జారీ చేశాను. అయినా మీ వైఖరిలో మార్పు రాలేదు. ఈ కేసు విషయంలో మీకు, ఎస్పీకి మెమో జారీ చేస్తాను. ఎస్సీ, ఎస్టీ యాక్ట్.. 356(2) సెక్షన్‌ను తొలగించండి' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షి టీవీలో కొమ్మినేని శ్రీనివాసరావు తన పేరుతో నిర్వహిస్తున్న చర్చా కార్యక్రమంలో ఒక విశ్లేషకుడు అమరావతి రాజధానిపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో కొమ్మినేనిపై బీఎన్ఎస్ 79, 196(1), 353(2), 299, 356(2), 61(1), 67 ఐటీ యాక్ట్, ఎస్సీ, ఎస్టీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. మంగళవారం ఆయన్ని పోలీసులు కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి పోలీసుల తీరును తీవ్రంగా తప్పు పట్టారు. ఎన్నిసార్లు చెప్పినా పోలీసుల వైఖరిలో మార్పు రావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. అనంతరం డిబేట్ అంశంపై కొమ్మినేని శ్రీనివాసరావును ప్రశ్నించారు.

వారించాను.. నేను కూడా క్షమాపణ చెప్పాను..

'నేను 18 సంవత్సరాలుగా డిబేట్ నిర్వహిస్తున్నా. ఎవరైనా హద్దు మీరి మాట్లాడుతుంటే వెంటనే ఆపుతాను. ఈ అంశంలో కూడా నేను వారించాను. నేను తప్పు చేయలేదు. అయినా రెండో రోజు చర్చలో క్షమాపణ చెప్పాను. నేను ఎప్పుడూ అసభ్య పదజాలం వాడలేదు' అని ఈ సందర్భంగా కొమ్మినేని జడ్జికి వివరణ ఇచ్చారు. అనంతరం న్యాయమూర్తి కొమ్మినేనికి 14 రోజుల రిమాండ్ విధించారు. దీనిపై కొమ్మినేని తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకరరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. తమ వాదనలు వినాలని, అసలు కొమ్మినేనిపై కేసే అక్రమమని వాదించారు. తన ఆరోగ్య సమస్యల దృష్ట్యా జైలులో సదుపాయాలు కల్పించాలని కొమ్మినేని కోరగా, జైలర్‌తో మాట్లాడాలని పోలీసు అధికారులకు న్యాయమూర్తి సూచించారు. ఒకవేళ జైలు అధికారులు అంగీకరించకపోతే తన వద్ద అప్పీల్ చేసుకుంటే ఆదేశాలు ఇస్తానని చెప్పారు. సోమవారం అరెస్టు చేసినప్పటి నుంచి ఇప్పటి వరకు కుటుంబ సభ్యులను కలవనీయడం లేదని కొమ్మినేని శ్రీనివాసరావు భార్య, బంధువులు జడ్జి దృష్టికి తీసుకెళ్లారు. వారు కొమ్మినేనితో మాట్లాడేందుకు అవకాశం ఇవ్వాలని, వారు మాట్లాడుతుండగా వీడియో తీసి తనకు చూపించాలని ఆదేశించారు. కోర్టు ఆదేశాల అనంతరం కొమ్మినేనిని గుంటూరు జిల్లా జైలుకు తరలించారు.

గంటన్నరపాటు వైద్య పరీక్షలు

అంతకు ముందు కొమ్మినేని శ్రీనివాసరావుకు గుంటూరు జీజీహెచ్‌లో డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించారు. సోమవారం రాత్రి అంతా పోలీస్ స్టేషన్‌లోనే ఉంచి మంగళవారం ఉదయం 9 గంటలకు ఆస్పత్రికి తీసుకెళ్లారు. గంటన్నరపాటు వైద్య పరీక్షలు చేసిన అనంతరం కొమ్మినేని బయటకు వచ్చే దృశ్యాలను చిత్రీకరించే సమయంలో పోలీసులు మీడియాపై దౌర్జన్యం చేశారు. కొత్తపేట సీఐ వీరయ్యచౌదరితో పాటు అక్కడున్న మరో సీఐ బెదిరించే ప్రయత్నం చేశారు.

సాక్షి కార్యాలయాల వద్ద పచ్చమూకల విధ్వంసం



ఏలూరులోని సాక్షి కార్యాలయ ఆవరణలో దగ్ధమైన ఫర్నిచర్

ఏలూరు కార్యాలయం వద్ద ఫర్నిచర్ తగులబెట్టి బీభత్సం

రాజానగరం కార్యాలయం వద్ద సాక్షి బోర్డు పీకేసి దౌర్జన్యం



టీడీపీ మూకలు నిప్పు పెట్టడంతో తగులబడుతున్న ఏలూరులోని సాక్షి కార్యాలయం ఆవరణలో ఉన్న ఫర్నిచర్



రాజానగరంలో సాక్షి నేమ్ బోర్డును పీకేస్తున్న కూటమి మూకలు

రాజానగరం/ఏలూరు/ఏలూరు టౌన్: సాక్షి కార్యాలయాల వద్ద కూటమి మూకల విధ్వంసకాండ కొనసాగుతోంది. మంగళవారం తూర్పుగోదావరి జిల్లా రాజానగరంలోని సాక్షి ముద్రణా కార్యాలయంతోపాటు ఏలూరులోని ప్రాంతీయ కార్యాలయం వద్ద కూటమి ఎమ్మెల్యేల ఆధ్వర్యంలో రౌడీ మూకలు బీభత్సం సృష్టించాయి. తూర్పు గోదావరి జిల్లా రాజానగరంలోని సాక్షి ముద్రణా కార్యాలయంపైకి రాజానగరం, అనపర్తి ఎమ్మెల్యేలు బత్తుల బలరామకృష్ణ (జనసేన పార్టీ), నల్లమిల్లి రామకృష్ణారెడ్డి (బీజేపీ), అనపర్తి టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి మనోజ్‌రెడ్డి, జనసేన పార్టీ సమన్వయకర్త రావాడ నాగుల ఆధ్వర్యాన ముష్కరులు దాడికి తెగబడ్డారు. ప్రధాన గేటు ముంగిట సాక్షి పత్రికలను వేసి దహనం చేశారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, సాక్షి మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సాక్షి నేమ్ బోర్డును పెకలించారు. అడ్డుకోబోయిన పోలీసులకు గాయాలయ్యాయి. కాగా, సాక్షి కార్యాలయాలపై కూటమి నేతల దాడులను అరికట్టాలని కోరుతూ తూర్పు గోదావరి, కాకినాడ ఎస్పీలు నరసింహ కిషోర్, బిందుమాధవ్‌లకు మీడియా ప్రతినిధులు వినతిపత్రాలు అందించారు.

ఫర్నిచర్ తగులబెట్టి భీతావహ వాతావరణం

ఏలూరు ఎస్ఆర్ పేటలోని 'సాక్షి' ప్రాంతీయ కార్యాలయం వద్ద దెందులూరు నియోజకవర్గానికి చెందిన 500 మందికిపైగా టీడీపీ గూండాలు భీతావహ వాతావరణం సృష్టించారు. కార్యాలయం వద్ద ఫర్నిచర్‌ను పెట్రోల్ పోసి తగులబెట్టారు. భారీగా మంటలు చెలరేగటంతో ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తొలుత కార్యాలయానికి నిప్పు పెట్టేందుకు ముష్కరులు యత్నించారు. కార్యాలయం ఆవరణలో కింద ఉన్న ఫర్నిచర్‌పై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. సాక్షి పత్రిక ప్రతులను దహనం చేశారు. దెందులూరు టీడీపీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనుచరులు, కార్యకర్తలు ఏప్రిల్ 22న కూడా ఏలూరు సాక్షి కార్యాలయంపై దాడి చేసి కంప్యూటర్లను ధ్వంసం చేసిన విషయం తెలిసిందే.

ఏలూరులోని సాక్షి ఆఫీసు ఆవరణలో తగులబడుతున్న ఫర్నిచర్ వీడియో కోసం స్కాన్ చేయండి

సాక్షి కార్యాలయాలపై దాడులు హేయం



టీడీపీ ప్రభుత్వం సాక్షి మీడియా గ్రూప్ టార్గెట్‌గా చేస్తున్న పనులు అత్యంత హేయం. అమరావతి మహిళల పేరుతో తొలుత సాక్షి మీడియా ఆఫీసులపై దాడి చేసిన పచ్చమూకలు... మరో అడుగు ముందుకేసి, ఏలూరు సాక్షి కార్యాలయంపై పెట్రోల్ బాటిళ్లు, రాళ్లతో దాడి చేసి ఫర్నిచర్‌కు నిప్పు పెట్టడం దుర్మార్గం. ఈ అనైతిక చర్య వెనుక ప్రభుత్వ పెద్దల హస్తం ఉంది. అక్రమ కేసుతో సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడం దారుణం.

– కురసాల కన్నబాబు, వైఎస్సార్‌సీపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి

పథకం ప్రకారమే దాడులు



సాక్షి కార్యాలయాలపై మూడు రోజులుగా పథకం ప్రకారం టీడీపీ ముష్కరులు దాడులు చేస్తున్నారు. ఏలూరు సాక్షి కార్యాలయం ఆవరణలోని ఫర్నిచర్‌కు నిప్పుపెట్టడం దుర్మార్గం. మీడియాపై దాడి అంటే ప్రజాస్వామ్యంపై దాడే. హింసాత్మక చర్యలు భవిష్యత్‌లో తీవ్ర పర్యవసానాలకు దారితీస్తాయి. దాడులతో ప్రశ్నించే వారిని భయపెట్టలేరు. ఈ అరాచకాలపై ప్రజలకు సమాధానం చెప్పుకోవాల్సి ఉంటుంది. అక్రమ కేసులో కొమ్మినేని అరెస్టును ఖండిస్తున్నా.

– బొత్స సత్యనారాయణ, శాసన మండలిలో విపక్ష నేత


కూటమి అరాచకాలు పతాకస్థాయికి



ఏపీలో కూటమి ప్రభుత్వం అరాచకాలు పతాకస్థాయికి చేరాయి. ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభంగా భావించే పత్రికా స్వేచ్ఛకూ సంకెళ్లు వేస్తున్నారు. నిజాలు రాసే కలాలను, వాస్తవాలు చెప్పే గళాలను నిరంకుశంగా అణగదొక్కుతున్నారు. ఎవరో చేసిన వ్యాఖ్యలను సాకుగా చూపించి 'సాక్షి' కార్యాలయాలపై దాడులకు పాల్పడడం దారుణం. టీడీపీ ప్రోద్బలంతో కూటమి నేతలు, అల్లరిమూకలు కలిసి ఈ అరాచకాలకు తెగబడుతున్నాయి. ఏలూరు సాక్షి ఆఫీసులోని ఫర్నిచర్ తగులబెట్టడం అత్యంత దారుణం.

– గడికోట శ్రీకాంత్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి

వారం వ్యవధిలోనే రూ.14 వేల కోట్ల అప్పు



- ఏడాదిలోనే రూ.1.58 లక్షల కోట్ల అప్పుల భారం
- అయినా సూపర్ సిక్స్ అమలు లేదు
- ఏడాదిలో బడ్జెట్ అప్పులే రూ.1,08,194 కోట్లు
- బడ్జెట్ బయట అప్పులు మరో రూ.50,410 కోట్లు
- రాష్ట్ర చరిత్రలో ఇంత తక్కువ వ్యవధిలో భారీగా అప్పులు చేసిన ఘనత దక్కించుకున్న చంద్రబాబు

సాక్షి, అమరావతి: కేవలం వారం వ్యవధిలోనే చంద్రబాబు ప్రభుత్వం ఏకంగా రూ.14 వేల కోట్లు అప్పు చేసింది. గత మంగళవారం (3వ తేదీన) రూ.7,000 కోట్లు అప్పు చేసిన చంద్రబాబు సర్కారు.. తాజాగా ఈ మంగళవారం మరో రూ.7,000 కోట్లు అప్పు చేసింది. 6.65 శాతం నుంచి 7.8 శాతం వడ్డీకి ప్రభుత్వ సెక్యూరిటీలను విక్రయించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి ఈ మొత్తం అప్పును ఆర్‌బీఐ సమీకరించింది. మంగళవారం చేసిన అప్పుతో ఏడాది పాలనలోనే చంద్రబాబు సర్కారు రాష్ట్ర ప్రజలపై రూ. 1,58,604 కోట్ల అప్పుల భారం మోపింది. ఇందులో బడ్జెట్ అప్పులే ఏకంగా రూ.1,08,194 కోట్లకు చేరగా.. బడ్జెట్ బయట అప్పులు మరో రూ.50,410 కోట్లకు చేరాయి. బడ్జెట్ బయట వివిధ కార్పొరేషన్ల పేరుతో రూ.19,410 కోట్లు అప్పు చేశారు. ఇదికాకుండా రాజధాని అమరావతి పేరుతో ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు, జర్మనీ సంస్థ, హడ్కో నుంచి రూ.31 వేల కోట్లు అప్పు చేస్తోంది. రాజధాని అప్పులకు చంద్రబాబు ప్రభుత్వం ఉత్తర్వులు కూడా జారీ చేసింది.

గనులపైనా అప్పులు

గనుల శాఖ (ఏపీఎండీ)కు చెందిన 436 మైనర్ లీజుల విలువ రూ.1,91,000 కోట్లుగా చూపించి తద్వారా ప్రైవేట్ బాండ్ల జారీ ద్వారా రూ.9,000 కోట్లు అప్పు చేయడానికి చంద్రబాబు సర్కారు ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఇప్పటికే రూ.3,489 కోట్ల విలువైన బాండ్ల జారీ ద్వారా అప్పు చేసింది. మిగతా మొత్తాన్ని కూడా బాండ్ల జారీ ద్వారా సేకరించనుంది. ఏడాదిలోనే ఇంత పెద్దఎత్తున అప్పులు చేసిన ప్రభుత్వాలు గతంలో లేవు. చంద్రబాబు ప్రభుత్వానికే ఆ ఘనత దక్కింది.

అయినా.. సూపర్ సిక్స్ పథకాలకు డబ్బుల్లేవట

అప్పులు చేయడం ద్వారా చంద్రబాబు సర్కారు రాష్ట్ర ప్రజలను అప్పుల ఊబిలోకి నెట్టేస్తోంది. అయినప్పటికీ సూపర్ సిక్స్‌తో పాటు ఇతర హామీలను అమలు చేయడం లేదు. ఎన్నికల ముందు తాము అధికారంలోకి వస్తే అప్పులు చేయకుండానే సంపద సృష్టించి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తామని చెప్పిన చంద్రబాబు అందుకు విరుద్ధంగా మంగళవారం, మంగళవారం అప్పులు చేస్తూ రాష్ట్ర ప్రజలపై మోయలేని భారం మోపుతున్నారు. మొత్తంగా ఏడాది పాలనలో చంద్రబాబు ప్రభుత్వం ఏమైనా చేసిందంటే.. భారీగా అప్పులు చేయడం తప్ప ఏమీ లేదని స్పష్టమవుతోంది.

బడ్జెట్ ఇప్పులు ఇలా.. (రూ.కోట్లలో)	
ఈ ఏడాది మార్చి చివరి వరకు కాగ్ గణాంకాల మేరకు అప్పు	81,622
ఏప్రిల్ 3న చేసిన అప్పు	5,750
మే నెల 6న అప్పు	6,822
జూన్ 3న అప్పు	7,000
జూన్ 10న అప్పు	7,000
మొత్తం	1,08,194

బడ్జెటేతర అప్పు (రూ.కోట్లలో)	
పౌర సరఫరాల సంస్థ	2,000
మార్కెఫెడ్	6,700
ఏపీఐఐసీ	1,000
ఏపీఎండీసీ	9,000
ఏపీ పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్	710
మొత్తం	19,410

రాజధాని అప్పులు (రూ.కోట్లలో)	
ప్రపంచ బ్యాంక్, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్	15,000
హడ్కో	11,000
జర్మనీకి చెందిన కేఎఫ్‌డబ్ల్యూ సంస్థ	5,000
మొత్తం	31,000

కార్మికులపై సవరణ కత్తి

ఏపీ షాప్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్ట సవరణకు కుట్ర
శ్రమదోపిడీకి సర్కారు ఆస్కారం!
20 మంది కార్మికులు ఉండే సంస్థలను కార్మిక శాఖ పరిధి నుంచి తొలగించే యోచన
తనిఖీ అధికారాలకు కత్తెర
30 లక్షలకుపైగా శ్రామికులపై ప్రభావం
బాబు సర్కారుపై కార్మికలోకం ఆగ్రహం
ఇప్పటికే పని వేళలు 10 గంటలకు పెంచుతూ ప్రభుత్వ నిర్ణయం



సాక్షి, అమరావతి: శ్రమ దోపిడీకి ఆస్కారం ఇస్తూ కార్మికుల హక్కులను కాలరాసేందుకు కూటమి సర్కారు కుట్రపన్నుతోంది. ఇప్పటికే పని వేళలను పది గంటలకు పెంచుతూ నిర్ణయం తీసుకున్న కర్కశ ప్రభుత్వం ఇప్పుడు చిన్న సంస్థల్లో పనిచేసే చిరుజీవుల నోట్లో మట్టి కొట్టేందుకు రంగం సిద్ధం చేసింది. చిన్న వాణిజ్య సంస్థల్లో పనిచేసే గుమాస్తాలు, వాచ్‌మెన్‌లు, ఇతర చిరుద్యోగుల హక్కులు కాపాడే ఏపీ షాప్స్ ఎస్టాబ్లిష్ మెంట్ చట్టాన్ని సవరించేందుకు సిద్ధమైంది. 20 మందిలోపు సిబ్బంది ఉండే సంస్థలపై కార్మిక శాఖ జోక్యం లేకుండా చట్ట సవరణకు ప్రతిపాదనలు చేసింది. ఇవి వచ్చే కేబినెట్ భేటీలో మంత్రివర్గం ముందుకు వచ్చే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

యజమానే డిక్లరేషన్ ఇస్తే చాలట

రాష్ట్రంలో ఒకటి నుంచి 20 మంది సిబ్బందితో కార్యకలాపాలు నిర్వహించే సంస్థలు 3.50 లక్షలకుపైగా ఉన్నాయి. వీటిల్లో 30 లక్షల మంది కార్మికులు, చిరుద్యోగులు పనిచేస్తుంటారు. ఈ సంస్థలు ఏపీ షాప్స్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం–1988 మార్గదర్శకాలు పాటించాలి. ఈ చట్టం ప్రకారం.. ఎప్పటికప్పుడు కార్మిక శాఖ అధికారులు తనిఖీలు చేపట్టి నిబంధనలు ఉల్లంఘించిన యజమానులపై కేసుల నమోదుకు అవకాశం ఉంటుంది. అయితే 20 మంది లోపు సిబ్బందితో నడిచే సంస్థలను కార్మిక శాఖ పరిధి నుంచి తప్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. దీనిప్రకారం.. అన్ని నిబంధనలూ సక్రమంగా పాటిస్తున్నామని యజమాని సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే చాలు.. ఆ సంస్థలలో కార్మిక శాఖ అధికారులు తనిఖీలు చేయడానికి అవకాశం ఉండదు.

దాదాపు 12 గంటలు పనిచేయిస్తున్న సంస్థలు

ఇప్పటికే చిన్న సంస్థల యజమానులు శ్రామికుల చేత 12 గంటలకుపైగా పనిచేయిస్తున్నారు. ఉదయం పది గంటలకు దుకాణానికి వెళితే రాత్రి పదిగంటల తర్వాత కూడా వెట్టిచాకిరీ చేయిస్తున్నారు. కార్మిక శాఖ ఏడాది పొడవునా ఈ దుకాణాలను తనిఖీ చేసి నియంత్రిస్తున్నా.. యజమానులు లెక్కచేయని దుస్థితి. ఇప్పుడు ప్రభుత్వమే కార్మిక శాఖ పరిధి నుంచి వాటిని మినహాయిస్తే ఇప్పుడు పరిస్థితి ఇంకా ఎంత భయానకంగా ఉంటుందోనని శ్రామికులు, కార్మిక సంఘాల నేతలు ఆందోళన చెందుతున్నారు.

ఇప్పటికే పని గంటలు పెంపు

ఓ వైపు పని వేళలు తగ్గించాలని కార్మిక వర్గాల నుంచి డిమాండ్ వ్యక్తమవుతుంటే దీనికి భిన్నంగా పెట్టుబడుల ఆకర్షణను సాకుగా చూపి పని వేళలను గరిష్ఠంగా 9 నుంచి 10 గంటలకు పెంచుతూ చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. దీనిపై ఇప్పటికే కార్మికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో త్రైమాసిక కాలానికి ఓవర్‌టైమ్ 75 గంటల నుంచి 144 గంటలకు పెరిగాయి. ఈ పెంపు వల్ల ఎక్కువ సంపాదించవచ్చని సర్కారు వక్రభాష్యం చెబుతోంది. రాష్ట్రంలో ప్రస్తుతం కనీస వేతనాలే అమలు కావడం లేదన్న సత్యాన్ని ఉద్దేశపూర్వంగా విస్మరిస్తోంది.

ఏపీ షాప్స్ అండ్ ఎస్టాబ్లిష్ యాక్ట్- 1988 చట్టం ఏం చెబుతోందంటే..

- ఒక వర్కర్‌ను సంస్థలో చేర్చుకునేప్పుడు నియామక పత్రం ఇవ్వాలి.
- ఉద్యోగి అటెండెన్స్ రిజిష్టర్‌ను నిర్వహించాలి. ప్రతినెలా ఐదో తేదీలోపు వేతనం చెల్లించాలి.
- ఏటా 12 రోజులు క్యాజువల్ లీవ్స్, 9 పండుగ సెలవులు ఇవ్వాలి. వీక్లీ ఆఫ్ అమలు చేయాలి.
- వర్కర్‌కు మధ్యలో డబ్బు అవసరం అయితే ఇవ్వడానికి వీలుగా అడ్వాన్స్ రిజిస్టర్ పెట్టాలి.
- ఉద్యోగంలో నుంచి తీసి వేయడానికి నెల ముందు నోటీస్ ఇవ్వాలి.
- 10 మంది కంటే ఎక్కువ ఉద్యోగులు ఉన్నట్టయితే నెల వేతనం ఏటా బోనస్ కింద ఇవ్వాలి. కనీస వేతనాల చట్టం అమలు, స్త్రీ, పురుషులకు సమాన వేతనం పాటించాలి.
- కార్మిక శాఖ సాధారణ తనిఖీల్లో నిబంధనలు అతిక్రమించినట్లు గుర్తిస్తే కేసు నమోదు చేసి, కోర్టులో చార్జి షీట్ దాఖలు చేయడానికి వీలుంటుంది. కనీస వేతనాలు ఇవ్వలేదని తేలితే యజమాని నుంచి రికవరీ చేయచ్చు.

చట్ట సవరణ చేస్తే..

- చట్ట సవరణ అయితే ఎవరైనా శ్రామికుడు ఫిర్యాదు చేస్తే తప్ప కార్మిక శాఖ చిన్న సంస్థలపై జోక్యం చేసుకోరాదు. దీనివల్ల ఇప్పుడు ఉన్న హక్కులన్నింటినీ కార్మికుడు కోల్పోయే ప్రమాదం ఉంది. యజమాని సెల్ఫ్ డిక్లరేషన్‌లో అసత్యాలు పేర్కొనే ఆస్కారమూ ఉంది.

క్లుప్తంగా...

'సైబర్' ఉచ్చులో రిటైర్డ్ టీచర్

తిరుపతి క్రైమ్: కొత్త పుంతలు తొక్కుతున్న సైబర్ నేరగాళ్లు.. ఓ మాజీ టీచర్‌ను బురిడీ కొట్టించి రూ.1.20 కోట్లు కొట్టేశారు. తిరుపతి అలిపిరి సీఐ రామకిశోర్ తెలిపిన వివరాల మేరకు.. నవోదయ కాలనీకి చెందిన పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయురాలికి ఏప్రిల్‌లో గుర్తుతెలియని నంబర్ నుంచి కాల్ వచ్చింది. అవతలి వ్యక్తి తాను సీబీఐ అధికారినంటూ పరిచయం చేసుకున్నాడు. మానవ అక్రమ రవాణా చేస్తున్న ఓ వ్యక్తి.. ఆమె ఆధార్ కార్డుతో ఢిల్లీలో కెనరా బ్యాంక్‌లో అకౌంటును ఉపయోగిస్తున్నారని తెలిపాడు. తర్వాత వీడియో కాల్‌లో మాట్లాడి.. మీ బ్యాంకు ఖాతాల సమాచారం ఇవ్వాలని, లేదంటే ఈ విషయాన్ని ఎన్‌ఐఏ, ఈడీ, సీఐడీ, ఎస్సీటీ, రాకి తెలియజేస్తామని బెదిరించాడు. భయపడ్డ ఆమె తన అన్ని ఖాతాల వివరాలను చెప్పారు. దీంతో ఆమె ఖాతా నుంచి విడతల వారీగా రూ.1,20,80,000 ట్రాన్స్‌ఫర్ చేసుకున్నారు. అనంతరం తాను మోసపోయానని తెలుసుకుని ఆమె ముందుగా సైబర్ సెల్‌కి, అనంతరం అలిపిరి పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగుతోందని సీఐ రామకిశోర్ తెలిపారు.

అరుణాచలేశ్వర ఆలయంలో చికెన్ బిర్యానీ తిన్న దంపతులు


పరిహార పూజలు చేసిన నిర్వాహకులు



వేలూరు(తమినాడు): తమిళనాడు తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయం ఐదో ప్రాకారంలో మంగళవారం దంపతులు చికెన్ బిర్యానీ తింటుండగా భక్తులు గుర్తించి ఆలయ నిర్వాహకులకు ఫిర్యాదు చేశారు. సాధారణంగా దర్శనానికి వెళ్లే భక్తులను పోలీసులు తనిఖీ చేసి, లోనికి అనుమతిస్తారు. కానీ ఈ దంపతులు పోలీసుల కళ్లుగప్పి, బిర్యానీ పొట్లాలను లోనికి తీసుకెళ్లారు. వారిని విచారించగా తాము ఈ ప్రాంతానికి చెందినవారమేనని, బయట బిర్యానీ కొనుగోలు చేసి, ఆలయంలో తింటున్నామని చెప్పారు. దీంతో ఆలయ నిర్వాహకులు ప్రాంగణాన్ని పుణ్యాజలాలతో సంప్రోక్షణ చేసి, పరిహార పూజలు నిర్వహించారు.

ఒక్క చెవిరెడ్డి కోసం.. ఎంత మందికి నరకం చూపుతారు..?

- తప్పుడు స్టేట్‌మెంట్ల కోసం ఎంతకైనా తెగిస్తారా..?
- నాతో ఉన్న వాళ్లందరినీ చిత్రవధకు గురిచేస్తున్నారు
- ఘట్టమనేని శ్రీనివాస్ స్క్రిప్ట్‌ను 'సిట్' అమలు చేస్తోంది
- మీరు చేసే ఈ పాపం భవిష్యత్తులో ఎవ్వరినీ వదలదు..
- తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులు కోర్టుల్లో నిలబడవు
- తప్పు చేసిన పోలీసులపై హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్లు
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వెల్లడి



తిరుపతి రూరల్: ''అక్రమ కేసుల్లో ఒక్క చెవిరెడ్డిని అరెస్టు చేయడం కోసం.. ఎంత మందిని వేధిస్తారు.. ఇంకా ఎంత మందికి నరకం చూపుతారు? మీకు నచ్చినట్టు తప్పుడు స్టేట్‌మెంట్లు రికార్డు చేసుకోవడం కోసం ఎంతకైనా తెగిస్తారా? నాతో ఉన్న వాళ్లను చిత్రవధకు గురిచేస్తున్నారు.సిట్ కార్యాలయంలో కాకుండా ఒక రహస్య ప్రదేశంలో వాళ్లను విచారించడం ఏమిటి? మీరు చెప్పినట్టు వినకుంటే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా? అక్కడ అంతా ఘట్టమనేని శ్రీనివాస్ స్క్రిప్ట్‌ను అమలు చేస్తున్నారు. మీరు చేసే ఈ పాపం మిమ్మల్నే వెంటాడుతుంది. భవిష్యత్తులో ఎవ్వరినీ వదలదు అన్న విషయం గుర్తు పెట్టుకోండి. తప్పుడు కేసులు, అక్రమ అరెస్టులు మీకు తాత్కాలిక ఆనందాన్ని ఇవ్వవచ్చు. కోర్టుల్లో నిలబడవు అన్న నిజం గుర్తుంచుకోవాలి.. అక్రమంగా ఎత్తుకెళ్లి నరకం చూపించే పోలీసులపై బాధితుల కుటుంబీకులు హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటీషన్లు కూడా వేస్తున్నారు.. అరెస్టుకు నేను సిద్ధం.. జైలుకు వెళ్లడానికి సిద్ధంగానే ఉన్నా.. మళ్లీ చెబుతున్నా మీరు రావడానికి ఇబ్బంది అయితే చెప్పండి.. నేనే సిట్ కార్యాలయం ముందు ఓ గది తీసుకుని అక్కడే ఉంటా..'' అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అన్నారు. తిరుపతి రూరల్ మండలం తుమ్మలగుంట గ్రామంలోని ఆయన ఇంటి వద్ద మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో చెవిరెడ్డి మాట్లాడారు. తనను అరెస్టు చేసి ఎవ్వరినో ఆనందపరచడానికి అమాయకులను హింసించడం బాధ కలిగిస్తోందన్నారు. చేయని తప్పును చెవిరెడ్డి చేశారని చెప్పించడానికి సిట్ అధికారులు పడుతున్న తపన, తాపత్రయం చూస్తుంటే ఆశ్చర్యం కలుగుతోందని పేర్కొన్నారు. అక్రమ మార్గంలో కోర్టులో తప్పుడు స్టేట్‌మెంట్‌లు ఇప్పించడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు. గతంలో చిత్తూరుకు ఎస్పీగా, టీటీడీలో సీవీఎస్‌వోగా, డీఐజీగా పనిచేసిన ఘట్టమనేని శ్రీనివాస్ స్క్రిప్ట్ ఇస్తే దానిని అమలు చేస్తూ అమాయకులను టార్చర్ పెడుతున్నారని ఆరోపించారు. దేవుడు దగ్గర పనిచేసి వెళ్లిన ఆయన ఆ మార్గాన్ని ఎంచుకోవడం ఆయనకే మంచిది కాదన్నారు. ఒక దశలో సిట్ కార్యాలయంలో జరుగుతున్న అన్యాయం, అమాయకులను హింసించి వేరెవ్వరినో అరెస్టులు చేయడానికి రంగం సిద్ధం చేస్తున్న తీరు అక్కడి సిబ్బందికే నచ్చడం లేదన్నారు.

నాతో ఉన్న వాళ్లను వేధించవద్దు..

లిక్కర్ మాట చెబితేనే అసహ్యించుకునే తనను అదే లిక్కర్ కేసులో ఇరికించాలని చూస్తున్నారని, దానికి తాను సిద్ధంగానే ఉన్నానని చెబుతున్నా సరే.. తనతో ఉన్న వాళ్లను వేధించడం ఏమిటో అర్థం కావడం లేదని చెవిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుల అక్రమ అరెస్టులతో ఆందోళన చెందుతున్న బాధితుల కుటుంబ సభ్యులు న్యాయ స్థానాలను ఆశ్రయించి తప్పు చేసిన పోలీసులు, అధికారులపై హెబియస్ కార్పస్ పిటిషన్లు వేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తనకు గన్‌మెన్‌లుగా పనిచేసిన గిరి, మదన్‌లను విచారించారని, ఆ తరువాత తనతో సఖ్యతగా ఉండే వెంకటేష్ నాయుడు కుటుంబీకులను చిత్రవధ చేశారని, 3 రోజుల క్రితం బాలాజీతోపాటు మరో ఇద్దరిని తీసుకువెళ్లి అక్రమంగా నిర్బంధించి రహస్య ప్రదేశంలో వారిని కొడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తనపై తప్పుడు కేసులో సాక్షులుగా తయారు చేసిన స్టేట్‌మెంట్‌లలో సంతకాలు పెట్టాలని, వీడియో రికార్డుల కోసం వారిచ్చిన స్క్రిప్టు చదవాలని నరకం చూపుతున్నారన్నారు. ఒక్క చెవిరెడ్డిని అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్టు చేయడానికి ఇలా ఎంత మందికి నరకం చూపుతారో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమంగా వ్యవహరించే సిట్ అధికారులు, పోలీసు అధికారులు అందరూ న్యాయస్థానంలో దోషులుగా నిలబడే రోజు వస్తుందని ఆయన హెచ్చరించారు.

రాష్ట్రంలో నాలుగైదు రోజులు భారీ వర్షాలు

- ఈరోజూ, రేపు అధికంగా వానలు
- రాయలసీమపై అధిక ప్రభావం

సాక్షి, అమరావతి: వచ్చే నాలుగైదు రోజులు రాష్ట్రంలో పలుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తరప్రదేశ్ నుంచి పశ్చిమ మధ్య బంగాళాఖాతం వరకు, ఉత్తర మధ్యప్రదేశ్, దక్షిణ ఛత్తీస్‌గఢ్, మధ్య ఒడిశా మీదుగా కొనసాగుతున్న ద్రోణి ప్రభావంతో ఈ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. రాయలసీమపై దీని ప్రభావం అధికంగా ఉంటుందని తెలిపింది. అనంతపురం, కర్నూలు, శ్రీ సత్యసాయి, అన్నమయ్య జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. కోస్తా జిల్లాల్లోనూ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ప్రధానంగా 11, 12 తేదీల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తాయని, గంటకు 40 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు వివరించింది. మరోవైపు కొన్నిచోట్ల ఉక్కపోతతోపాటు ఎండ ప్రభావం ఉంటుందని తెలిపింది. మంగళవారం పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో 4.3 సెంటీమీటర్లు, శ్రీకాకుళంలో 4.2, విశాఖ జిల్లా ఆనందపురంలో 3.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే ప్రకాశం జిల్లా వేమవరంలో 40 డిగ్రీలు, కొనకనమిట్లలో 39.9, తిరుపతి జిల్లా మంగ నెల్లూరు 39.9, వైఎస్సార్ కడప జిల్లా ఎర్రగుంట్లలో 39.8 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదైనట్లు వాతావరణ శాఖ వెల్లడించింది.

'సాక్షి'పై దాడులను ఖండించిన ఏపీడబ్ల్యూజేఎఫ్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 'సాక్షి' మీడియా కార్యాలయాలపై జరిగిన దాడులను ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్స్‌ఫెడరేషన్ అధ్యక్షుడు ఎస్.వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి జి.ఆంజనేయులు మంగళవారం ఓ ప్రకటనలో ఖండించారు. మీడియాను భయభ్రాంతులకు గురిచేసే రీతిలో జరిగిన ఈ దాడులను నివారించేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అదే సమయంలో టీవీ చానళ్లలో జరిగే చర్చాగోష్ఠులలో అవాంఛనీయ ఘటనలను నివారించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో కేంద్రం సూచించిన మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 'సాక్షి' టీవీలో ప్రసారమై, వివాదాస్పదమైన అంశాన్ని ఆ కమిటీ ద్వారా విచారణ జరిపించాలని వారు కోరారు.

సాక్షి

బుధవారం, 11 జూన్ 2025

ట్రంప్ 'ఫెడరల్' పరీక్ష!

వలసలను అరికట్టి తీరతానని వాగ్దానం చేసి గద్దెనెక్కిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అందుకోసం ఎంతకైనా తెగించేందుకు సిద్ధపడుతున్నారు. క్యాలిఫోర్నియా రాష్ట్రంలోని లాస్‌ఏంజెలెస్ నగరంలోని ఒక ప్రాంతంలో అక్రమ వలసదారుల ఏరివేతకు వచ్చిన ప్రతిఘటన సాకుతో ఆరున్నర దశాబ్దాల తర్వాత ఆ రాష్ట్రం అనుమతి లేకుండా ఆదివారం కేంద్ర బలగాలను పంపారు. డెమాక్రటిక్ ఏలుబడిలోని ఆ రాష్ట్రానికి అలా సవాలు విసిరారు. దీన్ని తీవ్రంగా తప్పుబట్టిన గవర్నర్ గావిన్ న్యూసమ్‌ను అరెస్టు చేయిస్తానని, ఆ రాష్ట్రానికి నిధులు నిలిపేస్తానని హెచ్చరించారు. అందుకు ప్రతిగా క్యాలిఫోర్నియా నుంచి పన్నుల రూపంలో ఫెడరల్ ప్రభుత్వానికి వెళ్లే 8,000 కోట్ల డాలర్ల నిధుల్ని ఆపేస్తామని న్యూసమ్ జవాబిచ్చారు. అంతేకాదు... చట్టవిరుద్ధంగా ఫెడరల్ బలగాలను పంపిన ట్రంప్ తీరుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని చెప్పారు. మొత్తానికి అమల్లో ఉన్న వలస విధానంపై కొన్నేళ్లుగా అంతర్గతంగా రాజుకుంటున్న అసంతృప్తి క్యాలిఫోర్నియాలో భగ్గున బద్దలైంది. నాలుగు లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో సొంతంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లోనే నాలుగో స్థానాన్ని ఆక్రమించగలిగిన క్యాలిఫోర్నియాలో అపరిమితమైన సంపద ఉన్నట్టే దాన్ని ఆశ్రయించి వలసలూ అధికంగా ఉన్నాయి. ముఖ్యంగా మెక్సికో నుంచి ఏటా వచ్చే వేలాదిమంది అక్కడ చిన్నాచితకా పనులు చేసుకుంటూ పొట్టపోసుకుంటారు. స్థానికంగా ఉండే శ్వేత జాతి అమెరికన్లకు ఈ వలసలపై ఆగ్రహావేశాలున్నాయి. దీన్ని సకాలంలో సరిచేయటంలో డెమాక్రాట్లు విఫలమైన కారణంగానే ట్రంప్ వంటి దూకుడైన నేత అమెరికా రాజకీయాల్లో ఆవిర్భవించారు.

వర్తమాన స్థితిని ఇలాగే కొనసాగనీయదల్చుకుంటే ట్రంప్ ప్రత్యేకతేముంది? దీన్ని సాకుగా తీసుకుని మరింత ముందుకు చొచ్చుకుపోయేందుకు ఆయన రెడీ అయ్యారు. అలబామాలో పౌర హక్కుల యాత్రకు అక్కడి ప్రభుత్వం ఆటంకం కలిగించవచ్చునన్న సంశయంతో ఆరున్నర దశాబ్దాల క్రితం అప్పటి అధ్యక్షుడు లిండన్ జాన్సన్ గవర్నర్ అనుమతి లేకుండా ఫెడరల్ బలగాలను పంపారు. ఇంకా వెనక్కివెళ్తే 1860ల్లో అప్పటి అధ్యక్షుడు అబ్రహాం లింకన్ ఈ మాదిరే బలగాలను తరలించిన ఉదంతం ఉంది. ఎన్నడో 1807లో అమెరికాలో తిరుగుబాటు చట్టాన్ని రూపొందించారు. ఏ రాష్ట్రమైనా ఫెడరల్ ప్రభుత్వంపై తిరగబడి ఆత్యయిక స్థితి ఏర్పడితే మెరైన్‌లను రంగంలోకి దించి వాటిని అణిచేయటం దీని ఉద్దేశం. అప్పట్లో అంతర్యుద్ధాలూ, కొన్ని రాష్ట్రాలు జట్టుకట్టి ఫెడరల్ సర్కారుపై తిరుగుబాటుకు సిద్ధపడటం వగైరా పరిస్థితులను ఎదుర్కొనటానికి ఈ చట్టం తీసుకొచ్చారు. అయితే ఈ అరవయ్యేళ్లలోనూ ఫెడరల్ బలగాలను పంపాల్సిన సందర్భాలు రాలేదని కాదు. 1992లో రోడ్నీ కింగ్ అనే నల్లజాతీయుణ్ణి అత్యంత దారుణంగా హింసించిన కేసులో పోలీసులు నిర్దోషులని తీర్పు వెలువడినప్పుడు ఇదే లాస్ ఏంజెలెస్ దాదాపు వారంరోజుల పాటు అట్టుడికిపోయింది. 50 మంది మరణించటంతో పాటు వందలాది భవంతులు ధ్వంసమయ్యాయి. వేలాది కార్లకు నిప్పుపెట్టారు. ఇప్పుడలా కాదు. నగరంలోని ఒక బ్లాక్‌లో దాదాపు 200 మంది మెక్సికన్ కార్మికులు ఆదివారం ఆందోళనకు దిగారు. కార్లు తగలబెట్టడం, లూటీలు, ఫెడరల్ భవంతులపై రాళ్లు రువ్వటం వంటి ఘటనలు చోటుచేసుకున్నాయి. క్యాలిఫోర్నియా పోలీసులే చాలావరకూ అదుపులోకి తెచ్చారు. ఆ ఆందోళన పెద్దగా విస్తరించింది కూడా లేదు.

కానీ ట్రంప్ దీన్ని వదలదల్చుకోలేదు. 2020లో తన తొలి ఏలుబడి కాలంలో నల్లజాతీయుడు జార్జి ఫ్లాయిడ్‌ను శ్వేతజాతి పోలీసులు ఊపిరాడకుండా చేసి హతమార్చిన ఉదంతం సమయంలో తీవ్ర హింస చెలరేగినా ట్రంప్ ముందుకు కదల్లేకపోయారు. ఆనాటి రక్షణమంత్రి మార్క్ ఎస్పర్, సైనిక బలగాల చీఫ్, అటార్నీ జనరల్ ఫెడరల్ బలగాలను పంపటం ప్రమాదకరమని వారించారు. అందుకే ఈసారి అలాంటివారిని దూరంకొట్టి నిర్విచక్షణగా తనకు మద్దతునిచ్చేవారిని చేరదీశారు. ఇప్పుడు క్యాలిఫోర్నియాకు కేంద్ర బలగాలను పంపాలని నిర్ణయించగానే రక్షణమంత్రి హెగ్సెత్, అటార్నీ జనరల్ బోండీ మద్దతుగా నిలిచారు. ట్రంప్ పని సులభమైంది.

రెండోసారి అధికారంలోకొచ్చాక చిన్న పామునైనా పెద్ద కర్రతో కొట్టాలన్న విధానాన్ని ట్రంప్ పాటిస్తున్నారు. గాజాలో ఇజ్రాయెల్ నరమేధాన్ని నిరసిస్తూ విశ్వవిద్యాలయాల్లో చెలరేగిన ఉద్యమం విషయంలో ఆయన ఏం చేశారో ప్రపంచమంతా చూసింది. అందులో పాల్గొన్నవారిని దేశద్రోహులుగా పరిగణించి, సంకెళ్లువేసి జైళ్లకు తరలించటం, దేశం నుంచి గెంటేయటం రివాజుగా మారింది. ప్రస్తుత క్యాలిఫోర్నియా అల్లర్లపైనా ఆయన ఆ వైఖరే తీసుకున్నారు. అసలు తిరుగుబాటు చట్టం అమలును ప్రకటించకుండానే, గవర్నర్‌కు వర్తమానం పంపకుండానే 2,000 మంది బలగాలను అక్కడికి తరలించటం అమల్లోవున్న సంప్రదాయాలను ధిక్కరించటమే! ఏ పార్టీకి చెందిన దేశాధ్యక్షులైనా గతంలో ఇలాంటి దుస్సాహసానికి దిగలేదు. కానీ ఉన్న అధికారాలను మాత్రమే కాదు... ఎక్కడాలేని, ఏనాడూ ఎవరూ వినియోగించని అధికారాలను సైతం దబాయించి అమలు చేయించే నైజం ట్రంప్‌ది. లాస్ ఏంజెలెస్ అల్లర్ల వంటివి ట్రంప్‌కు చేజేతులా ఆ అవకాశాన్నిస్తున్నాయి. అక్కడ చెలరేగిన హింస, అందులో మెక్సికన్ జాతీయ జెండాల ప్రదర్శన స్థానికుల్లో ఆగ్రహావేశాలను రగిలించాయి. విద్వేషాన్ని పెంచాయి. హింసతో దేన్నయినా సాధించుకోవచ్చన్న మనస్తత్వం వికటిస్తుందని ఉద్యమకారులు తెలుసుకోవటం అవసరం. పరిస్థితిని అదుపు చేయటానికి క్యాలిఫోర్నియా ప్రభుత్వానికి సహకరించటమే వారికి శ్రేయస్కరం.

ప్రపంచం మన మాట వినట్లేదేం?

విశ్లేషణ



సంజయ బారు

పాకిస్తాన్ ఒక విఫల రాజ్యం. పాకిస్తాన్‌ను ఉగ్రవాద దేశంగా ప్రకటించాలి. పాకిస్తాన్ ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోంది. పాకిస్తాన్ అంతర్జాతీయంగా ఏకాకి అయింది. ప్రపంచంలో ముస్లింలు అత్యధికంగా ఉన్న దేశమైన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవొ సుబియాంతో పాక్‌తో ముడిపెట్టకుండా, భారత్‌ను విడిగా సందర్శించారు. ఒక దశాబ్దం నుంచి భారత ప్రజానీకానికి ఈ రకమైన చిత్రాన్ని రూపుకట్టిస్తూ వస్తున్నారు.

మరి మనం 'అంతర్జాతీయ సమాజం'గా చెప్పుకొంటున్నది పాక్‌ను నిలదీయకుండా సంశయ స్థితిలో ఉండిపోవడానికి కారణమేమిటి? పాక్‌ను గూడుగా చేసుకుని పనిచేస్తున్న ఉగ్ర మూకల వల్ల రెండు దేశాలూ ఘర్షణ పడి ఇంకా నెల కూడా కాకుండానే, కౌంటర్ – టెర్రరిజం కమిటీ ఉపాధ్యక్ష పదవిని ఐరాస భద్రతామండలి జూన్ 4న పాక్‌కు కట్టబెట్టింది. గత నెల రోజులుగా పాక్ సాధించిన దౌత్య విజయాలకు ఇది శిఖరాగ్రం. పాక్‌ను ప్రపంచం ఎలా వీక్షిస్తోంది అనే అంశంపైన దృష్టి సారించవలసిన సమయం ఆసన్నమైంది.

మద్దతుగా వచ్చిన దేశాలెన్ని?


రెండు దేశాల మధ్య ఘర్షణలు మొదలై రెండు రోజులయ్యాయో లేదో మే 9న మనం దౌత్యపరమైన మొదటి దిగ్భ్రాంతిని చవిచూడవలసి వచ్చింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్) 200 కోట్ల డాలర్ల రుణాన్ని పాక్‌కు అందించడానికి అనుకూలంగా ఓటు వేసింది. ఒక్క భారత్ మినహా, జీ–7 దేశాలతో సహా బోర్డులోని మిగిలిన సభ్య దేశాలన్నీ పాక్ ఊపిరిపీల్చుకునేందుకు ఊతమిచ్చాయి. ఐఎంఎఫ్ బాటలో, ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంకు కూడా పాక్‌కు అప్పులిచ్చేందుకు ముందుకొచ్చాయి.

ఇక అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దీనికి సంబంధించి ఓ డజను ప్రకటనలు చేశారు. దాడి, ప్రతిదాడులు చేసుకుంటున్న పొరుగు దేశాలతో కాల్పుల విరమణ ప్రకటింపజేసిన ఘనత తనదేనని ఆయన మొదట చాటుకున్నారు. కాల్పుల విరమణకు, అమెరికాకు ఎలాంటి సంబంధమూ లేదని భారత్ అధికారికంగా ప్రకటించిన తర్వాత కూడా ఆయన ఆ రకమైన మాటలు ఆపలేదు. భారత్–పాక్‌లను ఒకే గాటన కడుతూ, రెండూ అమెరికాకి మిత్ర దేశాలనీ, ఎందుకంటే, అవి అణ్వాయుధ దేశాలనీ ఆయన అన్నారు. భవిష్యత్తులో ఘర్షణలు తలెత్తకుండా నివారించేందుకు అవి పరస్పరం వాణిజ్య సంబంధాలను పునరుద్ధరించుకోవాలని, అమెరికాతో కూడా వ్యాపారం చేయాలని ట్రంప్ చెప్పుకొచ్చారు.

ఉగ్రవాదంపై పోరాటంలో భారత్‌కు మద్దతు ప్రకటించిన దేశాలు చాలా ఉన్నప్పటికీ, కేవలం రెండు –ఇజ్రాయెల్, అఫ్గానిస్తాన్ మాత్రమే ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తున్నదిగా పాక్‌ను పేరెత్తి ప్రకటించాయి. చైనా కొద్ది రోజుల్లోనే పాకిస్తాన్, అఫ్గానిస్తాన్‌లతో ఒక త్రైపాక్షిక సమావేశం నిర్వహించి ఆ రెండింటి మధ్య రాజీ కుదిర్చింది. దాంతో, ప్రస్తుతం నిస్సహాయులపై జాతిసంహారం సాగిస్తున్నట్లు నిందపడుతున్న ఇజ్రాయెల్ ఒక్కటే, భారత్‌కు అండగా నిలిచినట్లవుతోంది. రష్యా కూడా రెండు నాల్కల ధోరణితో మాట్లాడింది. పహల్‌గామ్ ఉగ్రదాడి జరిగిన కొద్ది రోజుల తర్వాత, భారత్ 'భాగస్వాములను కోరుకుంటోంది కానీ, బోధకులను కాదు' అని యూరోపియన్ యూనియన్‌ను విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ ఎద్దేవా చేశారు. ఆ తర్వాత ఎవరూ నీతులు పలికే యత్నం చేయని మాట నిజమేకానీ, భాగస్వాములవుతామన్న దేశాలు కొద్దిగానే ఉన్నాయి.



భారత ప్రధాని నరేంద్ర మోదీ



పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్

మనకెందుకు మద్దతు రాలేదు?

పాకిస్తాన్ అసలు రూపాన్ని అంగీకరించడంలో, దాన్ని నిలదీయడంలో, 'అంతర్జాతీయ సమాజం'గా మనం భావిస్తున్నది ఎందుకు వెనకడుగు వేస్తున్నట్లు? పాకిస్తాన్ దుశ్చర్యలను చిత్తశుద్ధితో ఎందుకు ఖండించడం లేదు? కనీసం, భారతదేశానికి మరింత హృదయపూర్వకంగానైనా సంఘీభావం వ్యక్తపరచడం లేదు ఎందుకని? భారత రాయబారులు చేయవలసిన పనిని నిర్వర్తించేందుకు వివిధ పార్టీల పార్లమెంట్ సభ్యులతో ప్రతినిధి బృందాలను ప్రధాని నరేంద్ర మోదీ పంపవలసిన అవసరం ఎందుకొచ్చింది?

గతంలో ఇలాంటి స్థితి ఎన్నడూ ఉత్పన్నం కాలేదు. ముష్ఫ్ దుస్తులలో వచ్చిన పాక్ సైనికులను కార్గిల్ నుంచి 1999లో తరిమికొట్టినప్పుడు... అంతర్జాతీయ సమాజం భారత్ సరసన నిలిచింది. నియంత్రణ రేఖనే సరిహద్దుగా అంగీకరిస్తున్న సిమ్లా ఒప్పందానికి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ తలూపిన తర్వాత, కశ్మీర్ హోదాపై ప్రపంచ అభిప్రాయంలోనూ మార్పు వచ్చింది. క్లింటన్ అప్పట్లో భారత్‌లో ఐదు రోజులు పర్యటించి పాకిస్తాన్‌లో ఐదు గంటలు మాత్రమే గడిపారు. భారత్‌ను ప్రశంసించి, పాక్‌ను మందలించారు.

ముంబయిపై ఉగ్రదాడి సందర్భంలో, 2008 నవంబర్‌లో కూడా మొత్తం ప్రపంచం భారత్‌కు బాసటగా నిలిచింది. ఆ రెండు ఉదంతాలలోనూ పాక్ పాత్ర తేటతెల్లం కావడంతో అది తలదించుకోవలసి వచ్చింది. భారత్ ప్రకటనలకు ప్రపంచం సముచిత గౌరవం ఇవ్వడం కూడా దానిలో అంతే సమానమైన పాత్ర వహించింది. అటల్ బిహారీ వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాల ప్రకటనలను అన్ని ప్రధాన దేశాలూ గౌరవ ప్రపత్తులతో చూశాయి. మన వైఖరి గురించి వివరణ ఇచ్చుకుంటూ, 50 మంది పార్లమెంటేరియన్లను ప్రపంచం నలుమూలలకు పంపడం ద్వారా ప్రజాధనాన్ని ఇప్పటిలా వృథా చేయవలసిన అవసరం కూడా లేకపోయింది. వృత్తిపరమైన దౌత్యవేత్తలే ఆ బాధ్యతను నిర్వహించారు.

- భారతదేశపు పొరుగు దేశాన్ని ప్రపంచం ఎలా వీక్షిస్తోందన్న దానిపై మరింత దృష్టి సారించవలసిన అవసరం ఉంది.
- రెండు దేశాల మధ్య ఆర్థిక వ్యత్యాసం పెరిగిందనడంలో సందేహం లేకపోయినా, పాక్ మరీ పనికిరానిదిగా కూడా ఏమీ లేదు.
- పహల్‌గామ్ దాడిలో పాలుపంచుకున్న ఉగ్రవాదుల జాతీయతను గుర్తించడంలోనూ, పాక్ అపరాధాన్ని స్పష్టంగా నిరూపించడంలోనూ కేంద్ర ప్రభుత్వ విఫలమైంది. అది భారత్ దౌత్య సామర్థ్యాన్ని వికలం చేసింది.

పహల్‌గామ్ దాడిలో పాలుపంచుకున్న ఉగ్రవాదుల జాతీయతను గుర్తించడంలో, పాక్ అపరాధాన్ని స్పష్టంగా నిరూపించడంలో కేంద్రం విఫలమైంది. అది ఈసారి భారత్ దౌత్య సామర్థ్యాన్ని వికలం చేసింది. సీమాంతర ఉగ్రవాదంపై భారత్ వాదనను బలహీనపరచడంలో భారత అంతర్గత రాజకీయాలు పాత్ర పోషించలేదు కదా అని ప్రపంచంలోని అనేక దేశాలు విస్తుపోతున్నాయి. భారత్ లౌకిక, ప్రజాస్వామిక దేశంగానూ, వాజ్‌పేయి, మన్మోహన్ సింగ్ ప్రభుత్వాలు బాధ్యతాయుతమైన ప్రభుత్వాలుగానూ పరిగణన పొందాయి. వర్తమానానికొస్తే, భారత్ కేసు బలహీన పడింది. అంతర్జాతీయ అభిప్రాయంలోనూ సానుభూతి సన్నగిల్లింది.

మున్ముందు జరగవలసింది!

శత్రుదేశాన్ని ఆచితూచి అంచనా వేయడం జాతీయ భద్రత, విదేశీ విధాన నిర్వహణ కర్తల మొదటి లక్ష్యం కావాలి. సమాచారాన్ని ఇచ్చిపుచ్చుకోవడానికి వీలయ్యే విధంగా వివిధ స్థాయిలలో సంబంధాలు కొనసాగేటట్లు చూసుకోవాలి. పాకిస్తాన్‌తో అన్ని దౌత్యపరమైన, వ్యాపార, పౌర సమాజ మార్గాలను మూసివేయడ ద్వారా... పొరుగు దేశం గురించి సమ తూకంతో కూడిన మదింపు చేయడానికున్న మార్గాలను, సరిహద్దుకు ఆవల అభిప్రాయాలను ప్రభావితం చేయడానికున్న అవకాశాన్ని చేజార్చుకున్నట్లయింది.

రెండు దేశాల మధ్య ఆర్థిక వ్యత్యాసం పెరిగిందనడంలో సందేహం లేదుగానీ, పాకిస్తాన్‌ను మరీ పనికిరానిదిగా చూడటం కూడా సరికాదు. దానికి చెప్పుకోతగినంత ఆర్థిక వ్యవస్థ, పారిశ్రామిక, వ్యావసాయిక పునాదులున్నాయి. దానికి ప్రధాన ఆర్థిక వ్యవస్థలతో సంబంధాలున్నాయి. సమర్థత కలిగిన సైన్యం ఉంది. పాక్ తన భౌతిక శక్తితోపాటు, ఉన్నత వర్గీయుల 'సాఫ్ట్ పవర్'ను కూడా వినియోగించుకుంటోంది. భూస్వామ్య పెత్తందారీ విధానం, అసమానతలు అధికంగా ఉన్న సమాజంలో, పాశ్చాత్య మధ్యవర్తులతో సమానమైన వర్గంగా, ఆత్మవిశ్వాసంతో మెలిగేలా పాక్ తన ఉన్నత వర్గాన్ని తీర్చిదిద్దుకుంటూ వస్తోంది. భారతదేశపు రాజకీయాలను, దౌత్యాన్ని ప్రభావితం చేస్తున్న మధ్య తరగతి దానికి దీటు కాదు.

వ్యాసకర్త సెంటర్ ఫర్ ఎయిర్ పవర్ స్టడీస్ ఫౌండర్–ట్రస్టీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ మీడియా సలహాదారు

సోషల్ మీడియా

థ్రిల్లర్ రైటర్



ఫ్రెడరిక్ ఫోర్‌సీత్ (1938–2025) ఆత్మకు శాంతి కలుగుగాక (జూన్ 9న మరణించారు)! నాకు అత్యంత ఆసక్తి కలిగించిన మొదటి థ్రిల్లర్ రైటర్ ఆయన. 'డే ఆఫ్ ద జాకల్', 'ఒడెస్సా ఫైల్' నవలలు నాకు విపరీతంగా నచ్చాయి. కానీ తన ఆర్ఏఎఫ్ పైలట్ అనుభవాల నేపథ్యంలో రాసిన 'షెఫర్డ్' నా ఫేవరెట్.

– జాయ్ భట్టాచార్య, క్విజ్జర్

సెంటిమెంట్ పట్టదా?



కన్నడ, కర్ణాటక సెంటిమెంట్‌కు కాంగ్రెస్ ఎప్పుడూ వ్యతిరేకంగా పోతుంది. ఉదాహరణకు కర్ణాటక జనానికి సంబంధించిన మైసూర్ శాండల్ సబ్బు ఉత్పత్తి విషయంలో దాని ప్రాంతీయతను అంగీకరించడానికి కాంగ్రెస్ నిరాకరిస్తుంది. అదే కన్నడ, కర్ణాటకకు ఏ సంబంధం లేని ఆర్సీబీ లాంటి జట్టు విజయాన్ని వేడుక చేసుకోవడానికి మాత్రం కారణాలు వెతుకుతుంది.

– చేతన్ కుమార్ అహింస, కన్నడ నటుడు

తెల్లారితేగానీ...



గతంలో ప్రతి రోజూ సూర్యోదయం అయింది కాబట్టి, రేపు కూడా సూర్యోదయం అవుతుందని నిశ్చయంగా అనుకోవడం ఎలాంటిదంటే- గతంలో తనను యజమాని ఏ రోజూ కూర వండుకోలేదు కాబట్టి, రేపు కూడా వండుకోడని కోడి నమ్మడం లాంటిది!

– కౌశిక్ బసు, ఆర్థికవేత్త

పెద్ద నష్టం



గత పదకొండేళ్లలో మోదీ ప్రభుత్వం రాజ్యాంగ సంస్కృతికి అతి పెద్ద నష్టం కలిగించింది. వాళ్లు సృష్టించిన మేధా–వ్యతిరేక వాతావరణం, రాజ్యాంగబద్ధతావాదాన్ని మెజారిటీవాదం ఆక్రమించేలా చేసింది.

– సంజయ్ కె. ఝా, జర్నలిస్ట్

హద్దులుంటాయి!



ఒక నిర్ణయం పట్ల నిరాశ చెందడం ఒక సంగతి. కానీ ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం అంగీకరించలేనిది. ఆఖరికి నిరసనలకు కూడా హద్దులుంటాయి.

– రామి నిరంజన్ దేశాయి, ఆంత్రోపాలజిస్ట్

ఇన్ బాక్స్

గ్రంథాలయ గాంధీ

జీవితాన్ని గ్రంథాలయోద్యమానికి ధారపోసిన గ్రంథాలయ సారథి, పుస్తక సంపాదకుడు, బాలసాహితీవేత్త, ఎందరో బాల సాహితీవేత్తలను ప్రోత్సహించి, వారు పుస్తకాలు రాసే అవకాశం కల్పించిన సహృదయుడు, 'గ్రంథాలయ గాంధీ' వెలగా వెంకటప్పయ్య. జూన్ 12వ తేదీన వీరి వర్ధంతిని పురస్కరించుకుని గుంటూరు జిల్లా తెనాలిలో ఆయన కాంస్య విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి సేవలు యువతకు తెలియవలసిన అవసరం ఎంతైనా ఉంది. 1932లో తెనాలి ఐతానగర్‌లో జన్మించారు. గ్రంథాలయంలో చిరుద్యోగిగా జీవితం ఆరంభించి, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి పీహెచ్‌డీ పొంది గ్రంథాలయ శాఖలో వివిధ పదవులు నిర్వహించారు.



వెలగా వెంకటప్పయ్య

17 ఏళ్ల వయస్సులోనే 1949లో 'బంగారు బొమ్మ' పేరుతో బాలల కథల సంపుటిని ప్రచురించి పిల్లలకు అందించారు. పిల్లల కోసం 1958లో 'టెలిఫోన్', 1959లో 'రేడియో', 1962లో 'కాగితం కథ' వంటి పుస్తకాలు రాశారు. 30 వేల తెలుగు సామెతలు, వేయి తెలుగు బాలల జానపద గేయాలు, 3 వేల పొడుపు కథలు, 15 వేల జాతీయాలు సేకరించి ప్రచురించారు. 2013లో 'అందరూ మహానుభావులే' పేరుతో 1024 పేజీలతో అన్ని రంగాల ప్రముఖుల పరిచయాలతో కూడిన బృహత్తర గ్రంథానికి సంపాదకత్వం వహించారు. 2014లో కేంద్ర సాహిత్య అకాడమీ వారి బాలసాహిత్య కథల సంకలనానికి సంపాదక బాధ్యతలు వహించారు.

గ్రంథాలయ విజ్ఞానంలో ఆయన తాకని అంశం లేదు. వందకు పైగా పుస్తకాలు, ముఖ్యంగా గ్రంథాలయ విజ్ఞానానికి సంబంధించి రాసిన గ్రంథాలు అత్యంత ప్రామాణికమైనవి. వీరు కాకతీయ విశ్వవిద్యాలయానికి సర్టిఫికెట్ కోర్సుకు ఆరు పుస్తకాలు, డిగ్రీకి 12 పుస్తకాలు రాశారు. 1990లో ఉద్యోగ విరమణ చేసి రచనా వ్యాసంగంలోనే నిమగ్నమయ్యారు. 2013లో అవిభక్త ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉగాది పురస్కారాన్ని గ్రంథాలయ రంగం నుండి అందుకున్న తొలి వ్యక్తి డా॥ వెలగా. జీవిత కాలాన్ని గ్రంథాలయ ఉద్యమాలు, బాల సాహిత్యం కోసం అంకితం చేసిన వెలగా వెంకటప్పయ్య తన 82వ ఏట 2014 డిసెంబర్ 29న గుండెపోటుతో కన్నుమూశారు. ఆయన సేవలు చిరస్మరణీయాలు.

– షేక్ అబ్దుల్ హకీం జాని, తెనాలి

(రేపు తెనాలిలో డా॥ వెలగా వెంకటప్పయ్య కాంస్య విగ్రహ ప్రతిష్ఠ)

ఉత్పాదకత పెరగదు... అనారోగ్యం తప్ప!

కార్పొరేట్ల కోణంలో చూసినప్పుడు మనిషి కూడా ఒక యంత్రమే. ఈ యంత్రాన్ని తమకు నచ్చినంత సమయం వాడుకోవాలని యజమానులు చూస్తారు. ఎటువంటి భావోద్వేగాలనూ ప్రదర్శించకుండా తమ 'చెప్పుచేతల్లో' ఉంచుకోవాలని ప్రయత్నిస్తారు. తాము ఇస్తున్న వేతనంతో పోలిస్తే ఉద్యోగి అందించే సేవ తక్కువ అన్న భావం ప్రకటించని యజమానులు అసలు ఉండరేమో? మరోవైపు ఉద్యోగి తాను చేసే పనినీ, వచ్చే డబ్బునూ నిత్యం బేరీజు వేసుకుంటాడు.

ఈ లెక్కల మధ్య ఉద్యోగి–యజమాని సంబంధాల్లో పనిగంటలు అనేవి కీలకం. అసలు ఎన్ని గంటలు పనిచేస్తే యజమానులు సంతృప్తి చెందుతారనేది సమాధానం లేని ప్రశ్న. ఏడాదిన్నర క్రితం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి వారానికి 70 గంటలు ఉద్యోగులు పని చేయాలని ప్రతిపాదించి పెద్ద చర్చను లేవదీశారు. ఈ రకమైన 'వర్క్ ఎథిక్' దేశ ప్రగతికి చాలా అవసరమనీ, అప్పుడే వేగంగా అభివృద్ధి చెందుతున్న చైనా, జపాన్‌లతో పోటీ పడగలమనీ తన వాదనను సమర్థించుకున్నారు. ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యం ఓ అడుగు ముందుకేసి వారానికి 70 గంటలు కాదు, 90 గంటలు పని చేస్తే ఇంకా మంచిదని సూచించారు. 'మీ ఆవిడ మొహం చూస్తూ ఎంత సేపు ఇంట్లో కూర్చుంటారు. ఆదివారం కూడా పనిచేసుకోండి' అని ఉచిత సలహా ఒకటి పారేశారు. ఎన్విడియా వంటి సంస్థల్లో షేర్లు ఉన్న ఉద్యోగులు ఇప్పటికే వారానికి 90 గంటలు పని చేస్తున్నారు. ఒకవైపు ఎక్కువ పనిగంటల పైన చర్చ జరుగుతుంటే... శాప్ ల్యాబ్స్, వీబా ఫుడ్స్ వంటి సంస్థలు పనిగంటలు తగ్గించాయి. దీని వల్ల ఉత్పాదకత పెంచుకోగలిగామని చెబుతున్నారు.

ఇప్పుడు ఇదంతా మాట్లాడుకోవటం ఎందుకంటే... ఏపీ ప్రభుత్వం రోజువారీ పని గంటలను 9 నుంచి 10 గంటలకు పెంచుతూ తాజాగా నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రయివేటు సంస్థలు, ఫ్యాక్టరీలు, ఇండస్ట్రీలు, తప్పనిసరిగా ఈ విధానాన్ని అమలు చేయాలని పేర్కొంది. ఈ మేరకు లేబర్ కోడ్‌ను సవరించాలని నిర్ణయించింది. రోజుకి 8 గంటల వంతున 5 రోజుల పాటు అంటే మొత్తం 40 గంటలపాటు పని చేయటం అనేది ప్రామాణికంగా ఉంది. ఈ ఎనిమిది గంటలను దశాబ్దం క్రితం 9 గంటలు చేశారు. ప్రస్తుతం



- పనిగంటలు ఎక్కువయితే ఉత్పాదకత పెరుగుతుందా? అలాంటిది ఏమీలేకపోగా, ఓ స్థాయి దాటి పని చేయటం వల్ల ఉత్పత్తి దారుణంగా పడిపోతుందని కూడా వెల్లడయ్యింది. ఉద్యోగుల్లో ఒత్తిడి, బర్నవుట్‌తో పాటు అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి.

పెట్టుబడులను ఆకర్షించటానికి, మరిన్ని పరిశ్రమలను రప్పించటానికి పని గంటలు పెంచినట్టు ప్రభుత్వం చెబుతోంది. ట్రేడ్ యూనియన్లు ఈ విషయంపైన ఆందోళన చెందుతున్నాయి. ఫ్యాక్టరీలలో పనిచేస్తున్న కార్మికులు ఇప్పటికే దాదాపు రెండు గంటల సమయం అధికంగా పనిచేస్తున్నారనీ ప్రభుత్వం తీసుకున్న కొత్త నిర్ణయం వల్ల పని భారం 12 గంటలకు పెరుగుతుందనీ చెబుతున్నారు.

ప్రభుత్వం 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో భాగంగా... 'ఏపీ ఫ్యాక్టరీస్, బాయిలర్స్ చట్టం', 'ఇన్సూరెన్స్, మెడికల్ సర్వీసెస్ చట్టం', 'ఏపీ షాప్ అండ్ ఎస్టాబ్లిష్మెంటు చట్టా'ల్లో మార్పులు చేస్తోంది. ఓటీ నిబంధనలు, నైట్ షిఫ్ట్ నిబంధనలు మార్చారు. ఇకపై మహిళలను కూడా నైట్ షిఫ్టుల్లో పనిచేయటానికి అనుమతిస్తారు.

పనిగంటలు ఎక్కువయితే ఉత్పాదకత పెరుగుతుందా? అలాంటిది ఏమీలేకపోగా, ఓ స్థాయి దాటి పని చేయటం వల్ల ఉత్పత్తి దారుణంగా పడిపోతుందని కూడా వెల్లడయ్యింది. ఉద్యోగుల్లో ఒత్తిడి, బర్నవుట్‌తో పాటు అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వర్క్ లైఫ్ బ్యాలెన్స్ దారుణంగా దెబ్బతింటుంది. భారతదేశంలో 1948 నాటి ఫ్యాక్టరీల చట్టం కూడా ఉద్యోగి వారానికి 48 గంటలకు మించి పని చేయకూడదని చెబుతోంది. ఆఫీసులో ఎక్కువ సమయం ఉండటం వల్ల ఎక్కువ ఉత్పాదకత సాధించగలమని అనుకోవటం భ్రమ. పని ప్రదేశాల్లో సీసీ కెమెరాలు, సామాజిక మాధ్యమాలపైన నిషేధం ఉంచటం, మొబైళ్లను సైతం అనుమతించకపోవటం వల్ల వచ్చే ఫలితం అల్పం. 'మిమ్మల్ని మేం నమ్మటం లేదు' అని యాజమాన్యం పరోక్షంగా ఉద్యోగికి చెప్పటమే ఇది. ఉద్యోగులు మనసు పెట్టి పనిచేయకపోవటానికీ, గౌరవంగా ఉండకపోవటానికీ అది కారణం అవుతుంది. ప్రతి ఉద్యోగీ కంపెనీ ఉత్పాదకతలో భాగస్వామి అన్న భావం ఎక్కువ మంచి ఫలితాన్ని అందిస్తుంది.

ఇప్పుడు ఏఐ రంగ ప్రవేశంతో పని విధానం మారిపోయింది. ఉద్యోగుల పాత్ర క్రమంగా తగ్గుతూ వస్తోంది. కొన్ని ఉద్యోగాలు మాయమవుతూ మరికొన్ని కొత్తవి రంగప్రవేశం చేస్తున్నాయి. ఓ సంధియుగంలో ఉద్యోగులు భయాందోళనలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యోగి–యజమాన్య సంబంధాలు సవ్యంగా, సానుకూలంగా మారటం పోయి వారి మధ్య అగాథం మరింత తీవ్రమవుతోంది.

– డా॥ పార్థసారథి చిరువోలు
సీనియర్ జర్నలిస్ట్ । 99088 92065

సేద్యం ఓ యజ్ఞం

వేదాన్ని జీవన విధానంగా మార్చుకున్నారు భారతీయులు. పూజలు, హోమాది క్రతువుల్లో మాత్రమే కాదు, వేద ప్రతిపాదిత వృత్తులనే ఉపాధి మార్గాలుగా ఎంచుకున్నారు. వ్యవసాయం కూడా వేదం సూచించినదే! వ్యవసాయం ఒక యజ్ఞం. వ్యవసాయ పనుల ప్రారంభానికి ముందు భూమి పూజ చేయడం అనాదిగా వస్తున్న ఆచారం. మండే ఎండలకు వీడ్కోలు పలుకుతూ... తొలకరి జల్లులతో నేలతల్లి పులకరించే క్షణాలివి. రుతుపవనాలు బలపడి, వర్షాలు మొదలవుతాయి. దుక్కి దున్ని పొలం పనులను మొదలుపెట్టడానికి ఇది అనువైన సమయం. అంతేకాదు! అందరూ ఒకేసారి పనులు మొదలుపెడితే వ్యవసాయం కూడా క్రమపద్ధతిలో ఉంటుంది. అందుకోసమే జ్యేష్ఠమాసంలో వచ్చే పౌర్ణమి రోజున వ్యవసాయ పనులను మొదలుపెట్టాలని సూచించి ఉంటారు మన పెద్దలు. ఒక రకంగా ఇది వ్యవసాయానికి ఉగాది లాంటిది. పురాణాల్లోనూ వ్యవసాయదారులకు సంబంధించిన అనేక విషయాలు చర్చించడం గమనించవచ్చు. అగ్ని, వాయు పురాణాల్లో సాగుకు సంబంధించిన అంశాలు కనిపిస్తాయి. తొలిసారిగా నాగలిని భూక్షేత్రంలో గుచ్చడానికి ముందు ధరణిపూజ చేయాలని ఋగ్వేదం ఘోషిస్తున్నది. ఆ భూమిపూజ కూడా జ్యేష్ఠపౌర్ణమి నాడు జరపాలని శాస్త్ర నిర్ణయం. అందుకే జ్యేష్ఠ పూర్ణిమను 'ఏరువాక పున్నమి' పర్వదినంగా కర్షకులు జరుపుకొంటారు. అథర్వవేదం ఏరువాకను 'అనడుత్సవం'గా చెప్పింది. క్షేత్రపాలకుని మంత్రాలతో స్తుతించి నాగలితో భూమిని దున్ని విత్తనాన్ని చల్లడం ఆచరణలో ఉంది. తర్వాతి కాలంలో పరాశరుడు, బోధాయనుడు వంటి మహర్షులు తమ గుహ్య సూత్రాల్లో ఈ పండుగను ప్రస్తావించారు. ఏరువాక పూర్ణిమను 'సీతాయజ్ఞం'అనే పేరుతో కూడా జరుపుకొంటారు.



హిందూ మత విశ్వాసాల ప్రకారం, వ్యవసాయ పనులు ప్రారంభించడానికి ముందు రైతులందరూ తమ పొలాల్లో భూమి పూజను చేస్తారు. ఈ సమయంలో తమ పొలాల్లో నాగలితో దుక్కి దున్నడాన్ని 'ఏరువాక' అంటారు. ఏరు అంటే ఎద్దులను కట్టి దున్నడానికి ఆరంభమని చెబుతారు. తెలుగు పండుగల్లో సాహిత్య ఆధారాలున్న కొన్ని వేల సంవత్సరాల అతి ప్రాచీన పండుగ ఇది. శ్రీకృష్ణ దేవరాయల కాలంలో కూడా ఏరువాక సందర్భంగా రైతన్నల ప్రస్తావన వచ్చింది. పరాశరుడు రాసిన 'కృషి పరాశరం' ప్రామాణిక వ్యవసాయ గ్రంథంగా పేర్కొంటారు. వ్యవసాయ ప్రారంభానికి ముందు నేలను పూజించి, ఆ నేల తల్లి ఆశీస్సులందుకునేందుకు చేసే పండుగైన ఈ ఏరువాక పున్నమిని ఆనందంగా జరుపుకొందాం.

– వాడవల్లి శ్రీధర్ (నేడు ఏరువాక పున్నమి)

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** పౌర్ణమి ప.12.22 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** జ్యేష్ఠ రా.7.54 వరకు, తదుపరి మూల, **వర్జ్యం:** తె.4.30 నుండి 6.12 వరకు (తెల్లవారితే గురువారం), **దుర్ముహూర్తం:** ఉ.11.35 నుండి 12.27 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.15 నుండి 12.01 వరకు, ఏరువాక పౌర్ణమి ; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.28, **సూర్యాస్తమయం:** 6.30.

క్లుప్తంగా...

మద్దతు ధర లభించక.. రైతు ఆత్మహత్య


బాబయ్య(ఫైల్)

ఆలూరు రూరల్: రెక్కల కష్టానికి మద్దతు ధర లభించక..సాగుకోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో పాలుపోక గత్యంతరం లేని పరిస్థితిలో ఓ రైతు బలవన్మరణానికి పాల్పడిన ఘటన కర్నూలు జిల్లా ఆలూరు మండలం హులేబీడులో చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. రైతు బోయ చిన్న బాబయ్య(63) తనకున్న ఏడెకరాల్లో మిరప సాగు చేశాడు. పంటల సాగుకు రూ.6 లక్షల వరకు అప్పు చేశాడు. పంట దిగుబడి ఆశించిన విధంగానే వచ్చింది. కానీ మద్దతు ధర లేక పోవడంతో మానసికంగా కుంగిపోయాడు. చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మంగళవారం ఉదయం 11.30 గంటలకు తన పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఆలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య అంబమ్మ, నలుగురు కుమార్తెలు, ముగ్గురు కుమారులు సంతానం. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహబూబ్ బాషా తెలిపారు.

'నారాయణ'లో పుస్తకాల అక్రమ విక్రయం

అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ నేతలు



భీమవరం: నిబంధనలకు విరుద్ధంగా పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో అక్రమంగా పుస్తకాలు విక్రయిస్తున్న నారాయణ స్కూల్ వద్ద ఎస్ఎఫ్ఐ నాయకులు మంగళవారం ధర్నా చేశారు. పుస్తకాల విక్రయాన్ని అడ్డుకున్నారు. అనంతరం విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేయడంతో డీవైఈవో రమేష్ స్కూల్‌కు చేరుకుని పుస్తకాలు నిల్వ చేసిన గదిని సీజ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి.గణేష్, టి.ప్రసాద్ మాట్లాడుతూ దోపిడీ చేయడానికే నారాయణ విద్యాసంస్థలను నెలకొల్పారని విమర్శించారు. ఇప్పటికే పెద్ద మొత్తంలో ఫీజులు వసూలు చేయడమేగాక పుస్తకాలు, యూనిఫాం వంటివి విక్రయించడం ద్వారా మరింత దోచుకుంటున్నారని మండిపడ్డారు.

'ఐజర్' ల్యాబ్‌లో అగ్నిప్రమాదం

ఏర్పేడు: తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లి సమీపంలోని తిరుపతి ఐజర్‌లోని కెమికల్ ప్రయోగశాలలో మంగళవారం అగ్ని ప్రమాదం జరిగింది. రీసెర్చ్ కాంప్లెక్స్‌లోని 4వ ఫ్లోర్‌లో ఉన్న ప్రయోగశాలలో మంటలు చెలరేగాయి. ఐజర్ డైరెక్టర్ సంతాను భట్టాచార్య శ్రీకాళహస్తి, వెంకటగిరి అగ్నిమాపక అధికారులకు సమాచారమివ్వటంతో వారు వచ్చి మంటలను అదుపు చేశారు. 4గంటల పాటు ల్యాబ్ నుంచి పెద్ద శబ్దాలతో దట్టమైన పొగ బయటకు వచ్చింది. ఫైర్ సిబ్బంది మంటలను పూర్తిగా అదుపు చేశారు. ఎలాంటి ప్రాణనష్టం జరగలేదని డైరెక్టర్ తెలిపారు. ఈ ఘటనపై నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసి ఎంత మేరకు నష్టం జరిగింది? ఘటనకు దారితీసిన కారణాలపై దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

వడగాడ్పులు.. గుడ్లు తేలేస్తున్న కోళ్లు

రోజూ వేల సంఖ్యలో మృత్యువాత

కొద్ది రోజులుగా మండుతున్న ఎండలు పౌల్ట్రీకి గుబులు పుట్టిస్తున్నాయి. వేడిగాలులకు తాళలేక ఫారాల వద్ద వందల సంఖ్యలో కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. 3 నెలల క్రితం బర్డ్ ఫ్లూ దెబ్బతో కుదేలైన కోళ్ల పరిశ్రమకు కూటమి ప్రభుత్వం ఇప్పటికీ పరిహారం అందించలేదు. మరో పక్క మండుతున్న ఎండలు మరింత సంక్షోభంలోకి నెట్టేస్తుండటం కోళ్ల రైతులను కలవరపరుస్తోంది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, అత్తిలి, ఇరగవరం, ఉంగుటూరు, దేవరపల్లి, ఉండ్రాజవరం తదితర మండలాల్లోని 200 పౌల్ట్రీల్లో 1.3 కోట్ల వరకు లేయర్ కోళ్లు ఉన్నాయి. లక్ష కోళ్లు ఉన్న పౌల్ట్రీ ఫారంలో సాధారణంగా రోజుకు 50–60 కోళ్ల వరకు చనిపోతుంటాయి. ప్రస్తుతం ఈ మరణాల సంఖ్య భారీగా ఉంటోంది. వారం రోజులుగా ఎండలు ఎక్కువై, వడగాడ్పుల తీవ్రతతో కోళ్ల మరణాలు పెరిగాయని రైతులు చెబుతున్నారు. ఈ విధంగా రోజుకు 39,000 కోళ్లు మృత్యువాత పడుతున్నట్లు అంచనా. ఒక కోడి చనిపోతే రూ.250 వరకు నష్టం వస్తుందని రైతులు చెబుతున్నారు. ఈ మేరకు కోళ్ల మరణాల రూపంలో రూ.97.50 లక్షల నష్టం వాటిల్లుతోంది. గత వారం రోజుల్లో జిల్లాలోని పౌల్ట్రీకి రూ.6.83 కోట్ల నష్టం జరిగినట్లు అంచనా.

– సాక్షి, భీమవరం

గుడ్ల ఉత్పత్తిపై తీవ్ర ప్రభావం

తడిసి మోపెడవుతున్న నిర్వహణ భారం

నేటికీ అందని బర్డ్ ఫ్లూ పరిహారం

ఇలాగైతే కష్టమే అంటున్న రైతులు


వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం నీటిని తాగుతున్న కోళ్లు

తగ్గిపోయిన గుడ్ల ఉత్పత్తి...

ఎండల తీవ్రతతో గుడ్ల ఉత్పత్తి భారీగా తగ్గింది. సాధారణ పరిస్థితుల్లో జిల్లాలో రోజుకు 1.05 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతుండగా వడగాడ్పుల తీవ్రతకు అది 94.50 లక్షలకు తగ్గిపోయింది. డ్రాపింగ్ వల్ల రోజుకు 10.5 లక్షల గుడ్లను రైతులు కోల్పోవాల్సి వస్తోంది. ప్రస్తుతం ఫాంగేట్ వద్ద గుడ్డు రైతు ధర రూ.5.35 ఉండగా రోజుకు రూ.56.17 లక్షలు చొప్పున వారం రోజుల్లో రూ.3.93 కోట్లు నష్టపోయినట్టు పౌల్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

పెరిగిన నిర్వహణ భారం

అధిక ఉష్ణోగ్రతల నుంచి కోళ్లను కాపాడుకునేందుకు ప్రత్యేక సంరక్షణ చర్యలతో నిర్వహణ భారం తడిసిమోపెడవుతోందని కోళ్ల రైతులు చెబుతున్నారు. వడదెబ్బకు గురికాకుండా కోళ్లకు ప్రత్యేక మందులు ఇవ్వడం, కోళ్లకు వేడిగాలులు తగలకుండా ఫారాల్లో వాతావరణాన్ని చల్లబర్చేందుకు షెడ్ల చుట్టూ గోనె సంచులు కట్టి నీటితో తడపడం, స్ప్రింక్లర్ల ఏర్పాటు తదితర జాగ్రత్తలకు తోడు పెరిగిన మేత ధరలు, కూలీ రేట్లతో నిర్వహణ భారం పెరిగిపోతోందని తెలిపారు.

ఈ ఏడాది ఫిబ్రవరి ప్రారంభంలో వెలుగుచూసిన బర్డ్ ఫ్లూ వైరస్ కోళ్ల రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. వైరస్‌ను గుర్తించక ముందు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 15 లక్షల వరకు లేయర్ కోళ్లు మృతి చెందినట్లు అంచనా. వైరస్ గుర్తించాక వేల్పూరు ఇన్ఫెక్షన్ జోన్‌లోని 55 వేలు, బాదంపూడి ఇన్ఫెక్షన్ జోన్‌లోని 1.34 లక్షల లేయర్ కోళ్లను కల్లింగ్ చేశారు. గుడ్లు, మేతను పూడ్చిపెట్టారు. వైరస్ కట్టడిలో భాగంగా ఆంక్షలు అమలు చేయడంతో వినియోగం తగ్గి ఫాంగేట్ వద్ద గుడ్డు ధర రూ.4.10కు పడిపోయింది.

ఒక్కో కోడికి రూ.140 నష్టపోయినట్లు అధికారులు ప్రాథమికంగా లెక్కగట్టారు. ఈ మేరకు పూడ్చిపెట్టిన కోళ్లకు గాను రూ.2.65 కోట్లు, గుడ్లు, మేత రూపంలో మరింత మొత్తం బాధిత రైతులకు అందించాల్సి ఉంది. 3 నెలలైనా ప్రభుత్వం ఇప్పటివరకు వారికి పరిహారం అందించలేదు. మూలిగే నక్కపై తాటికాయ పడిన చందాన ఇప్పుడు ఎండలు పౌల్ట్రీకి నష్టం కలిగిస్తున్నాయి. ప్రభుత్వం నుంచి బర్డ్ ఫ్లూ పరిహారం రావాల్సి ఉందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రభుత్వం తక్షణం చర్యలు తీసుకోకపోతే తాము మరింతగా నష్టాల్లో కూరుకుపోతామని రైతులు, పౌల్ట్రీ యజమానులు చెబుతున్నారు. వాస్తవ పరిస్థితులు పరిశీలించి ప్రభుత్వం వెంటనే తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

మమ్మల్ని తప్పుడు కేసులో ఇరికించాలని చూస్తున్నారు

హైకోర్టులో పేర్ని నాని, ఆయన కుమారుడి పిటిషన్

సాక్షి, అమరావతి: నకిలీ పట్టాల పంపిణీ వ్యవహారంలో తమపై ఎలాంటి కఠిన చర్యలేవీ తీసుకోకుండా పోలీసులను ఆదేశించాలని కోరుతూ మాజీ మంత్రి పేర్ని నాని, ఆయన కుమారుడు పేర్ని సాయి కృష్ణమూర్తి హైకోర్టును ఆశ్రయించారు. మచిలీపట్నంలో నకిలీ ఇళ్ల పట్టాల పంపిణీ వ్యవహారానికి సంబంధించిన కేసులో పోలీసులు తమను ఇరికించే ప్రయత్నం చేస్తున్నారని వారు తమ పిటిషన్‌లో పేర్కొన్నారు. ఓ పత్రికలో వచ్చిన కథనాల ఆధారంగా పోలీసులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. పెద్ద సంఖ్యలో పేదలు ఎన్నో దశాబ్దాలుగా నివాసం ఉంటూ ఆస్తి పన్నుతో పాటు ఇతర పన్నులు, కరెంటు బిల్లులు చెల్లిస్తున్నారని, వీరికి ఇప్పటి వరకు ఎలాంటి పట్టాలు మంజూరు చేయలేదన్నారు. ఎన్నో ఏళ్లుగా వీరు పట్టాలు మంజూరు చేయాలని కోరుతున్నారన్నారు. వీరి అభ్యర్థన మేరకు తహసీల్దార్ అర్హులను గుర్తించి, వారికి గ్రామ సచివాలయాల ద్వారా పట్టాలు మంజూరు చేశారన్నారు. అర్హుల ఎంపికలో, పట్టాల తయారీలో తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే వైఎస్సార్‌సీపీకి చెందిన ప్రముఖులను తప్పుడు కేసుల్లో ఇరికిస్తోందన్నారు. అధికార యంత్రాంగమంతా టీడీపీ కనుసన్నల్లో పనిచేస్తోందన్నారు. తమను కూడా ఇలాగే తప్పుడు కేసులో ఇరికించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఈనెల 3న ఓ పత్రికలో తాము 10 వేల నకిలీ పట్టాలు చేసినట్లు కథనం ప్రచురించిందని, ఈ ఆరోపణలు నిరాధారమైనవన్నారు. పట్టాలు పంచితే అవి ఎమ్మార్వో కార్యాలయంలో ఎలా ఉంటాయని, వాటిని కలెక్టర్ ఎలా సీజ్ చేస్తారని, కుట్రలో భాగంగానే ఆ పట్టాలను ఎమ్మార్వో ఆఫీసులో ఉంచారన్నారు.

ప్రేమ వ్యవహారమే హత్యకు కారణం

గిరిజన విద్యార్థిని హత్య కేసులో అనంతపురం ఎస్పీ జగదీష్ వెల్లడి

కేసు దర్యాప్తులో నిర్లక్ష్యం వహించిన సీఐ సస్పెన్షన్

అనంతపురం: గిరిజన విద్యార్థిని తన్మయి హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ వివరాలను అనంతపురం జిల్లా ఎస్పీ పి.జగదీష్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. అనంతపురంలోని రామకృష్ణ కాలనీకి చెందిన ఎరుకల లక్ష్మీపతి కుమార్తె తన్మయి ఈ నెల 3న రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి.. ఆ తరువాత తిరిగి రాలేదు. దీనిపై విద్యార్థిని తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయగా అనంతపురం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో విద్యార్థిని మృతదేహాన్ని ఈ నెల 7న కూడేరు మండలం గొట్కూరు సమీపంలో స్థానికులు గుర్తించారు. పోలీసులు అనుమానాస్పద మృతి కేసు నమోదు చేసి విచారణ చేసి ఈ నెల 10న నిందితుడు కురబ నరేష్‌ను అరెస్ట్ చేశారు. నేరానికి వాడిన బైక్, రెండు బండ రాళ్లను సీజ్ చేశారు. అనంతపురానికి చెందిన కురబ రామాంజినేయులు కుమారుడు నరేష్ టైల్స్ పనిచేస్తుంటాడు. ఇతడికి వివాహమైంది. రామకృష్ణ కాలనీలోని తన్మయి ఇంటికి సమీపంలో నరేష్ టైల్స్ పనిచేస్తూ ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. అది ప్రేమగా మారింది. ఈ క్రమంలో తనను పెళ్లి చేసుకోవాలని నరేష్‌పై ఆమె ఒత్తిడి చేయడంతో ఈ నెల 3న రాత్రి..నిందితుడు నరేష్ తన బైక్‌పై తన్మయిని తీసుకువెళ్లి అనంతపురంలోని ఓ గదిలో ఉంచాడు. మరో పెళ్లి చేసుకుంటే ఇద్దరితో ఉండటం కష్టమని నరేష్ భావించి ఆమెను అడ్డు తొలగించుకోవాలని అనుకున్నాడు. 4న రాత్రి నిర్జన ప్రదేశానికి ఆమెను బైక్‌పై తీసుకువెళ్లి అక్కడ రాయితో ఆమె వీపుపై, తలపై బలంగా కొట్టి హతమార్చాడు. దర్యాప్తులో నిందితుడు నరేష్ అని తేలడంతో హత్య, ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కేసులు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కాగా, ఈ కేసు ఛేదనలో పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది. మిస్సింగ్ కేసు నమోదై 4 రోజులు గడుస్తున్నా..సరైన తీరులో దర్యాప్తు చేయలేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో అనంతపురం వన్‌టౌన్ సీఐ రాజేంద్రనాథ్ యాదవ్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు.

ఇచ్చిన హామీలు అమలు చేయాలి

ఉరితాళ్లతో ఆటో కార్మికుల వినూత్న నిరసన



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆటో, మోటార్ కార్మికులకు ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ తక్షణమే అమలు చేయాలని ఏపీ ప్రగతిశీల ఆటో మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. విజయవాడలోని అలంకార్ సెంటర్ ధర్నాచౌక్ లో ఇఫ్టూ ఆధ్వర్యంలో సమాఖ్య ప్రతినిధులు మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో ఆటో కార్మికులు మెడకు ఉరితాళ్లు బిగించుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. డ్రైవర్లకు ఇచ్చే రూ.15 వేలు ఎప్పుడు? 5శాతం వడ్డీతో వాహనాలకు రుణాలు ఏవి?, మోటారు కార్మికుల సంక్షేమ బోర్డు ఎక్కడ? జీవో 21 రద్దు ఎప్పుడు? అంటూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ఫ్లెక్సీలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా మోటార్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాది శ్రీనివాసరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీల్లో ఒక్కటీ అమలు చేయలేదని చెప్పారు. హామీలు అమలు చేయలేనప్పుడు మేనిఫెస్టోలో ఎందుకు చేర్చారని ప్రశ్నించారు. ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. పోలారి మాట్లాడుతూ ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం రూ.1.50 లక్షల కోట్లు అప్పులు చేసిందని, కానీ సంక్షేమ పథకాలను అమలు చేయడం లేదని దుయ్యబట్టారు.

సామూహిక అత్యాచారం ఘటనలో మరో ఏడుగురు అరెస్ట్: ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికపై సామూహిక అత్యాచారం కేసులో మరో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ రత్న తెలిపారు. పుట్టపర్తిలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్‌కుమార్‌తో కలసి మంగళవారం ఆమె వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ ఘటనలో మొత్తం 18 మందిపై కేసు నమోదు చేయగా..ఇప్పటి వరకు 13 మందిని అరెస్ట్ చేశామన్నారు. వీరిలో ఒకరు మైనర్ కావడంతో జువైనల్ హోంకు తరలించామన్నారు.

సరైన ధర లేక రైతుల ఇళ్లలోనే పొగాకు బేళ్లు



కొమరోలు: పొగాకు పంటకు వేలంలో సరైన ధరలు లభించకపోవడం, వేలం కేంద్రానికి వచ్చిన బేళ్లను ఏదో ఒక వంకతో 'నో బిడ్' పేరుతో తిప్పి పంపుతుండటంతో పొగాకు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. మంచి ధర దక్కకపోతుందా.. అనే ఆశతో బేళ్లను కొందరు కోల్డ్ స్టోరేజీల్లో పెట్టుకుంటుండగా, స్థోమత లేని రైతులు వారి ఇళ్లలోనే ఉంచుతున్నారు. ప్రకాశం జిల్లా కొమరోలు మండలంలోని ఇడమకల్లు, ముక్తాపురం, రాజుపాలెం, బసువపల్లె, అయ్యవారిపల్లె, ఎస్.బొంతపల్లె, నల్లగుంట్ల, అక్కపల్లె, తాటిచెర్ల, దద్దవాడ గ్రామాల్లో ఇళ్లలోనే పొగాకు బేళ్లను పదుల సంఖ్యలో నిల్వ ఉంచారు.

ఆరేళ్ల చిన్నారిపై అఘాయిత్యం

రాజీ చేసేందుకు కూటమి నేతల యత్నం

నరసాపురం రూరల్: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలం తూర్పుతాళ్లు గ్రామానికి చెందిన బాలిక (6)పై పక్కింటిలో నివసిస్తున్న సలాది శ్రీను (50) అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ నెల 8న బాలికకు మాయమాటలు చెప్పి ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి తన ఇంటిలోకి తీసుకెళ్లి బాలికపై లైంగిక దాడి చేశాడు. విషయం తెలుసుకున్న బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భీమవరం మండలం వంకాయలపాలెం నుంచి తూర్పుతాళ్లు గ్రామానికి వచ్చి మామగారి ఇంటి వద్ద నివసిస్తున్న నిందితుడు..తన ఇద్దరు కుమార్తెలకు వివాహం చేశాడు. పాపకు చాక్లెట్లు ఇస్తానని ఆశ చూపి శ్రీను ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాగు. ఈ కేసును నీరుగార్చి రాజీ కుదిర్చేందుకు గ్రామానికి చెందిన కూటమి నేతలు ప్రయత్నాలు చేశారు. దీనిలో భాగంగా వైద్య పరీక్షలు సాకుగా చూపి సోమవారం బాలికతో పాటు తల్లిదండ్రులను ఏలూరుకు తరలించారు. అఘాయిత్యానికి పాల్పడిన శ్రీనుపై పోక్సో కేసు నమోదు చేసి అరెస్టు చేసి కోర్టుకు పంపగా, న్యాయస్థానం ఈ నెల 23 వరకూ అతనికి రిమాండ్ విధించింది.

పచ్చని జీవితాల్లో మద్యం చిచ్చు

స్నేహితుడి హత్య

ఐదుగురి అరెస్టు • పరారీలో ఇద్దరు


మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీకాంత్

కోరుకొండ: తాగిన మత్తులో కొంతమంది వ్యక్తులు స్నేహితుడినే అంతమొందించారు. ఈనెల 4న జరిగిన ఈ హత్య కేసు మిస్టరీని తూర్పు గోదావరి జిల్లా పోలీసులు ఛేదించారు. రాజమహేంద్రవరం నార్త్ జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ కథనం మేరకు... కోరుకొండ మండలం గాడాల–నిడిగట్ల రోడ్డులోని ఓ వెంచర్ డ్రైనేజీలో గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. హతుడిని రాజమహేంద్రవరం రూరల్ వెంకట నగరం గ్రామానికి చెందిన కొవ్వాడ చిన్నబ్బులు (31)గా పోలీసులు గుర్తించారు. చిన్నబ్బులుకు రాజమహేంద్రవరానికి చెందిన డీజే సాయి, శెట్టి వీరబాబు, కర్రి శ్రీనివాసరెడ్డి, రేలంగి తరుణ్‌సాయి, ఆకుల గణేష్ స్నేహితులు. తరచుగా కలుసుకుని మద్యం తాగుతుంటారు. ఈనెల 4న ఉదయం మద్యం తాగుతున్న సమయంలో వీరబాబు సెల్‌ఫోన్ చిన్నబ్బులు తీసుకోగా, కింద పడి పగిలిపోయింది. దీంతో స్నేహితుల మధ్య గొడవ జరిగింది. ఒకరినొకరు బెదిరించుకున్నారు. సమస్య పరిష్కరించుకుందామని అదే రోజు రాత్రి చిన్నబ్బులును పిలిచారు. ముందుగా వేసుకున్న పథకం ప్రకారం ఐదుగురూ చిన్నబ్బులు గొంతును పదునైన బ్లేడ్‌తో కోసి, బండరాయితో మోది హత్య చేశారు. నిందితులను పోలీసులు రాజమహేంద్రవరం సీతంపేటలోని ఓ ఇంట్లో అరెస్టు చేశారు. వారికి ఆశ్రయమిచ్చిన గండిమేను సుదర్శన్, నిఖితలను కూడా ఈ కేసులో నిందితులుగా చేర్చారు. ప్రస్తుతం వారిద్దరూ పరారీలో ఉన్నారు. నిందితుల నుంచి రెండు మోటార్ సైకిళ్లు, సెల్‌ఫోన్, రక్తపు మరకలున్న దుస్తులు, ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.

తండ్రి హతం

మద్యం తాగి ఇంట్లో గొడవ.. కొడుకులపై దాడి

ఎదురు దాడి చేసిన పెద్ద కుమారుడు


హతుడు ఆనంద్

తోట్లవల్లూరు: కృష్ణాజిల్లా తోట్లవల్లూరు మండలంలో కొడుకు చేతిలో తండ్రి దారుణహత్యకు గురయ్యాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని చాగంటిపాడు గ్రామానికి చెందిన నిమ్మకూరి ఆనంద్ (43) వ్యవసాయ పనులు చేస్తుంటాడు. అతనికి భార్య సుపథ, కుమారులు వాసు, భార్గవ్ ఉన్నారు. వాసు కార్ల షోరూమ్‌లో పనిచేస్తున్నాడు. భార్గవ్ డిగ్రీ చదువుకుంటూ విజయవాడలో ఉంటున్నాడు. తనకు తెలియకుండా భార్య ఇంటిపై రూ.5లక్షలు అప్పు తెచ్చినట్టు ఆనంద్‌కు తెలిసింది. ఈక్రమంలో సోమవారం మద్యం తాగి భార్యతో గొడవపడ్డాడు. విషయం తెలుసుకున్న ఆనంద్ తల్లి వెంకటేశ్వరమ్మ ఇద్దరికీ సర్దిచెప్పే ప్రయత్నం చేసింది. తండ్రి మద్యం తాగి వచ్చి గొడవచేస్తున్న విషయాన్ని సుపథ కొడుకులు చెప్పింది. రాత్రి 11 గంటల సమయంలో ఇంటికి చేరుకున్న కొడుకులతో కూడా ఆనంద్ గొడవకు దిగాడు. రాడ్‌తో పెద్ద కొడుకు వాసుపై దాడి చేయటంతో కింద పడిపోయాడు. వెంటనే వాసు చేతికి దొరికిన చెక్కతో దాడి చేశాడు. కోపంలో రాడ్‌తో కూడా కొట్టడంతో తలకు బలమైన గాయాలై ఆనంద్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పమిడిముక్కల సీఐ చిట్టిబాబు, తోట్లవల్లూరు ఎస్ఐ అవినాశ్ మంగళవారం వివరాలను సేకరించారు. మృతుని తల్లి వెంకటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. హత్యకు కారకుడైన వాసుని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

యువకుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): మద్యానికి బానిస కావడంతో, భార్య అలిగి పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్తాపానికి గురైన భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు నగరంలోని జాకీర్‌హుస్సేన్ నగర్‌లో మంగళవారం జరిగింది. పోలీసుల సమాచారం మేరకు.. రబ్బాని (30), మముల దంపతులకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రబ్బాని తన ఇంటి పక్క వీధిలో టిఫిన్ అంగడి పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిసైన రబ్బాని భార్యాపిల్లలను పట్టించుకోవడం మానేశాడు. దీంతో దంపతుల నడుమ విభేదాలు చోటు చేసుకున్నాయి. ఈ నెల 8న భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. దీంతో భర్తపై అలిగి మముల తన ఇద్దరు పిల్లలను తీసుకుని శ్రీనివాసగనర్‌లోని పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో మంగళవారం రబ్బాని ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని అతని స్నేహితుడు అక్బర్ అలియాస్ ఇక్బాల్ ఫోన్ చేసి మములాకు తెలిపారు. దీంతో ఆమె తన బంధువులతో కలిసి ఘటనా స్థలానికి చేరుకుని కన్నీరుమున్నీరైంది. బాధితురాలు నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

శాతవాహన కళాశాల కూల్చివేతపై విచారణ జరపాలి

పోలీస్ కమిషనర్‌కు కళాశాల పరిరక్షణ కమిటీ వినతి

విజయవాడస్పోర్ట్స్: కబ్జా చేసి, కూల్చేసిన శాతవాహన కళాశాల ఘటనలో నిందితులను వెంటనే అరెస్టు చేసి, కళాశాలకు పూర్వ వైభవం కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆ కళాశాల పరిరక్షణ కమిటీ కోరింది. జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబుకు కమిటీ ప్రతినిధులు మంగళవారం ఈ మేరకు విజ్ఞాపన పత్రమిచ్చారు. కళాశాల కమిటీ ఉపాధ్యక్షులు ఉయ్యూరు సాంబిరెడ్డి పూర్వ విద్యార్థులు, ప్రస్తుత విద్యార్థి సంఘాల నాయకులతో కూడిన కమిటీ పూర్తి వివరాలను పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లింది. సాంబిరెడ్డి మాట్లాడుతూ స్థలం విషయంలో ఏదైనా సమస్య ఉన్నా.., వారికి అనుకూలంగా తీర్పు ఇస్తే మాత్రం రాత్రికి రాత్రి కళాశాలను పూర్తిగా ధ్వంసం చేసే హక్కు ఎక్కడిదని ప్రశ్నించారు. లక్షలాది మంది విద్యార్థుల్ని అందించిన కళాశాల కబ్జాకు గురికావడం బాధాకరమని, విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో తక్షణమే పునఃప్రారంభం చేసి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించాలని కోరారు.


సీపీకి వినతిపత్రం ఇచ్చేందుకు కార్యాలయానికి వచ్చిన కమిటీ ప్రతినిధులు



లాస్‌ఏంజెలెస్‌లో తగలబడుతున్న కారు, ఓ యువతి నిరసన



శాంటా అనాలో సీఐఎస్ ఆఫీసు ముందు నేలపై పడుకొని నిరసన

‘ఐస్’ మంటలు

లాస్ ఏంజెలెస్‌లో మరింత చెలరేగిన ఆందోళనాగ్ని

- దావానలంలా ఇతర నగరాలకూ వ్యాపిస్తున్న నిరసనజ్వాలలు
- నిరసనజ్వాలల్ని బుల్లెట్ల వర్షంతో ఆపేస్తామన్న ట్రంప్

లాస్ ఏంజెలెస్/వాషింగ్టన్: అక్రమ వలసదారులను అదుపులోకి తీసుకోవాలన్న ట్రంప్ సర్కార్ పంతం చివరకు అడ్డూఅదుపులేని నిరసన జ్వాలలను రేపింది. గత మూడు రోజులుగా లాస్ ఏంజెలెస్‌కే పరిమితమైన ఇమి గ్రేషన్, కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్(ఐస్) ఏరివేత కార్య క్రమం, దానికి వ్యతిరేకంగా మొదలైన ఆందోళనలు ఇప్పుడు ఇతర నగరాలకూ పాకాయి. శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూయార్క్, సియాటెల్, డాలస్, లూయీ విల్లే, శాన్ ఆంటోనియో, షికాగో నగరాల్లోనూ సోమవారం ఆందోళనలు మొదలయ్యాయి. ఆందోళనకారుల నుద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరిక వ్యాఖ్యలు నిరసనకారులు మరింత రెచ్చిపోయేలా చేశాయి. మీరు నిరసనజ్వాలల్ని ఎగదోస్తే మేం బుల్లెట్లవర్షం కురిపిస్తాం. కట్టలు తెంచుకున్న ఆగ్రహాన్ని కట్టడిచేస్తాం. కాలిఫోర్నియా గవర్నర్ ఆందోళనకారులను రెచ్చగొట్టి నేషనల్ గార్డ్‌ల మీదకు ఉసిగొల్పుతున్నారు. గార్డ్‌లను రెచ్చగొడితే దారుణ పరిణామాలను ఎదుర్కొంటారు '' అని ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్' ద్వారా ఆందోళనకారులను హెచ్చరించారు. దానికితోడు లాస్‌ఏంజెలెస్ నగరానికి అదనంగా మరో 2,000 మంది నేషనల్ గార్డ్ రిజర్వ్‌బలగాలను పంపించారు. వీరికి తోడుగా 700 మంది నేవీ మెరైన్ సాయుధ సభ్యులూ రంగప్రవేశం చేశారు. వేలాది మంది ఆందోళనకారులు ఒకవైపు వందల మంది పోలీసులు, నేషనల్ గార్డ్, మెరైన్లు ఒకవైపు ఎదురు నిలబడి తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. దీంతో లాస్‌ఏంజెలెస్ వీధులు కనీవినీ ఎరుగని స్థాయిలో యుద్ధక్షేత్రాలను తలపించాయి. డౌన్‌టౌన్ లాస్‌ఏంజెలెస్‌లో చాలా మంది మెక్సికో, గ్వాటిమాలా జాతీయజెండాలతో కనిపించారు. ఆందోళనలను రికార్డ్‌చేస్తున్న సీఎన్ఎన్ వార్తాసంస్థ విలేకరి, ఫొటో, వీడియో జర్నలిస్ట్‌లను పోలీసులు నిలువరించారు. ఆందోళనకారులు శాంతించాలని కాలిఫోర్నియా రాష్ట్ర గవర్నర్ గవిన్ న్యూసమ్ విజ్ఞప్తిచేశారు. అదనపు బలగాలను రప్పిస్తూ మరోసారి అసాధారణ అధికారాలను ట్రంప్ దుర్వినియోగం చేశారని న్యూసమ్ ధ్వజమెత్తారు.

బలగాలపై గవర్నర్, మేయర్ అభ్యంతరం

సోమవారం రాత్రి లాస్ ఏంజెలెస్‌లోని సివిక్ సెంటర్‌లోని సిటీ హాల్ వద్దకు వేలాదిగా ఆందోళనకారులు గుమిగూడి భారీ ర్యాలీ చేపట్టారు. మరోవైపు పెద్దసంఖ్యలో అక్రమవలసదారులను బంధించి ఉంచిన డిటెన్షన్ సెంటర్ ఉన్న ఫెడరల్‌కాంప్లెక్స్ భవనం వద్దకు సైతం వందల మంది చేరుకుని ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. లాస్‌ఏంజెలెస్ భయంకరమైన ఉద్యమ సంక్షోభంలోకి వెళ్తోందని ట్రంప్ చేసిన వ్యాఖ్యలను న్యూసమ్, నగర మహిళా మేయర్ కరెన్ బాస్ తప్పుబట్టారు.

టెక్సాస్, ఆస్టిన్, శాంటా అనా నగరాల్లోనూ..

కెంటకీ రాష్ట్రంసహా కాలిఫోర్నియా రాష్ట్రంలోని శాన్‌ఫ్రాన్సిస్కో శాంటా అనా, టెక్సాస్ రాష్ట్రంలోని డాలస్, ఆస్టిన్ నగరాల్లోనూ 'ఐస్' వ్యతిరేక ఆందోళనలు మొదలయ్యాయి. ఈ నగరాల్లో పలు ప్రాంతాల్లో స్థానికులు రోడ్ల మీదకొచ్చి ఇమిగ్రేషన్ అధికారుల ఆకస్మిక దాడులు, అరెస్ట్‌లను తప్పుబట్టారు. బోస్టన్, పీట్స్‌బర్గ్, ఛార్లొటే, సియాటెల్, వాషింగ్టన్ డీసీ, కనెక్టికట్, న్యూయార్క్ నగరాల్లోనూ నిరసన ప్రదర్శనలు భారీ ఎత్తున జరిగాయి. ఆస్టిన్ సిటీలోనూ నేషనల్ గార్డ్ రంగంలోకి దిగారు. ఆస్టిన్ నగరంలో డజనుకుపైగా ఆందోళనకారులను అరెస్ట్‌చేసినట్లు టెక్సాస్ గవర్నర్ గ్రెగ్ అబ్బాట్ తెలిపారు. మరోవైపు నేషనల్ గార్డ్‌లను రాష్ట్రంలోకి అనుమతించే అంశంలో గవర్నర్ నిర్ణయాన్ని పరిగణనలోకి తీసుకోకపోవడంపై కోర్టులో కేసు వేశామని కాలిఫోర్నియా అటార్నీ జనరల్ రాబర్ట్ ఆండ్రీస్ బోంటా మంగళవారం ప్రకటించారు. '' మా రాష్ట్రంలో ఎలాంటి అంతర్యుద్ధం లేదు. తిరుగుబాటు అస్సలు లేదు. అలాంటప్పుడు రాష్ట్ర సార్వభౌమత్వాన్ని తొక్కిపెట్టేలా అధ్యక్షుడెలా నిర్ణయాలు తీసుకుంటారు?. ఈ విషయాన్ని అంత తేలిగ్గా తీసుకోబోం. అందుకే ట్రంప్, రక్షణ మంత్రి హెగ్సెత్‌పై కేసు వేశాం. ట్రంప్ ఉత్తర్వును చట్టవ్యతిరేకమైనదిగా ప్రకటించాలని కోర్టును కోరాం. అదనపు నేషనల్‌గార్డ్‌ల ప్రవేశాన్ని అడ్డుకునేలా ఆదేశాలు ఇవ్వాలని అభ్యర్థించాం'' అని ఆయన వెల్లడించారు. నేషనల్ గార్డ్‌లను రాష్ట్రాల్లోకి అనుమతించడాన్ని విపక్ష డెమొక్రాట్లు తప్పు బట్టారు. ట్రంప్ దేశానికి రాజులా భావిస్తున్నారని కాలిఫోర్నియా డెమొక్రటిక్ పార్టీ నేత, దిగువసభ సభ్యుడు జాన్ గ్యారమెండీ ఆరోపించారు. మరోవైపు గార్డ్‌ల రాకను హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం స్వాగతించింది.

శ్వేతసౌధం వివరణ

వలసదారుల ఏరివేత విధుల్లో ఉన్న ఇమ్మిగ్రేషన్ అధికారులు, ఫెడరల్ ఏజెంట్ల రక్షణ, కేంద్రప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ కోసమే నేవీ మెరైన్ బలగాలను రప్పించామని శ్వేతసౌధం వివరణ ఇచ్చింది. నిరసనలను నిలువరించాలంటే నేవీ మెరైన్లు రావాల్సిందేనని బోర్డర్ జార్ టామ్ హోమన్ అభిప్రాయపడ్డారు.

కార్మిక నేత విడుదల

శుక్రవారం అరెస్టయిన కార్మిక నేత డేవిడ్ హుయెర్టాను 50వేల డాలర్ల పూచీకత్తుతో ఇమిగ్రేషన్ అధికారులు సోమవారం విడుదలచేశారు. సర్వీస్ ఎంప్లాయీస్ ఇంటర్నేషనల్ యూనియన్ కాలిఫోర్నియా అధ్యక్షుడు డేవిడ్ అరెస్ట్ తర్వాతే ఆందోళనలు మరింత ఉధృతమవడం తెల్సిందే.

పిల్లలా... వద్దులే!

- ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి
- ఆర్థిక భారమే ప్రధాన కారణం
- జనాభా వృద్ధిలో భారీ తగ్గుదల
- ఐరాస అంతర్జాతీయ సర్వేలో వెల్లడి

ఒక్కరు ముద్దు, ఇద్దరు హద్దు, ఇకపై వద్దంటూ ఒకప్పుడు ప్రభుత్వాలే ముమ్మరంగా ప్రచారం చేశాయి. జనాభా అడ్డూఅదుపూ లేకుండా పెరిగిన రోజులవి. జనాభా వృద్ధి నానాటికీ నేలచూపులు చూస్తుండటం నేటికాలపు చేదు నిజం. భారత్ అనే కాదు, జనాభా వృద్ధిలో ప్రపంచమంతటా కనీవినీ ఎరగని రీతిలో భారీ తగ్గుదల నమోదవుతోంది! దాంతో వీలైనంత మందిని కనండని ప్రభుత్వాలే వేడుకుంటున్నాయి. కానీ ఫలితం మాత్రం పెద్దగా కన్పించడం లేదు. నానాటికీ చుక్కలనంటున్న జీవనవ్యయమే దీనికి ప్రధాన కారణమని ఐక్యరాజ్యసమితి జనాభా నిధి (యూఎన్ఎఫ్‌పీఏ) సర్వే తేల్చింది. పునరుత్పాదనకు సంబంధించి ప్రపంచవ్యాప్తంగా దంపతుల మనోగతం తెలుసుకునేందుకు ఈ ఐరాస సంస్థ ప్రయత్నం చేసింది. ఇందుకోసం 14 దేశాల్లో 14 వేల జంటలపై అధ్యయనం జరిపింది. "అత్యధికులకు ఎక్కువమందిని కనాలని ఉన్నా ఆకాశాన్నంటున్న ఖర్చులకు భయపడుతున్నారు. పోషణ భారమవుతుందనే భయంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఒక్క సంతానానికే పరిమితమవుతున్నారు" అని తేల్చింది. తమ శాంపిల్ సంఖ్య చూసేందుకు చిన్నదిగా కనిపిస్తున్నా, సర్వే ఫలితాలు మాత్రం కోట్లాది మంది మనోగతానికి అద్దం పడుతున్నాయని స్పష్టం చేసింది. ఈ ఏడాది చివరికల్లా మరో 50 దేశాల్లో సర్వే జరపాలని యూఎన్ఎఫ్‌పీఏ నిర్ణయించింది.

ఇలా చేశారు

- సర్వేలో సమాజంలోని అన్ని వర్గాల అభిప్రాయాలూ సముచితంగా ప్రతిఫలించేలా యూఎన్ఎఫ్‌పీఏ జాగ్రత్తలు తీసుకుంది.
- భారత్, అమెరికా, బ్రెజిల్, మెక్సికో, ఇటలీ, హంగరీ, జర్మనీ, స్వీడన్, దక్షిణకొరియా, మొరాకో, నైజీరియా, దక్షిణాఫ్రికా, థాయ్‌లాండ్, ఇండోనేసియా దేశాలను ఎంచుకుంది. తద్వారా అన్ని ఖండాలకూ సరైన ప్రాతినిధ్యం ఉండేలా చూసింది. ప్రపంచ జనాభాలో మూడో వంతు ఈ దేశాల్లోనే ఉండటం విశేషం!
- పేద, వర్ధమాన, సంపన్న దేశాలను ఎంచుకుంది. జననాల రేటు అత్యల్పంగా, అత్యధికంగా ఉన్న దేశాలు తగినంతగా కవరయ్యేలా జాగ్రత్త పడింది.
- అల్పాదాయ, మధ్యతరగతి, సంపన్న జంటలు; యువ, మధ్యవయసు, 50 ఏళ్ల పైచిలుకు వారిని తగిన నిష్పత్తిలో ఎంపిక చేసుకున్నారు.

ఇదీ తేలింది

- సర్వేలో పాల్గొన్న ప్రతి ఐదుగురిలో ఒకరు ఎక్కువ మందిని కనాలని ఉన్నా అందుకు సాహసం చేయలేకపోయినట్టు అంగీకరించారు.
- సంతాన లేమికి వంధ్యత్వాన్ని కారణంగా పేర్కొన్నది 12 శాతం మంది మాత్రమే!
- ఆర్థిక స్తోమత లేకపోవడం వల్లే పిల్లల్ని కనలేదని, లేదా రెండో సంతానానికి వెళ్లలేదని 39% మంది వాపోయారు. ఇలాంటివారి సంఖ్య దక్షిణ కొరియాలో అత్యధికంగా (58%), స్వీడన్‌లో అత్యల్పంగా (19%) ఉంది.
- ఎక్కువ మందిని కనాలని ఉన్నా అందుకు సాహసం చేయలేకపోయినట్టు 50 ఏళ్ల పైచిలుకు వారిలో సగం మందికి పైగా అంగీకరించారు.
- థాయ్‌లాండ్‌లో 19 శాతం మంది వంధ్యత్వాన్ని ప్రధాన కారణంగా చూపారు. తర్వాతి స్థానాల్లో అమెరికా (16 శాతం), దక్షిణాఫ్రికా (15 శాతం), నైజీరియా (14 శాతం), భారత్ (13 శాతం) ఉన్నాయి.
- ఆఫీసుకు వెళ్లి రావడానికే రోజుకు సగటున మూడు గంటలు పోతోందంటూ చాలా జంటలు ఆవేదన వెలిబుచ్చాయి. దాంతో పిల్లల బాగోగులు చూసుకునేంత సమయం లేదని వాపోయాయి.

“ 40 ఏళ్ల కింద చాలా దేశాలు అధిక జనాభాతో సతమతమయ్యాయి. కానీ 2015 నుంచి జనాభా తగ్గుదలే పెను సమస్యగా మారుతూ వస్తోంది. ప్రపంచం ఎదుర్కొంటున్న అతి పెద్ద సంక్షోభమిది. దీనికి తోడు చాలా దేశాల్లో వృద్ధుల సంఖ్య శరవేగంగా పెరుగుతుండటంతో పరిస్థితి పెనం నుంచి పొయ్యిలోకి జారుతోంది

- డాక్టర్ నటాలియా కనెం, యూఎన్ఎఫ్‌పీఏ సారథి

భారత్‌లో కూడా..!

భారత్‌లో జనాభా 146.4 కోట్లకు చేరినట్టు యూఎన్ఎఫ్‌పీఏ నివేదిక వెల్లడించింది. అయితే అన్ని దేశాల్లో మాదిరిగానే మన దేశంలోనూ జనాభా వృద్ధి నానాటికీ తగ్గిపోతోందని పేర్కొంది. జనాభా పెరుగుదల స్థిరంగా ఉండాలంటే సంతానోత్పత్తి రేటు సగటున ఒక్కో మహిళకు కనీసం 2.1 ఉండాలి. కానీ భారత్‌లో అది 1.9కి తగ్గినట్టు నివేదిక తెలిపింది.

నివేదిక విశేషాలు...

- ప్రపంచ దేశాలన్నింట్లోనూ అత్యధిక యువతతో భారత్ కళకళలాడుతోంది. జనాభాలో 24 శాతం 0–14 ఏళ్ల వయసు వారున్నారు. 10–19 ఏళ్లు 17 శాతం కాగా 24 శాతం మంది 10–24 ఏళ్ల వయసువారు.
- జనాభాలో ఏకంగా 68 శాతం పనిచేసే వయసులో (15–64) ఉన్నారు.
- 65 ఏళ్లు, ఆపైబడ్డ వృద్ధులు 7 శాతం.
- మహిళల్లో సగటు ఆయుఃప్రమాణం 74 ఏళ్లు కాగా పురుషుల్లో 71 ఏళ్లు.
- భారత్‌లో జనాభా మరో 40 ఏళ్ల పాటు పెరిగి 170 కోట్లకు చేరుకుంటుంది. అక్కడినుంచి తగ్గుముఖం పడుతుంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

మళ్లీ ఉగ్రదాడికి తెగిస్తే పాక్ నడిబొడ్డున దాడులు

విదేశాంగమంత్రి జైశంకర్

బ్రస్సెల్స్: మళ్లీ ఉగ్రవాద దాడులతో భారత్‌ను రెచ్చగొడితే ఈసారి పాకిస్తాన్ నడిబొడ్డున దాడులు చేయడం ఖాయమని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ హెచ్చరించారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత నెలరోజులకు యూరప్ ఖండంలో పర్యటిస్తున్న జైశంకర్ సోమవారం బెల్జియం దేశంలో అక్కడి వార్తాసంస్థ 'పొలిటికో'తో ప్రత్యేకంగా మాట్లాడారు. '' భారత్‌లో ఉగ్రవాదాన్ని ఇక ఏమాత్రం సహించబోం. పహల్గాం తరహాలో మళ్లీ ఎప్పుడైనా ఉగ్రవాదులు పాశవిక దాడికి పాల్పడితే ఉగ్ర సంస్థలు, ఉగ్ర నేతలపై భారత్ ఎన్నడూ, ఎవరూ ఊహించనంత స్థాయిలో విరుచుకుపడుతుంది. ఉగ్రనేతలు ఎక్కడ దాక్కున్నారనేది మాకు అనవసరం. ఒకవేళ వాళ్లు పాకిస్తాన్ ప్రధాన భూభాగంలో, నడిబొడ్డున ఉన్నాసరే అక్కడ కూడా భీకర స్థాయిలో దాడిచేస్తాం. ఉగ్రవాదాన్ని పాకిస్తాన్ ఒక దేశీయ విధానంగా మల్చుకుంది. అదే ఇప్పుడు ప్రధాన సమస్య'' అని జైశంకర్ అన్నారు. '' పరస్పర సైనిక చర్యల వేళ భారత్ ఎన్ని యుద్ధవిమానాలు కోల్పోయిందనే విషయాన్ని సందర్భోచితంగా సంబంధిత అధికారులే వెల్లడిస్తారు. యుద్ధంలో మనం ఎంత కోల్పోయాం అనేదానికంటే శత్రువును ఎంత దారుణంగా దెబ్బతీశాం అనేదే ప్రధానం. ఈ విషయంలో రఫేల్ ఫైటర్‌జెట్లు అద్భుతంగా పనిపూర్తిచేశాయి. 10వ తేదీన ఒకే ఒక్క కారణంతో పాక్ తోకముడిచింది. పాక్‌కు అత్యంత కీలకమైన 8 వైమానిక స్థావరాలు, సైనిక రన్‌వేలను నాశనంచేశాం. భారత దాడి తీవ్రతను మీరు కూడా గూగుల్‌లో చూడొచ్చు. గుంతలు పడినరన్‌వేలు, కూలిపోయిన యుద్ధవిమాన హ్యాంగర్లు కనిపిస్తాయి'' అని జైశంకర్ అన్నారు.

అఖిలపక్ష బృందాలకు ప్రధాని మోదీ ప్రశంస

న్యూఢిల్లీ: ఆపరేషన్ సిందూర్ తదనంతర పరిణామాలు, పాక్ ఉగ్రవాద విష సంస్కృతిని ప్రపంచదేశాల ఎదుట ప్రభావవంతంగా ఎండగట్టినందుకు అఖిలపక్ష బృందాలను ప్రధాని మోదీ మెచ్చుకున్నారు. 50 మందికిపైగా సభ్యులతో ఏడు బృందాలుగా బయల్దేరి అత్యంతప్రధానమైన దేశాల్లో పర్యటించి పాక్ వైఖరిపై దుమ్మెత్తి తిరిగొచ్చిన అఖిలపక్ష సభ్యులను ప్రధాని మోదీ మంగళవారం సాయంత్రం ఢిల్లీలో 7, లోక్‌కళ్యాణ్‌మార్గ్‌లోని తన అధికార నివాసంలో కలిశారు. వారి విదేశీ పర్యటన వివరాలను స్వయంగా అడిగి తెల్సుకున్నారు. అంతర్జాతీయ వేదికపై భారత దృఢవైఖరిని, పాక్ దుష్టనీతిని అత్యంత ప్రభావవంతంగా తెలియజెప్పినందుకు వారందరినీ ప్రధాని ప్రశంసించారు. ఈ సందర్భంగా సభ్యులు తమ పర్యటన అనుభవాలు, విశేషాలను ప్రధానితో పంచుకున్నారు. '' ఉగ్రవాదాన్ని అంతంచేసి శాంతిస్థాపనకు భారత్‌చేస్తున్న కృషిని, భారత్‌పై పాక్ చిమ్ముతున్న ఉగ్రవిషాన్ని ప్రపంచదేశాలకు తెలియజేప్పేందుకు పర్యటనకు వెళ్లివచ్చిన అఖిలపక్ష బృందాలతో భేటీ అయ్యా. భారత వాణిని బలంగా వినిపించినందుకు మేమంతా ఎంతగానో గర్వపడుతున్నాం'' అని తర్వాత మోదీ తన సామాజిక మాధ్యమ ఖాతా 'ఎక్స్'లో ఒక పోస్ట్‌చేశారు. రవిశంకర్ ప్రసాద్, బైజయంత్ పాండా(బీజేపీ), శశిథరూర్(కాంగ్రెస్), కనిమొళి(డీఎంకే), శ్రీకాంత్ శిందే(శివసేన), సంజయ్ కుమార్ ఝా(జేడీయూ), సుప్రియా సూలే (ఎన్సీపీ-ఎస్పీ)ల సారథ్యంలోని ఏడు అఖిలపక్ష పార్లమెంటరీ బృందాలు 33 దేశాల రాజధాని నగరాలు, యురోపియన్ యూనియన్‌లో పర్యటించడం తెల్సిందే.

భేటీలు సత్ఫలితాలనిచ్చాయి: శశిథరూర్

అమెరికాతోపాటు మరో నాలుగు దేశాల పర్యటనకు సారథ్యంవహించిన కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అంతకుముందు మీడియాతో మాట్లాడారు. '' భేటీ అద్భుతమైన సత్ఫలితాలనిచ్చింది. రాజకీయాలకు అతీతంగా ఎంపీలను పంపి భారత ఐక్యతను ప్రభుత్వం చాటింది. అందుకు తగ్గట్లే భేటీలన్నీ ఫలవంతమయ్యాయి. మా లక్ష్యం నెరవేరింది. పహల్గాం దాడి తర్వాత భారత్ ఎందుకు ఉగ్ర, పాక్ స్థావరాలపై దాడిచేసిందో బలంగా వినిపించాం. ఆయాదేశాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఉన్నతాధికారులు, మీడియా సైతం భారత్‌కు మద్దతు పలికారు'' అని శశిథరూర్ అన్నారు. '' ఉగ్రవాదం విషయంలో భారత దేశ ఐక్యతను చాటడంతోపాటు భారత వాణిని ప్రపంచదేశాలకు బలంగా వినిపించే లక్ష్యంతో ఈ బృందాలు 30కిపైగా దేశాల్లో పర్యటించాయి'' అని తర్వాత కేంద్ర ప్రభుత్వం ఒక ప్రకటన విడుదలచేసింది. ఇప్పటికే ఈ బృందాల కృషిని భారత విదేశాంగ శాఖ పొగిడింది. ఇప్పటికే ఈ బృందాలతో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ విడివిడిగా భేటీ అయ్యారు. అమెరికా, యూరప్, పశ్చిమాసియా, ఆఫ్రికా, ఆగ్నేయాసియాలో ఒక్కో బృందం పర్యటించింది.



అఖిలపక్ష బృందాల సభ్యులు శశి థరూర్, శ్రీకాంత్ షిండే, మనీశ్ తివారీ తదితరులతో మోదీ ముచ్చట్లు

‘జాతీయ భద్రతా సలహా మండలి’ సభ్యుడిగా సతీశ్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: డీఆర్‌డీఓ మాజీ చైర్మన్ ప్రొఫెసర్ జి.సతీశ్ రెడ్డిని జాతీయ భద్రతా మండలి సభ్యుడిగా కేంద్ర ప్రభుత్వం నియమించింది. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ నేతృత్వంలో 'జాతీయ భద్రతా సలహా మండలి'లో సభ్యుడిగా మంగళవారం నుంచి రెండేళ్ల పాటు, అంటే 2027 జూన్ 9వ తేదీ వరకు సతీశ్‌రెడ్డి కొనసాగనున్నారు. ఈ మేరకు జాతీయ భద్రతా మండలి సచివాలయ డిప్యూటీ సెక్రటరీ పుష్పేందర్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. నెల్లూరు జిల్లాలోని మహిమలూరులో 1963 జూలై 1న జన్మించిన సతీశ్ రెడ్డి 1986లో డిఫెన్స్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ లేబొరేటరీలో శాస్త్రవేత్తగా ఉద్యోగంలో చేరారు. ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజనీరింగ్‌లో అనంతపురం జేఎన్‌టీయూ నుంచి పట్టభద్రుడయ్యారు. అనంతరం హైదరాబాద్ జేఎన్‌టీయూలో ఎంఎస్, పీహెచ్‌డీ పూర్తి చేశారు.పరిశోధనా సంస్థ ఇమారత్ (ఆర్‌సీఐ) డైరెక్టర్‌గా పనిచేశారు. ఈ కాలంలో ఐఆర్ సీకర్స్, ఇంటిగ్రేటెడ్ ఏవి యానిక్స్ మాడ్యూల్స్, ఇతర వినూత్న వ్యవస్థల అభి వృద్ధిని పర్యవేక్షించారు. 2015లో రక్షణ మంత్రి సాంకేతిక సలహా దా రుగా నియమితులయ్యారు. 2018 ఆగస్టు లో డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవల ప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డీఆర్ డీవో) 13వ చైర్మన్‌గా నియమితులయ్యారు. క్షిపణులు, వ్యూహాత్మక వ్యవస్థల అభివృద్ధి డైరెక్టర్ జనరల్‌గా ఇండియన్ బాలిస్టిక్ మిస్సైల్ డిఫెన్స్ ప్రోగ్రామ్‌ను పర్యవేక్షించారు. నాగ్, క్యూఆర్ఎస్ఏఎం, రుద్రమ్, దీర్ఘశ్రేణి గైడెడ్ బాంబ్‌ల అభివృద్ధిలో కీలక భూమిక పోషించారు. విజయవంతమైన పృథ్వీ డిఫెన్స్ వెహికిల్ తొలి పరీక్షను పర్యవేక్షించారు. 2018 నుంచి 2022 డీఆర్‌డీవో చైర్మన్‌గా సేవలందించారు.



అమ్ములపొదిలోకి తేజస్ 2.0

- నెలాఖరుకల్లా అందుబాటులోకి ఎంకే1–ఏ రకం యుద్ధవిమానాలు
- దశలవారీగా 83 ఫైటర్లను సమకూర్చుకోనున్న వాయుసేన
- అత్యాధునిక రాడార్లతో పాటు ఎన్నో ప్రత్యేకతలు వీటి సొంతం
- ఇజ్రాయెల్ భాగస్వామ్యంతో భారత్‌లోనే అభివృద్ధి



పాకిస్తాన్‌తో ఉద్రిక్తలు తారస్థాయికి చేరిన వేళ మన వైమానిక పాటవం మరింత బలోపేతం కానుంది. తేలికరకం యుద్ధ విమానం తేజస్ తాలూకు అత్యాధునిక ఎంకే1–ఏ వేరియంట్ ఈ నెలాఖరుకల్లా ఎయిర్‌ఫోర్స్ అమ్ములపొదిలోకి చేరనుంది. దశలవారీగా మొత్తం 83 విమానాలు సమకూరనున్నాయి. ఇజ్రాయెల్‌కు చెందిన అత్యాధునిక ఏఈఎస్ఏ (యాక్టివ్ ఎలక్ట్రానికలీ స్కాన్డ్ అరే) రాడార్లతో వాటిని అత్యంత బలోపేతంగా తీర్చిదిద్దారు. ఇది ప్రపంచంలోనే అత్యంత మెరుగైన రాడార్ వ్యవస్థ. ఫలితంగా పాశ్చాత్య దేశాలకు చెందిన అత్యాధునిక యుద్ధ విమానాలకు తీసిపోని సామర్థ్యం తేజస్ ఎంకే1–ఏ సొంతమైనట్టు జెరూసలేం పోస్ట్ వార్తా సంస్థ వెల్లడించింది. ఇవి గతేడాదే అందుబాటులోకి రావాల్సి ఉండగా కీలక విడిభాగాల సరఫరా తదితరాల్లో ఆలస్యం వల్ల జాప్యమైంది. కాలం చెల్లుతున్న మిగ్–21, జాగ్వార్ యుద్ధ విమానాలను పూర్తిగా తేజస్‌లతో భర్తీ చేయాలని కేంద్రం నిర్ణయించడం తెలిసిందే. ప్రస్తుతం తొలి తరానికి చెందిన 40 తేజస్ యుద్ధ విమానాలు సేవలందిస్తున్నాయి. వాయుసేన వద్ద ప్రస్తుతం 31 ఫైటర్ స్క్వాడ్రన్లు మాత్రమే ఉన్నాయి. వీలైనంత త్వరగా వాటిని కనీసం 42కు పెంచుకోవాలన్నది లక్ష్యం. ఒక్కో స్క్వాడ్రన్‌లో 16 నుంచి 20 దాకా యుద్ధ విమానాలుంటాయి.

ఇవీ ప్రత్యేకతలు

- తేజస్ ఎంకే1–ఏలో అమర్చిన అత్యాధునిక ఏఈఎస్ఏ రాడార్ వ్యవస్థను ఇజ్రాయెల్ ప్రభుత్వ రంగ ఏరోస్పేస్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఎల్టా సిస్టమ్స్ సంస్థ అభివృద్ధి చేసింది.
- తేజస్‌లో అమర్చిన అధునాతన ఎలక్ట్రానికల్ యుద్ధతంత్ర వ్యవస్థను కూడా ఎల్టాయే సరఫరా చేసింది.
- ఇజ్రాయెల్‌కే చెందిన ఎల్బిట్ సిస్టమ్స్ రూపొందించిన అత్యాధునిక హెల్మెట్ మౌంటెడ్ డిస్‌ప్లే ఘర్షణల వేళ పైలట్లకు ఎంతగానో ఉపయోగపడుతుంది.
- ఏఈఎస్ఏ వ్యవస్థ తదితరాలన్నింటినీ మేకిన్ ఇండియా ప్రాజెక్టులో భాగంగా ఇజ్రాయెల్ భాగస్వామ్యంతో భారత్‌లోనే తయారు చేశారు.
- తేజస్ ఎంకే1–ఏకు ఇజ్రాయెల్ సమకూర్చిన పలు సాంకేతిక హంగులు ఆ దేశానికే చెందిన పలు యుద్ధవిమానాల్లో కూడా లేకపోవడం విశేషం.
- రఫేల్ యుద్ధ విమానాల్లోని రాడార్ గైడెడ్ డెర్బీ క్షిపణులను తేజస్‌ఎంకే1–ఏకు అమర్చనున్నారు. ఫలితంగా దాని యుద్ధపాటవం ఎన్నో రెట్లు పెరగనుంది.
- తేజస్ తాలూకు భావి వెర్షన్లు మరింత అధునాతనమైన కానార్డ్ వింగ్స్, ఎలక్ట్రానిక్ తదితర వ్యవస్థలు, మరింత మెరుగైన రేంజ్ వంటివాటిని సంతరించుకోనున్నట్టు జెరూసలేం పోస్ట్ తెలిపింది.
- తేజస్ మూడో వెర్షన్లను మరింత ఆధునీకరించేందుకు ప్రభుత్వ రంగ హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ నిత్యం శ్రమిస్తోంది.
- ఈ నేపథ్యంలో వాటికి అవసరమైన అధునాతన సాంకేతిక వ్యవస్థల సరఫరా కాంట్రాక్టుల కోసం ఇజ్రాయెల్‌తో పాటు ఫ్రాన్స్, అమెరికా ఆయుధ కంపెనీలు పోటీపడుతున్నాయి.

- సాక్షి, నేషనల్ డెస్క్

కమల్‌హాసన్ ఎన్నిక ఏకగ్రీవం !

మరో ఐదుగురు సైతం..

చెన్నై: తమిళనాడులో అధికార డీఎంకే పార్టీ బలపరిచిన మక్కల్ నీది మయ్యం వ్యవస్థాపకుడు, నటుడు కమల్‌హాసన్ రాజ్యసభకు ఏకగ్రీవంగా నామినేట్ కాబోతున్నారు. ఆయనకు పోటీగా ఎవరూ లేకపోవడంతో ఆయన ఎన్నిక ఖరారైంది. ఈయనతోపాటు రాజ్యసభకు మరో ఐదుగురి నామినేషన్లు సైతం ఏకగ్రీవమయ్యాయి. ఈ ఐదుగురిలో ముగ్గురు డీఎంకే నేతలుకాగా, ఇద్దరు అన్నాడీఎంకే నేతలు. తమిళనాడు అసెంబ్లీ సెక్రటేరియట్ రిటర్నింగ్ అధికారి/అదనపు కార్యదర్శి అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన తర్వాత మంగళవారం తుది నామినేషన్ల జాబితా విడుదల చేశారు. దీని ప్రకారం తమిళనాడు నుంచి రాజ్యసభకు కమల్ హాసన్, పి.విల్సన్(డీఎంకే), ఎస్ఆర్ శివలింగం(డీఎంకే), రాజాథి (డీఎంకే), ఐఎస్ ఇన్బదురై(అన్నాడీఎంకే), ఎం.ధనపాల్(అన్నాడీఎంకే)లకు పోటీగా ఎవరూ లేరు. దీంతో వీరందరూ ఏకగ్రీవంగా ఎన్నికవనున్నారు. ఏడుగురు స్వతంత్ర అభ్యర్థుల నామినేషన్లను రిటర్నింగ్ అధికారి తిరస్కరించారు. విల్సన్ గతంలోనూ రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. కమల్‌హాసన్ మాత్రం తొలిసారిగా పెద్దల సభలో అడుగుపెట్టబోతున్నారు.

ఆస్ట్రియాలో ఘాతుకం

- స్కూల్లో పూర్వ విద్యార్థి కాల్పులు
- 10 మంది విద్యార్థుల దుర్మరణం

గ్రాజ్ (ఆస్ట్రియా): ఆస్ట్రియా ఓ పూర్వవిద్యార్థి తాను చదివిన స్కూల్లో దారుణానికి తెగబడ్డాడు. క్లాస్‌రూముల్లోకి చొరబడి విచక్షణారహితంగా కాల్పులకు దిగి 10 మందిని పొట్టన పెట్టుకున్నాడు. 12 మందిని గాయపరిచాడు. తర్వాత తానూ ఆత్మహత్య చేసుకున్నాడు. గ్రాజ్ సిటీలోని బోర్గ్ డ్రెర్‌షుజెంగసీ హైస్కూల్లో మంగళవారం ఈ దారుణం జరిగింది. దుండగుడు ఉదయం 10 గంటలప్పుడు రైఫిల్, గన్‌తో పాఠశాలలో చొరబడి కాల్పులకు దిగాడు. భద్రతాబలగాలు వచ్చేసరికి టాయిలెట్ గదిలో శవంగా కనిపించాడు. కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు వెల్లడించారు. అతను ఈ ఘోరానికి ఎంతుకు తెగబడ్డదీ తెలియాల్సి ఉంది. దుండగుడు ఈ సెకండరీ స్కూల్‌లోనే చదివినా గ్రాడ్యుయేషన్ చేయకుండా మధ్యలోనే ఆపేశాడని అంతర్గత వ్యవహారాల మంత్రి గెర్హాడ్ కర్నెర్ చెప్పారు. ఘటనపై ఆస్ట్రియా చాన్స్‌లర్ క్రిస్టియన్ స్టాకర్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మూడు రోజులపాటుసంతాప దినాలు పాటిస్తామని ప్రకటించారు. దేశ చరిత్రలో ఇదొక చీకటిరోజు అని అభివర్ణించారు. ఆస్ట్రియాలో గ్రాజ్ రెండో అతిపెద్ద నగరం. నగర జనాభా 3,00,000. మధ్యయూరప్ దేశాల్లో కాల్పుల ఘటనలు, తుపాకీ సంస్కృతి అత్యంత అరుదు. 2021 గణాంకాల ప్రకారం ఆస్ట్రియాలో ప్రతి లక్ష జనాభాకు కాల్పుల ఘటనల్లో మరణాల రేటు కేవలం 0.1 శాతమే. అదే అమెరికాలో ప్రతి లక్ష జనాభాకు కాల్పుల ఘటనల్లో మరణాల రేటు 4.5 శాతం కావడం గమనార్హం.

ఏసీ కూలింగ్ ఇకపై 20 డిగ్రీలే!

అంతకంటే తగ్గించడం కుదరదు • త్వరలో కొత్త నిబంధన: కేంద్రం

న్యూఢిల్లీ: ఏసీ లేనిదే నిద్రపట్టని వారు ఎందరో! కూలింగ్‌ను మాగ్జిమం పెట్టుకుని పడుకుంటే గానీ చాలామందికి రాత్రి తెల్లారదు. అలాంటి వారికి ఇది చేదువార్తే. ఏసీ కూలింగ్‌కు పరిమితి విధించాలని కేంద్రం తాజాగా నిర్ణయించింది. దానిప్రకారం కూలింగ్‌ను 20 డిగ్రీల కంటే తగ్గించడం, గరిష్ఠంగా 28 డిగ్రీల కంటే ఎక్కువ పెట్టుకోవడం కుదరదు. ఈ మేరకు ఏసీ 'టెంపరేచర్ రేంజ్' త్వరలో అమల్లోకి రానుంది. ప్రయోగాత్మకంగా ఈ చర్య చేపట్టాలని నిర్ణయించినట్టు కేంద్ర హౌజింగ్, పట్టణ వ్యవహారాల మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ మంగళవారం ప్రకటించారు. తద్వారా మితిమీరిన కరెంటు వాడకానికి అడ్డుకట్ట పడుతుందని ఆశాభావం వెలిబుచ్చారు. ఈ నిబంధన ఇళ్లు, ఆఫీసులతో పాటు కార్లకు కూడా వర్తించనుంది. భారత్‌లో ప్రస్తుతం ఏసీల చల్లదనాన్ని 16 నుంచి 30 డిగ్రీల దాకా నియంత్రించుకోవచ్చు.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

బుధవారం । 11 । జూన్ । 2025



ఆడబిడ్డలకు రక్షణ ఏది?

కూటమి పాలనలో ఆడబిడ్డలకు రక్షణ కరువైందని వైఎస్సార్ సీపీ మహిళా ప్రజాప్రతినిధులు విమర్శించారు. మహిళల మానప్రాణాలు కాపాడాలని కోరుతూ మంగళవారం ఆందోళన చేశారు. -8లో▸



నిత్య యోగాతో జీవితంలో నూతనోత్తేజం

యోగాతో జీవితంలో నూతనోత్తేజం కలుగుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళవారం ఉపాధి హామీ కూలీలు, విశ్రాంత పోలీసు అధికారులతో కలిసి యోగాసనాలు వేశారు. -8లో▸



వెబ్ కౌన్సెలింగ్‌కు బ్రేక్

ఉపాధ్యాయుల బదిలీల వెబ్ కౌన్సెలింగ్ నిలిచిపోయింది. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన నిరసనలతో ప్రభుత్వం ఈ మేరకు చర్యలు తీసుకుంది. -8లో▸

న్యూస్‌రీల్

భక్తులతో పోటెత్తిన కార్తికేయుని ఆలయం



మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం మంగళవారం భక్త సంద్రంగా మారింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం నిండిపోయింది. స్వామివారి నిత్యకల్యాణంలో 73 జంటలు పాల్గొన్నాయి. ఈ ఒక్కరోజునే వివిధ సేవా టిక్కెట్ల ద్వారా రూ.9,07,678 ఆదాయంగా వచ్చిందని ఆలయ ఈఓ దాసరి శ్రీరామ వరప్రసాదరావు తెలిపారు. పాఠశాలల వేసవి సెలవులు ముగియనుండటం, చతుర్థితో కూడిన మంగళవారం కావడంతో వేలాదిగా భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించారు. ఆలయ అధికారులు భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు.

బీచ్ ఫెస్టివల్ క్రీడా పోటీల విజేతలకు అభినందన



విజయవాడస్పోర్ట్స్: మచిలీపట్నం మసులా బీచ్ ఫెస్టివల్‌లో నిర్వహించిన జాతీయ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుల ప్రదర్శన భేష్ అని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ పీఎస్ గిరీషా పేర్కొన్నారు. క్రీడల నిర్వహణలో శాప్ అధికారులు, డీఎస్డీఓలు, కోచ్‌లు, అసోసియేషన్ల బాధ్యుల కృషిని అభినందించారు. విజయవాడలోని శాప్ కార్యాలయ సమావేశపు హాలులో మంగళవారం బీచ్ ఫెస్టివల్ జాతీయ పోటీల్లో గెలుపొందిన ఏపీ క్రీడాకారులు, క్రీడా పోటీలు నిర్వహించిన శాప్ అధికారులు, సిబ్బంది, క్రీడా సంఘాల ప్రతినిధులను సత్కరించారు. తొలుత బీచ్ కబడ్డీ, బీచ్ వాలీబాల్, కెనాయింగ్ అండ్ కయాకింగ్ జాతీయ పోటీల్లో ఏపీ తరఫున తలపడి పతకాలు సాధించిన విజేతలను సత్కరించి, ఆర్థిక ప్రోత్సాహకాలను అందజేశారు. శాప్ ఏఓ ఆర్.వెంకటరమణ నాయక్, టీఎస్ఓ ఎస్.వి.రమణ, ఎస్ఓలు కోటేశ్వరరావు, మహేష్, సురేంద్ర, కిషోర్, ఏడీ వేణు పాల్గొన్నారు.

మెడికల్ అకాడమీ తరలింపును విరమించాలి



కంకిపాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ సంస్థ ఐఐటీ మెడికల్ అకాడమీ తరలింపు యోచనను విరమించుకోవాలని విద్యార్థి సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈడుపుగల్లులోని ఐఐటీ–మెడికల్ అకాడమీ వద్ద మంగళవారం విద్యార్థి సంఘాలు నిరసన చేపట్టాయి. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్ మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయ సంస్థ ఐఐటీ – మెడికల్ అకాడమీ 2017 నుంచి కొనసాగుతోందన్నారు. రాష్ట్రంలో బాలికలకు ప్రత్యేకంగా ఉన్న అకాడమీ ఇదొక్కటే అని గుర్తు చేశారు. ఉత్తమ ఫలితాలు సాధిస్తున్న అకాడమీని కేవలం అద్దె భారం సాకుతో మూతవేసి, విద్యార్థులను తరలించే ఆలోచన చేయటం దుర్మార్గమన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ షైనింగ్ స్టార్ అవార్డుల పేరుతో ప్రభుత్వ విద్యార్థుల కంటే ప్రైవేటు విద్యార్థుల్ని ప్రమోట్ చేస్తున్నారని విమర్శించారు. ఐఐటీ మెడికల్ అకాడమీని కొనసాగించాలని డిమాండ్ చేశారు.

రేపటి నుంచి ఇగ్నో పరీక్షలు

పటమట(విజయవాడపశ్చిమ): ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో) నిర్వహించే జూన్- 2025 టర్మ్ ఎండ్ పరీక్షలు ఈ నెల 12 నుంచి జూలై 19వ తేదీ వరకూ జరగనున్నాయని సంస్థ విజయవాడ ప్రాంతీయ కేంద్రం సీనియర్ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ డి.ఆర్.శర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రం పరిధిలో విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు అందరికీ హాల్ టికెట్లను ఇగ్నో వెబ్ సైట్‌లో అందుబాటులో ఉంచామని వివరించారు. ప్రాక్టికల్ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు తమ అధ్యయన కేంద్రాలను థియరీ పరీక్షల అనంతరం సంప్రదించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు విజయవాడ కొత్తపేట హిందూ హైస్కూల్ ప్రాంగణంలో ఉన్న ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని స్వయంగా లేదా 0866–2565253 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించొచ్చని ఆ ప్రకటనలో సూచించారు.


కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొన్ని నెలల్లోనే తెలంగాణ రాష్ట్రం భద్రాద్రికొత్తగూడెంనకు చెందిన శ్రీనివాసరావుకు విజయవాడ సైబర్ పోలీసుల నుంచి నోటీసు వెళ్లింది. సోషల్ మీడియాలో అసభ్యకర మెసేజ్‌ను పోస్ట్ చేశారని, విచారణకు రావాలని ఆ నోటీసు సారాంశం. తెలంగాణ రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం, వరంగల్ ప్రాంతాలకు చెందిన సుమారు 150 మందికి కూడా ఈ నోటీసులు వెళ్లాయి. వారంతా పోలీసులు చెప్పిన తేదీకి విజయవాడ సైబర్ స్టేషన్‌కు విచ్చేశారు. స్వతహాగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అభిమానులైన వీరంతా ‘తెలంగాణ వైఎస్సార్ కుటుంబం’ పేరుతో నడిచే వాట్సాప్ గ్రూప్ సభ్యులు. గ్రూపు ‘డీపీ’గా వైఎస్సార్ ఫొటో పెట్టుకున్నందుకు తమను విచారణకు పిలిచి ఇబ్బందులు పెడుతున్నారని వారంతా అప్పట్లో గగ్గోలు పెట్టారు. ఇదేం అన్యాయం అంటూ ప్రశ్నించడంతో పోలీసులు వారిని వదిలేశారు.

విజయవాడలో శాంతిభద్రతలు పూర్తిగా ప్రమాదంలో పడ్డాయనడానికి ఈ నెల ఎనిమిదో తేదీన మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఘటనే నిదర్శనం. పట్టపగలు, నడిరోడ్డుపై యువకులు మద్యం మత్తులో కత్తులు, బీరు సీసాలతో పరస్పర దాడులు చేసుకుని స్థానికులను భయాందోళనకు గురి చేశారు. బ్యాచ్‌లర్ పార్టీలో తలెత్తిన ఈ వివాదం కత్తులు, బీర్ సీసాలతో దాడికి దారితీసింది. పోలీస్ స్టేషన్‌కు సమీపంలోనే దాదాపు గంటన్నర పాటు ఈ రాద్ధాంతం జరిగినా, గొడవ సద్దుమణిగే వరకు పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం విమర్శలకు తావిచ్చింది.

రెడ్‌బుక్ లాఠీ

ప్రశ్నించే గొంతుకను నొక్కేస్తున్న పోలీసులు

- ప్రభుత్వం చేతిలో కీలుబొమ్మగా లాఠీ.. హుందాతనం కోల్పోతున్న ఖాకీ
- ఫలితంగా ఎన్టీఆర్ జిల్లాలో పెరిగిన రౌడీ, కేడీ షీటర్లు, బ్లేడ్ బ్యాచ్ ముఠాలు
- శాంతిభద్రతలను విస్మరించి, కూటమి నేతల అవినీతి, అక్రమాలకు సహకరిస్తున్న పోలీసులు
- ప్రజాక్షేత్రంలో పరువు పోగొట్టుకుంటున్న పోలీస్ కమిషనరేట్



సాక్షి గ్రాండ్ రిపోర్ట్

విజయవాడ: ప్రజాస్వామ్యంలో అధికార పక్షం, ప్రతిపక్షం కీలకపాత్ర పోషిస్తుంటాయి. తెలిసో.. తెలియకో అధికార పక్షం చేసే కొన్ని తప్పులను నిలదీసి, గాడిలో పెట్టాల్సిన బాధ్యత ప్రతిపక్షానిది. అయితే అధికార పక్షం చేసే తప్పులను ప్రశ్నించే గొంతులను నొక్కేయడమే లక్ష్యంగా పోలీసులు చర్యలు తీసుకోవడం విమర్శలకు తావిస్తోంది. భారత రాజ్యాంగం స్థానంలో కూటమి ప్రభుత్వం రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమల్లోకి తీసుకురావడం, దానికి పోలీసులు వంతపాడటం సమాజ తిరోగమనానికి దారితీస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు కూటమి నాయకులు ఎన్నో హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన విషయం తెలిసిందే. ఆ హామీలు అలవికానివని, అమలుపై ప్రతిపక్షం, ప్రజా సంఘాలు కచ్చితంగా నిలదీస్తాయని కూటమి నేతలకు ముందే తెలుసు. ప్రశ్నించే ముందుగానే ఆ గొంతులను నొక్కేసే వ్యవహారానికి కూటమి శ్రీకారం చుట్టింది. అందుకు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌ను పావుగా వాడుకుంటోందన్న విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

పేట్రేగిన దొంగలు, రౌడీలు, కేడీలు

కూటమి అధికారంలోకి వచ్చిన కొన్ని వారాల్లోనే పోలీసు శాఖలో ఉన్నతాధికారుల నుంచి ఎస్ఐ స్థాయి వరకు చకాచకా బదిలీలు జరిగాయి. ఈ బదిలీల్లో పోస్టింగ్‌లు పొందిన పోలీసు అధికారులు కేవలం ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తల దినచర్యలపై దృష్టి పెట్టారు. కానిస్టేబుల్ స్థాయి నుంచి టాస్క్‌ఫోర్స్, ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బందితోపాటు నగరంలోని సీసీ కెమెరాలను సైతం ప్రతిపక్షం నేతల వైపే తిప్పారు. తమపై పోలీసుల నిఘా లేకపోవడంతో దొంగలు, రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు, గంజాయి స్మగ్లర్లు రెచ్చిపోయారు. 2024 ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు విజయవాడలో 2,500 ద్విచక్ర వాహనాలు చోరీకి గురయ్యాయి. చైన్‌స్నాచింగ్, గంజాయి సరఫరా విచ్చలవిడి అయింది. 2024 జూన్ నుంచి 2025 మే నెల వరకు జిల్లాలో 989 పరస్పర దాడుల కేసులు, 1,320 కబ్జా కేసులు, 1,662 మహిళలు, చిన్నారులపై లైంగిక దాడి కేసులు, 110 ఎస్సీ, ఎస్టీలపై దాడుల కేసులు, 1,407 రోడ్డు ప్రమాదాల కేసులు, 323 సైబర్ కేసులు, 550 చీటింగ్ కేసులు, 142 డ్రగ్స్ సరఫరా కేసులు పోలీస్ కమిషనరేట్‌లో నమోదయ్యాయి. 38 హత్య కేసులు, 112 హత్యాయత్నం కేసులు, 27 తీవ్రమైన దాడుల కేసులు, 791 స్వల్ప దాడుల కేసుల నమోదయ్యాయి. 18 మంది మహిళలు హత్యకు గురవగా, వరకట్నం వేధింపులకు ఐదుగురు బలయ్యారు. 45 మంది మహిళలు, యువతులపై లైంగికదాడులు జరగ్గా, 836 మంది గృహిణులు వరకట్నం వేధింపులు ఎదుర్కొంటున్నారు. విద్యాసంస్థల్లో సైతం ర్యాగింగ్ పేరుతో ఇబ్బంది పెడుతున్నారని 394 మంది విద్యార్థినులు పోలీసులకు ఫిర్యాదులు చేశారు. ఇక చిల్లర దొంగతనాలకు హద్దేలేకుండా పోయింది. చోరీలను అదుపు చేయలేక రక్షణ వ్యవస్థ చేతులెత్తేసింది. మొత్తంగా కమిషనరేట్ పరిధిలో ప్రజల భద్రతకు పెనుముప్పు తీసుకొచ్చేలా 3,437 మంది రౌడీలు, కేడీలను రెడ్‌బుక్ రాజ్యాంగం తయారు చేసింది.

పోలీసు అధికారులకు కోర్టుల్లో చీవాట్లు

కూటమి నేతల దృష్టిలో పడి మంచి పోస్టింగ్ కొట్టేద్దామని అత్యుత్సాహంతో అక్రమ కేసులు బనాయించిన పలువురు పోలీసు అధికారులు సైతం ఇబ్బందులు పడుతున్న ఘటనలు తాజాగా వెలుగు చూస్తున్నాయి. రెడ్ బుక్ మోజులో పడి బీఎన్ఎస్‌ను అపహాస్యం చేస్తూ ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి న్యాయస్థానంలో కొందరు పోలీసు అధికారులు చీవాట్లు తిన్నారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తపై అక్రమ కేసులు బనాయించిన పోలీసులపై వైఎస్సార్ సీపీ నాయకులు సైతం తిరిగి కేసులు పెట్టారు. ప్రస్తుతం ఈ కేసులు న్యాయస్థానం విచారణలో ఉన్నాయి. ఈ కేసుల్లో అభియోగాలు నిరూపితమైతే తమ ఉద్యోగాలకే ముప్పు వాటిల్లుతుందనే భయం సదరు పోలీసు అధికారులను వెంటాడుతోంది. ఈ నేపథ్యంలో పోలీసు అధికారులు ఆయా కేసులను వెనక్కి తీసుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకుల కాళ్లావేళ్లా పడుతున్నట్లు సమాచారం.

విలేకరులపై అక్రమ కేసులు, ఎడిటర్ ఇంట్లో అనధికార సోదాలు

కూటమి పాలకుల అవినీతి అక్రమాలను వెలుగులోకి తీసుకొచ్చే విలేకరులపైనా పోలీస్ శాఖ జులుం ప్రదర్శిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన కొన్ని వారాలకే నందిగామలో కూటమి నేతల అక్రమాలు వెలుగులోకి వచ్చాయి. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన సాక్షి విలేకరిపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. బుడమేరు వరదల్లో పాలకుల వైఫల్యాన్ని, ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులు, ఆస్తి, ఆర్థిక నష్టాలను సాక్షి వెలుగులోకి తీసుకొచ్చిన విషయం తెలిసిందే. ఆ తరువాత కూటమి నేతల మౌఖిక ఆదేశాలతో పోలీసులు అమాయక ప్రజలపై విరుచుకుపడుతున్న తీరును సాక్షి బహిర్గతం చేస్తోంది. ఈ నేపథ్యంలో సాక్షి గొంతుకను నొక్కేందుకు పత్రిక ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపైకి పోలీసులను కూటమి నేతలు ఉసిగొల్పారు. ముందస్తు నోటీసులు, న్యాయస్థానం ఆదేశాలు లేకుండా ఆయన ఇంట్లో తనిఖీలు చేసి ప్రజాస్వామ్యాన్ని పోలీసు శాఖ అపహాస్యం చేసింది.

సోషల్ మీడియా యాక్టివిస్టులతో మొదలు..



ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన కూటమి పాలనపై సోషల్ మీడియా యాక్టివిస్టులు గొంతు విప్పారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, ఎక్స్, యూ ట్యూబ్, వాట్సాప్ వేదికగా ప్రశ్నించడం ఆరంభించారు. రానున్న రోజుల్లో ఈ ప్రశ్నలు విజృంభిస్తాయని గ్రహించిన కూటమి నేతలు వారిపైకి పోలీస్‌లను ఉసిగొల్పారు. ఫిర్యాది ఎవరో తెలియకుండానే జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్లలో సోషల్‌మీడియా ఖాతాలపై కేసులు నమోదయ్యాయి. పదేళ్ల క్రితం చేసిన పోస్ట్ ఆధారంగా కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. జిల్లా సైబర్ పోలీస్ స్టేషన్‌లో వారం రోజుల వ్యవధిలో 300లకు పైగా కేసులు నమోదయ్యాయి. సుమారు రెండు వేల మందిని 41(ఏ) నోటీసులతో స్టేషన్‌కు పిలిపించి విచారణ పేరుతో ఇబ్బందులు పెట్టారు. జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్లలో రెండు వేలకు పైగా కేసులు నమోదు చేశారు. వీటిలో చిన్నారులు, మహిళలపై అసభ్యకరంగా పోస్ట్ చేసిన ఖాతాలకు మినహా అన్ని కేసులు న్యాయస్థానంలో నిలబడలేకపోయాయి.

కూటమి పాలనలో యథేచ్ఛగా లైంగిక దాడులు

- బాధితుల్లో ఆర్నెల్ల పాప నుంచి అరవై ఏళ్ల వృద్ధులు
- నేరాలకు పాల్పడుతున్న వారంతా టీడీపీ వారే
- మద్యం, గంజాయి, డ్రగ్స్ వాడకమే ఇందుకు కారణం
- మహిళలకు రక్షణ కల్పించడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు వరుదు కల్యాణి



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, మహిళా నేతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వంలో మహిళలపై అఘాయిత్యాలు, లైంగిక దాడులు, హత్యలు యథేచ్ఛగా జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి విమర్శించారు. మద్యం, గంజాయి, డ్రగ్స్ వాడకమే ఇందుకు కారణమని పేర్కొన్నారు. బాధితుల్లో ఆర్నెల్ల చిన్నారి నుంచి 60 ఏళ్ల వృద్ధురాలి వరకు ఉన్నారని ఆందోళన వ్యక్తంచేశారు. ఏడాది కూటమి పాలనలో మహిళల మాన, ప్రాణాలు గాల్లో దీపాలయ్యాయని, రాష్ట్రంలో మహిళలు బతకాలంటే భయపడుతున్నారని, బాలికల తల్లిదండ్రులు గజగజా వణికిపోతున్నారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం మహిళల భద్రతను గాలికి వదిలేసిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఆటవిక రాజ్యం నడుస్తోందని, మహిళలు, చిన్నారులపై లైంగిక దాడులు, హత్యలకు పాల్పడిన వారంతా టీడీపీ నాయకులు, కార్యకర్తలేనని మండిపడ్డారు. మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలకు నిరసనగా వైఎస్సార్ సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం విజయవాడలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్యాణి మాట్లాడుతూ... ‘రాష్ట్రంలో మహిళలపై అఘాయిత్యాలు, లైంగిక దాడులు, హత్యలు ఎంత దారుణంగా ఉన్నాయో చూస్తున్నాం. ఈ ఏడాది కాలంలో విపరీతంగా పెరిగాయి. మహిళల భద్రత విషయంలో ప్రభుత్వ వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. మహిళలు బయటకు వెళ్లాలంటే భయపడే పరిస్థితి. మహిళలు ఇంట్లో ఉన్నా, బడిలో, కళాశాలలో ఉన్నా, చివరికి పని ప్రదేశంలో ఉన్నా అఘాయిత్యాలు, లైంగిక దాడులు, హత్యలు జరుగుతున్నాయి. ఇటీవల హిందూపురం, అనంతపురంలో చిన్నారి తన్మయి. సత్యసాయి జిల్లాలో 14 ఏళ్ల బాలికపై లైంగిక దాడులే ఇందుకు నిదర్శనం’ అని పేర్కొన్నారు.

గంటకు మూడు, నాలుగు అఘాయిత్యాలు

కూటమి పెద్దలు పనికిమాలిన విషయాలపై దృష్టి పెడుతున్నారని, మహిళలపై ఇన్ని ఘటనలు జరిగినా సీఎం, డిప్యూటీ సీఎం, హోం మంత్రి ఎక్కడైనా స్పందించారా అని వరుదు కల్యాణి ప్రశ్నించారు. కడప జిల్లాలో మూడేళ్ల బాలికపై లైంగిక దాడి, హత్య చేశారని, ఉండి నియోజకవర్గంలో, భీమిలిలో ఇలా ఎక్కడా చూసినా ఇలాంటి ఘటనలు వినని రోజు లేదని ఆందోళన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో రోజుకు 70 నుంచి 80 కేసులు నమోదవుతున్నాయని, నమోదు కానివి ఇంకా ఎన్నో ఉన్నాయని, గంటకు మూడు, నాలుగు లైంగికదాడులు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది కావొస్తున్నా ఒక్క రివ్యూ చేయకపోవడం సిగ్గుచేటని, అవసరం లేని విషయాలపై, కక్షపూరిత రాజకీయాలపై ప్రెస్ మీట్లు పెట్టే హోం మంత్రి ఇలాంటి ఘటనలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు.

ఏరులై పారుతున్న మద్యం

కూటమి పాలనలో రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతోందని వరుదు కల్యాణి విమర్శించారు. అధికారంలోకి వచ్చిన వందరోజుల్లో గంజాయి రూపుమాపుతామని గొప్పలు చెప్పారని, హోం మంత్రి నివసిస్తున్న విశాఖలోనే గంజాయి ఉత్పత్తి జరుగుతోందని, ఆమె నియోజకవర్గం మీదుగానే గంజాయి రవాణా జరుగుతోందని వివరించారు. కూటమి పాలనలో వీధికో గాంధార పుత్రుడు, వీధివీధినా గంజాయి పుత్రులే కనిపిస్తున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం కళ్లు తెరిచి మహిళలకు రక్షణ కల్పించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ఉర్వేళమ్మ ఉత్సవం.. సకల జనుల సంబరం

- మూడేళ్లకోసారి గ్రామదేవత ఉర్వేళమ్మ జాతర
- నూరు వసంతాలుగా వెల్లివిరుస్తున్న మత సామరస్యం
- ఉర్వేళమ్మ జాతరలో తొలి పూజలు ముస్లిం సాహెబ్‌కే
- హిందూ భక్తులతో మదార్ సాహెబ్ సంబరం



భావదేవరపల్లి గ్రామదేవత శ్రీ ఉర్వేళమ్మ అమ్మవారు



మదార్ సాహెబ్ జెండా సంబరంలో భక్తులు సమర్పించే రొట్టెలు, గంధపు ఉండలు

భావదేవరపల్లి(నాగాయలంక): నూరేళ్లుగా అచ్చమైన మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తుంది ఈ గ్రామదేవత సంబరం. నాగాయలంక మండలం భావదేవరపల్లి గ్రామంలో మూడేళ్లకు ఒకసారి నిర్వహించే గ్రామదేవత ఉర్వేళమ్మ జాతర వైభవంగా జరుగుతుంది. జాతరకు ముందుగా పూర్వీకుల సంప్రదాయం రీత్యా మదార్ సాహెబ్ సంబరం జరపడం తప్పనిసరి. గ్రామంలో గుడారం, మదరా సాహెబ్ జెండా ఊరేగింపు కార్యక్రమాలు జరుగుతాయి. వందేళ్ల క్రితం అప్పటి ఆలయ ధర్మకర్తలు భోగాది అప్పారాయుడు, మండలి వెంకటప్పయ్య, గ్రామపెద్దలు రాసిన ఇలియా (శాసనం) ప్రకారం ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉర్వేళమ్మతో పాటు మదార్‌సాహెబ్ సంబరం ముందుగా నిర్వహిస్తారు. వాస్తవానికి ఈ గ్రామంలో ముస్లిం కుటుంబాలు లేవు. అయినా అందుబాటులో ఉండే ముస్లిం పెద్దలు వచ్చి మదార్ సాహెబ్ సంబరం జరుపుతారు. తొలుత సాహెబ్ జెండా పట్టుకుని గ్రామ వీధుల్లో తిరిగి భక్తుల నుంచి కొబ్బరికాయలు, అగరొత్తులు, చిల్లర నాణేలు స్వీకరిస్తారు. అదే రాత్రికి మదార్ సాహెబ్ గుడారానికి చేరిన భక్తులు ఆ మత సంప్రదాయం మేరకు మూడు చొప్పున రొట్టెలు, గంధపు ఉండలు, జెండాలు, చిల్లర నాణేలు సమర్పించి పూజలో పాల్గొంటారు. హిందూ–ముస్లిం సమైక్యతతో ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఈ క్రతువు ముగిసిన వెంటనే మద్ది రావమ్మ స్థావరానికి భక్తులు చేరుకుని వేడి నైవేద్యాలను సమర్పిస్తారు.

13వ తేదీ నుంచి ఉత్సవాలు

ఎంతో వైవిధ్యంతో కూడిన ఉర్వేళమ్మ జాతర మహోత్సవాన్ని గ్రామస్తులు ఈ నెల 13, 14, 15 తేదీల్లో మూడు రోజులు పాటు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 13న పోతురాజు స్వామి పోత తదుపరి మద్ది రావమ్మ, మదారా సాహెబ్ సంబరం జరుగుతాయి. 14న గ్రామంలో గుడారం, మదారా సాహెబ్ జెండా ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఈ ఊరేగింపులో సాహెబ్ జెండా పట్టుకుని భక్తులు నడుస్తారు. చివరి రోజు 15వ తేదీన ఉదయం ఎనిమిది గంటలకు ఉర్వేళమ్మవారికి పూజ, రాత్రి ఏడు గంటలకు ఉర్వేళమ్మ దేవతకు వేడి నైవేద్యాలతో గ్రామస్తులు ఊరేగింపు నిర్వహిస్తారు. రాత్రి పది గంటలకు ఆలయానికి చేరుకుని గ్రామంలోని 20 ముఠాల నేతృత్వంలో సంయుక్తంగా అమ్మవారి సంబరాన్ని అట్టహాసంగా జరుపుతారు.

నకిలీ విత్తన విక్రేతల ముఠా అరెస్టు

సూర్యాపేటటౌన్: రైతులకు నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తున్న ఆరుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట ఎస్పీ కె.నర్సింహ తెలిపారు. రూ.65 లక్షల విలువైన 22 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ కేసు వివరాలను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో వెల్లడించారు. తెలంగాణలోని ఆత్మకూర్(ఎస్) మండలం పాతర్లపహాడ్ బస్‌స్టేజీ వద్ద ఈ నెల 9న పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా.. మహబూబాబాద్ జిల్లా మరిపెడకు చెందిన తండా నగేష్ 120 ప్యాకెట్ల నకిలీ విత్తనాలను తరలిస్తుండగా పట్టుకున్నారు. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం పెనుగొలనుకు చెందిన పంది రాము వద్ద విత్తనాలు తెస్తున్నట్లు నగేష్ ఒప్పుకున్నాడు. రామును అదుపులోకి తీసుకొని విచారించగా.. మైలవరంలో బానోతు జయరాం షాపులో కొనుగోలు చేస్తున్నట్లు తెలిపాడు. జయరాం షాపునకు గుంటూరు జిల్లా బాలాజీనగర్‌కు చెందిన తరిగొప్పుల శ్రీనివాసరావు సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది. జయరాంను, శ్రీనివాసరావును అదుపులోకి తీసుకొని విచారించారు. బాపట్ల జిల్లా ఇంకొల్లు గ్రామానికి చెందిన మాగులూరి సాంబశివరావు అరుణోదయ అనే నకిలీ పత్తి విత్తన కంపెనీ నిర్వహిస్తూ విత్తనాలు తయారు చేస్తున్నాడని, తరిగొప్పుల శ్రీనివాసరావు మధ్యవర్తిగా కర్నూలు జిల్లా పల్లిపాడుకు చెందిన చెవుల నర్సింహులుతో సరఫరా చేస్తున్నట్లు తేలింది. జయరాం షాపులో నిల్వ చేసిన 37 బస్తాల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకోగా ఒక్కో బస్తాలో 120 ప్యాకెట్లు నకిలీ విత్తనాలు ఉన్నాయి. ఈ కేసులో తండ నగేష్, పంది రాము, బాణోతు జయరాం, తరిగొప్పుల శ్రీనివాసరావును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపగా.. ఏ–1 నిందితుడు అరుణోదయ కంపెనీ ఎండీ మాగులూరి సాంబశివరావు, ఏ–6 చెవుల నర్సింహులు పరారీలో ఉన్నట్లు తెలిపారు.

మరో కేసులో ఇద్దరు..

ముందస్తు సమాచారం మేరకు సూర్యాపేట జిల్లా మోతె మండలం రావిపహాడ్ గ్రామానికి చెందిన వెలుగు శ్రీను ఇంట్లో ఈ నెల 9న జిల్లా సీసీఎస్, మోతె పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. అతని ఇంట్లో అడ్వాన్స్ 333, అరుణోదయ అనే నకిలీ పత్తి విత్తనాల కంపెనీల పేరుతో ఉన్న 98 ప్యాకెట్ల స్వాధీనం చేసుకొని నిందితుడిని అరెస్టు చేశారు. శ్రీను బంధువైన ఎన్టీఆర్ జిల్లాకు చెందిన చర్లపల్లి శాతవాహన అనే వ్యక్తితో కలిసి సూర్యాపేట జిల్లా వ్యాప్తంగా తిరుగుతూ రైతులకు ఈ నకిలీ విత్తనాలు అమ్ముతున్నామని ఒప్పుకున్నాడు. వెంటనే శాతవాహనను అరెస్టు చేసి అతని వద్ద 30 ప్యాకెట్ల నకిలీ విత్తనాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. వీరికి ఈ విత్తనాలు సరఫరా చేస్తున్న మరో వ్యక్తి కర్ణాటక రాష్ట్రం నలుగునూర్‌కు చెందిన తిరుమల్‌గా గుర్తించారు. ప్రస్తుతం తిరుమల్ పరారీలో ఉండగా అతనిని పట్టుకునేందుకు పోలీస్ ప్రత్యేక టీంలను ఏర్పాటు చేశారు. ఈ కేసులో రూ.2 లక్షల విలువ చేసే 58 కేజీల నకిలీ విత్తనాలు సీజ్ చేసినట్లు ఎస్పీ తెలిపారు.

క్లుప్తంగా

వెబ్ కౌన్సెలింగ్‌కు బ్రేక్

ప్రారంభమైన ఎస్జీటీల మాన్యువల్ బదిలీలు



బదిలీ ప్రక్రియ ఆలస్యం కావటంతో చెట్ల కింద పడిగాపులు కాస్తున్న ఉపాధ్యాయులు

మచిలీపట్నంఅర్బన్: ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు చేపట్టిన నిరసనలతో ప్రభుత్వం వెబ్ కౌన్సెలింగ్ విధానానికి బ్రేక్ వేసింది. టీచర్ల బదిలీలను మాన్యువల్ కౌన్సెలింగ్ ద్వారా నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. ఈ ప్రక్రియలో భాగంగా ఉమ్మడి కృష్ణా జిల్లా, 53 మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న సుమారు 2,800 మంది సెకండరీ గ్రేడ్ టీచర్లకు (ఎస్జీటీ) బదిలీ ప్రక్రియ మంగళవారం సాయంత్రం విద్యాశాఖ అధికారులు ప్రారంభించారు.

సర్వర్ సమస్యలతో ఆలస్యం..

స్థానిక జిల్లా పరిషత్ (జెడ్పీ) సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న మాన్యువల్ కౌన్సెలింగ్‌కు ఎస్జీటీలు మధ్యాహ్నం రెండు గంటలకే జెడ్పీకి చేరుకున్నప్పటికీ, అవసరమైన ఆన్‌లైన్ అనుమతులు ఆలస్యం కావడంతో అదే ప్రాంగణంలో గంటల తరబడి ఉపాధ్యాయులు పడిగాపులు కాశారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన టీచర్లు చెట్ల కింద కూర్చొని అసహనానికి గురయ్యారు. కనీస వసతులు కల్పించలేదని పెదవి విరిచారు. కౌన్సెలింగ్ మొదటి రోజున 200 మంది ఎస్జీటీల బదిలీలను చేపట్టారు. టెక్నికల్ సమస్యలు ఎదురవడం, సర్వర్ మొరాయించటంతో ప్రక్రియలో జాప్యం జరిగింది. మొత్తం బదిలీల ప్రక్రియను మూడు రోజుల్లో పూర్తి చేస్తామని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ఉపాధ్యాయుల అర్హతలు, ప్రాధాన్యతలు పరిగణనలోకి తీసుకుని పారదర్శకంగా బదిలీలు చేపడతామని అధికారులు స్పష్టం చేశారు.

శాప్ పాలకవర్గ సభ్యులు వీరే..

విజయవాడస్పోర్ట్స్: ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) పాలకవర్గ సభ్యుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ప్రకటించింది. ఒలింపిక్ క్రీడాకారులు, అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీతలు, క్రీడలకు ప్రోత్సాహం అందించే వ్యక్తులకు పాలకవర్గంలో చోటు కల్పిస్తూ ప్రభుత్వ కార్యదర్శి వి.వినయ్‌చంద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఒలింపిక్ హాకీ క్రీడాకారిణి ఇ.రజని(చిత్తూరు), అర్జున, ద్రోణాచార్య అవార్డు గ్రహీత, వాలీబాల్ సీనియర్ క్రీడాకారుడు ఎ.రమణరావు(విజయవాడ), ఎం.డి.రమేష్‌కుమార్(విజయనగరం), వ్యాయామ విద్యా అధ్యాపకుడు ప్రేమ్‌రవీంద్రనాథ్(పశ్చిమగోదావరి), క్రికెట్ క్రీడాకారుడు ఎస్.సంతోష్‌కుమార్(విజయవాడ), కె.జగదీశ్వరి(ఎన్జీవో), క్రీడలకు ప్రోత్సాహం అందించే బి.శివ(అనంతపురం), పి.బి.వి.ఎస్.ఎన్.రాజు(అనకాపల్లి) సభ్యుల జాబితాలో ఉన్నారు.

సమిధలవుతున్న వనితలు

- రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువు
- వరుస దారుణ ఘటనలతో బెంబేలు
- డైవర్షన్ కోసమే సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని అరెస్ట్
- మీడియాతో వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్



విలేకరులతో మాట్లాడుతున్న దేవినేని అవినాష్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి, జగన్‌మోహనరావు, విజయవాడ మేయర్ భాగ్యలక్ష్మి

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, రోజుకో ప్రాంతంలో వారిపై అత్యాచారాలు, హత్యలు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఇన్‌చార్జిలతో కలిసి మంగళవారం అవినాష్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా, ఇచ్చిన హామీల అమలు శూన్యమన్నారు. తాము వెన్నుపోటు దినం ద్వారా నిరసన తెలిపితే కూటమి పాలకులు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని మండిపడ్డారు.

దారుణ రాజకీయాలు..

ఒక జర్నలిస్ట్ చానల్‌లో మాట్లాడితే దానిని వైఎస్ జగన్ కుటుంబానికి అంటగడుతూ విమర్శలు చేస్తున్నారన్నారు. కొమ్మినేని శ్రీనివాస్‌ని అరెస్ట్ చేసి కక్ష పూరిత రాజకీయాలు చేస్తున్నారని దేవినేని అవినాష్ అన్నారు. గత ప్రభుత్వంలో మహిళలకు అత్యంత ప్రాధాన్యం కల్పించామని, మహిళల పేరుతో అనేక పథకాలు అమలు చేసినట్లు తెలిపారు. మహిళలు అంటే గౌరవంతో వైఎస్ జగన్ పాలన సాగించారన్నారు. అమరావతి ప్రాంతంలో పేద ప్రజలకు సొంతింటి కలను జగన్ నెరవేర్చారన్నారు. జగన్ చేసిన మంచి పనులను దమ్ముగా, ధైర్యంగా చెప్పగలమని, ఆయన గురించి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని, జాగ్రత్త అని హెచ్చరించారు. తప్పు చేసిన వారిని తప్పకుండా చట్టం ముందు నిలబెడతామని, ఒక చానల్లో వచ్చిన దానికి కొమ్మినేని అప్పుడే క్షమాపణ చెప్పారని, ఆ మీడియా ఆఫీసుపై దాడి చేసి ధ్వంసం చేయడం దారుణమన్నారు.

డైవర్షన్ పాలిటిక్స్..



మల్లాది విష్ణు

వెన్నుపోటు దినం సక్సెస్ అయ్యేసరికి కూటమి నేతలు డైవర్షన్ పాలిటిక్స్ స్టార్ట్ చేశారని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మండిపడ్డారు. వైఎస్ జగన్ కంటే మెరుగైన పాలన అందిస్తామని ప్రజలను నమ్మించి వంచించారన్నారు. మహిళలను దారుణంగా మోసం చేసి ఉసురు పోసుకున్నారని ఆరోపించారు. మహిళల గురించి మాట్లాడే నైతిక హక్కు కూటమి ప్రభుత్వానికి లేదన్నారు. అమ్మఒడి, చేయూత, ఇళ్ల పట్టాల పంపిణీ ద్వారా లక్షల మంది మహిళలకు వైఎస్ జగన్ అండగా నిలిచారన్నారు. శాంతిభద్రతల సమస్య ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నట్లు మరే రాష్ట్రంలోనూ లేదన్నారు. కొమ్మినేని అరెస్టును ఖండిస్తున్నామని, మీడియా సంస్థపై దాడి హేయమైన చర్యగా పేర్కొన్నారు.

రాజకీయాల కోసం దిగజారుతున్నారు..



జగన్‌మోహనరావు

రాజకీయ లబ్ధి కోసం కూటమి నేతలు దిగజారి వ్యవహరించడం సిగ్గుచేటని మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. కొమ్మినేని శ్రీనివాస్ మీద కేసు పెట్టడం దారుణమని, జర్నలిస్ట్ కృష్ణంరాజు మాట్లాడిన సమయంలోనే ఆ వ్యాఖ్యలను ఖండించారన్నారు. మహిళలను అవమానించడం సరికాదని అప్పుడే చెప్పారన్నారు. ఆయనపై పెట్టిన సెక్షన్లు ఆశ్చర్యంగా ఉన్నాయన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను అందరూ చూస్తున్నారన్నారు. రాజధాని మహిళలను అడ్డుపెట్టుకుని అనని మాటలను అంటగడుతున్నారని ఆరోపించారు.

అరాచకాలు చూపిస్తే బ్యాన్ చేస్తున్నారు..



వెలంపల్లి శ్రీనివాసరావు

రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను చూపిస్తున్న చానళ్ల ప్రసారం కాకుండా బ్యాన్ చేస్తున్నారని మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మండిపడ్డారు. వారిని బెదిరించి, భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ఇప్పటికే అప్పుల ఊబిలో ఉందని, ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేక పోయిందన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేసే పరిస్థితిలో ప్రభుత్వం లేదన్నారు. మహిళలపై దాడులు జరుగుతున్నా చర్యలు తీసుకోవడం లేదని, మహిళా హోం మంత్రి అయి ఉండి ఏమి మాట్లాడుతున్నారో తెలియడం లేదని విమర్శించారు. క్రిమినల్‌ని ట్రీట్ చేసినట్లు కొమ్మినేనిని చూడటం దుర్మార్గమన్నారు.

గతంలో అధిక ప్రాధాన్యం..



తన్నీరు నాగేశ్వరరావు

గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పించారని జగ్గయ్యపేట వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు అన్నారు. మహిళా సాధికారత ఉంటేనే అభివృద్ధి సాధ్యమని నమ్మి.. అదే చేసి చూపించారని చెప్పారు. కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టును ఖండిస్తున్నామన్నారు. జర్నలిస్టు చేసిన వ్యాఖ్యలను వైఎస్సార్ సీపీకి అంటగట్టడం దుర్మార్గమన్నారు.

హోంమంత్రి రాజీనామా చేయాలి..



మేయర్ భాగ్యలక్ష్మి

రాష్ట్రంలో మహిళలపై రోజుకో ప్రాంతంలో ఘోరమైన నేరాలు జరుగుతున్నాయని, శాంతి భద్రతలు అదుపు తప్పాయని రాయన భాగ్యలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న ఘటనలపై హోం మంత్రి అనిత ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. ఏ బాధిత కుటుంబానికి భరోసా ఇవ్వలేక పోతున్నారని విమర్శించారు. పోలీస్ వ్యవస్థ దారుణంగా ఉందని.. ఆ ఘటనలకు బాధ్యత వహించి హోంమంత్రి రాజీనామా చేయాలని ఆమె డిమాండ్ చేశారు.

తప్పులను ఎత్తిచూపినందుకే..



నల్లగట్ల స్వామిదాసు

ప్రభుత్వం చేస్తున్న తప్పులను ఎత్తి చూపినందుకే కొమ్మినేని గొంతునొక్కుతున్నారని తిరువూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు అన్నారు. ఆయన అరెస్ట్‌ని ఖండిస్తున్నట్లు చెప్పారు. లైవ్ డిబేట్‌లో అనేక పొరపాట్లు జరుగుతాయని.. ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు లైవ్‌లో ఒక నాయకుడిని చెప్పుతో కొట్టారని గుర్తు చేశారు. పోసాని, వంశీలాంటి నేతలపై కూడా కక్ష సాధిస్తున్నారన్నారని మండిపడ్డారు.

నిత్య యోగాతో జీవితంలో నూతనోత్తేజం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



బీఆర్టీఎస్ రోడ్డులోని యోగా స్ట్రీట్ నందు యోగాసనాలు చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రతినిత్యం యోగా చేయడం ద్వారా జీవితంలో నూతనోత్తేజం కలుగుతోందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ అన్నారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ యోగాను చేరువచేసేందుకు థీమ్ యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం బీఆర్టీఎస్ యోగా స్ట్రీట్‌లో జిల్లా అధికార యంత్రాంగం, ఆయుష్ శాఖ, విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ఉపాధి హామీ శ్రామికులు, విశ్రాంత పోలీసు అధికారులతో కలిసి కలెక్టర్ యోగాసనాలు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి వర్గం ప్రజలకు యోగాపై అవగాహన కల్పించేందుకు థీమ్ యోగా నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉపాధి హామీ పథకం శ్రామికులతో పాటు విశ్రాంత పోలీసు అధికారులతో కలిసి యోగాసనాల అభ్యసన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డ్వామా పీడీ ఎ.రాము, అసోసియేషన్ ఆఫ్ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్స్ అధ్యక్షుడు ఏఎస్ఎన్ రెడ్డి, కార్యదర్శి డాక్టర్ పి.హరికృష్ణ, కోశాధికారి డి.రాజారావు, లయన్స్ క్లబ్, సిద్ధార్థ కళాశాల యోగా శిక్షణ కేంద్రం సభ్యులు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం. సుహాసిని, ఆయుష్ అధికారి డాక్టర్ రామతీర్థ తదితరులు పాల్గొన్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన చల్లా లింగయ్య మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి పొలం పనులకు వెళ్లారు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి వచ్చే సరికి తలుపులు తీసి ఉండటంతోపాటు బీరువాలోని రూ. 2.70 లక్షల నగదు కనిపించకపోవడంతో చిల్లకల్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడకు చేరుకున్న ఎస్ఐ తోట సూర్యశ్రీనివాస్ వివరాలు తెలుసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నకిలీ బంగారం తాకట్టు.. వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నకిలీ బంగారం తాకట్టు పెట్టి ప్రైవేటు సంస్థను బురిడీ కొట్టించిన వ్యక్తిపై భవానీపురం పీఎస్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. భవానీపురంలోని ఓ ప్రైవేటు సంస్థలో కోమల శ్రీరామ్ మూడు దఫాలు బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకున్నాడు. గతేడాది డిసెంబర్ 24న 28.9 గ్రాములు(4 ఉంగరాలు), అదే నెల 26న 14.9 గ్రాములు(2 గాజులు), 31న 11.3గ్రాములు (2ఉంగరాలు) మొత్తం 54.7గ్రాముల బంగారం తాకట్టు పెట్టి రూ. 2,85,275 రుణం తీసుకున్నాడు. ఈ ఏడాది మార్చిలో 26 నుంచి 30వరకు బ్రాంచ్‌లో ఇన్‌స్పెక్షన్ జరిగింది. ఈ ఇన్‌స్పెక్షన్‌లో కోమల శ్రీరామ్ తాకట్టు పెట్టిన బంగారం నకిలీదని గుర్తించారు. రాగి వస్తువుల పై బంగారం పూత వేసి మోసం చేశాడని గుర్తించారు. దీనిపై బ్రాంచ్ మేనేజర్ పిళ్లా సంగీత పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అంతులేని అఘాయిత్యాలపై ఆందోళన

- కూటమి ఆటవిక పాలనపై వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నిరసన
- అంబేడ్కర్ స్మృతి వనంలోని విగ్రహానికి వినతి పత్రం సమర్పణ



నినాదాలు చేస్తూ అంబేడ్కర్ స్మృతి వనంలోకి వెళ్తున్న వైఎస్సార్ సీపీ మహిళా ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలోని కూటమి పాలనలో మహిళలకు, బాలికలకు రక్షణ కరువైందని ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యాలను నిరసిస్తూ 'సేవ్ ఉమెన్, సేవ్ ఆంధ్ర' పేరుతో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం నిరసన కార్యక్రమం చేపట్టింది. ఇందులో భాగంగా మంగళవారం విజయవాడ అంబేడ్కర్ స్మృతివనంలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహా శిల్పం వద్ద మేయర్ రాయన భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీశైలజారెడ్డి తదితర మహిళా నేతలతో కలిసి ఆమె ఆందోళన చేపట్టారు.

పోలీసుల ఓవరాక్షన్..

అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించేందుకు వచ్చిన మహిళా ప్రతినిధులను పోలీసులు లోపలికి అనుమతించలేదు. మంగళవారం సెలవు దినం లోపలికి అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. దీంతో గేటు వద్ద వైఎస్సార్ సీపీ మహిళ విభాగం ప్రతినిధులు ప్లకార్డులతో నినాదాలు చేశారు. టీడీపీ క్రూర మృగాల నుంచి మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఆడ బిడ్డల కన్నీళ్లతో కూటమి ప్రభుత్వం కొట్టుకుపోతుందన్నారు. గేటు వద్దే నిరసన తెలియజేస్తున్న వారిలో కొందరిని లోపలకు పంపి మిగిలిన వారిని గేటు వద్ద నిలిపివేశారు. లోపలికి వెళ్లిన వరుదు కల్యాణి, మేయర్, డెప్యూటీ మేయర్లు, కార్పొరేటర్లను అంబేడ్కర్ విగ్రహం ముందువైపునకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. పక్కనే ఉండి వినతి పత్రం అందజేయాలని హుకుం జారీ చేశారు. ఆ సమయంలో పోలీసులకు ప్రతినిధులకు వాగ్వాదం జరిగింది. ఎవరైనా ముందుకు వెళ్లి వినతి పత్రం ఇస్తారని, పక్క నుంచి ఎలా ఇస్తారని వరుదు కల్యాణి నిలదీశారు.



మహిళా ప్రతినిధులను అడ్డుకుంటున్న పోలీసులు

రెడ్‌బుక్ రాజ్యాంగం..

మేయర్ రాయన భాగ్యలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, రెడ్ బుక్ రాజ్యాంగం అమలు జరుగుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిరసన తెలిపేందుకు రాజ్యాంగ నిర్మాత విగ్రహం వద్దకు వెళ్లనీయకుండా అడ్డుకున్నారని, తాము ప్రజాప్రతినిధులమని, తీవ్రవాదులం కాదన్నారు. తమ చేతుల్లో ఆయుధాలు లేవని పోలీసులు ఎందుకు అనుమతించడం లేదో అర్థం కావడం లేదన్నారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ, భద్రత కల్పించడం ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. మహిళా విభాగం ప్రతినిధులు విజిత, త్రివేణి రెడ్డి, సుభాషిణి, వేముల బేబీరాణి, తోపుల వరలక్ష్మి, బండి పుణ్యశీల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మెకానిక్‌లు దుర్మరణం

- ముందు వెళ్తున్న లారీని ఢీకొన్న కారు
- కృష్ణాజిల్లా ఆత్కూరు వద్ద ఘటన



కారులో ఇరుక్కుపోయిన ఫణివిక్రమ్‌ను బయటకు తీస్తున్న పోలీసులు, స్థానికులు



మృతి చెందిన నూతక్కి శ్రీనివాస్ (ఫైల్), సర్ఫరాజ్ (ఫైల్)

ఆత్కూరు(గన్నవరం): ఉంగుటూరు మండలం ఆత్కూరు వద్ద జాతీయ రహదారిపై మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. పోలీసుల సమాచారం ప్రకారం.. హనుమాన్ జంక్షన్‌కు చెందిన దాసరి ఫణివిక్రమ్ తన కారును మరమ్మతుల నిమిత్తం విజయవాడలోని మెకానిక్ నూతక్కి శ్రీనివాస్(37) వద్దకు ఆదివారం సాయంత్రం తీసుకువెళ్లారు. అయితే పాత కారు కావడంతో తన స్నేహితుడైన ఉత్తరప్రదేశ్ నుంచి వలస వచ్చిన మరో మెకానిక్ సర్ఫరాజ్ (30)ని పిలిపించాడు. ఇరువురు కలిసి అర్ధరాత్రి వరకు కారుకు మరమ్మతులు చేశారు. అనంతరం తెల్లవారుజాము వరకు కారులోనే విశ్రాంతి తీసుకుని ఉదయం ఫణివిక్రమ్‌తో కలిసి సర్ఫరాజ్, శ్రీనివాస్ కారులో హనుమాన్‌జంక్షన్ బయలుదేరారు. మార్గ మధ్యలో ఆత్కూరు ఫ్లై ఓవర్ వద్దకు రాగానే ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేసే క్రమంలో సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీని వెనుక నుంచి బలంగా ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో కారు పూర్తిగా నుజ్జునుజ్జు కావడంతో అందరూ అందులో చిక్కుకుపోయారు. కారు నడుపుతున్న సర్ఫరాజ్, వెనుక సీట్లో కూర్చున్న శ్రీనివాస్‌కు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. కారులో ఎడమ వైపు కూర్చున్న ఫణివిక్రమ్ మాత్రం గాయాలతో బయటపడ్డారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఆత్కూరు పోలీసులు క్రేన్ సాయంతో కారు డోర్లను తెరచి గాయపడిన ఫణివిక్రమ్‌ను పిన్నమనేని సిద్ధార్థ ఆస్పత్రికి తరలించారు. సర్ఫరాజ్, శ్రీనివాస్ మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కారును అతివేగంగా నడపడం కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లుగా ప్రత్యక్ష సాక్షులు పేర్కొంటున్నారు. ఈ ఘటనపై ఆత్కూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడు శ్రీనివాస్‌కు భార్య, ఒక కుమారుడు ఉండగా, సర్ఫరాజ్ మాత్రం అవివాహితుడిగా పోలీసులు పేర్కొన్నారు.

వలస కూలీల అనుమానాస్పద మృతి

నందివాడ: వలస కూలీలు అనుమానాస్పదంగా మృతి చెందిన ఘటన వెన్ననపూడి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. అసోంకు చెందిన బిశాల్ బసుమత్రి (25), జహర్లల్ దోయిమరి (36) వెన్ననపూడి గ్రామంలో ఓ ఆక్వా చెరువు వద్ద కాపలాదారులుగా ఉంటూ అక్కడే కుటుంబంతో కలిసి జీవనం సాగిస్తున్నారు. మంగళవారం ఉదయం చెరువు వద్ద ఉన్న షెడ్డులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడం.. పొగ బాగా కమ్ముకోవడంతో ఇరువురూ అక్కడికక్కడే మృతి చెందారు. వారి శరీరం కూడా సగం వరకూ కాలిపోయింది. ఘటనా స్థలంలో ఉన్న పరిస్థితిని బట్టి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ లేదా ఎవరైనా సిగరెట్ కాల్చి పడేయడం వల్ల ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతుల శరీర భాగాలతో పాటు ఘటనా స్థలంలో ఉన్నటువంటి వస్తువులను మంగళగిరి ఆర్ఎఫ్ఎస్ ల్యాబ్‌కి తరలించామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

దుర్గగుడిలో భారీగా బదిలీలు

వివిధ హోదాల్లో పనిచేస్తున్న 10 మందికి స్థానచలనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ప్రభుత్వ ఆదేశాల మేరకు దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం నుంచి వివిధ హోదాల్లో పనిచేస్తున్న 10 మంది అధికారులను రాష్ట్రంలోని పలు దేవస్థానాలకు బదిలీ చేశారు. దుర్గగుడి వాటర్ సెక్షన్ ఏఈ వి. కుటుంబరావు ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ అయ్యారు. ఏఈవోలు జె. శ్రీనివాసం, సూపరిండెంటెంట్ కె. లక్ష్మణరావు పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానానికి, టి. గురురాజ్ అన్నవరం దేవస్థానానికి, వి. నగేష్ ద్వారకాతిరుమల దేవస్థానానికి బదిలీ అయ్యారు. సీనియర్ అసిస్టెంట్ కేడర్‌లో ఎం. తులసీరామ్ ద్వారకాతిరుమలకు, బి. నాగేశ్వరరావు పెనుగంచిప్రోలు దేవస్థానానికి, పప్పుల వెంకట రమణ అన్నవరం దేవస్థానానికి బదిలీ అయ్యారు. జూనియర్ అసిస్టెంట్ కేడర్‌లో జె. దండేశ్వరరావు అన్నవరానికి, కేవీబీ కాత్యాయని ద్వారకాతిరుమలకు బదిలీ అయ్యారు.

దుర్గగుడికి వచ్చే వారు..

సింహాచలం దేవస్థానంలో ఈఈగా విధులు నిర్వర్తిస్తున్న బి. రాంబాబు, పెనుగంచిప్రోలు ఏఈవోగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఎం.తిరుమలేశ్వరరావు, అన్నవరం దేవస్థానంలో సూపరిండెంటెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న వి. సత్యనారాయణమూర్తి, పెనుగంచిప్రోలు దేవస్థానానికి చెందిన ఎల్. శ్రీనివాసరావు, ద్వారకాతిరుమల దేవస్థానంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న కేవీ నరసింహ, అన్నవరంలో విధులు నిర్వర్తిస్తున్న మరుపిళ్ల శ్రీనివాసరావు, అన్నవరం జూనియర్ అసిస్టెంట్ కె. సతీష్, ద్వారకాతిరుమలకు చెందిన చిట్టిబాబు, వి. జగన్నాథరావు దుర్గగుడికి బదిలీపై వస్తున్నారు.

నేడు కృష్ణానదిలో ఫ్లోటింగ్ యోగా

వివరాలు వెల్లడించిన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ



మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న యోగాంధ్ర-2025లో భాగంగా ఈ నెల 11వ తేదీన బెరం పార్కు వద్ద కృష్ణా నదిలో 'యోగా ఆన్ వాటర్ క్రాఫ్ట్ - ఫ్లోటింగ్ యోగా'తో ప్రపంచ రికార్డును సొంతం చేసుకునేలా మెగా ఈవెంట్‌ను నిర్వహించనున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. ఫ్లోటింగ్ యోగాలో ప్రపంచ రికార్డును కైవసం చేసుకునేందుకు చేస్తున్న ఏర్పాట్లపై కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. పంట్లు, బోట్లు, స్పీడ్ బోట్లు, కయాక్స్ బోట్లు, శాండ్ బోట్లు, జెట్ స్కీ, లైఫ్ బోట్లు వంటి 200 వాటర్ క్రాఫ్ట్‌పై వెయ్యిమందితో కామన్ యోగా ప్రోటోకాల్‌తో యోగాసనాలు వేస్తున్నట్లు చెప్పారు. వరల్డ్ రికార్డ్స్ యూనియన్ కార్యక్రమాన్ని పరిశీలించి, ప్రపంచ రికార్డుగా నమోదు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మెగా ఈవెంట్ నిర్వహణలో జిల్లా అధికార యంత్రాంగంతో ఆయుష్ శాఖ, వైద్య ఆరోగ్యం, మునిసిపల్, ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీరాజ్, మత్స్య తదితర శాఖలతో పాటు అమరావతి బోటింగ్ క్లబ్ (ఏబీసీ), స్విమ్మర్ల అసోసియేషన్, యోగా శిక్షణ సంస్థలు వంటివి కూడా భాగస్వాములవుతున్నాయని కలెక్టర్ తెలిపారు.

పూర్తి స్థాయిలో భద్రతా ఏర్పాట్లు..

ఫ్లోటింగ్ యోగా నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. గజఈతగాళ్లు, లైఫ్ జాకెట్లు, సుశిక్షితులైన బోట్ ఆపరేటర్లను సిద్ధం చేసినట్లు తెలిపారు. బోట్లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు కూడా ఇచ్చారన్నారు. సమావేశంలో అమరావతి బోటింగ్ క్లబ్ సీఈవో డాక్టర్ తరుణ్ కాకాని, జిల్లా ఆయుష్ అధికారి డాక్టర్ రామతీర్థ, డీపీఆర్‌వో ఎస్‌వీ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన..

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఫ్లోటింగ్ యోగా కార్యక్రమ ఏర్పాట్లను కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ మంగళవారం పరిశీలించారు. ప్రపంచ రికార్డ్‌ను సొంతం చేసుకునేలా నిర్వహిస్తున్న ఈ మెగా ఈవెంట్‌లో యోగా ఔత్సాహికులు పెద్ద ఎత్తున పాల్గొననున్నందున ఎక్కడా ఎలాంటి ఇబ్బందీ కలుగకుండా భద్రత, ఇతర ఏర్పాట్లను చేయాలని అధికారులను కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. బారికేడింగ్, సీటింగ్ తదితర ఏర్పాట్లు చేయాలని, విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా సంబంధిత అధికారులు చూడాలని సూచించారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, ప్రాంగణ అలంకరణ తదితరాలకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విజయవాడ ఆర్డీఓ కావూరి చైతన్య, ఆయుష్ అధికారులు, ఏపీటీడీసీ విజయవాడ డివిజనల్ మేనేజర్ పి. కృష్ణచైతన్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

షాపుల వేలం పారదర్శకంగా నిర్వహించాలి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా మండపం 5వ అంతస్తులో దేవస్థాన షాపుల వేలం పక్రియ పారదర్శకంగా నిర్వహించాలని ఈవో శీనానాయక్ ఆలయ అధికారులను ఆదేశించారు. మహామండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో దేవస్థాన అధికారులతో ఆయన సమావేశమయ్యారు. కనకదుర్గానగర్, గోశాల, గోశాల ఎదుట ఉన్న దేవస్థాన షాపులకు 11, 12వ తేదీలలో సీల్డ్ టెండర్, బహిరంగ వేలం ప్రక్రియను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. అదే విధంగా టెండర్ పక్రియను పర్యవేక్షించేందుకే 11 మంది అధికారులతో కమిటీని ఏర్పాటు చేశామన్నారు. 19 షాపులకు పెద్ద మొత్తంలో టెండర్లు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. సమావేశంలో ఆలయ ఏఈవో రమేష్‌బాబు, సీసీ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకుంటున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో



లబ్బీపేట(విజయవాడతూర్పు): మహాత్మాగాంధీరోడ్డులోని శ్రీ శేషసాయి కల్యాణ మండపంలో నిర్వహిస్తున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో మహిళలను ఆకట్టుకుంటోంది. ఈ నెల 8న ప్రారంభమైన ఎక్స్ పో 14వ తేదీ వరకు కొనసాగనుంది. ఈ ప్రదర్శనలో సొగసైన పైథాని సిల్క్ చీరలు, బెంగళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్ చీరలు, మహేశ్వరి సిల్క్ చీరలు, పశ్చిమ బెంగాల్ వారి బలూచారి, జమ్దాని, టాంగైల్ వంటి చీరలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ప్రతి రోజు ఉదయం 11 నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రదర్శన కొనసాగుతుందని, ప్రవేశం ఉచితమని నిర్వాహకులు తెలిపారు.

ఆర్‌పీఐ నేత రామిశెట్టి గుండెపోటుతో మృతి



కృష్ణలంక(విజయవాడతూర్పు): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా(ఆర్‌పీఐ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ రామిశెట్టి రమేష్‌కుమార్(45) గుండెపోటుతో మృతి చెందారు. కృష్ణలంక ప్రాంతానికి చెందిన ఆయన సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో గుండెపోటు రావడంతో తుదిశ్వాస విడిచారు. పార్టీ నిర్ణయం మేరకు పార్థివదేహాన్ని కృష్ణలంక, 22వ డివిజన్ సత్యంగారి దొడ్డి సమీపంలోని ఆయన నివాసం వద్ద ప్రజల సందర్శనార్థం ఉంచారు. పార్టీ జాతీయ అధ్యక్షుడు రామ్‌దాస్ అథవాలే ఫోన్‌లో రమేష్ కుటుంబ సభ్యులతో మాట్లాడి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహిత అదృశ్యమైన ఘటనపై ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొత్తపేట నెహ్రూబొమ్మ సెంటర్ రాజగిరి వారి వీధికి చెందిన పోలవరపు రమణ, మధు(45)లు భార్యాభర్తలు. వీరికి ముగ్గురు సంతానం. ఈ నెల 8వ తేదీన సాయిరాం థియేటర్ వద్ద ఉన్న పెద్ద కుమారుడి ఇంటికి మధు వెళ్లింది. మధ్యాహ్నం 3 గంటలకు మధు తమ ఇంటికి బయలుదేరి వెళ్లింది. సాయంత్రం పని నుంచి ఇంటికి వచ్చిన రమణ ఇంట్లో భార్య మధు కనిపించకపోవడంతో పెద్దబ్బాయికి ఫోన్ చేసి అడిగాడు. మధ్యాహ్నమే ఇంటికి వెళ్లిపోయిందని చెప్పగా బంధువులు, స్నేహితులను ఆరా తీసినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): శ్రీ పద్మావతి, గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలను బుధవారం నుంచి ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు చెప్పారు. చిట్టినగర్‌లోని శ్రీ మహాలక్ష్మి అమ్మవారి దేవస్థాన కల్యాణ మండపంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాలకు సంబంధించి కరపత్రాలను నిర్వాహకులు, ఆలయ అర్చకుడు వినుకొండ రత్నమాచార్యులు ఆవిష్కరించారు. ఐదు రోజుల పాటు ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఆలయ ప్రాంగణంలో హోమాలను నిర్వహించేందుకు హోమగుండాలు, కల్యాణ వేదికను సిద్ధం చేశామని చెప్పారు. 13వ తేదీన జరిగే స్వామి వారి కల్యాణోత్సవానికి పెద్ద ఎత్తున పుర ప్రముఖులు, రాజకీయ నాయకులు, వివిధ రంగాలకు చెందిన వారు విచ్చేస్తారన్నారు. బ్రహ్మోత్సవాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో పొట్నూరి దుర్గాప్రసాద్(రాజా), కామందుల నరసింహారావు, తమ్మిన సూర్యకుమారి, మజ్జి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రమాదకర గుంతలతో బెంబేలు

- అధ్వానంగా రమేష్ ఆస్పత్రి రోడ్డు
- ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గేటు ఎదురుగా కుంగిన రోడ్డు
- కేబుల్స్ గుంతలు తవ్వి పూడ్చకుండా వదిలేసిన వైనం
- మరమ్మతులు చేపట్టాలని వినతి



ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ప్రమాదకరంగా ఉన్న ప్రాంతం

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నిత్యం వాహనదారులు, పాదచారులు రాకపోకలతో రద్దీగా ఉండే రమేష్ ఆస్పత్రి రోడ్డు గుంతలమయంగా మారింది. రమేష్ ఆస్పత్రి జంక్షన్‌లో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్‌ను దాటి కొద్దిగా ముందుకు వచ్చిన తర్వాత ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల గేటు ఎదురుగా ఉన్న రోడ్డు కుంగింది. రోడ్డు కుంగి పక్కనే ఉన్న మురుగునీటి కాలువ వైపునకు మట్టి జారి ప్రమాదకరంగా ఉంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సర్వీస్ రోడ్డులో నుంచి రమేష్ ఆస్పత్రి రోడ్డులోకి ప్రవేశించే మలుపులో ఈ ప్రమాదకరం ప్రాంతం ఉంది. ట్రాఫిక్ సిగ్నల్స్‌లో గ్రీన్ లైన్ పడగానే వాహనాలు వేగంగా వచ్చి ఈ ప్రాంతం దగ్గరకు వచ్చేసరికి సడన్‌గా బ్రేకులు వేస్తున్నారు. ఈ సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రమాదం జరగడం ఖాయం. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుకునే విద్యార్థులు ఈ ప్రాంతానికి అతి సమీపంలో నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డు కుంగిన ప్రాంతానికి అతి సమీపంలోనే రింగ్‌రోడ్డు విద్యుత్ సబ్‌స్టేషన్, ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్(ఏపీసీపీడీసీఎల్)కార్యాలయం ఉన్నాయి. విద్యుత్ సబ్‌స్టేషన్ సిబ్బందితో పాటుగా వివిధ పనులకు అక్కడకు వచ్చే వారు, ఏపీసీపీడీసీఎల్‌లో పనిచేసే ఉద్యోగులు అంతా ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రాంతం ప్రమాదకరంగా ఉండటంతో సమీపంలో విధులు నిర్వహించే ట్రాఫిక్ పోలీసులు బారికేడ్‌ను అడ్డుగా పెట్టారు. ఈ ప్రాంతానికి సమీపంలోనే రోడ్డు మధ్యలో గుంత పడటంతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సిబ్బంది గుంతను పూడ్చారు.

- రమేష్ ఆస్పత్రి రోడ్డులోని పోస్టాఫీస్‌కు సమీపంలో కేబుల్స్ అమర్చడానికి గుంతను తవ్వి కేబుల్స్ అమర్చారు. అక్కడ గుంతను మాత్రం పూడ్చలేదు.

రమేష్ ఆస్పత్రికి వచ్చే రోగుల బంధువులు, ఆసుపత్రిలోని సిబ్బంది తమ వాహనాలను ఈ గుంతకు సమీపంలోనే పార్కింగ్ చేస్తుంటారు. వాహనాలను పార్కింగ్ చేసేటప్పుడు లేదా తీసే సమయంలో ఇక్కడ జాగ్రత్తగా ఉండాల్సిందే లేదంటే ద్విచక్రవాహనంతో పాటు వాహనదారులు గుంతలో పడే అవకాశముంది. రాత్రి వేళ కొత్తగా ఈ ప్రాంతానికి వచ్చిన పాదాచారులు చూసుకోకుండా అడుగు వేస్తే నేరుగా గుంతలో పడిపోతారు.

- రమేష్ ఆస్పత్రి రహదారి మొత్తం గుంతలమయంగా ఉంది. ఈ రోడ్డులోనే ప్రభుత్వ ఐటీఐ కళాశాల, స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్ కళాశాల, జిల్లా ఉపాధి కల్పనా శాఖ కార్యాలయం, ఓమ్‌క్యాప్ కార్యాలయం, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ట్రెనింగ్ రాష్ట్ర కార్యాలయం, ఆంధ్రా మోటార్స్ మర్చంట్స్ అసోసియేషన్(అమ్మ) హాలు ఉన్నాయి. దీంతో ఈ రోడ్డులో నిత్యం వాహనాల రద్దీ విపరీతంగా ఉంటుంది. ప్రభుత్వ ఐటీఐ కళాశాల గేటు దగ్గర కూడా గుంతలు ప్రమాదకరంగానే ఉన్నాయి. రద్దీ ఎక్కువగా ఉండే రోడ్డులో ఒక వైపున రోడ్డు కుంగిపోవడం, మరోవైపున కేబుల్స్ అమర్చడానికి గుంతలు తవ్వి సరిగా పూడ్చకపోవడంతో వాహనదారులు, పాదచారులు ఇటుగా ప్రయాణానికి భయపడుతున్నారు. కేబుల్స్ అమర్చడానికి తీసిన గుంతలు తీయడంపై ఉన్న శ్రద్ధ పనులు పూర్తయిన తర్వాత గుంతలు పూడ్చడంపై లేదంటూ వాహనదారులు, పాదచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రమేష్ ఆస్పత్రి రోడ్డులో దుస్థితి



కేబుల్స్ కోసం రోడ్డు తవ్వారు.. వదిలేశారు

తక్షణమే మరమ్మతులు చేయాలి

రోజూ కళాశాలకు ఇటుగానే రాకపోకలు సాగిస్తుంటాం. ప్రభుత్వ పాలిటెక్నిక్, ఐటీఐ, స్పా కళాశాలలతో పాటుగా ప్రభుత్వ కార్యాలయాలు ఉన్న ప్రధానమైన రోడ్డులో ఇలాంటి పరిస్థితులు ఉన్నా అధికారులు స్పందించకపోవడం సరికాదు. ఏదో మారుమూల ప్రాంతంలో అంటే అధికారులు, సిబ్బందికి కనిపించలేదు అనుకోవచ్చు. ప్రధానమైన రహదారిలోనే ఇలాంటి పరిస్థితులు ఉన్నా పట్టించుకోకపోవడం బాధాకరం. తక్షణమే అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలి.

–జి.రాజ్యలక్ష్మి, విద్యార్థిని

రథం సెంటర్ వద్ద సేవా కేంద్రం

ఆక్రమణల తొలగింపునకు ఈవో ఆదేశాలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): కనకదుర్గానగర్, రథం సెంటర్ మధ్య ఉన్న దేవస్థానం స్థలంలో ఆక్రమణలను తొలగించడంతో పాటు ఆ ప్రాంతంలో సేవా కేంద్రం ఏర్పాటు చేయాలని ఈవో శీనానాయక్ ఆదేశాలు జారీ చేశారు. కనకదుర్గానగర్, రథం సెంటర్ వద్ద ఉన్న ఆక్రమణలను మంగళవారం దేవస్థాన అధికారులు పరిశీలించారు. దేవస్థానానికి విరాళాల చెల్లింపు, ఆలయ సమాచారం, సేవా టికెట్ల బుకింగ్ వంటి పనులను భక్తులు నేరుగా సేవా కేంద్రం నుంచి పొందవచ్చునన్నారు. సేవా టికెట్ల కోసం మహా మండపం, ఘాట్‌రోడ్డు మీదుగా కొండపైకి చేరడం ఇబ్బందికరంగా ఉందని పలువురు భక్తులు ఆలయ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో ఆలయ ఈవో, దేవస్థానానికి చెందిన ఇంజినీరింగ్, పరిపాలనా విభాగం అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సేవా కేంద్రం ఏర్పాటుపై చర్చించారు. కార్యక్రమంలో ఏఈవో ఎన్.రమేష్‌బాబు, పి.చంద్రశేఖర్, బీవీ రెడ్డి, డీఈ రవీంద్ర, డీవీవీ సత్యనారాయణ, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లబ్బీపేట(విజయవాడతూర్పు): విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో మహాత్మాగాంధీ ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు మంగళవారం తెలిపారు. అందులో భాగంగా రెవెన్యూ కాలనీ, ఏ.రామారావు రోడ్డు, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ రోడ్డు, కాంధారీ రోడ్డు, పార్క్ రోడ్డు తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు ఆటంకం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

డ్రెయిన్లలో సిల్టును త్వరగా తొలగించాలి



కనకదుర్గానగర్‌లో అధికారులకు సూచనలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): వర్షాకాలం దృష్ట్యా డీసిల్టింగ్ పనులను శరవేగంగా పూర్తి చేయాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం నగరంలోని సర్కిల్–3 పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. డ్రెయిన్ల అన్నింటిలోనూ డీసిల్టింగ్ పనులు పూర్తయినప్పటికీ, అవసరమైన చోట మళ్లీ డీసిల్టింగ్ ప్రక్రియను చేపట్టాలన్నారు. పటమట హైస్కూలు రోడ్డులో ఉన్న అన్న క్యాంటీన్‌ను సందర్శించారు. అన్న క్యాంటీన్‌లో పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, ఆహారం ఉన్న చోట ఈగలు, అపరిశుభ్రమైన వాతావరణం లేకుండా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి, వాడుక నీటి సరఫరా నిరంతరం ఉండేటట్టు అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలన్నారు. అనంతరం ఆయన కనకదుర్గానగర్‌లో నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ట్యాంక్‌ను పరిశీలించారు. నిర్మాణ పురోగతిపై ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌ను అడిగి తెలుసుకుని ఎటువంటి ఇబ్బందులు ఉన్నా వెంటనే తమకు తెలియజేయాలన్నారు. మహానాడు రోడ్డు పంట కాలువ రోడ్డులో పర్యటించి పారిశుద్ధ్యను నిర్వహణ పరిశీలించారు. రోడ్డుపై ఉన్న వ్యర్థాలను తొలగించాలని, ప్రతి రోజు రోడ్లను శుభ్రపర్చి, విజయవాడ నగరాన్ని పరిశుభ్రమైన నగరంగా ఉంచాలని చెప్పారు. ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాలకృష్ణ నాయక్, పర్యవేక్షణ ఇంజినీర్ పి.సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సామ్రాజ్యం పాల్గొన్నారు.

యోగాంధ్ర సాధన అందరి బాధ్యత

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): యోగాంధ్ర సాధనకు పౌరులందరి బాధ్యత అని కేబీఎన్ కళాశాల అధ్యక్ష, కార్యదర్శులు ఉసిరిక ఉమామహేశ్వరరావు, టి.శ్రీనివాసులు అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆ కళాశాల ఫిజికల్ ఎడ్యుకేషన్, ఎన్ఎస్ఎస్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 1,500 మంది విద్యార్థులతో యోగసాధన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ కళాశాల విద్యా ప్రణాళికలో యోగాను భాగంగా చేర్చామని, నిత్యం ప్రతి విద్యార్థి యోగసాధన చేసేలా టైంటేబుల్ అమలు చేస్తున్నామన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి, హిందూ హైస్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ నారాయణరావు మాట్లాడుతూ.. నూతన విద్యావిధానం కూడా యోగాను చదువులో భాగం చేయాలని సూచించిందన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగాధిపతి డి.హేమచంద్రరావు, యోగ శిక్షకులు గౌరీనాథ్ విద్యార్థులతో యోగ సాధన చేయించారు. కమిటీ సభ్యులు బీవీ బాలకోటేశ్వరరావు, వైస్ ప్రిన్సిపాల్స్ కె.రామకృష్ణ, పీఎల్ రమేష్, వెంకటేశ్వరరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డి.పవన్ కుమార్, శాంతిబాబు, గౌతమీదేవి, ఎస్.సాంబశివరావు పాల్గొన్నారు.

కౌన్సిల్ అజెండాపై వీఎంసీ కమిషనర్ సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగర పాలక సంస్థ సర్వసభ్య సమావేశం ఈ నెల 13వ తేదీన నిర్వహిస్తున్నందున కౌన్సిల్ ముందుకు వచ్చే అజెండా అంశాలపై వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో విజయవాడ నగరాభివృద్ధికి ప్రజా ప్రతినిధులు పొందుపరిచిన సాధారణ సర్వసభ్య సమావేశపు అజెండాలో అంశాలను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. వాటిపై ప్రస్తుతం ఉన్న స్థితిగతులు, తీసుకోవాల్సిన చర్యలు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని సూచించారు. జోన్‌ల వారీగా అభివృద్ధి పనులు, ప్రజలకు అందించాల్సిన మౌలిక సదుపాయాలు, కౌన్సిల్ అజెండా ప్రతిపాదనలపై పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని చెప్పారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు

పెనమలూరు: కానూరులో విద్యార్థి అదృశ్యమైన ఘటనపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు అమరావతి కాలనీకి చెందిన కొల్లంశెట్టి శివరోహిత్ విజయవాడలో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. అతను ఈ నెల 4వ తేదీన ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. అతని ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోందని తల్లి కొల్లంశెట్టి నాగహరిత ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశామని తెలిపారు.

బదిలీల్లో లాక్ సూపరింటెండెంట్స్‌కు అన్యాయం



మాట్లాడుతున్న ప్రసాదబాబు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల నిర్వహించిన ఏపీ ఇరిగేషన్ లాక్ సూపరింటెండెంట్స్ బదిలీల్లో కొంతమందికి తీవ్ర అన్యాయం జరిగిందని, పట్టణాల్లో ఉన్నవారు పట్టణాల్లోనే ఉండగా, పల్లెలో ఉండేవారిని పల్లెలకే పరిమితం చేశారని ఏపీ ఇరిగేషన్ లాక్ సూపరింటెండెంట్స్ అసోసియేషన్ ఏపీ ప్రధాన కార్యదర్శి బి.ప్రసాదబాబు ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక ముత్యాలంపాడు జీఎస్ రాజు రోడ్డులోని ఏపీ ఇరిగేషన్ లాక్ సూపరింటెండెంట్స్ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంతో కాలంగా పట్టణాల్లో పనిచేస్తున్న వారిని పట్టణాల్లోనే ఉంచగా, ఎంతో కష్టనష్టాలకు ఓర్చి పల్లెల్లో మారుమూల ప్రాంతాల్లో విధులను నిర్వహిస్తున్న వారిని పల్లె ప్రాంతాలకే పరిమితం చేశారని విచారం వ్యక్తం చేశారు. ఒకే సెక్షన్‌లో 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న వారిని ఎటువంటి బదిలీ చేయకుండా కొంతమందిని ఒకే సెక్షన్‌లో పరస్పర బదిలీలతో సరిపెట్టారని అన్నారు. మ్యూచువల్ పెట్టుకున్న కొంత మంది లాక్ సూపరింటెండెంట్‌లను, మహిళలను ఇష్టం వచ్చిన విధంగా బదిలీ చేశారని విచారం వ్యక్తం చేశారు. నీటి పారుదల వ్యవస్థలో అతి కీలకమైన లాక్ సూపరింటెండెంట్‌లకు ఎటువంటి కనీస సదుపాయాలు లేకపోయినప్పటికీ 24 గంటలు లాక్ అవసరాలను కనిపెట్టుకుని పనిచేస్తున్నామన్నారు. అధికారులకు, రైతులకు అందుబాటులో ఉంటూ నీటిని సరఫరా చేస్తున్నామని, వరదల సమయంలో విషసర్పాల మధ్య ప్రమాదకర వాతావరణంలో విధులను నిర్వహిస్తున్నామన్నారు. అన్యాయం జరిగిన లాక్ సూపరింటెండెంట్‌లకు మానవతా దృక్పథంతో వారి సమస్యలను అర్థం చేసుకుని డైవర్షన్ చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీల చట్ట సవరణ బిల్లులో మార్పులను ఉపసంహరించాలి

భారతీయ మజ్దూర్ సంఘ్ డిమాండ్

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఫ్యాక్టరీల చట్టం 2025లో చేసిన మార్పులను వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించాలని భారతీయ మజ్దూర్ సంఘ్ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి మేకల వెంకటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రస్తుత కార్మిక చట్టాలను సవరించటానికి చేపట్టిన ఏపీ ఫ్యాక్టరీల సవరణ బిల్లు 2025ను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. ఈ సవరణల ద్వారా గరిష్ఠ రోజువారీ పనిగంటలను 9 నుంచి 10 గంటలకు పెంచటం, విశ్రాంతి విరామానికి ముందు పని సమయం 5 గంటల నుంచి 6 గంటలకు పెంచటం, ప్రతీ త్రైమాసికంలో ఓవర్‌టైమ్ పరిమితిని 50 నుంచి 144 గంటలకు పెంచటం, మహిళా కార్మికులు సేఫ్‌గార్డులతో రాత్రి షిఫ్టుల్లో పనిచేయటానికి అనుమతించటం జరుగుతుందన్నారు. ఈ మార్పుల వల్ల ఉద్యోగుల శ్రేయస్సు, ఆరోగ్యం, కుటుంబ వ్యవస్థ, ఉద్యోగుల భవిష్యత్తుపై ప్రత్యక్ష ప్రభావాన్ని చూపుతాయని విచారం వ్యక్తం చేశారు. ఓవర్ టైమ్ పెంపు వల్ల కొత్త ఉపాధి అవసరాలపై తీవ్రమైన ప్రభావాన్ని చూపుతుందని, భవిష్యత్ తరం ఉద్యోగ అవకాశాలకు అతి పెద్ద అడ్డంకిగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఏపీ ఫ్యాక్టరీల సవరణ బిల్లు 2025లో చేసిన మార్పులను ఉపసంహరించుకోవాలని ఆయన కోరారు.

అమరావతిలో ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



గాయకుడు ఘంటసాల అభిమానుల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న అతిథులు

విజయవాడకల్చరల్: ఏపీ రాజధాని అమరావతిలో అమర గాయకుడు ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, పోలవరపు సాహితీ పీఠం, ఘంటసాల చైతన్యవేదిక ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళా వేదిక మీద మంగళవారం సినీ సంగీత విభావరి, జిల్లా స్థాయి ఘంటసాల అభిమానుల ఆత్మీయ సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. చిట్టిబాబు మాట్లాడుతూ కృష్ణానది కరకట్టమీద తెలుగు సాహితీ మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఘంటసాల చైతన్యవేదిక అధ్యక్షుడు కోట వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ సాంస్కృతిక కళా సంస్థలు కళాకారుల సంక్షేమం కోసం కృషి చేయాలని సూచించారు. సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు కె.డేవిడ్ రాజు, టి.శ్రీనివాసరెడ్డి, బీవీ వీరభద్రరావు, గోళ్ళ నారాయణరావు, సాహితీవేత్త ప్రభాకర్ పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు.

సమన్వయంతో పనిచేసి మెరుగైన సేవలందించాలి



పటమట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లాలోని హెచ్ఐవీ, ఎయిడ్స్, క్షయ, స్వచ్ఛంద సంస్థల సిబ్బంది సమన్వయంతో పనిచేసి మరింత మెరుగైన సేవలు అందించాలని జిల్లా అదనపు వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జూపూడి ఉషారాణి సూచించారు. బెంజిసర్కిల్ సమీపంలోని వాసవ్య మహిళా మండలి సమావేశ మందిరంలో మంగళవారం ఎన్టీఆర్ జిల్లాలోని హెచ్ఐవీ, ఎయిడ్స్, క్షయ విభాగాల సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఉద్యోగుల పనితీరును సమీక్షించారు. నాకో, ఏపీశాక్స్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఉద్యోగులు పని చేయాలని సూచించారు. దిశ క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ డాక్టర్ శ్యాంసన్ మాట్లాడుతూ.. అన్ని విభాగాల సిబ్బంది కలిసిమెలసి పనిచేసి ఆరోగ్యకర సమాజ స్థాపనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో వాసవ్య మహిళా మండలి, షేర్ ఇండియా, వీహెచ్ఎస్, విహాన్, రైడ్స్, ఐసీటీసీ, ఏఆర్టీ సెంటర్ కౌన్సిలర్లు, డేటా మేనేజర్లు, షేర్ ఇండియా ప్రతినిధులు జాన్ వెస్లీ, కృష్ణమూర్తి, క్షయ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్వహిస్తే తెలపండి

సీడీపీవో బేబీసుకన్య

పెనమలూరు: గ్రామాలలో ఎక్కడైనా బాల్య వివాహాలు జరిగితే వెంటనే తమ దృష్టికి తీసుకు రావాలని ఐసీడీఎస్ సీడీపీవో బేబీ సుకన్య సూచించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు సమాజంలో అందరూ కృషి చేయాలన్నారు. వణుకూరు గ్రామంలో మంగళవారం కిశోర వికాసం సమ్మర్ క్యాంప్‌లో ఆమె ప్రసంగించారు. బాల్య వివాహాల వలన అనేక దుష్ప్రభావాలు చోటు చేసుకుంటాయన్నారు. బాల్య వివాహాలు చేయటం చట్ట రీత్యా నేరమన్నారు. తమ పిల్లలకు బాల్య వివాహాలు చేయబోమని తెలిపిన ఇద్దరు తల్లులను సన్మానించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కె.శ్రీలత, సచివాలయం సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు. కాగా పోరంకి బీజేఆర్‌నగర్‌లో జరిగిన కార్యక్రమంలో సీడీపీవో బేబీసుకన్య పాల్గొన్నారు. బాల్య వివాహాల వలన వచ్చే అనర్థాలను స్థానికులకు వివరించారు.

కానూరులో విద్యార్థులకు సన్మానం

కానూరులో పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన ఇద్దరు విద్యార్థులను అంగన్‌వాడీ కార్యకర్తలు ఘనంగా సన్మానించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి.విజయలక్ష్మి మాట్లాడుతూ చదువు భవిష్యత్తుకు బాట వేస్తుందన్నారు. బాల్య వివాహాలు అరికట్టడానికి, బాలికల విద్యకు అందరూ మద్దతుగా నిలవాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు, ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ కార్యకర్తలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

పీఎస్ఆర్‌కు తీవ్ర అస్వస్థత

- హృద్రోగ, ఊపిరితిత్తుల సంబంధ సమస్యలు
- శస్త్ర చికిత్స చేయాలంటున్న వైద్యులు

సాక్షి, అమరావతి: రెడ్‌బుక్ అక్రమ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ఆయన్ని విజయవాడ జిల్లా జైలు నుంచి మంగళవారం హుటాహుటిన ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఆయనకు సీటీ స్కాన్, ఎకో, ఇతర వైద్య పరీక్షలు చేశారు. పీఎస్ఆర్‌కు హృద్రోగ, ఊపిరితిత్తుల సంబంధ సమస్యలు ఉన్నాయని వైద్యులు గుర్తించారు. రెస్పిరేటరీ సపోర్ట్ యూనిట్ (ఆర్ఎస్‌యూ)లో చేర్చి వైద్య సేవలు అందిస్తున్నారు. శస్త్ర చికిత్స చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు చెప్పారు. కాగా, పీఎస్ఆర్ దాదాపు 15 కిలోలు బరువు తగ్గడం ఆందోళనకరంగా మారింది. ఆయన్ను శస్త్రచికిత్స కోసం ఏదైనా కార్పొరేట్ ఆస్పత్రికి తరలించాల్సిన అవసరం ఉందని వైద్యులు భావిస్తున్నారు. శస్త్ర చికిత్స, ఇతర వైద్య సేవలపై విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నారు.

మాజీ మంత్రి కాకాణికి రిమాండ్



గుంటూరు లీగల్: ఫొటోలు మార్ఫింగ్ చేసి సమాజంలో భిన్న వర్గాల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టే విధంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారనే ఆరోపణలపై అరెస్టయిన వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డికి సీబీసీఐడీ కోర్టు న్యాయమూర్తి ఈ నెల 23 వరకు రిమాండ్ విధించారు. దీంతో కాకాణిని నెల్లూరు జైలుకు తరలించారు. కాగా, కాకాణిపై మేకల సురేంద్ర అనే వ్యక్తి ఇచ్చిన తప్పుడు ఫిర్యాదు మేరకు సీబీ సీఐడీ కేసు నమోదు చేసింది. సురేంద్ర నెల్లూరు రూరల్ మండలం అల్లిపురానికి చెందిన వ్యక్తి. ఇతని ద్వారా టీడీపీ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఉద్దేశపూర్వకంగా కేసు బనాయింపజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షులు అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఒక పథకం ప్రకారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసే విధంగా ప్రవర్తిస్తుందన్నారు.

చదువు చతికిల'బడి'ంది

ఏడాదిలోనే ఎంత తేడా...? అప్పుడు అంతా ప్రగతి బాట.. ఇప్పుడు మొత్తం అస్తవ్యస్తం..! నాడు సంస్కరణల పథం.. నేడు నిర్వీర్యం..! వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఒక విప్లవంలా విద్యారంగాన్ని ముందుకుతీసుకెళ్లగా... టీడీపీ కూటమి సర్కారు అంతా కుప్పకూల్చింది..! పేద పిల్లలకు నాణ్యమైన విద్య అందించాలని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ తపించగా.. ప్రైవేటుమయం చేయాలని ప్రస్తుత సీఎం చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. దీంతో నాడు-నేడు అభివృద్ధి పనులు అటకెక్కాయి.. సర్కారీ చదువులు చట్టుబండలవుతున్నాయి..! అమ్మ ఒడికి వీడ్కోలు పలికారు...ఇంగ్లిష్ మీడియంకు మంగళం పాడారు... డిజిటల్ క్లాస్‌రూమ్‌కు బైబై అన్నారు... టోఫెల్ క్లాసులకు టాటా చెప్పారు...సబ్జెక్ట్ టీచర్లపై వేటు వేశారు... గోరుముద్దను ఘోరంగా మార్చారు... ఆసాంతం విద్యా వ్యవస్థను నీరుగార్చారు... ఫలితం... ఫలితాలు దారుణంగా పడిపోయాయి. దీంతో ప్రభుత్వ బడులను వీడి విద్యార్థులు ప్రైవేటు బాట పడుతున్నారు.

▲ ప్రభుత్వ విద్యా వ్యవస్థలో స్వాతంత్ర్యం అనంతరం ఎవరూ చేయని స్థాయిలో... వైఎస్ జగన్ పాలనలో సమూల విద్యా సంస్కరణలు ఉద్యమంలా సాగాయి. నాణ్యమైన విద్యను పేద పిల్లల ముంగిటకు తెచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పోటాపోటీ చేరికలతో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు విలసిల్లాయి. సర్కారీ బడుల్లో ఖాళీలు లేక.. 'నో వేకెన్సీ' బోర్డులు పెట్టేంత వరకు వెళ్లాయి. కానీ, కూటమి పాలనలో సంస్కరణలు నిలిచిపోయి.. సంక్షేమ పథకాలు అమలు కాక.. పరిస్థితులు తలకిందులయ్యాయి. రాష్ట్రంలో గురువారం నుంచి పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

సాక్షి, అమరావతి : సంవత్సరం క్రితం వరకు ఎంతో గొప్ప ఫలితాలతో దేశంలోనే ఆదర్శంగా నిలిచిన ఏపీ ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి నేడు దిగజారిపోయింది. వైఎస్సార్‌సీపీ పాలనలో మనబడి నాడు-నేడు పనులతో సకల సదుపాయాలతో వెలుగొందిన బడులు ఇప్పుడు జీవం కోల్పోయాయి. రికార్డు వ్యవధిలో ఫలితాలు అంటూ.. ఘనంగా చెప్పుకొన్న పదో తరగతి ఫలితాల్లోనే కూటమి సర్కారు డొల్లతనం బయటపడింది. మోడల్ స్కూళ్ల పేరుతో వందల ప్రాథమిక పాఠశాలలను దూరంగా ఉన్న మరో పాఠశాలలో విలీనం చేయడంతోనే పనితీరు తేటతెల్లమైంది. సర్కారీ బడుల్లో ప్రమాణాలు పెంచే పనులను పక్కనపెట్టడంతోనే.. చంద్రబాబు ప్రభుత్వానిది ప్రైవేటు మోజు అని స్పష్టమైంది. ఇదే అదనుగా ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు చెలరేగుతున్నాయి. ఈ ఏడాది ఫీజులను భారీగా పెంచేశాయి. ఇక కార్పొరేట్ స్కూళ్లలో చదివించాలంటే ఆస్తులు అమ్ముకునే పరిస్థితి. సగటున ఒక్కో స్కూల్లో 10 నుంచి 30 శాతంపైగా ఫీజులు పెంచేశాయి. వీటికి పుస్తకాలు, యూనిఫాం ఖర్చులు అదనం. ప్రైవేటులో ఫీజులను నియంత్రించాల్సిన కూటమి ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకున్నది లేదు. పిల్లల చదువులు భారంగా మారడంతో గురువారం నుంచి పాఠశాలలు పునఃప్రారంభం అంటేనే తల్లిదండ్రులు దిగాలు చెందుతున్నారు.

-2024 వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న విద్యార్థులే అత్యధిక మార్కులతో టాపర్లుగా నిలిచారు. ఈ ఏడాది అధిక శాతం ప్రైవేటు విద్యార్థులే ఆ స్థానాన్ని దక్కించుకున్నారు. దీంతో 'షైనింగ్ స్టార్' అవార్డులు వారికే దక్కాయి.

- గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సమూల విద్యా సంస్కరణలు
- స్వాతంత్ర్యం అనంతరం ఎవరూ చేయని స్థాయిలో అమలు
- నాణ్యమైన విద్యను పేద పిల్లల ముంగిటకు తెచ్చిన వైఎస్ జగన్
- పోటాపోటీ చేరికలతో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- నాడు సర్కారీ బడుల్లో ఖాళీలు లేక.. 'నో వేకెన్సీ' బోర్డులు
- విద్యార్థుల యూనిఫాం సైతం వైఎస్ జగన్ స్వయంగా పరిశీలించి ఎంపిక
- నేడు నిలిచిపోయిన సంస్కరణలు.. అమలు కాని పథకాలు
- వైఎస్సార్‌సీపీ పాలనకు, ఇప్పటికీ పూర్తి భిన్నంగా పరిస్థితులు



ప్రజా వ్యతిరేక విధానాలే మేలంటూ..

2024 జూన్ 12న చంద్రబాబు సీఎంగా ప్రమాణ స్వీకారం చేశారు. మరుసటి రోజు నుంచి 2024–25 విద్యా సంవత్సరం ప్రారంభమైంది. కూటమి వచ్చిందే తడవుగా.. అప్పటిదాకా వైఎస్ జగన్ ప్రభుత్వం అమలు చేసిన సంస్కరణలు, విద్యా సంక్షేమ పథకాలను, కార్యక్రమాలను నిలిపివేసింది. పథకాలకు పేర్లు మార్చింది. విద్యా కానుక తప్ప ఇతర అన్నింటినీ రద్దు చేసింది. 16 రకాల పదార్థాలతో విద్యార్థులకు అందజేసిన 'జగనన్న గోరుముద్ద'ను డొక్కా సీతమ్మ మధ్యాహ్న పథకంగా పేరు మార్చిందేగాని నాణ్యతను గాలికి వదిలేసింది. దీంతో 50 శాతం మంది కూడా విద్యార్థులు తినలేని పరిస్థితి.

- ▲ రాష్ట్రంలో మూడు ప్రాంతాలకు మూడు రకాల మెనూ అందిస్తామని రూ.కోట్ల ఖర్చుతో ప్రయోగాలు చేసిన ప్రభుత్వం చివరకు చేతులెత్తేసింది.
- ▲ ఇంట్లో విద్యార్థులు ఎంతమంది ఉంటే అందరికీ రూ.15వేలు చొప్పున తల్లికి వందనం ఇస్తామని చెప్పి ఏడాదిగా ఎగ్గొట్టింది.
- ▲ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.8 వేల కోట్లతో మన బడి నాడు–నేడు రెండో దశ పనులు ప్రారంభించింది. 20 వేల పాఠశాలల అభివృద్ధి పనులను చేపట్టి, 4 వేల స్కూళ్లలో పూర్తిచేసింది. మిగిలిన పాఠశాలల్లో పనులను కూటమి ప్రభుత్వం అర్ధంతరంగా నిలిపివేసింది.
- ▲ గత ఏడాది జూలైలో ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియను ప్రారంభించి ప్రాథమికోన్నత స్కూళ్లలో స్కూల్ అసిస్టెంట్ బోధనను తొలగించింది. విద్యా సంవత్సరంలో దాదాపు 9 నెలలపాటు ఉపాధ్యాయుల సర్దుబాటుతోనే కాలంవెళ్లదీసి బోధనను బలహీనం చేసింది.
- ▲ ప్రమాణాల మెరుగు కోసం 3–5 తరగతుల విద్యార్థులకు వైఎస్ జగన్ ప్రభుత్వం తెచ్చిన సబ్జెక్టు టీచర్ చదువులను సైతం కూటమి సర్కారు రద్దు చేసింది.
- ▲ వైఎస్సార్‌సీపీ వెయ్యి స్కూళ్లలో ప్రారంభించిన సీబీఎస్ఈ బోధనను కూటమి వచ్చాక ఎత్తివేశారు.
- ▲ పేద విద్యార్థుల కోసం తెచ్చిన టోఫెల్, అంతర్జాతీయ ఐబీ విద్యను చంద్రబాబు ప్రభుత్వం దూరం చేసింది. డిజిటల్ క్లాస్‌రూమ్ కాన్సెప్ట్‌ను పక్కనపెట్టింది.

టెన్త్ పరీక్షల్లో ఘోరంగా 'ఫెయిల్'

పరీక్షలు జరుగుతుండగానే ప్రశ్నపత్రాలు వాట్సాప్‌లో ప్రత్యక్షం... ఆపై ఫలితాల వెల్లడిలో చరిత్రలో ఎన్నడూ లేనంతగా ఘోర వైఫల్యం..! ఇదీ 2024–25 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షలను కూటమి ప్రభుత్వం నిర్వహించిన తీరు. ఈ ఒక్క ఉదాహరణ చాలు... ప్రభుత్వం ఎంత ఘోరంగా ఫెయిలైందో చెప్పేందుకు. గత ఐదేళ్లలో ఎన్నడూ లేనిది... కూటమి ప్రభుత్వంలో ప్రశ్నపత్రం లీక్ కావడం ఒకప్పటి టీడీపీ పాలనను గుర్తు చేసింది. ప్రభుత్వ పెద్దల ఒత్తిడి, రికార్డు కక్కుర్తిలో తక్కువ రోజుల్లోనే ఫలితాల ప్రకటనతో తప్పిదాలు జరిగాయి. రీ వెరిఫికేషన్, రీ కౌంటింగ్ కోసం ఏకంగా 66 వేల దరఖాస్తులు అందాయి. పునః పరిశీలనలోనూ మళ్లీ తప్పులు జరిగాయి.

నాడు నో వేకెన్సీ బోర్డులు.. నేడు సర్కారు బడికి రాంరాం

చక్కగా సాగుతున్న సంస్కరణలను పక్కకుపెట్టి... సంక్షేమ పథకాలను ఎత్తివేసిన కూటమి.. ప్రభుత్వ విద్యలో ప్రయోగాలు చేస్తూ 2025–26 విద్యా సంవత్సరం నుంచి 9 రకాల పాఠశాలలను ప్రవేశపెట్టింది. ప్రజలు, ఉపాధ్యాయులు వ్యతిరేకిస్తున్నా ఇదే మేలంటూ పాఠశాల విద్యను అంధకారంలోకి నెట్టేసింది. గత ఏడాది ప్రభుత్వ చర్యలతో ఏకంగా 4 లక్షల మందిపైగా విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల నుంచి వెళ్లిపోయారని ముఖ్యమంత్రికే జిల్లాల కలెక్టర్లు నివేదిక ఇవ్వడం గమనార్హం. ప్రస్తుతం ప్రభుత్వ విద్యపై ప్రజల్లో నమ్మకం సన్నగిల్లిందని.. ఇదే విధానాలు కొనసాగితే ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల సంఖ్య మరింత తగ్గిపోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. దీనికి భిన్నంగా వైఎస్సార్‌సీపీ పాలనలోని పరిస్థితులను ప్రస్తావిస్తున్నారు. నాడు చేపట్టిన విద్యా సంస్కరణలు అద్భుత ఫలితాలు ఇచ్చాయని, ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేటుకు దీటుగా నిలిచాయని గుర్తుచేస్తున్నారు. విద్యార్థులతో కిటకిటలాడాయని పేర్కొంటున్నారు. ''మా పాఠశాలలో సీట్లు లేవు'' అంటూ గేట్లకు నో వేకెన్సీ బోర్డులు కూడా పెట్టిన విషయాన్ని ప్రస్తావిస్తున్నారు. అప్పటి సీఎం వైఎస్ జగన్ విద్యార్థుల యూనిఫాంను స్వయంగా పరిశీలించి ఎంపిక చేసిన అంశాన్ని ఉదహరిస్తున్నారు.

విద్యార్థుల ప్రైవేటు బాట... ఫీజుల బాదుడు బాధ

కూటమి ప్రభుత్వ విద్యా విధానాల వల్ల ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలు దిగజారడంతో తల్లిదండ్రులు తమ పిల్లలకు ప్రైవేటు స్కూళ్లల్లో ప్రవేశాలు తీసుకుంటున్నారు. దొరికిందే చాన్సుగా ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు ఫీజులు భారీగా పెంచేశాయి. ఏడాది కాలంలో సగటున 10 నుంచి 30 శాతం పైగా స్కూల్ ఫీజులు పెంచేయడంతో మధ్య తరగతి వర్గం తీవ్ర ఆందోళన చెందుతోంది. గత ఏడాది ఓ కార్పొరేట్ స్కూల్లో 3వ తరగతి ఫీజు రూ.45 వేలు ఉంటే, ఇప్పుడు రూ.55 వేలకు పెరిగింది. పుస్తకాల ధర రూ.7 వేల నుంచి రూ.8,500కి చేరింది. ఏడాది కాలంలో వందపైగా కొత్త ప్రైవేట్ స్కూళ్లకు విద్యాశాఖ అనుమతినిచ్చినట్టు అంచనా. సాధారణ బడ్జెట్ పాఠశాలల్లో ఒకటో తరగతికి రూ.12 వేలు ఫీజు, పుస్తకాలకు మరో రూ.3 వేలు వసూలు చేస్తుండగా, ఆరో తరగతికి రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు తీసుకుంటున్నారు. పుస్తకాలకు మరో రూ.5 వేలు వెరసి రూ.30 వేలు అవుతోంది. వ్యవసాయ కుటుంబాలు, మధ్య తరగతి వర్గాల పిల్లలను చదివించే సెమీ కార్పొరేట్ పాఠశాలలు ఒకటో తరగతికి రూ.25 వేల నుంచి రూ.38 వేలు వసూలు చేస్తున్నాయి. కార్పొరేట్ పాఠశాలలు నాన్ ఏసీ, ఏసీ తరగతులు అంటూ ఫీజులు బాదుతున్నాయి.

పిల్లల చదువులతో ఆర్థిక కష్టాలు

ఎలక్ట్రీషియన్‌గా కుటుంబాన్ని పోషిస్తున్న నాకు ఇద్దరు పిల్లలు. అమ్మాయి 6వ తరగతి, అబ్బాయి 5వ తరగతికి వచ్చారు. ఇద్దరినీ స్థానికంగా ఉన్న ప్రైవేటు పాఠశాలల్లో చదివిస్తున్నా. ఏడాదికి రూ.50 వేలు ఖర్చవుతున్నాయి. పిల్లలను చదివించేందుకు ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఫీజులతో పాటు బుక్స్, యూనిఫాం, బ్యాగ్‌లు, బూట్లు, సాక్సులు వంటి సామగ్రి కొనుగోలు భారంగా మారింది. ఫీజులను ఇష్టారాజ్యం పెంచుకుంటూ పోతున్నారు.

–షేక్ బాజీ, గుంటూరు

చదువు భారంగా మారుతోంది

నాకు ముగ్గురు పిల్లలు. మా పెద్దబ్బాయి హాలహర్విలోని ఓ ప్రైవేట్ స్కూల్లో మూడో తరగతి చదువుతున్నాడు. ఏడాదికి రూ.20 వేలు ఫీజు చెల్లించాలి. ఫీజుతోపాటు బుక్స్, యూనిఫాం, షూకు రూ.4 వేలు ఖర్చు అవుతోంది. మాకున్న రెండు ఎకరాల పొలంలో వ్యవసాయం చేస్తూ.. కూలి పనులు చేసుకుని బతుకుతున్నాం. పిల్లల చదువుకు, వ్యవసాయానికి ఏటా రూ.50వేలు అప్పు చేయాల్సిన దుస్థితి.

– గాదిలింగప్ప, నిట్రవట్టి గ్రామం, హాలహర్వి మండలం, కర్నూలు జిల్లా

డయాఫ్రం వాల్‌పై 'డ్రామా'నాయుడు

తప్పులు కప్పిపుచ్చేందుకు జలవనరుల శాఖ మంత్రి యత్నం..

- వాల్ నిర్మించేది భూగర్భంలో..
- మందం లోతు కొలవడానికి ప్రత్యేక సాంకేతికత
- ట్రెంచ్ కట్టర్, గ్రాబర్‌ను కార్మికులతో కొలిపించి.. 1.5 మీటర్ల మందం ఉన్నట్లుగా మాయ చేసిన మంత్రి నిమ్మల
- మంత్రి నిమ్మల తీరుతో విస్తుపోయిన ఇంజినీర్లు
- అంతర్జాతీయ నిపుణుల కమిటీ ఎత్తిచూపిన తప్పులను బహిర్గతం చేసిన 'సాక్షి'
- ఆ తప్పులను దిద్దుకోవాల్సిందిపోయి మంత్రి డ్రామాలు
- కమీషన్ల కక్కుర్తితో 2016–18లో చేసిన తప్పులే మళ్లీ చేస్తున్నారంటున్న ఇంజినీరింగ్ నిపుణులు

- As discussed during Site Visit No. 4, based on the 0.3% maximum deviation tolerance, the minimum wall thickness at the maximum estimated depth (100 m) of the D-Wall is 900 mm, not 1,500 mm as shown on design drawings and reports.
- The D-Wall design should be based on the minimum thickness of 900 mm. The PoE recommends that this minimum thickness should be reviewed and accepted by the Project.

సీడబ్ల్యూసీ 1.5 మీటర్ల మందంతో నిర్మించేలా డయాఫ్రం వాల్ డిజైన్, డ్రాయింగ్‌ను ఆమోదిస్తే.. దానికి భిన్నంగా కనిష్ఠంగా 0.9 మీటర్లతో నిర్మిస్తున్నారని పీపీఏకు అంతర్జాతీయ కమిటీ ఇచ్చిన నివేదిక



డయాఫ్రం వాల్ నిర్మించేందుకు భూమిని తవ్వే ట్రెంచ్ కట్టర్, గ్రాబర్‌ను కార్మికులతో టేపుతో కొలిపిస్తున్న జలవనరుల శాఖ మంత్రి నిమ్మల, ఆ శాఖ సలహాదారు వెంకటేశ్వరావు

The submission was reviewed and it was observed that the WRD AP has proposed a new parallel diaphragm wall of 1.5m thickness, upstream of the existing diaphragm wall, maintaining a clear spacing of 6 meters along the entire length in Gap-II. This spacing was justified as necessary for ensuring trench stability during the construction of the new parallel diaphragm wall.

డయాఫ్రం వాల్‌ను 1.5 మీటర్ల మందంతో నిర్మించేలా డిజైన్‌ను ఆమోదిస్తూ సీడబ్ల్యూసీ ఈ ఏడాది జనవరి 16న ఏపీ ప్రభుత్వానికి రాసిన లేఖ

సాక్షి, అమరావతి/పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు ప్రధాన డ్యాం గ్యాప్–2 పునాది డయాఫ్రం వాల్ పనుల్లో అంతర్జాతీయ నిపుణుల కమిటీ ఆక్షేపించిన, 'సాక్షి' ఎత్తిచూపిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు మంగళవారం గోదావరి వేదికగా జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు డ్రామా చేశారు. డయాఫ్రం వాల్‌ను భూగర్భంలో నిర్మిస్తారు. దాని మందం, లోతు, నాణ్యత కొలతకు ప్రత్యేక సాంకేతికతను ఉపయోగిస్తారు. భూమిని తవ్వే ట్రెంచ్ కట్టర్/గ్రాబర్‌ను బావర్ సంస్థ కార్మికులతో టేపుతో కొలిపించి.. 1.5 మీటర్ల మందంతో డయాఫ్రం వాల్‌ను నిర్మిస్తున్నట్లుగా ప్రకటించి మంత్రి నిమ్మల మాయ చేశారు. దీనిపై ఇంజినీరింగ్ నిపుణులు విస్తుపోయారు. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఆమోదించిన డిజైన్, డ్రాయింగ్ ప్రకారం డయాఫ్రం వాల్‌ను గరిష్ఠ లోతు వంద మీటర్లతో 3 శాతం టోలరెన్స్(విచలనం, భ్రమణం) డీవియేషన్‌తో 1.5 మీటర్లు(1,500 మిల్లీమీటర్లు) మందంతో నిర్మించాల్సి ఉండగా.. కనిష్ఠ మందం 0.9 మీటర్లు(900 మిల్లీమీటర్లే) ఉందని అంతర్జాతీయ నిపుణుల కమిటీ తేల్చిచెబుతూ ఈనెల 4న పీపీఏ(పోలవరం ప్రాజెక్టు అథారిటీ)కి నివేదిక ఇచ్చింది. ఈ అంశంపై సమీక్షించి.. సముచిత నిర్ణయం తీసుకోవాలని సిఫార్సు చేసింది. ఇదే అంశాన్ని 'డయాఫ్రం వాల్ పనులు డిజైన్‌కు విరుద్ధం' శీర్షికన ఆదివారం ప్రచురించిన కథనం ద్వారా 'సాక్షి' బహిర్గతం చేసింది. అంతర్జాతీయ నిపుణుల కమిటీ సిఫార్సులను పాటిస్తూ డయాఫ్రం వాల్‌ను నాణ్యతతో నిర్మించాల్సిందిపోయి.. చేస్తున్న తప్పులను కప్పిపుచ్చేందుకు మంత్రి యత్నించడంపై ఇంజినీరింగ్ నిపుణులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్‌కు విరుద్ధంగా..!

ప్రధాన డ్యాం గ్యాప్–2లో 1396.6 మీటర్ల పొడవు.. 1.5 మీటర్ల మందం, 93.5 మీటర్ల లోతు.. 0.3 శాతం టోలరెన్స్(విచలనం, భ్రమణం) డీవియేషన్‌తో డయాఫ్రం వాల్‌ను నిర్మించేలా ఈ ఏడాది జనవరి 16న సీడబ్ల్యూసీ, డిజైన్, డ్రాయింగ్, లేఅవుట్ ప్లాన్‌ను ఆమోదించింది. డయాఫ్రం వాల్ నిర్మాణానికి వర్కింగ్ ప్లాట్‌ఫాంను ఏర్పాటుచేసి దానిపై ట్రెంచ్ కట్టర్/గ్రాబర్‌తో భూమి లోపల రాతి పొర తగిలే వరకూ తవ్వుతూపోతారు. ప్యానళ్లను అత్యంత కఠిన శిల(సౌండ్ హార్డ్ రాక్)లోకి రెండు మీటర్లు దించాలి. ఖాళీ ప్రదేశంలోకి బెంటనైట్ మిశ్రమంతో నింపుతూపోవాలి. ఆ తర్వాత 32 డిగ్రీల వద్ద టీ–16 ప్లాస్టిక్ కాంక్రీట్ సమ్మేళనాన్ని అధిక ఒత్తిడితో పంపాలి. అప్పుడు బెంటనైట్ మిశ్రమం బయటకు వస్తుంది. కొంత బెంటనైట్ మిశ్రమం ప్లాస్టిక్ కాంక్రీట్ సమ్మేళనంతో కలిసి పటిష్ఠ గోడగా మారుతుంది. అదే డయాఫ్రం వాల్.. అధిక ఒత్తిడితో ప్లాస్టిక్ కాంక్రీట్ సమ్మేళనాన్ని పంపినప్పుడు అది విచలనం, భ్రమణాని(టోలరెన్స్)కి గురవడం వల్ల మందం కాస్త తగ్గుతుంది. 0.3 శాతం విచలనం, భ్రమణాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. సీడబ్ల్యూసీ ఆమోదించిన ప్రకారం గరిష్ఠ లోతు 100 మీటర్ల వద్ద అంటే అట్టడుగు భాగంలో డయాఫ్రం వాల్ మందం కనిష్ఠంగా 1.2 మీటర్లు.. గరిష్ఠంగా 1.455 మీటర్లు ఉండాలి. అట్టడుగు భాగంలో అంతకంటే మందం తగ్గితే డయాఫ్రం వాల్ సీడబ్ల్యూసీ ఆమోదించిన డిజైన్‌కు విరుద్ధంగా ఉన్నట్లు లెక్క. డయాఫ్రం వాల్ నాణ్యతను నిర్ణయించడానికి నిర్వహించిన పరీక్షల్లో దాని మందం కనిష్ఠంగా 0.9 మీటర్లే ఉన్నట్లు అంతర్జాతీయ నిపుణుల కమిటీ గుర్తించి.. అదే అంశాన్ని నివేదికలో తెలిపింది.

నిన్న ఒకలా.. నేడు మరోలా..:

జలవనరుల శాఖ మంత్రి నిమ్మల సోమవారం రాజమహేంద్రవరంలో మీడియాతో మాట్లాడుతూ లోతుకు వెళ్లే క్రమంలో కొన్ని ప్రాంతాల్లో 0.3 మీటర్లు, ఒక ప్యానల్ పక్కన మరో ప్యానల్ దించేటప్పుడు 0.3 మీటర్లు మందం మొత్తం 0.6 మీటర్లు తగ్గే అవకాశం ఉంటుందని సీడబ్ల్యూసీ ఆమోదించిన డయాఫ్రం వాల్ డిజైన్‌లో ఉందని పేర్కొన్నారు. నిర్దిష్టంగా 0.9 మీటర్ల మందంతో డయాఫ్రం వాల్ ఉండాలనే లక్ష్యంతోనే డయాఫ్రం వాల్ మందాన్ని 1.5 మీటర్లుగా నిర్ణయించారన్న విషయాన్ని గ్రహించాలని, పోలవరం పనులు పరుగులు పెడుతుండటాన్ని జీర్ణించుకోలేక 'సాక్షి' అబద్ధపు కథనాలను ప్రచురిస్తోందని విమర్శించారు. కానీ.. పోలవరం ప్రాజెక్టు పనులను క్షేత్ర స్థాయి పరిశీలన పేరుతో మంగళవారం అక్కడికి వెళ్లిన నిమ్మల ట్రెంచ్ కట్టర్/గ్రాబర్‌ను కార్మికులతో కొలిపించి.. డయాఫ్రం వాల్‌ను 1.5 మీటర్ల మందంతో నిర్మిస్తున్నట్లు ప్రకటించడం గమనార్హం. దీన్ని బట్టి చూస్తే.. డయాఫ్రం వాల్ నిర్మాణంలో తప్పులను కప్పిపుచ్చేందుకు మంత్రి నిమ్మల డ్రామా లాడినట్లు స్పష్టమవుతోంది.

పనుల నాణ్యతపై నోరుమెదపరేం?

డయాఫ్రం వాల్ నిర్మాణంలో వినియోగించిన ప్లాస్టిక్ కాంక్రీట్ సమ్మేళనం నాణ్యత లోపం వల్ల ఏప్రిల్ నాటికి 52 ప్యానళ్లలో 9 ప్యానళ్ల పరిధిలో డయాఫ్రం వాల్‌లో పైభాగం 1 నుంచి 2 మీటర్ల లోతు వరకూ నీటి బుడగలు కన్పిస్తున్నాయని, సీపేజీ తీవ్రతను తేల్చడానికి 2 నుంచి 3 మీటర్ల లోతు వరకూ వరుసగా రంధ్రాలు చేసి అధ్యయనం చేయాలని అంతర్జాతీయ నిపుణుల కమిటీ సూచించిన అంశాన్ని 'సాక్షి' ఎత్తిచూపింది. సీపేజీ అధికంగా ఉన్న ప్రాంతాల్లో డయాఫ్రం వాల్ పైభాగంలో 1 నుంచి 2 మీటర్ల లోతు వరకూ తొలగించాలని అంతర్జాతీయ నిపుణుల కమిటీ స్పష్టం చేయడాన్ని, ప్లాస్టిక్ కాంక్రీట్ సమ్మేళనం నాణ్యతను సమీక్షించి.. డయాఫ్రం వాల్‌ను నిర్మించాలని సూచించడాన్ని 'సాక్షి' చాటిచెప్పింది. టీ–16 ప్లాస్టిక్ కాంక్రీట్ సమ్మేళనం 32 డిగ్రీల వద్ద నాణ్యంగా ఉంటుందని.. కానీ 35 డిగ్రీలతో ఉన్న ప్లాస్టిక్ కాంక్రీట్‌ను వినియోగించడం, నీటి శాతం ఎక్కువగా ఉండటంతో ఆ ఉష్ణోగ్రతకు సిమెంటు, బెంటనైట్, కంకర వంటివి విడిపోయాయని(సెగ్రిగేట్).. ఇదే సీపేజీకి దారి తీస్తోందని నిపుణుల కమిటీ స్పష్టం చేసింది. ఆ ప్లాస్టిక్ కాంక్రీట్‌ను సమీక్షించి.. 32 డిగ్రీల వద్ద ఉండేలా చూడాలని సూచించింది. వాటిపై మంత్రి నిమ్మల నోరుమెదపకపోవడం గమనార్హం.

2027 డిసెంబర్ నాటికి పోలవరం పూర్తి

పోలవరం రూరల్: పోలవరం ప్రాజెక్టు పనులు 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేస్తామని మంత్రి నిమ్మల అన్నారు. పోలవరం ప్రాజెక్టు పనులను మంగళవారం ఆయన అధికారులు, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజుతో కలిసి పరిశీలించారు. డయాఫ్రమ్ వాల్ పనులు జరుగుతున్న తీరును ప్రాజెక్టు సీఈ నరసింహమూర్తి ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి విలేకరులతో మాట్లాడుతూ ఇప్పటికే డయాఫ్రంవాల్ నిర్మాణం 360 మీటర్లకు చేరుకుందన్నారు. గ్యాప్–1కు సంబంధించి ఈసీఆర్ఎఫ్ డ్యామ్ 2026కు పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. అనంతరం ప్రాజెక్టు క్యాంపు కార్యాలయంలో ఇంజనీరింగ్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులతో పనుల పురోగతిపై సమీక్షించారు.

'సాక్షి' మీడియా లక్ష్యంగా చంద్రబాబు కుట్ర

- అబద్ధాలను పోగేసి, సాక్షిపై దాడులకు వ్యూహరచన
- అందులో భాగంగానే జర్నలిస్ట్ కొమ్మినేని అరెస్ట్
- మాజీ మంత్రి ఆర్‌కే రోజా



నగరి: 'సాక్షి' మీడియా గొంతు నొక్కాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు కుట్ర చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ మంత్రి ఆర్‌కే రోజా ధ్వజమెత్తారు. వ్యూహాత్మకంగానే 'సాక్షి' కార్యాలయాలపై దాడులు చేయడంతో పాటు సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావుపై తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేశారన్నారు. మంగళవారం చిత్తూరు జిల్లా నగరిలో మీడియాతో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో రెడ్‌బుక్ అక్రమ కేసులు పరాకాష్ఠకు చేరుకున్నాయన్నారు. శాంతి భద్రతలను కాపాడాల్సిన అధికార పార్టీయే అల్లర్లు, దాడులు చేస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీకి చెందిన మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఐపీఎస్ అధికారులు, మాజీ ఐఏఎస్ అధికారులపై కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారన్నారు. ఇప్పుడు ఏకంగా జర్నలిస్టులపై కూడా అక్రమ కేసులు పెట్టి సాక్షి కార్యాలయాలపై దాడులు చేయిస్తున్నారన్నారు. ఇది ప్రజాస్వామ్యమా లేక నియంత పాలనా అని ప్రశ్నించారు.

జర్నలిస్ట్ కృష్ణంరాజు వ్యాఖ్యలను ఎవరూ సమర్థించరు

జర్నలిస్టు కృష్ణంరాజు వ్యాఖ్యలను ఎవరూ సమర్థించరని, వాటిని తనతోపాటు తమ పార్టీ నాయకులు సైతం ఖండించారని రోజా గుర్తు చేశారు. టీడీపీ సాక్షిపైన, తమ అధినేత వైఎస్ జగన్‌పైన, భారతమ్మపై బురదచల్లుతున్నారన్నారు. ఇది పూర్తిగా డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే అని చెప్పారు. ఎవరో జర్నలిస్ట్ వ్యాఖ్యలు చేస్తే వైఎస్ జగన్, భారతమ్మ క్షమాపణలు చెప్పాలనడం విడ్డూరమన్నారు. ఈ వ్యవహారంపై ఎలాంటి సంబంధం లేని భారతమ్మపై బురద జల్లుతున్నందుకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

దాడులు డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే

ఏడాది పాలనలో ఘోరమైన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడం కోసమే చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని రోజా మండిపడ్డారు. అమరావతిలో చంద్రబాబు మరో 50 వేల ఎకరాల భూదోపిడీకి సిద్ధమయ్యారని.. దీనిపై అమరావతి రైతుల్లో వెల్లువెత్తుతున్న అసంతృప్తిని డైవర్ట్ చేయడానికి ఇలాంటి పనులు చేస్తున్నారన్నారు. సాక్షి మీడియాలో డిబేట్ జరిగిన మరుసటి రోజే కొమ్మినేని శ్రీనివాసరావు సారీ చెప్పారన్నారు. కానీ.. కృష్ణంరాజు మాట్లాడిన మాటలను తమ అనుకూల మీడియా ద్వారా టీడీపీ నేతలు విషప్రచారం చేశారన్నారు. దీనిపై లోకేశ్ ట్వీట్ చేయడంతోపాటు అసభ్యకరమైన పోస్టింగ్‌లు పెట్టించడం, సాక్షిపై దాడి చేసేలా అందరినీ రెచ్చగొట్టడం, ఆపై పవన్‌కళ్యాణ్ ట్వీట్ చేయడం పథకం ప్రకారమే జరిగాయన్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల వ్యాఖ్యలు సిగ్గుచేటని పేర్కొన్నారు.

తెనాలిలో నడిరోడ్డుపై పోలీసుల చర్య అనాగరికం

- దోషులనైనా బహిరంగంగా కొట్టడం పెద్ద తప్పు

సాక్షి, అమరావతి: తెనాలిలో నడిరోడ్డుపై దళితులను బహిరంగంగా పోలీసులు కొట్టడం అనాగరిక చర్య అని మాజీ సీఎస్ ఐ.వై.ఆర్. కృష్ణారావు అన్నారు. వ్యక్తిగత ఐ.వై.ఆర్ టాక్స్‌లో మాట్లాడిన వీడియోను ఫేస్‌బుక్ ద్వారా ఆయన విడుదల చేశారు. ఇందులో తెనాలిలో దళితులపై పోలీసులు బహిరంగంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు. ఈ ఘటనపై ఐ.వై.ఆర్ కృష్ణారావు ఇలా స్పందించారు..'' తెనాలిలో జరిగిన అంశాన్ని రెండు రకాలుగా చూడాలి..మొదటిది వారు దోషులై ఉండవచ్చు, దోషులైతే శిక్షించడానికి విధానం ఉంది. కానీ ఈ రకంగా నడిరోడ్డుపై బహిరంగంగా దళితులను కొట్టడం అనాగరికమే. ఎందుకు ఇలా చేశారా అంటే తెలియదు. వారు డిజర్వింగ్ అన్ డిజర్వింగా అనేది వదిలేస్తే.. ఏదైనా తప్పు చేస్తే న్యాయ, చట్టం ప్రకారం చర్య తీసుకోవాలి తప్ప ఇలా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదు. అయితే ఈ ఘటనను ఎల్లో మీడియా మరోలా వక్రీకరిస్తూ ముందుకు తీసుకుపోవడం బాధాకరం. తిమ్మిని బమ్మిని చేయడంలో ఎల్లో మీడియాను మించిన వారు లేరు. ఇదే ఘటన ఎక్కడైనా బహిరంగంగా దళితులను పోలీసులు కొట్టి ఉంటే పెద్ద ఇష్యూ అయ్యేది. ఏదేమైనా నడిరోడ్డుపై బహిరంగంగా పోలీసులు కొట్టడం మానవత్వం అంగీకరించదు. చాలా పెద్ద తప్పే జరిగింది. దాన్ని సరిదిద్దుకోవాలి'' అంటూ ఐవైఆర్ మాట్లాడారు.

వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ విభాగంలో నియామకాలు

సాక్షి,అమరావతి: వైఎస్సార్‌సీపీ ఎన్ఆర్ఐ విభాగం స్టేట్ కన్వీనర్లు, కో– కన్వీనర్లను పార్టీ నియమించింది. పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం మంగళవారం తెలిపింది. ఆస్ట్రేలియాలోని వివిధ రాష్ట్రాలకు ఈ నియామకాలు చేపట్టింది. న్యూ సౌత్ వేల్స్ కన్వీనర్(ఎన్ఎస్‌డబ్ల్యూ)గా ఎల్లా అమర్‌నాథ్‌రెడ్డి, కో కన్వీనర్‌గా అంకిరెడ్డిపల్లి శివరంగారెడ్డి, విక్టోరియా కన్వీనర్‌గా మర్రి కృష్ణదత్తరెడ్డి, కో కన్వీనర్‌గా కందుల భరత్, క్వీన్స్‌ల్యాండ్ కన్వీనర్‌గా యెరువూరి బ్రహ్మారెడ్డి, కో కన్వీనర్‌గా వీరంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, సౌత్ ఆస్ట్రేలియా కన్వీనర్‌గా బొంతు వంశీధర్‌రెడ్డి , కో–కన్వీనర్‌గా ఆలేటి నరసింహాచారిని నియమించారు.

సేవ్ ఉమెన్.. సేవ్ ఆంధ్రా


పార్వతీపురంలో మహిళల నిరసన ర్యాలీ


తిరుపతిలో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందిస్తున్న మహిళలు

రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నిరసనలు

సాక్షి, అమరావతి/నెట్‌వర్క్: రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఆందోళనల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు. మంగళవారం 'సేవ్ ఉమెన్.. సేవ్ ఆంధ్రా' నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నిరసన కార్యక్రమాలు చేపట్టింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటినుంచి మహిళలు, చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్న నేపథ్యంలో అన్ని జిల్లా కేంద్రాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నేతలు వినతిపత్రాలు సమర్పించారు. కూటమి పాలనలో రాష్ట్రంలో స్త్రీలు, బాలికల మాన, ప్రాణాలకు రక్షణ లేకుండాపోయిందని మహిళలంతా నినదించారు. హోం మంత్రి అనిత మహిళ అయి ఉండి కూడా మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ఆమె వెంటనే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

పోలీస్ ఆంక్షల నడుమ పోటెత్తిన ర్యాలీలు

గుంటూరులో నిరసన తెలిపేందుకు వెళుతున్న మహిళలను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు, నిరసనకారుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. మహిళలు బారికేడ్లను నెట్టుకుని వెళ్లి నిరసన తెలియజేశారు. లాడ్జి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి, మహిళా విభాగం అధికార ప్రతినిధి శ్రీదేవిరెడ్డి పాల్గొన్నారు. విజయవాడలో పోలీసులు అడుగడుగునా అడ్డుపడినా 'సేవ్ ఉమెన్.. సేవ్ ఆంధ్రా' నినాదాలు చేస్తూ మహిళలు అంబేడ్కర్ స్మృతి వనానికి తరలివెళ్లారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి తదితరులు పాల్గొన్నారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి మహిళలపై అఘాయిత్యాలు, హత్యలను నిరసిస్తూ వినతిపత్రం సమర్పించారు. బాపట్లలో అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం సమర్పించారు. కృష్ణా జిల్లా మచిలీపట్నంలో 'సేవ్ ఉమెన్.. సేవ్ ఆంధ్రా' నినాదాలతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లు చేతబట్టి మహిళలు భారీ ర్యాలీ నిర్వహించారు. నెల్లూరులోని వీఆర్‌సీ సెంటర్‌లో భారీ ర్యాలీ జరిగింది. ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద మహిళలు భారీఎత్తున నిరసన తెలిపారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో అంబేడ్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేసి వినతిపత్రం సమర్పించారు. భీమవరంలోనూ పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు జరిగాయి. కాకినాడ ఇంద్రపాలెం బ్రిడ్జి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో మహిళలు భారీ నిరసన చేపట్టి గోకవరం బస్టాండ్ వద్ద అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జిల్లా నలుమూలల నుంచి మహిళలు తరలివచ్చి 'సేవ్ ఉమెన్.. సేవ్ ఆంధ్రా' కార్యక్రమం చేపట్టారు. ఒంగోలులో అంబేడ్కర్ భవన్ నుంచి ప్లకార్డులు పట్టుకుని మహిళలు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ కలెక్టరేట్‌కు చేరుకుని నిరసన తెలిపారు.

ఉత్తరాంధ్రలో నిరసనల వెల్లువ

విశాఖపట్నంలో మహిళలు, వైఎస్సార్‌సీపీ నేతలు భారీ ర్యాలీ నిర్వహించి అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనకాపల్లిలో మహిళలు రింగ్ రోడ్ నుంచి ర్యాలీగా రైల్వే జంక్షన్‌కు వెళ్లి అంబేడ్కర్ విగ్రహం వద్ద 'రెడ్‌బుక్ పాలన పోవాలి.. మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలు అరికట్టాలంటూ వినతిపత్రం అందజేశారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. శ్రీకాకుళంలోని అంబేడ్కర్ కూడలి వద్ద మహిళలు ప్లకార్డులతో నినాదాలు చేస్తూ నిరసన ప్రదర్శన చేశారు.


ఒంగోలులో అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మహిళలు

రాయలసీమ జిల్లాల్లో నిరసన గళం

మహిళలపై జరుగుతున్న అకృత్యాలపై అనంతపురం అంబేడ్కర్ విగ్రహం ఎదుట రోడ్లపై బైఠాయించారు. రాప్తాడు, హిందూపురంలో మహిళలు నిరసన తెలిపారు. కడప కోటిరెడ్డి సర్కిల్‌లో మహిళలకు రక్షణ కల్పించాలని మహిళలు నినదించారు. అన్నమయ్య జిల్లా రాయచోటిలో ర్యాలీ జరిపారు. కర్నూలులో నల్లబ్యాడ్జీలు ధరించి కొండారెడ్డి బురుజు నుంచి పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ చేశారు. మహిళలపై అఘాయిత్యాల విషయం కూటమి ప్రభుత్వ తీరును ఎండగడుతూ తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. చిత్తూరు జిల్లాలోనూ నిరసన కార్యక్రమాలు జరిగాయి.

రాష్ట్రంలో మహిళలు భయపడిపోతున్నారు

వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి



సాక్షి, అమరావతి: కూటమి పాలనలో మహిళల మాన, ప్రాణాలు గాలిలో దీపాలయ్యాయని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలు బతకాలంటే భయపడిపోతున్నారని, ఆడపిల్లల తల్లిదండ్రులు గజగజ వణికిపోతున్నారని పేర్కొన్నారు. మంగళవారం తాడేపల్లి వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించిన ఆందోళనలు విజయవంతం అయ్యాయని చెప్పారు. అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ నేతృత్వంలో మహిళలు స్వచ్ఛందంగా ఈ నిరసనల్లో పాల్గొని ప్రభుత్వ దుర్మార్గ పాలనపై ఆగ్రహాన్ని వ్యక్తం చేశారని చెప్పారు. ఏడాది కాలంగా మహిళలపై అఘాయిత్యాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని మండిపడ్డారు. కూటమి పాలనలో ఇప్పటికే 188 మహిళలు, బాలికలు అత్యాచారానికి గురికాగా.. 15 మందిపై అత్యాచారం చేసి చంపేశారన్నారు. మహిళలపై దాడులకు సంబంధించి రోజుకు 70 నుంచి 80 కేసులు నమోదవుతున్నాయని ఇటీవల శాసనసభలోనే ప్రభుత్వం అంగీకరించిందని గుర్తు చేశారు.

తన్మయి హత్యకు సమాధానం చెప్పండి

తాజాగా అనంతపురంలో గిరిజన విద్యార్థిని తన్మయి దారుణ హత్యకు గురైందని, ఆరు రోజుల కిందటే ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం స్పందించలేదని వరుదు కళ్యాణి పేర్కొన్నారు. ప్రతిపక్షంపై దుమ్మెత్తిపోసేందుకు ముందుండే హోంమంత్రి ఇటువంటి ఘటనలపై కనీసం స్పందించలేదని, విద్యార్థిని అదృశ్యంపై అనుమానితుల పేర్లు, ఫోన్ నంబర్లు ఇచ్చినా కూడా పోలీసులు దర్యాప్తు చేయలేదన్నారు. చివరకు పోలీసుల నిర్లక్ష్యం వల్లే విద్యార్థిని హత్య జరిగిందని జిల్లా ఎస్పీ అంగీకరించి సంబంధిత సీఐని సస్పెండ్ చేశారన్నారు. ఈ ఘటనకు ఎస్పీ, డీజీపీ, హోంమంత్రి, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహించాలన్నారు.

క్లుప్తంగా...

ప్లంజ్‌పూల్‌లో అండర్‌వాటర్ వీడియోగ్రఫీ


ప్లంజ్‌పూల్ ప్రాంతంలో వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ చేస్తున్న నిపుణులు

శ్రీశైలం ప్రాజెక్ట్: శ్రీశైలం డ్యాం ప్లంజ్‌పూల్‌లో మంగళవారం అండర్ వాటర్ వీడియోగ్రఫీ, ఫొటోగ్రఫీ ప్రారంభమైంది. వాల్తేరు సీలైన్ ఆఫ్‌షోర్ డైవింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన 14 మంది నిపుణులు అత్యాధునిక కెమెరాలతో నదిలోకి దిగి ప్లంజ్‌పూల్‌లో ఏర్పడిన గోతులు, సిమెంట్ కాంక్రీట్ సిలిండర్ల నాణ్యత, డ్యాం పునాది వద్ద పరిస్థితులను వీడియో, ఫొటోగ్రఫీ చేస్తున్నారు. ఈ సర్వే 12 రోజుల పాటు సాగనున్నట్లు డ్యాం ఎస్‌ఈ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు.

యోగాంధ్రకు రమ్మన్నారు.. 'సాక్షి'ని తిట్టమన్నారు

విస్తుపోయిన స్వయం సహాయక సంఘాల మహిళలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరులో పలువురు మహిళా స్వయం సహాయక సభ్యులకు మంగళవారం ఫోన్లు వెళ్లాయి. ఈ రోజు యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు చేయాలని, అందరూ గాంధీ విగ్రహం వద్దకు రావాలంటూ కార్పొరేషన్‌కు చెందిన సిబ్బంది ఫోన్లు చేశారు. ఎవరైనా రాకపోతే ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు, బ్యాంకు రుణాలు రావంటూ భయపెట్టారు. అన్యమనస్కంగా వచ్చిన మహిళలు అసలు విషయాన్ని గ్రహించి విస్తుపోయారు. వచ్చిన వారంతా చేతిలో చీపుర్లు పట్టుకుని నిల్చోవాలని, వైఎస్ జగన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేయాలంటూ అక్కడున్న నిర్వాహకులు హుకూం జారీ చేశారు. ఈ పరిణామంతో పలువురు డ్వాక్రా సంఘాల మహిళలు అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజకీయాలు వద్దని, ఇందులోకి లాగవద్దంటూ వేడుకున్నారు. 'ఇది ఎమ్మెల్యే సార్ ఆర్డర్. చేయకుంటే మీ ఇష్టం..' అని చెప్పడంతో మహిళలు మిన్నకుండిపోయారు. అనంతరం 'సాక్షి' మీడియా ప్రసారాలను ఆపాలని,సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు క్షమాపణలు చెప్పాలంటూ చిత్తూరు మేయర్ అముద, చుడా చైర్‌పర్సన్ హేమలత, ఇతర టీడీపీ మహిళా నేతలు ర్యాలీ చేపట్టారు.

ఎమ్మెల్యే లేఖా.. మజాకా!

- ఒకే పోస్టులో ఇద్దరి నియామకం

సాక్షి, అమరావతి: వ్యవసాయ శాఖలో జరిపిన బదిలీల్లో పెద్దఎత్తున అవకతవకలు చోటుచేసుకున్నాయి. ఓ వైపు మంత్రులు, ఎమ్మెల్యేల సిఫార్సులకు పెద్దపీట వేస్తూనే.. అధికారులు అందినకాడికి దండుకున్నారు. ఒక సామాజిక వర్గానికి చెందిన వారికైతే కోరుకున్న చోటుకు అడ్డగోలు పోస్టింగ్‌లు ఇచ్చేశారు. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా బాపులపాడు మండల వ్యవసాయ అధికారి పోస్టుకు స్థానిక ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఏకంగా ఇద్దరికి సిఫార్సు లేఖలు ఇచ్చారు. ఒకే పోస్టులో ఇద్దర్ని ఎలా నియమిస్తారన్న ఇంగిత జ్ఞానం కూడా లేకుండా ఎమ్మెల్యే లేఖలను పరిగణనలోకి తీసుకున్న అధికారులు ఆ ఇద్దరిని ఒకే చోటుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయాన్ని గ్రహించిన ఉన్నతాధికారులు మంగళవారం రాత్రి ఆ ఇద్దరి బదిలీ ఉత్తర్వులను నిలిపివేశారు. మైలవరం ఎమ్మెల్యే సిఫారసు మేరకు ముమ్మ మండల వ్యవసాయ శాఖాధికారిగా పనిచేస్తున్న కె.శివప్రసాద్‌కు బదిలీల్లో భాగంగా బాపులపాడులో పోస్టింగ్ ఇచ్చారు. మరోవైపు గన్నవరం వ్యవసాయాధికారిగా పనిచేస్తున్న వై.రజనికి సైతం బాపులపాడులోనే పోస్టింగ్ ఇచ్చారు.

మద్యం అక్రమ కేసులో బెయిల్ పిటిషన్లపై విచారణ వాయిదా

విజయవాడలీగల్: మద్యం అక్రమ కేసులో అరెస్టైన రాజ్ కేసిరెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణ మోహన్‌రెడ్డి, గోవిందప్ప బాలాజీ, చాణక్యల బెయిల్ పిటిషన్లపై విచారణ ఈ నెల 17వ తేదీకి వాయిదా పడింది. ఈ మేరకు సీబీఐ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. అలాగే, చాణక్యకు జైలులో పరుపు, దిండు సౌకర్యాలను కల్పించాలని జైలు అధికారులను ఆదేశిస్తూ న్యాయమూర్తి ఉత్తర్వులిచ్చారు.

పీఎస్‌ఆర్ బెయిల్ పిటిషన్ విచారణ నేటికి వాయిదా

ఏపీపీఎస్సీ మూల్యాంకనంలో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై అరెస్టైన పీఎస్‌ఆర్ ఆంజనేయులు..హైకోర్టు సూచనల మేరకు మంగళవారం ఒకటవ అదనపు ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశిస్తూ విచారణను నేటికి వాయిదా వేశారు.

నేడు కేసీఆర్‌కు క్రాస్ ఎగ్జామినేషన్

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టులోని బరాజ్‌ల నిర్మాణంలో అవకతవకలపై విచారణలో భాగంగా జస్టిస్ పినాకి చంద్రఘోష్ కమిషన్ బుధవారం మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావుకు క్రాస్ ఎగ్జామినేషన్ నిర్వహించనుంది. విచారణ కమిషన్ ఎదుట ఓ మాజీ ముఖ్యమంత్రి హాజరు కానుండడం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి కావడంతో దీనికి ప్రాధాన్యత సంతరించుకుంది.

ప్రభుత్వం మాదే.. మాపైనే కేసులా!

- రామసముద్రం పోలీస్ స్టేషన్‌ను ముట్టడించిన టీడీపీ శ్రేణులు
- స్టేషన్‌లోకి దూసుకెళ్లేందుకు యత్నం
- ఎస్‌ఐని అప్పజెప్పాలని డిమాండ్


రామసముద్రం పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న ఎర్రబోయినపల్లి టీడీపీ శ్రేణులు

రామసముద్రం: 'రాష్ట్రంలో అధికారంలో ఉన్నది మా పార్టీ ప్రభుత్వమే. అలాంటిది మాపైనే కేసులు పెడతారా! మీకెంత ధైర్యం? ఆ ఎస్‌ఐని మాకు అప్పజెప్పండి. ఆయన సంగతి తేలుస్తాం' అంటూ అన్నమయ్య జిల్లా ఎర్రబోయినపల్లి గ్రామానికి చెందిన టీడీపీ వర్గీయులు పోలీస్ స్టేషన్‌పై దండెత్తారు. వివరాల్లోకి వెళితే.. ఎర్రబోయినపల్లి, శ్రీరాములవారిపల్లి గ్రామాల మధ్య చెలరేగిన ఉద్రిక్తతల నేపథ్యంలో రెండువర్గాలపై రామసముద్రం పోలీసులు కేసులు నమోదు చేశారు. శ్రీరాములవారిపల్లెకు చెందిన మంజునాథ్ ఫిర్యాదు మేరకు ఎర్రబోయినపల్లెకు చెందిన 11 మంది టీడీపీ కార్యకర్తలపై కేసు నమోదు చేశారు. దీనిపై ఆగ్రహించిన ఎర్రబోయినపల్లి టీడీపీ శ్రేణులు స్టేషన్‌పైకి దూసుకొచ్చాయి. ఎస్సై రవికుమార్, కానిస్టేబుల్ ఈ విషయాన్ని గమనించి స్టేషన్ గేటును మూసివేశారు. ఎవరినీ లోపలికి రానివ్వకుండా అడ్డుకున్నారు. విషయం తెలిసి మదనపల్లె రూరల్ సీఐ సత్యనారాయణ అక్కడకు చేరుకోగా.. ఆయన సమక్షంలోనే టీడీపీ శ్రేణులు పోలీస్ స్టేషన్ గేటును నెట్టుకుంటూ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. తర్వాత అక్కడే ఆందోళన నిర్వహించారు. టీడీపీకి చెందిన తమపైనే కేసు నమోదు చేసేంత ధైర్యం మీకెవరు ఇచ్చారంటూ పోలీసులపై విరుచుకుపడ్డారు. ఈ ఘటనతో రామసముద్రంలో ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ శ్రేణుల దాడి యత్నంతో ఆందోళనకు గురైన పోలీసులు పరిస్థితిని చక్కదిద్దే ప్రయత్నాలు చేశారు. టీడీపీ నాయకుడు విశ్వనాథ్ ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో మంజునాథ్ వర్గానికి చెందిన ఆరుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై రవికుమార్ ప్రకటించారు. ఈ కేసులో ఇంకా చాలా మంది నిందితులు ఉన్నారని వారిపైనా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాష పోలీస్ స్టేషన్‌కు చేరుకుని సీఐ, ఎస్సైలతో సమావేశమయ్యారు.

ఖరీఫ్ ముందుకు జరగాలి

తుపాన్ల బారిన పడకుండా ప్రణాళిక పక్కాగా అమలు చేయాలి

వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు



సాక్షి, అమరావతి: ఖరీఫ్ పంటలను తుపాన్ల నుంచి రక్షించుకునేందుకు వీలుగా పంటకాలాన్ని ముందుకు తీసుకు రావాల్సిన అవసరం ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. మంగళవారం వ్యవసాయ శాఖ సమీక్షలో ఆయన మాట్లాడుతూ పంట కాలాన్ని ముందుకు తీసుకురావాలన్న కార్యాచరణతో ఈ ఏడాది ఇప్పటికే గోదావరి, కృష్ణా డెల్టా ప్రాంతాలకు సాగునీరు విడుదల చేశారని పేర్కొన్నారు. జూలై మొదటివారంలో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు నీరు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని పేర్కొన్నారు. ఇదే రీతిలో ఏటా సీజన్‌కు ముందుగానే సాగునీటి విడుదలకు ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులకు సూచించారు. 365 రోజులూ పంటలు పండించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏటా 3 పంటల విధానం తీసుకురావాలని చెప్పారు.

సన్న రకాలకు ప్రోత్సాహం

వరిలో అధిక డిమాండ్ ఉన్న సన్నరకాలను పండించేలా రైతులను ప్రోత్సహించాలని చంద్రబాబు చెప్పారు. వరిలో అంతర పంటగా గట్లపై కూరగాయలు, పండ్ల మొక్కలు పెంచే విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేయాలని సూచించారు. వరి పంట మధ్యలో లేదా, పంట చుట్టూ ఆక్వాకల్చర్, హార్టికల్చర్ సాగునూ ప్రోత్సహించవచ్చని వివరించారు. ఈ ఏడాది హెచ్చీ బర్లీ స్థానంలో ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలని చంద్రబాబు చెప్పారు. సమీక్షలో వ్యవసాయ శాఖమంత్రి అచ్చెన్నాయుడు, స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి మత్తులోనే మహిళలపై అఘాయిత్యాలు

రాష్ట్రంలో గంజాయి మత్తులో క్షణికావేశంతో మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడుతున్నారికి శిక్ష తప్పదనే అభిప్రాయం కలిగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అనంతపురం జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థిని హత్య, యువతి అత్యాచారం ఉదంతాలపై ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్ అంటే భయం లేకపోవడంతోనే నేరాలు పెరుగుతున్నాయన్నారు. అనంతపురం జిల్లాలో ఇంటర్మీడియెట్ విద్యార్థిని హత్య, ఓ యువతి అత్యాచారం కేసుల్లో నిందితులకు త్వరగా శిక్ష పడేట్టుగా చర్యలు తీసుకోవాలన్నారు. త్వరగా చార్జ్‌షీట్ దాఖలు చేసి న్యాయ విచారణ వేగవంతం చేసేందుకు సహకరించాలన్నారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, ఇంటలిజెన్స్ అదనపు డీజీ మహేశ్ చంద్ర లడ్హా తదితరులు పాల్గొన్నారు.

పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు నీచ ప్రయత్నం


వైఎస్సార్‌సీపీ నేత జూపూడి ప్రభాకర్‌రావు



సాక్షి, అమరావతి: ప్రభుత్వ వైఫల్యాలు, అక్రమాలు, అరాచకాలను ప్రశ్నిస్తున్న సాక్షి మీడియా గ్రూప్ గొంతు నొక్కాలని కుట్ర పన్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి జూపూడి ప్రభాకర్‌రావు అన్నారు. అందులో భాగంగానే రెండు రోజులుగా సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులు చేస్తుండటం పత్రికా స్వేచ్ఛకు సంకెళ్లు వేయడమేనని మండిపడ్డారు. ఇది నీచ ప్రయత్నమన్నారు. 'ఏలూరు జిల్లా సాక్షి కార్యాలయంపై పెట్రోల్ బాటిళ్లు, రాళ్లతో దాడి చేసిన పచ్చమూకలు.. ఫర్నీచర్‌కు నిప్పు పెట్టారు. దీంతో సమీపంలోని దుకాణం సోఫా సెట్లు, ఫర్నీచర్ అగ్నికి ఆహుతి అయ్యాయి. అక్కడే ఉన్న భవనం యజమాని కారు కూడా పాక్షికంగా ధ్వంసమైంది. ప్రభుత్వ పెద్దలు ఒక వ్యూహం ప్రకారం లేని వివాదాన్ని సృష్టించడంతో పాటు, అక్రమ కేసులు బనాయించి సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయించారు. మరోవైపు దాడులు చేస్తూ, రాష్ట్రంలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు. ఈ దుశ్చర్యను తీవ్రంగా ఖండిస్తున్నాం' అని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు

ఏలూరు సాక్షి కార్యాలయంపై దాడి దారుణం

మాజీ మంత్రి మేరుగ నాగార్జున



సాక్షి, అమరావతి: ఏలూరు జిల్లా సాక్షి కార్యాలయంపై దాడి చేయడం, ఫర్నీచర్‌ను తగలబెట్టడం అత్యంత దారుణం అని, ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి అని మాజీ మంత్రి మేరుగ నాగార్జున మండిపడ్డారు. 'సాక్షి కార్యాలయాలపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. పత్రికా కార్యాలయాలపై దాడులు చేసే సంస్కృతి ప్రమాదకరం. విశ్లేషకుడి మాటలను సాక్షి మీడియా ఖండించినప్పటికీ, సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేనిని అక్రమ కేసు పెట్టి అరెస్ట్ చేయడం అత్యంత దారుణం. దేశవ్యాప్తంగా ఇలాంటి టాక్ షోలు చేసే వారు అనేక అభ్యంతరకర వ్యాఖ్యలు చేస్తున్నారు.. కొమ్మినేనిపై పెట్టినట్టు వారందరిపైనా అక్రమ కేసులు పెట్టి జైళ్లకు పంపుతారా' అని ఆయన మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని నిలదీశారు.

వైఎస్ జగన్‌ను తీసుకెళ్లడానికి వీలు కాలేదు

విచారణలో స్పష్టం చేసిన హెలికాప్టర్ పైలట్ అనిల్‌కుమార్

చెన్నేకొత్తపల్లి: హెలికాప్టర్ టెయిల్ రోటర్ దెబ్బతింది. దీంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని తిరిగి తీసుకెళ్లడానికి వీలుకాలేదు. మేము మాత్రమే వెళ్లాం. హెలికాప్టర్ ముందు భాగం సురక్షితమైంది. కానీ వెనుక వైపు అలా ఉండదు. అందుకే ఆయన్ను తీసుకెళ్లడానికి వీలు కాలేదు. మాకు కొన్ని నిబంధనలు ఉంటాయి. వాటిని అనుసరించే వెళ్లామ'ని హెలికాప్టర్ పైలట్ అనిల్‌కుమార్ స్పష్టం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి హెలికాప్టర్ విండ్‌షీల్డ్ డ్యామేజీ ఘటనకు సంబంధించి మంగళవారం పైలట్ అనిల్‌కుమార్‌ను పోలీసులు విచారించారు. రామగిరి సర్కిల్ సీఐ శ్రీధర్ సమక్షంలో జరిగిన విచారణకు పైలట్ అనిల్‌కుమార్ తన లాయర్ రత్నదీప్ ముఖర్జీతో కలిసి హాజరయ్యారు.

రాష్ట్రం ఎటుపోతోంది బాబూ!

రెడ్‌బుక్ కేసులపై ఉన్న శ్రద్ధ మహిళలపై అకృత్యాలు జరిగితే ఉండదా

- రాజ్యాంగాన్ని పరిహసిస్తున్న పోలీసు శాఖ
- మాజీ మంత్రి సాకే శైలజానాథ్



అనంతపురం (కార్పొరేషన్): చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం ఎటుపోతోందో అర్థం కాని పరిస్థితి నెలకొందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మండిపడ్డారు. మంగళవారం అనంతపురంలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఏడాది కాలంగా మహిళలపై పెద్దఎత్తున అకృత్యాలు జరుగుతున్నా పట్టించుకోని ప్రభుత్వం.. రాజకీయ కక్షసాధింపులకు పెద్దపీట వేస్తోందన్నారు. చంద్రబాబు కనుసన్నల్లో పోలీసు శాఖ రాజ్యాంగేతర చర్యలకు పాల్పడుతోందని, లోకేశ్‌కు రెడ్‌బుక్ అందించి వైఎస్సార్‌సీపీ శ్రేణులు, సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇంతటి దౌర్భాగ్యమైన సామాజిక స్థితిని బద్దలు కొట్టాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. ఇలాంటి దుర్మార్గాలపై ప్రజా సంఘాలతో కలసి వైఎస్సార్‌సీపీ ప్రజాస్వామ్య బద్ధమైన పోరాటాలు చేస్తుందని స్పష్టం చేశారు.

మహిళలు, బాలికలపై టీడీపీ అకృత్యాలు పెరిగిపోయాయి

రాష్ట్రంలో మహిళలు, బాలికలపై టీడీపీ నాయకులు, మద్దతుదారులు, అల్లరిమూకలు అత్యాచారాలకు పాల్పడుతున్నారని శైలజానాథ్ ఆందోళన వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడుగుర్రాలపల్లిలో దళిత మైనర్ బాలికపై 14 మంది నెలల తరబడి సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని, అనంతపురంలో తన్మయి అనే విద్యార్థిని హత్య చేశారని పేర్కొన్నారు. ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. తన్మయి విషయంలో ప్రారంభంలోనే పోలీసులు స్పందించి ఉంటే ఆమె బతికి ఉండేదన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులు, యువతులు, బాలికల మిస్సింగ్‌లపై స్పందించని పోలీసులు సీనియర్ జర్నలిస్టు కొమ్మినేని శ్రీనివాసరావును అరెస్టు చేయడంలో మాత్రం కరెంటు వేగంతో పనిచేసి ఆయనపై దాదాపు 50 కేసులు నమోదు చేయాలని చూస్తున్నారన్నారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన వారిని చిత్రహింసలకు గురి చేసి, కేసులు నమోదు చేస్తున్నారన్నారు. అనంతపురం అర్బన్‌లో ఓ ప్రజాప్రతినిధి తనపై హత్యాయత్నానికి పాల్పడుతున్నారని అదే పార్టీకి చెందిన వ్యక్తి ఫిర్యాదు చేస్తే ఇంతవరకు ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు.

రేణుకా చౌదరీ.. నోరు అదుపులో పెట్టుకో

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై తెలంగాణ ఎంపీ రేణుకాచౌదరి చేసిన వ్యాఖ్యలను శైలజానాథ్ ఖండించారు. రేణుకాచౌదరి నోరు అదుపులో పెట్టుకుంటే మంచిదన్నారు. షర్మిల జిల్లాలోని బాధలపై మాట్లాడాలని హితవు పలికారు. వైఎస్ భారతమ్మపై విమర్శలు సరికాదన్నారు. ఆమె ఎప్పుడైనా రాజకీయాల్లో కనిపించారా? చానల్‌లో వచ్చిన కార్యక్రమాన్ని యజమానికి ఎలా అంటగడతారని ప్రశ్నించారు.

కుట్రపూరితంగానే కొమ్మినేని అరెస్ట్

- ఏడాది పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కుట్ర
- వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కొరముట్ల శ్రీనివాసులు



సాక్షి, అమరావతి: కూటమి వైఫల్యాలను మీడియాలో ఎండగడుతున్న సీనియర్ పాత్రికేయుడు కొమ్మినేని శ్రీనివాసరావుపై రాష్ట్ర ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయించిందని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు మండిపడ్డారు. మంగళవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టీవీ డిబేట్‌లో జర్నలిస్ట్ కృష్ణంరాజు మాట్లాడిన మాటలను వైఎస్సార్‌సీపీ, సాక్షి టీవీ, వైఎస్ జగన్, ఆయన కుటుంబానికి ఆపాదిస్తూ కుట్రపూరితంగా వివాదాన్ని సృష్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏడాది పాలనా వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందన్నారు. ప్రభుత్వంపై ఎవరూ మాట్లాడకూడదనే నిరంకుశ ఆలోచనలో భాగంగానే సాక్షి మీడియా కార్యాలయాలపై దాడులు చేయిస్తున్నారన్నారు. డిబేట్ జరిగిన 24 గంటల తరువాత ఒక పథకం ప్రకారం దీనిని ఎలా వివాదం చేయాలి, దీనిలో ఎవరిపై విష ప్రచారం చేయాలనే దానిపై సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సమాచాలోచనలు చేశారని ఆరోపించారు. ఆ తరువాత లోకేశ్, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సోషల్ మీడియా ద్వారా దీనిపై రెచ్చగొట్టేలా ఒకరి తరువాత ఒకరు స్పందించడం, ఆ వెంటనే టీడీపీ శ్రేణులు ఆందోళనలు చేయడం చూస్తుంటే ఇది కుట్రేనని అర్థమవుతోందని స్పష్టం చేశారు.



కాంస్య పతకం గెలిచిన భారత షూటర్ ఇలావేనిల్

అంతర్జాతీయ షూటింగ్ క్రీడా సమాఖ్య (ఐఎస్ఎస్ఎఫ్) మూడో ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత్ కాంస్య పతకంతో ఖాతా తెరిచింది. జర్మనీలోని మ్యూనిక్‌లో మంగళవారం మొదలైన ఈ టోర్నీలో తొలి రోజు భారత్‌కు మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలో ఇలావేనిల్ వలారివన్ కాంస్య పతకాన్ని అందించింది. ఎనిమిది మంది షూటర్ల మధ్య ఎలిమినేషన్ పద్ధతిలో జరిగిన ఫైనల్లో 25 ఏళ్ల ఇలావేనిల్ 231.2 పాయింట్లు స్కోరు చేసి మూడో స్థానంలో నిలిచింది. ఓవరాల్‌గా వరల్డ్‌కప్ టోర్నీలలో ఇలావేనిల్‌కిది ఏడో పతకం కావడం విశేషం. వాంగ్ జిఫె (చైనా : 252.7 పాయింట్లు) స్వర్ణ పతకాన్ని దక్కించుకోగా... క్వాన్ యుంజీ (దక్షిణ కొరియా : 252.6 పాయింట్లు) కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. క్వాలిఫయింగ్‌లో ఇలావేనిల్ 635.9 పాయింట్లు స్కోరు చేసి రెండో స్థానంలో నిలిచింది. టాప్-8లో నిలిచిన వారికి ఫైనల్ బెర్త్ లభించింది. మరోవైపు పురుషుల 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో భారత షూటర్ వరుణ్ తోమర్ 160.3 పాయింట్లు స్కోరు చేసి ఆరో స్థానంలో నిలిచాడు. భారత ఇతర పిస్టల్ షూటర్లు నిశాంత్ రావత్ 12వ స్థానంలో, అర్జున్ సింగ్ చీమా 20వ స్థానంలో, ఆదిత్య మాల్రా 30వ స్థానంలో నిలిచారు.

నికోలస్ పూరన్ గుడ్‌బై

29 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన విండీస్ బ్యాటర్



పోర్ట్ ఆఫ్ స్పెయిన్: వెస్టిండీస్ విధ్వంసక బ్యాటర్ నికోలస్ పూరన్ 29 ఏళ్లకే అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్నాడు. వన్డేలు, అంతర్జాతీయ టి20లనుంచి తాను రిటైర్ అవుతున్నట్లు పూరన్ ప్రకటించాడు. 2016లో తొలి అంతర్జాతీయ మ్యాచ్ ఆడిన పూరన్... విండీస్ తరఫున 61 వన్డేల్లో 1983 పరుగులు, 106 టి20ల్లో 2275 పరుగులు సాధించాడు. జాతీయ జట్టు తరఫున అత్యధిక టి20లు ఆడిన, అత్యధిక పరుగులు సాధించిన రికార్డు అతని సొంతం. విండీస్ అర్హత సాధించలేకపోయిన 2023 వన్డే వరల్డ్ కప్ క్వాలిఫయర్స్ తర్వాత వన్డేలు ఆడని పూరన్... ఇటీవల ఇంగ్లండ్‌తో టి20 సిరీస్ కోసం తన పేరును పరిశీలించరాదని ముందే చెప్పేశాడు. 2024లో టి20ల్లో ఏకంగా 170 సిక్సర్లతో కొత్త రికార్డును సృష్టించిన పూరన్ 2026లో జరిగే వరల్డ్ కప్‌లో విండీస్ ప్రణాళికల్లో భాగంగా ఉన్నాడు. అయితే ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న వేర్వేరు లీగ్ టోర్నీల్లో అత్యధిక డిమాండ్ ఉన్న ఆటగాళ్లలో ఒకడైన పూరన్... లీగ్‌లకు అందుబాటులో ఉండేందుకు అంతర్జాతీయ క్రికెట్ నుంచి తప్పుకున్నాడు.

హాంకాంగ్ చేతిలో ఓడిన భారత్



కౌలూన్ (హాంకాంగ్): భారత ఫుట్‌బాల్ జట్టు మళ్లీ నిరాశపరిచింది. ఆసియా కప్-2027 క్వాలిఫయర్స్‌లో భాగంగా మంగళవారం జరిగిన మూడో రౌండ్ పోరులో భారత్ 0-1 గోల్ తేడాతో హాంకాంగ్ చేతిలో కంగుతింది. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో 127వ స్థానంలో ఉన్న భారత్ తనకన్నా దిగువ ర్యాంక్‌లో (153) ఉన్న హాంకాంగ్ జట్టుపైనా ప్రభావం చూపలేకపోయింది. ఓటమి అనంతరం భారత్ 133వ స్థానానికి పడిపోయింది. మ్యాచ్ ముగిసే ఇంజ్యూరీ సమయంలో ప్రత్యర్థికి గోల్ సమర్పించుకొని మూల్యం చెల్లించుకుంది. హాంకాంగ్ ఆటగాడు పెరీరా (90+4వ నిమిషంలో) గోల్ చేశాడు. దీంతో 'డ్రా'గా ముగియాల్సిన మ్యాచ్‌లో భారత్ అనూహ్యంగా ఓటమి పాలైంది. మార్చిలో సొంతగడ్డ (షిల్లాంగ్)పై బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ ఒక్క గోల్ అయిన నమోదు చేయకుండా 'డ్రా'గా ముగించింది. తాజా ఫలితం భారత్ ముందుకెళ్లే అవకాశాలను క్లిష్టం చేసింది. మూడో రౌండ్‌లో ప్రస్తుతం గ్రూప్ 'సి'లోని భారత్ ఆఖరి నాలుగో స్థానంలో ఉంది. ఇక మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో తప్పక గెలిచి... మెరుగైన గోల్ సగటుతో అగ్రస్థానానికి ఎగబాకితేనే సౌదీ అరేబియాలో జరిగే ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధిస్తుంది. మొత్తం నాలుగు గ్రూపుల నుంచి ఒక జట్టు మాత్రమే ముందంజ వేస్తుంది. అక్టోబర్ 9న జరిగే తదుపరి మ్యాచ్‌లో భారత్... సింగపూర్‌తో తలపడుతుంది. ప్రస్తుతం సింగపూర్ 4 పాయింట్లతో ఈ గ్రూప్‌లో అగ్రస్థానంలో ఉంది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

రెండు జట్లకు తుది 'టెస్టు'

నేటి నుంచి వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్

ఆస్ట్రేలియాతో దక్షిణాఫ్రికా 'ఢీ' ● సమరోత్సాహంతో ఇరు జట్లు

మధ్యాహ్నం 3 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

టెస్టు క్రికెట్‌లో అతి పెద్ద సమరానికి రంగం సిద్ధమైంది. సాంప్రదాయ ఫార్మాట్‌లో విశ్వ విజేతను తేల్చే వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ పోరుకు నేడు తెర లేవనుంది. డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా తమ టైటిల్‌ను నిలబెట్టుకోవాలని భావిస్తుండగా... గత 27 ఏళ్లుగా ఐసీసీ ట్రోఫీని సాధించలేకపోయిన దక్షిణాఫ్రికా ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి రికార్డును మార్చాలని పట్టుదలగా ఉంది. వరుసగా మూడోసారి ఇంగ్లండ్ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆతిథ్యం ఇస్తుండగా సౌతాంప్టన్, ఓవల్ తర్వాత ఈసారి వేదిక ప్రతిష్టాత్మక లార్డ్స్ మైదానానికి మారింది.

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 టైటిల్ వేటలో ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా హోరాహోరీ సమరానికి 'సై' అంటున్నాయి. లార్డ్స్ మైదానంలో నేటి నుంచి జరిగే ఫైనల్ పోరులో ఇరు జట్లు తలపడతాయి. 2023-25 మధ్య కాలంలో 9 జట్లు 27 సిరీస్‌లలో కలిపి మొత్తం 69 మ్యాచ్‌లలో తలపడిన అనంతరం తుది సమరానికి ఆసీస్, సఫారీ టీమ్ అర్హత సాధించాయి. ఇది మూడో డబ్ల్యూటీసీ ఫైనల్ కాగా...తొలి రెండు ట్రోఫీలను న్యూజిలాండ్, ఆస్ట్రేలియా గెలుచుకున్నాయి. రెండు సందర్భాల్లోనూ ఫైనల్ చేరి ఓడిన భారత్ ఈసారి తుది పోరుకు అర్హత పొందలేకపోయింది.

ఆసీస్ అదే జోరుతో...

ఐసీసీ ఫైనల్ మ్యాచ్‌లు అనగానే ఆస్ట్రేలియా ఆట ఒక్కసారిగా పతాక స్థాయికి చేరుతుందని గతంలో చాలాసార్లు రుజువైంది. ఆఖరి సమరంలో ప్రత్యర్థిపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడి మ్యాచ్‌ను తమ సొంతం చేసుకోవడంలో ఆ జట్టుకు తిరుగులేదు. మూడు ఫార్మాట్‌లలో కలిపి 13 ఐసీసీ ఫైనల్స్ ఆడిన కంగారూలు 10 టైటిల్స్ సాధించడం వారి ఆధిపత్యాన్ని చూపిస్తోంది. 2023లో భారత్‌పై ఫైనల్ ఆడిన తుది జట్టులోంచి 9 మంది మళ్లీ ఇక్కడా బరిలోకి దిగడం ఖాయమైంది. వార్నర్ రిటైర్ కాగా, ఆల్‌రౌండర్ వెబ్‌స్టర్‌కు చోటు దక్కింది. గాయంతో నాటి మ్యాచ్‌కు దూరమైన హాజల్‌వుడ్ ఇప్పుడు బోలండ్ స్థానంలో ఆడతాడు. ఖ్వాజాకు జోడీగా లబుషేన్ ఓపెనింగ్ చేయనుండగా, గ్రీన్ మూడో స్థానంలో ఆడతాడు. ఆల్‌టైమ్ గ్రేట్ బ్యాటర్లలో ఒకడైన స్టీవ్ స్మిత్, గత డబ్ల్యూటీసీ ఫైనల్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హెడ్ బ్యాటింగ్‌లో ప్రధాన బలం కాగా, కీపర్ అలెక్స్ కేరీ కూడా చెలరేగిపోగలడు. కమిన్స్, స్టార్క్, హాజల్‌వుడ్, లయన్‌లతో టీమ్ బౌలింగ్ పటిష్టంగా కనిపిస్తోంది.

రాత మారేనా...

దక్షిణాఫ్రికా వరుసగా గత 7 టెస్టుల్లో విజయాలు సాధించి ముందుగా ఫైనల్‌కు అర్హత సాధించినా సరే టీమ్‌పై విమర్శలు వచ్చాయి. టెస్టుల్లో అగ్రగామి అయిన ఆస్ట్రేలియా, ఇంగ్లండ్‌లాంటి టీమ్‌లతో లీగ్ దశలో ఒక్కసారి కూడా తలపడకుండానే జట్టు ఫైనల్ చేరింది. అయితే ఏ దారిలో వచ్చినా ఇప్పుడు తుది పోరులో విజేతగా నిలిచి సత్తా చాటాలని సఫారీలు భావిస్తున్నారు. అయితే జట్టులో అనుభవలేమి స్పష్టంగా కనిపిస్తోంది. మార్క్‌రమ్, కెప్టెన్ తెంబా బవుమాలకు మాత్రమే ప్రస్తుత ఆసీస్ బౌలర్లను ఎదుర్కొన్న అనుభవం ఉంది. రికెల్టన్, ముల్డర్, స్టబ్స్, బెడింగ్‌హామ్ ఇంకా టెస్టు కెరీర్ ఆరంభ దశలోనే ఉన్నారు. ఇంకా చెప్పాలంటే సఫారీ టాప్-7 బ్యాటర్లందరి టెస్టు పరుగులు కలిపినా (9,873)... ఒక్క స్మిత్ (10,271) పరుగులకంటే తక్కువే ఉన్నాయి! అయితే వైవిధ్యమైన బౌలింగ్ తో ఆసీస్‌ను కట్టడి చేయగలమని నమ్ముతోంది. ఇంగ్లండ్‌లో వాతావరణం అనుకూలిస్తే తన స్వింగ్‌తో రబాడ ప్రమాదకరమైన బౌలర్ కాగా, యాన్సెన్ లెఫ్టార్మ్ పేస్ కూడా ఇటీవల పదునెక్కింది. ఇక స్పిన్ కోసం మరోసారి దక్షిణాఫ్రికా మహరాజ్‌నే నమ్ముకుంది.

పిచ్, వాతావరణం

సాధారణ బ్యాటింగ్ పిచ్. ప్రస్తుతం ఉపఖండం తరహాలోనే వాతావరణం ఉంది. మ్యాచ్ సాగుతున్న కొద్దీ స్పిన్నర్లకు అనుకూలిస్తుంది. వర్షంతో అంతరాయం కలగవచ్చు. అయితే ఐదు రోజులలో నిర్ణీత ఓవర్లు పూర్తి కాకుండా ఫలితం రాకపోతే 'రిజర్వ్ డే' ఆరో రోజుకు మ్యాచ్ సాగుతుంది. భారత్, కివీస్ మధ్య 2021 ఫైనల్లో ఇదే జరిగింది.

తుది జట్లు (అంచనా)

ఆస్ట్రేలియా: కమిన్స్ (కెప్టెన్), ఖ్వాజా, లబుషేన్, గ్రీన్, స్మిత్, హెడ్, వెబ్‌స్టర్, కేరీ, స్టార్క్, లయన్, హాజల్‌వుడ్.

దక్షిణాఫ్రికా: బవుమా (కెప్టెన్), మార్క్‌రమ్, రికెల్టన్, ముల్డర్, స్టబ్స్, బెడింగ్‌హామ్, వెరీన్, యాన్సెన్, కేశవ్ మహరాజ్, రబాడ, ఇన్‌గిడి.



డబ్ల్యూటీసీ గదతో దక్షిణాఫ్రికా కెప్టెన్ బవుమా, ఆస్ట్రేలియా సారథి కమిన్స్

సాక్షి సినిమా

పోలీస్ స్టేషన్‌లో ఫైట్



● ఎన్టీఆర్

పోలీస్ స్టేషన్‌లో ఫైట్ చేస్తున్నారట ఎన్టీఆర్. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ హీరోగా 'డ్రాగన్' (ప్రచారం) అనే మూవీ తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ ఓ పోలీస్ స్టేషన్ సెట్‌లో జరుగుతోందని సమాచారం. పోలీస్ స్టేషన్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను దర్శకుడు ప్రశాంత్ నీల్ తెరకెక్కిస్తున్నారని, 500 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులు ఈ సీక్వెన్స్‌లో పాల్గొంటున్నారని టాక్. ఈ యాక్షన్ సీక్వెన్స్ ఈ సినిమాలో ఓ హైలైట్‌గా ఉంటుందట. ఇక ఈ చిత్రంలో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటిస్తున్నారని, మలయాళ నటుడు టొవినో థామస్ మరో కీలక పాత్రలో నటిస్తున్నారని టాక్. గుల్షన్ కుమార్, భూషణ్ కుమార్, టీ-సిరీస్ ఫిల్మ్స్ సమర్పణలో మైత్రీ మూవీ మేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై కల్యాణ్ రామ్ నందమూరి, నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది జూన్ 25న విడుదల కానుంది.

అడవిలో అన్వేషణ!



● మహేశ్‌బాబు

అడవుల్లో మహేశ్‌బాబు కళ్లు దేని కోసమో వెతుకుతున్నాయి. కొందరు నిధి కోసం అంటున్నారు. మరికొందరు ప్రాణం పోసే సంజీవిని తరహా లాంటి మొక్క కోసం అంటున్నారు. ఈ మాటలు మహేశ్‌బాబు కొత్త సినిమా గురించే. మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో అంతర్జాతీయ స్థాయిలో ఓ ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో మహేశ్‌బాబు క్యారెక్టరైజేషన్, సినిమా కథ గురించి ఎప్పటికప్పుడు కొత్త వార్తలు వస్తుండటం, సినీ ప్రేమికులు వీటిని ఆసక్తికరంగా గమనిస్తుండటం జరుగుతోంది. తాజాగా ఈ సినిమా గురించిన మరో ఆసక్తికరమైన వార్త ప్రచారంలోకి వచ్చింది. అదేంటంటే... ఈ సినిమాకు భారతీయ ఇతిహాసం రామాయణ నేపథ్యం ఉంటుందట. రామాయణంలో సంజీవని మొక్క కోసం వెతికే హనుమంతుడిని పోలిన లక్షణాలు మహేశ్‌బాబు పాత్రలో ఉంటాయని ఫిల్మ్‌నగర్ భోగట్టా. మరి... మహేశ్‌బాబు అడవిలో దేని కోసం అన్వేషిస్తున్నారో తెలియాలంటే మరికొన్ని రోజులు ఎదురుచూడక తప్పదు. ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ ఈ సినిమాకు కథ అందించారు. ఆ మధ్య ఈ సినిమా షూటింగ్ నిరవధికంగా జరిగింది. తర్వాత బ్రేక్ తీసుకున్నారు. ఈ వారంలో మళ్లీ చిత్రీకరణ మొదలవుతుందని, కాశీ నగరాన్ని తలపించే సెట్‌ని రెడీ చేయించారని, ఈ సెట్‌లోనే షెడ్యూల్ ప్రారంభం అవుతుందని తెలిసింది. రెండు వారాలకు పైగా ఇక్కడే చిత్రీకరణ జరుగుతుందట. ఇక ప్రియాంకా చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ ఈ సినిమాలో ప్రధాన పాత్రల్లో నటిస్తున్న విషయం తెలిసిందే. కేఎల్ నారాయణ నిర్మిస్తున్న ఈ చిత్రం 2027లో విడుదల కానుంది.

కుబేర నాకు ప్రత్యేకమైన సినిమా - అక్కినేని నాగార్జున



● ధనుష్, రష్మికా మందన్న, నాగార్జున

''శేఖర్ కమ్ములతో గత 15 ఏళ్లుగా సినిమా చేయాలనుకుంటున్నాను. అందుకే ఆయన 'కుబేర' సినిమా గురించి చెప్పినప్పుడు మరో ఆలోచన లేకుండా ఒప్పుకున్నాను. నాకు చాలా ప్రత్యేకమైన సినిమా ఇది. అందరూ మా చిత్రాన్ని చూసి ఎంజాయ్ చేయండి'' అని అక్కినేని నాగార్జున పేర్కొన్నారు. ధనుష్, అక్కినేని నాగార్జున లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రష్మికా మందన్న హీరోయిన్‌గా నటించగా, జిమ్ సర్భ్ కీలక పాత్ర పోషించారు. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్‌తో కలిసి ఎస్‌వీసీ ఎల్‌ఎల్‌పీపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 20న తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. దేవీశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'పీపీ డుమ్ డుమ్' అంటూ సాగే పాటని ముంబైలో లాంచ్ చేశారు. ఈ సందర్భంగా అక్కినేని నాగార్జున మాట్లాడుతూ– ''రష్మిక ఈ సినిమాలో అద్భుతంగా నటించింది. తన డబ్బింగ్ చూసిన తర్వాత ఫోన్ చేసి, అభినందించాను. దేవీశ్రీ తన సంగీతంతో సినిమాని మరో స్థాయికి తీసుకెళ్లారు. ధనుష్‌తో కలిసి పని చేయడం చాలా ఆనందంగా ఉంది'' అన్నారు. ధనుష్ మాట్లాడుతూ– ''కుబేర' నా బాల్యాన్ని గుర్తుకు తెచ్చింది. నాగార్జునగారితో కలసి పని చేయడం చాలా ఆనందాన్నిచ్చింది. ఈ సినిమా కోసం ఓ డంప్ యార్డ్‌లో దాదాపు 7 గంటల పాటు నేను, రష్మిక షూటింగ్‌లో పాల్గొన్నాం. అక్కడ అంతసేపు ఉన్నా ఆమె బాగానే ఉంది. 'నాకేం వాసన రావట్లేదు' అని చెప్పింది. మరి ఆమెకు ఏమైందో నాకు తెలియదు (నవ్వుతూ)'' అని తెలిపారు. ''నా గత సినిమాల్లోని 'గీతాంజలి, శ్రీవల్లి, మహారాణి యేసుబాయి'లానే 'కుబేర'లో చేసిన పాత్ర కూడా ప్రేక్షకులకు గుర్తుండిపోతుంది'' అన్నారు రష్మికా మందన్నా. ''ఈ సినిమా కోసం తెలుగులోనే డైలాగ్స్ చెప్పాను'' అని జిమ్ సర్భ్ చెప్పారు. ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో పుస్కూర్ రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ఉస్తాద్ యాక్షన్



● పవన్ కల్యాణ్

కొంత గ్యాప్ తర్వాత సెట్స్‌లోకి అడుగుపెట్టాడు ఉస్తాద్ భగత్ సింగ్. పవన్ కల్యాణ్ టైటిల్ రోల్ చేస్తున్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. ఈ చిత్రంలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. ఎస్. హరీష్ శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో పోలీసాఫీసర్ పాత్ర చేస్తున్నారు పవన్ కల్యాణ్. హైదరాబాద్‌లో ప్రారంభమైన ఈ సినిమా కొత్త షెడ్యూల్‌లో పవన్ కల్యాణ్ జాయిన్ అయ్యారు. ఈ షెడ్యూల్‌లో కొన్ని కీలక సన్నివేశాలతో పాటు ఓ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా తీయాలని మేకర్స్ ప్లాన్ చేశారని తెలిసింది. ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

గౌరవంగా ఉంది - కత్రినా కైఫ్



● కత్రినా కైఫ్

బాలీవుడ్ హీరోయిన్ కత్రినా కైఫ్ అరుదైన అవకాశం సొంతం చేసుకున్నారు. ప్రముఖ పర్యాటక కేంద్రంగా ప్రసిద్ధి చెందిన మాల్దీవులకు గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపికయ్యారామె. ఈ విషయాన్ని మాల్దీవ్స్ మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటకులను ఆకర్షించేందుకు 'విజిట్ మాల్దీవ్స్' పేరుతో ప్రత్యేక సమ్మర్ సేల్ ప్రచారాన్ని ప్రారంభించింది మాల్దీవ్స్ దేశం. అందులో భాగంగానే అంతర్జాతీయ స్థాయిలో హీరోయిన్‌గా మంచి గుర్తింపు ఉన్న భారతీయ నటి కత్రినా కైఫ్‌ను తమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంపిక చేసినట్లు తెలిసింది. ''భారత చలన చిత్ర పరిశ్రమలో ప్రముఖ నటి అయిన కత్రినా కైఫ్‌ను మాల్దీవులకు గ్లోబల్ బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించడం పట్ల మేం చాలా సంతోషంగా ఉన్నాం'' అంటూ 'మాల్దీవ్స్ మార్కెటింగ్ అండ్ పబ్లిక్ రిలేషన్స్ కార్పొరేషన్' సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. అలాగే తన నియామకం పట్ల కత్రినా కైఫ్ ఆనందం వ్యక్తం చేశారు. ''మాల్దీవులు లగ్జరీ, సహజ సౌందర్యానికి, ప్రశాంతతకు నిలయం. అలాంటి మాల్దీవులకి నేను బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రాతినిధ్యం వహించనుండటం ఎంతో సంతోషంగా, గౌరవంగా భావిస్తున్నాను. మాల్దీవులు ప్రపంచ స్థాయిలో మరింత పేరు పొందేలా సహాయపడటానికి, పర్యాటకులను పెంచేందుకు నా వంతు కృషి చేస్తాను'' అని కత్రినా కైఫ్ పేర్కొన్నారు.

హారర్... థ్రిల్



● మనోజ్ కుమార్, ఆశితా రెడ్డి

మనోజ్ కుమార్, ఆశితా రెడ్డి జంటగా రమణమూర్తి తంగెళ్లపల్లి నిర్మించిన చిత్రం 'నిశ్శబ్ద'. శ్రీనివాస్, ఎం. సంధ్యా రాణి నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. మంగళవారం నిర్మాత శ్రీనివాస్ పుట్టినరోజు సందర్భంగా 'నిశ్శబ్ద' టీజర్ లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించారు. ఈ వేడుకకి ముఖ్య అతిథులుగా హాజరైన యువ హీరోలు కృష్ణ, సంజయ్ మాట్లాడుతూ– ''టీజర్ చాలా బాగుంది. సినిమాని సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాం'' అన్నారు. ''బలమైన కంటెంట్‌తో క్లీన్ హారర్ మూవీగా మా 'నిశ్శబ్ద' ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది'' అన్నారు మనోజ్ కుమార్. రమణమూర్తి తంగెళ్లపల్లి మాట్లాడుతూ– ''ఈ హారర్ థ్రిల్లర్ సినిమా కోసం సాయంత్రం 6 గంటల నుంచి ఉదయం 5 వరకు షూటింగ్ చేసేవాళ్లం'' అని తెలిపారు. ''మా బ్యానర్‌లో మరో నాలుగైదు సినిమాలు నిర్మాణంలో ఉన్నాయి'' అని శ్రీనివాస్, ఎం. సంధ్యా రాణి పేర్కొన్నారు.

పోరు ఉంది



● సల్మాన్ ఖాన్, షారుక్ ఖాన్

వైఆర్ఎఫ్ (యశ్ రాజ్ ఫిల్మ్స్) స్పై యూనివర్స్‌లో భాగంగా ఇప్పటివరకు సల్మాన్ ఖాన్ హీరోగా చేసిన 'ఏక్తా టైగర్' (2012), 'టైగర్ జిందా హై' (2017), 'టైగర్ 3' (2023), హృతిక్ రోషన్ 'వార్' (2019), షారుక్ ఖాన్ 'పఠాన్' (2023) వంటి సినిమాలు సూపర్ హిట్స్‌గా నిలిచాయి. ఈ యూనివర్స్‌లోనే హృతిక్ రోషన్ - ఎన్టీఆర్ హీరోలుగా చేసిన 'వార్ 2', ఆలియా భట్ - శర్వారీ లీడ్ రోల్స్ చేసిన 'ఆల్ఫా' చిత్రం రిలీజ్‌కు సిద్ధమౌతున్నాయి. 'వార్ 2' సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది. 'ఆల్ఫా' చిత్రం ఈ ఏడాది డిసెంబరు 25న విడుదల కానుంది. కాగా... రెండు సంవత్సరాలుగా ఈ 'వైఆర్ఎఫ్' స్పై యూనివర్స్‌లో భాగంగానే 'పఠాన్ వర్సెస్ టైగర్' చిత్రం రానుందని, ఈ మూవీలో షారుక్ ఖాన్, సల్మాన్ ఖాన్ హీరోలుగా చేస్తారని, అలాగే 'పఠాన్ వర్సెస్ టైగర్' సినిమాలో ఈ యూనివర్స్‌లో భాగమైన హృతిక్ రోషన్, జాన్ అబ్రహాం, ఆలియా భట్, ఎన్టీఆర్ గెస్ట్ రోల్స్‌లో కనిపిస్తారనే ప్రచారం జరుగుతోంది. భారీ బడ్జెట్‌తో రూపొందనున్న ఈ సినిమాని 'వార్, పఠాన్' సినిమాలకు దర్శకత్వం వహించిన సిద్ధార్థ్ ఆనంద్ తెరకెక్కిస్తారనే టాక్ బాలీవుడ్‌లో వినిపిస్తోంది. దీంతో ఈ సినిమాపై అంచనాలు ఏర్పడ్డాయి. కానీ హఠాత్తుగా 'పఠాన్ వర్సెస్ టైగర్' చిత్రం ఆగిపోయిందనే టాక్ తెరపైకి వచ్చింది. కానీ అలాంటిది ఏమీ లేదని, 'వార్ 2', 'ఆల్ఫా' చిత్రాలు విడుదలైన తర్వాత 'పఠాన్ వర్సెస్ టైగర్' సినిమా గురించి ఓ స్పష్టత వస్తుందని జాతీయ ఆంగ్ల మీడియాలో వార్తలు వస్తున్నాయి. దీంతో సిల్వర్ స్క్రీన్‌పై 'పఠాన్-టైగర్'ల పోరు ఉంటుందని, కాకపోతే కొంత సమయం పడుతుందని తెలుస్తోంది.

స్టాక్ మార్కెట్లు (తెల్లవారి రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ △
53	1
82,392	25,104

విదేశీ సూచీలు

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	19,662	△	71
డోజోన్స్	42,902	△	141
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,853	△	21
డాక్స్	24,304	▽	187
షాంఘై	3,384	▽	15
నికాయ్	38,211	△	123

• అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	82.20	86.22
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.60	117.56
€	యూరో	ఎస్‌బీఐ	96.38	99.09
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.43	59.96
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	54.84	57.06
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.11	68.78
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.93	23.44
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.41	24.19
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.03	12.86

వేగంగా రిఫండ్‌లు

- కేవైసీ ప్రక్రియలను క్రమబద్ధీకరించండి
- ఆర్థిక మంత్రి సీతారామన్ సూచన

ముంబై: క్లెయిమ్ చేయకుండా ఉండిపోయిన డిపాజిట్‌లు, షేర్లు, డివిడెండ్‌లు, బీమా, పెన్షన్ నిధులను తిరిగి చెల్లించడాన్ని (రిఫండ్‌లు) వేగవంతం చేయాలని నియంత్రణ సంస్థలు, శాఖలను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. అలాగే, కేవైసీ ప్రక్రియల క్రమబద్ధీకరణకు చర్యలు తీసుకోవాలని సూచించారు.



29వ ఆర్థిక స్థిరత్వం, అభివృద్ధి మండలి (ఎఫ్ఎస్‌డీసీ) సమావేశాన్ని ఉద్దేశించి మంత్రి మాట్లాడారు. సామాన్య పౌరుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని, అర్హత కలిగిన వారికి రిఫండ్‌లను వేగంగా ప్రాసెస్ చేయాలని కోరారు. ఇందు కోసం జిల్లా స్థాయిల్లో ప్రత్యేక క్యాంపులను నిర్వహించాలని ప్రతిపాదించారు. ఆర్‌బీఐ, సెబీ, ఎంసీఏ, పీఎఫ్ఆర్‌డీఏ, ఐఆర్‌డీఏఐ, బ్యాంక్‌లు, పెన్షన్ ఏజెన్సీలు, ఇన్సూరెన్స్ కంపెనీల సహకారంతో దీన్ని చేపట్టాలని కోరారు. ఆర్థిక రంగం అంతటా సులభతర కేవైసీ విధానానికి వీలుగా చర్యలు తీసుకోవాలని ఎఫ్ఎస్‌డీసీకి సూచించారు. ఉమ్మడి కేవైసీ నిబంధనలతోపాటు సులభతర, డిజిటల్ కేవైసీ అవసరాన్ని ప్రస్తావించారు.

8 నగరాల్లో ఆల్‌కార్గో గతి ఎయిర్ డెలివరీ సేవలు



ముంబై: లాజిస్టిక్స్, సప్లై చెయిన్ సంస్థ ఆల్‌కార్గో గతి తమ 24 గంటల ఎయిర్ డెలివరీ సేవలను హైదరాబాద్‌తో పాటు బెంగళూరు, ముంబై, చెన్నై సహా ఎనిమిది కీలక మెట్రో నగరాల్లో ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 34 కమర్షియల్ విమానాశ్రయాలతో కనెక్టివిటీ ద్వారా ఫార్మా, ఎలక్ట్రానిక్స్, గార్మెంట్స్, ఆటోమొబైల్, రిటైల్ తదితర రంగాలకు భారీ పరిమాణంలో అవసరమయ్యే లాజిస్టిక్స్ సర్వీసులు అందించనున్నట్లు సంస్థ తెలిపింది. ఎయిర్ ఎక్స్‌ప్రెస్ సర్వీసు కింద లేట్ కటాఫ్, లేట్ పికప్‌లు, మరుసటి రోజు డెలివరీలాంటి ఆప్షన్లు అందుబాటులో ఉంటాయని వివరించింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..
ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్ డీలా..! | భారత్ వృద్ధి 6.3 శాతమే ప్రపంచ బ్యాంక్ అంచనా

డివిడెండ్ ధమాకా!

2024-25లో రికార్డ్
- ఇన్వెస్టర్లకు రూ.5 లక్షల కోట్లు చెల్లింపు
- వార్షికంగా 11 శాతం అప్
- షేర్ల బైబ్యాక్‌పట్ల కంపెనీల విముఖత

లిస్టెడ్ కంపెనీలు దేశీయంగా వాటాదారులకు గత ఆర్థిక సంవత్సరం(2024–25)లో రూ. 5 లక్షల కోట్లు డివిడెండ్‌గా చెల్లించాయి. ఇది సరికొత్త రికార్డ్‌కాగా.. వార్షికంగా ఇది 11 శాతం అధికం! అయితే గత ఐదేళ్లలో లేనివిధంగా గతేడాది వాటాదారులకు చెల్లింపులు నెమ్మదించడం గమనార్హం!

– సాక్షి, బిజినెస్ డెస్క్

ప్రపంచవ్యాప్త అనిశ్చితులు, మందగమన పరిస్థితుల మధ్య గతేడాది లిస్టెడ్ కార్పొరేట్ సంస్థల ఆదాయం, నికర లాభాలు మందగించాయి. అయినప్పటికీ వాటాదారులకు డివిడెండ్ రూపేణా లాభాల్లో వాటాను పంచడంలో సరికొత్త రికార్డ్ నమోదైంది. లిస్టెడ్ కంపెనీలు ఉమ్మడిగా గతేడాది రూ. 5 ట్రిలియన్లు డివిడెండ్‌గా చెల్లించాయి. అంతక్రితం ఏడాది (2023–24)లో వాటాదారులు అందుకున్న డివిడెండ్ రూ. 4.52 లక్షల కోట్లే. గతేడాది దేశీ లిస్టెడ్ కంపెనీల నికర లాభం (నష్టాలు, అనుకోని లాభాలను సర్దుబాటు చేశాక) 5 శాతం పైగా ఎగసి రూ. 16 లక్షల కోట్లను తాకాయి. అంతక్రితం ఏడాది రూ. 15.21 ట్రిలియన్లుగా నమోదైంది. బీఎస్‌ఈలో లిస్టయిన 1,218 ప్రధాన కంపెనీలను పరిగణనలోకి తీసుకున్న గణాంకాలివి! గతేడాది ఉమ్మడిగా నికర అమ్మకాలు (ఫైనాన్షియల్ సంస్థలైతే వడ్డీ ఆదాయం) 7.5% పుంజుకుని రూ.166.4 ట్రిలియన్లకు చేరాయి. అంతక్రితం ఇవి రూ.154.83 లక్షల కోట్లు.

బైబ్యాక్‌ల వెనకడుగు


సొంత ఈక్విటీ షేర్ల కొనుగోలు(బైబ్యాక్)లో గతేడాది నామమాత్ర(1.2 శాతం) వృద్ధి మాత్రమే నమోదైంది. బైబ్యాక్‌లతో కలిపి వాటాదారులకు కంపెనీలు రూ. 5.08 ట్రిలియన్లు చెల్లించాయి. అంతక్రితం ఏడాదిలో ఇది రూ. 5.03 లక్షల కోట్లుకాగా.. గతేడాది షేర్ల బైబ్యాక్‌పై లిస్టెడ్ కంపెనీలు రూ. 8,034 కోట్లు వెచ్చించాయి. బైబ్యాక్‌లు తగ్గడంతో వార్షికంగా చెల్లింపుల నిష్పత్తి 33 శాతం నుంచి 32 శాతానికి క్షీణించింది. అయితే గత దశాబ్ద కాలాన్ని పరిగణిస్తే లిస్టెడ్ కంపెనీలు బైబ్యాక్‌లు, డివిడెండ్లపై వార్షిక నికర లాభాల్లో 40 శాతం వరకూ వాటాదారులకు చెల్లించాయి. ప్రధానంగా ఐటీ దిగ్గజాలు బైబ్యాక్‌లపై నగదు వెచ్చింపును తగ్గించడం ఇటీవల ప్రభావం చూపుతున్నట్లు నిపుణులు పేర్కొన్నారు. మరోపక్క ఇతర రంగాలలోని కంపెనీలు విస్తరణ కోసం నగదును కేటాయించడంతో ఇటీవల డివిడెండ్ల చెల్లింపులపై ప్రతికూల ప్రభావం పడినట్లు తెలియజేశారు.

అధిక డివిడెండ్ బాటలో..

కంపెనీ పేరు	డివిడెండ్ రూ. కోట్లలో	వార్షిక మార్పు(%)
టీసీఎస్	45,612	73
ఐటీసీ	17,958	5
ఇన్ఫోసిస్	17,828	-6
వేదాంతా	17,009	55
హెచ్‌డీఎఫ్‌సీ	16,835	14
కోల్ ఇండియా	16,331	4
హెచ్‌సీఎల్ టెక్	16,290	15
ఓఎన్‌జీసీ	15,411	0
ఎస్‌బీఐ	14,190	16
హెచ్‌యూఎల్	12,455	26

లాభాలు ఓకే

గత రెండేళ్లలో డివిడెండ్ చెల్లింపులు 7 శాతానికి పరిమితమైనప్పటికీ కంపెనీల లాభాల్లో 16 శాతం పురోగతి నమోదైనట్లు విశ్లేషకులు తెలియజేశారు. గతేడాది షేర్ల బైబ్యాక్‌పై లిస్టెడ్ కంపెనీలు గత 9ఏళ్లలోనే కనిష్టంగా నిధులు వెచ్చించినట్లు వెల్లడించారు. 2017–18లో అత్యధికంగా 22% నగదును బైబ్యాక్‌కు కేటాయించాయి. 2024–25లో ఇది 1.6 శాతానికి పరిమితమైంది.



దిగ్గజాల తీరిలా

గరిష్ఠ డివిడెండ్లు చెల్లించే లిస్టెడ్ దిగ్గజాలలో టాటా గ్రూప్ సంస్థ టీసీఎస్ గతేడాది 73 శాతం అధికంగా రూ. 45,612 కోట్ల డివిడెండ్ చెల్లించింది. దీంతో వరుసగా రెండో ఏడాది(2024–25)లోనూ టాప్‌చెయిర్‌ను అలంకరించింది. అయితే బైబ్యాక్‌కు నో చెప్పింది. ఈ బాటలో ఎఫ్ఎంసీజీ దిగ్గజం ఐటీసీ రూ. 17,958 కోట్లు, ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ రూ. 17,828 కోట్లు వెచ్చించాయి. టాప్–10 జాబితాలో రూ. 17,009 కోట్లతో వేదాంతా, రూ.16,835 కోట్లతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, రూ.16,331 కోట్లతో పీఎస్‌యూ దిగ్గజం కోల్ ఇండియా, రూ.16,290 కోట్లతో హెచ్‌సీఎల్ టెక్, రూ.15,411 కోట్లతో ఓఎన్‌జీసీ, రూ.14,190 కోట్లతో ఎస్‌బీఐ, రూ.12,455 కోట్లతో హెచ్‌యూఎల్ నిలిచాయి. వెరసి టాప్–10 కంపెనీలు ఉమ్మడిగా రూ. 1.9 లక్షల కోట్లు డివిడెండ్‌గా చెల్లించాయి.

డిజిటల్ చెల్లింపుల జోరు



- ప్రపంచ దృష్టిని ఆకర్షిస్తున్న పేమెంట్స్ వ్యవస్థ
- మార్చిలో రూ. 24.77 లక్షల కోట్ల యూపీఐ లావాదేవీలు

న్యూఢిల్లీ: యావత్ ప్రపంచం దృష్టిని ఆకర్షించే విధంగా దేశీయంగా డిజిటల్ చెల్లింపుల జోరు కొనసాగుతోంది. ఈ ఏడాది మార్చిలో యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ద్వారా రూ. 24.77 లక్షల కోట్లు విలువ చేసే 1,830.151 కోట్ల లావాదేవీలు నమోదయ్యాయి. ప్రస్తుతం యూపీఐ సిస్టంను 46 కోట్ల మంది పైగా వ్యక్తులు, 6.5 కోట్లకు పైగా వ్యాపారులు ఉపయోగిస్తున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ సారథ్యంలో ఎన్‌డీఏ ప్రభుత్వం 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా విడుదల చేసిన బుక్‌లెట్‌లో కేంద్రం ఈ విషయాలు తెలిపింది. అత్యంత తక్కువ మొత్తంతో కూడుకున్న లావాదేవీలకు కూడా ప్రస్తుతం ప్రజలు డిజిటల్ చెల్లింపుల విధానాన్ని ఉపయోగిస్తున్నట్లు, మొత్తం పేమెంట్లలో దాదాపు 50 శాతం వాటా వీటిదే ఉంటున్నట్లు వివరించింది. ఇక నగదు బదిలీ (డీబీటీ) వంటి స్కీములను ప్రస్తావిస్తూ పారదర్శకతను పెంచేందుకు, గవర్నెన్స్ లోపాలను అరికట్టేందుకు ప్రభుత్వం టెక్నాలజీ, డిజిటల్ సాధనాలను సమర్ధవంతంగా ఉపయోగిస్తోందని బుక్‌లెట్ పేర్కొంది. వివిధ సంక్షేమ పథకాల్లో డీబీటీ, ఆధార్ ధ్రువీకరణను ప్రవేశపెట్టడంతో లక్షల కొద్దీ బోగస్ లబ్ధిదారుల సంఖ్య తగ్గిపోయిందని, ప్రభుత్వానికి భారీగా ఆదా కావడంతో పాటు ప్రజలకు సకాలంలో ప్రయోజనాలు అందుతున్నాయని వివరించింది. 2015 నుంచి 2023 మార్చి మధ్య కాలంలో డీబీటీ కారణంగా రూ. 3.48 లక్షల కోట్లు ఆదా అయినట్లు పేర్కొంది. గత 11 ఏళ్లలో కోట్లాది మంది ప్రజలకు బ్యాంక్ ఖాతాలు, బీమా వంటి ప్రాథమిక సదుపాయాలు అందుబాటులోకి వచ్చినట్లు వివరించింది. 55.22 కోట్ల జన్ ధన్ ఖాతాలు తెరవగా, పీఎం సురక్షా బీమా యోజన కింద 51 కోట్ల మందికి కవరేజీ దక్కినట్లు బుక్‌లెట్ తెలిపింది.

ఇంధన, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ

మిశ్రమంగా ముగిసిన సూచీలు



ముంబై: ఇంధన, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణతో స్టాక్ సూచీల నాలుగు రోజుల వరుస ర్యాలీకి మంగళవారం బ్రేక్ పడింది. అధిక వెయిటేజీ రిలయన్స్ ఇండస్ట్రీస్(–0.69%), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు(–0.64%), ఐసీఐసీఐ బ్యాంకు(–0.85%) షేర్ల పతనంతో పాటు అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న బలహీన సంకేతాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. సెన్సెక్స్ 53 పాయింట్ల నష్టంతో 82,392 వద్ద స్థిరపడింది. నిఫ్టీ ఒక పాయింటు స్వల్ప లాభంతో 25,104 వద్ద నిలిచింది. ట్రేడింగ్ ఆరంభంలో సెన్సెక్స్ 236 పాయింట్లు బలపడి 82,681 వద్ద, నిఫ్టీ 95 పాయింట్లు ఎగసి 25,199 వద్ద ఇంట్రాడే గరిష్టాలు తాకాయి. విదేశీ పెట్టుబడుల పునరాగమనంతో డాలర్ మారకంలో రూపాయి విలువ 9 పైసలు బలపడి 85.57 స్థాయి వద్ద ముగిసింది. అమెరికా చైనాల మధ్య లండన్‌లో జరుగుతున్న వాణిజ్య చర్చల నేపథ్యంలో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు బలహీనంగా ట్రేడవుతున్నాయి.

- బీఎస్‌ఈలో రంగాల వారీగా రియల్టీ 1%, టెలికం 0.55%, ఫైనాన్షియల్ 0.46%, సర్వీసెస్ 0.21%, కన్జూమర్ డిస్క్రీషనరీ 0.16 శాతం నష్టపోయాయి. నష్టాల మార్కెట్లోనూ ఐటీ, వినిమయ, విద్యుత్, టెక్, హెల్త్‌కేర్, కమోడిటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

భవిత
స్పర్ధయా వర్ధతే విద్య

జాబ్ పాయింట్

ఎన్‌పీసీఐఎల్, కాక్రపర్ గుజరాత్ సైట్‌లో 197 పోస్టులు

న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) గుజరాత్ కాక్రపర్ సైట్‌లో వివిధ విభాగాల్లో స్టైపెండరీ ట్రైనీస్/సైంటిఫిక్ అసిస్టెంట్, టెక్నీషియన్, అసిస్టెంట్ గ్రేడ్–1 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 197.
» **పోస్టుల వివరాలు:** స్టైపెండరీ ట్రైనీస్/సైంటిఫిక్ అసిస్టెంట్–11, స్టైపెండరీ ట్రైనీస్/టెక్నీషియన్–166, అసిస్టెంట్ గ్రేడ్–1(హెచ్‌ఆర్, ఎఫ్–ఏ, సీ–ఎంఎం)–20.
» **విభాగాలు:** మెకానికల్, కెమికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్, కెమిస్ట్రీ, ఫిజిక్స్, వెల్డర్, మెషినిస్ట్, ఏసీ మెకానిక్, డీజిల్ మెకానిక్.
» **అర్హత:** కనీసం 60 శాతం మార్కులతో పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో హెచ్‌ఎస్‌సీ(10+2), పదో తరగతి, డిప్లొమా, బీఎస్సీ ఉత్తీర్ణులవ్వాలి. **వయసు:** సైంటిఫిక్ అసిస్టెంట్‌కు 18 నుంచి 25 ఏళ్లు, టెక్నీషియన్‌కు 18 నుంచి 24 ఏళ్లు, అసిస్టెంట్ గ్రేడ్–1 పోస్టులకు 21 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు సైంటిఫిక్ అసిస్టెంట్‌కు రూ.35,400, టెక్నీషియన్‌కు రూ.21,700, అసిస్టెంట్ గ్రేడ్1 పోస్టులకు రూ.25,500.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(స్టేజ్–1, స్టేజ్–2), స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 17.06.2025
» **వెబ్‌సైట్:** https://npcilcareers.co.in

మజ్‌గావ్ డాక్‌లో 523 ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీలు

ప్రభుత్వ రంగ సంస్థ ముంబయిలో మజ్‌గావ్ డాక్‌షిప్ బిల్డర్స్ లిమిటెడ్... ట్రేడ్ అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

» **ట్రేడ్ అప్రెంటిస్(గ్రూప్ ఏ, బీ, సీ) ఖాళీల సంఖ్య:** 523
» **ట్రేడ్‌లు:** ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, పైప్ ఫిట్టర్, స్ట్రక్చరల్ ఫిట్టర్, ఐసీటీఎస్ఎం, ఎలక్ట్రానిక్ మెకానిక్, ఆర్ఏసీ, వెల్డర్, సీవోపీఏ, కార్పెంటర్, రిగ్గర్, వెల్డర్(గ్యాస్ అండ్ ఎలక్ట్రిక్).
» **అర్హతలు:** ఖాళీని అనుసరించి ఎనిమిదో తరగతి, పదో తరగతి, ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.10.2025 నాటికి గ్రూప్ ఏకు 15–19 ఏళ్లు, గ్రూప్ బీకు 16–21 ఏళ్లు, గ్రూప్ సీకి 14–18 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, స్కిల్/ట్రేడ్ టెస్ట్, సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 30.06.2025
» **ఆన్‌లైన్ పరీక్ష తేది:** 02.08.2025
» **వెబ్‌సైట్:** www.mazagondock.in

రైల్‌టెల్ కార్పొరేషన్ లిమిటెడ్, న్యూఢిల్లీలో 48 పోస్టులు

న్యూఢిల్లీలోని రైల్‌టెల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(రైల్‌టెల్).. వివిధ విభాగాల్లో అసిస్టెంట్ మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 48.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్–30, డిప్యూటీ మేనేజర్–18.
» **విభాగాలు:** సిగ్నలింగ్, మార్కెటింగ్, ఫైనాన్స్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఎస్సీ, బీటెక్/బీఈ, డిప్లొమా, ఎంబీఏ/పీజీడీఎం, పీజీ డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 30.06.2025 నాటికి అసిస్టెంట్ మేనేజర్‌కు 21 నుంచి 28 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 21 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు అసిస్టెంట్ మేనేజర్‌కు రూ.30,000 నుంచి రూ.1,20,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ.40,000 నుంచి రూ.1,40,000
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**30.06.2025
» **వెబ్‌సైట్:** www.railtel.in

ఇస్రోలో 320 సైంటిస్ట్ ఉద్యోగాలు



- రాత పరీక్ష, ఇంటర్వ్యూలో ప్రతిభ ఆధారంగా ఎంపిక

ఇంజనీరింగ్ అభ్యర్థులకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఇస్రో.. 320 సైంటిస్ట్/ఇంజనీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఎలక్ట్రానిక్స్, మెకానికల్, కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎంపికైతే ప్రారంభంలోనే ఆకర్షణీయ వేతనాలు అందుకోవచ్చు.

- **మొత్తం పోస్టుల సంఖ్య: 320**

పోస్టుల వివరాలు

» సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(ఎలక్ట్రానిక్స్)–113 పోస్టులు; » సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(మెకానికల్)–160 పోస్టులు; » సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(కంప్యూటర్ సైన్స్)–44 పోస్టులు; » సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(ఎలక్ట్రానిక్స్)–పీఆర్‌ఎల్–2 పోస్టులు; » సైంటిస్ట్/ఇంజనీర్ ఎస్‌సీ(కంప్యూటర్ సైన్స్)–పీఆర్‌ఎల్–1 పోస్టు

అర్హతలు

✦ కనీసం 65 శాతం మార్కులతో ఎలక్ట్రానిక్స్/మెకానికల్ ఇంజనీరింగ్/కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో బీఈ/బీటెక్ లేదా తత్సమాన ఉత్తీర్ణత ఉండాలి. 2024–25 విద్యాసంవత్సరంలో అర్హత కోర్సు పూర్తి చేసుకోనున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే వీరు 31.08.2025 నాటికి సర్టిఫికెట్లు కలిగి ఉండాలి. ✦ **వయసు:** 16.06.2025 నాటికి 28 ఏళ్లకు మించకూడదు.

ఎంపిక ప్రక్రియ

రాత పరీక్ష, ఇంటర్వ్యూల్లో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. రాత పరీక్ష వంద మార్కులకు, ఇంటర్వ్యూ వంద మార్కులకు ఉంటాయి.

పరీక్ష విధానం

రాత పరీక్ష మొత్తం వంద మార్కులకు పార్ట్ ఏ, పార్ట్ బీలుగా ఉంటుంది.

✦ పార్ట్ ఏలో అభ్యర్థి ఎంచుకున్న విభాగం నుంచి 80 ఆబ్జెక్టివ్ తరహా (ఎంసీక్యూస్) ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సరైన సమాధానానికి ఒక మార్కు కేటాయిస్తారు. ప్రతి పొరపాటు సమాధానానికి 1/3 మార్కులు తగ్గిస్తారు. అదేవిధంగా పార్ట్ బీలో అప్టిట్యూడ్/ఎబిలిటీ టెస్టు నుంచి 20 మార్కులకు 15 ప్రశ్నలు అడుగుతారు. ఇందులో నెగిటివ్ మార్కుల నిబంధన లేదు. ఈ ఆబ్జెక్టివ్ రాత పరీక్షకు కేటాయించిన సమయం 120 నిమిషాలు.

✦ రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు ఐదుగురిని చొప్పున(1:5 నిష్పత్తి) ఇంటర్వ్యూకు పిలుస్తారు. ఈ ఇంటర్వ్యూ వంద మార్కులకు ఉంటుంది. ఇంటర్వ్యూలో టెక్నికల్ నాలెడ్జ్(అకడెమిక్)–40 మార్కులు, జనరల్ అవేర్‌నెస్–20 మార్కులు, ప్రజంటేషన్/కమ్యూనికేషన్ స్కిల్స్–20 మార్కులు, కాంప్రహెన్షన్–10 మార్కులు, అకడెమిక్ ప్రతిభకు 10 మార్కులు కేటాయిస్తారు.

✦ ఈ ఎంపిక ప్రక్రియలో అర్హత సాధించాలంటే జనరల్ అభ్యర్థులు రాత పరీక్షలో కనీసం 50 శాతం మార్కులు, ఇంటర్వ్యూలో కనీసం 50 శాతం మార్కులు సాధించాలి. మొత్తంగా కనీసం 60 శాతం మార్కులు స్కోర్ చేయాలి. రాత పరీక్ష మార్కులకు 50 శాతం వెయిటేజీ, ఇంటర్వ్యూ మార్కులకు 50 శాతం వెయిటేజీ కల్పించి తుది ఎంపికను ఖరారు చేస్తారు.

ముఖ్య సమాచారం

✦ దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
✦ ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది: 16.06.2025
✦ వెబ్‌సైట్: https://www.isro.gov.in

సెంట్రల్ బ్యాంక్‌లో అప్రెంటిస్

ప్రముఖ ప్రభుత్వ రంగ బ్యాంకు.. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(సీబీఐ) అప్రెంటిస్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా దేశవ్యాప్తంగా ఉన్న బ్యాంక్ బ్రాంచ్‌ల్లో మొత్తం 4500 అప్రెంటిస్ నియామకాలు జరుపనుంది. డిగ్రీ ఉత్తీర్ణులై బ్యాంకింగ్ రంగంలో కెరీర్ కోరుకునే వారికి ఇది చక్కటి అవకాశం. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో ఏడాది అప్రెంటిస్ శిక్షణ ద్వారా ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకుల్లో ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అప్రెంటిస్ ఖాళీలు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, శిక్షణ, స్టైపెండ్ తదితర వివరాలు..

» 4500 అప్రెంటిస్ ఖాళీలతో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నోటిఫికేషన్
» ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణతతో దరఖాస్తుకు అవకాశం
» ఎంపికైతే ఏడాది శిక్షణ, నెలకు రూ.15వేల స్టైపెండ్

- మొత్తం అప్రెంటిస్ ఖాళీల సంఖ్య: 4500
- శిక్షణ వ్యవధి: 12 నెలలు
- స్టైపెండ్: నెలకు రూ.15వేలు

అర్హతలు

- కేంద్ర ప్రభుత్వ గుర్తింపు ఉన్న యూనివర్సిటీ నుంచి ఏదైనా విభాగంలో డిగ్రీ ఉత్తీర్ణత లేదా తత్సమాన అర్హత ఉండాలి. 01.01.2021 తర్వాత డిగ్రీ పూర్తిచేసిన అభ్యర్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.
- ఎన్ఏటీఎస్(నేషనల్ అప్రెంటిస్ ట్రైనింగ్ స్కీమ్) పోర్టల్‌లో తప్పనిసరిగా పేరు నమోదు చేసుకొని ఉండాలి.

వయసు

31.05.2025 నాటికి వయసు 20 నుంచి 28 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

ఆన్‌లైన్ రాత పరీక్ష, సంబంధిత రాష్ట్ర లోకల్ లాంగ్వేజ్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపిక చేస్తారు.

రాత పరీక్ష విధానం

వంద మార్కులకు ఆబ్జెక్టివ్ తరహా ఆన్‌లైన్ రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 15 ప్రశ్నలు–15 మార్కులు, లాజికల్ రీజనింగ్ 15 ప్రశ్నలు–15 మార్కులు, కంప్యూటర్ నాలెడ్జ్ 15 ప్రశ్నలు–15 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 15 ప్రశ్నలు–15 మార్కులు, బేసిక్ రిటైల్ ప్రొడక్ట్స్ 10 ప్రశ్నలు–10 మార్కులు, బేసిక్ రిటైల్ అసెట్ ప్రొడక్ట్స్ 10 ప్రశ్నలు–10 మార్కులు, బేసిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రొడక్ట్స్ 10 ప్రశ్నలు–10 మార్కులు, బేసిక్ ఇన్సూరెన్స్ ప్రొడక్ట్స్ 10 ప్రశ్నలు–10 మార్కులకు ఉంటాయి. పరీక్ష వ్యవధి 60 నిమిషాలు. ఈ పరీక్షలో నెగిటివ్ మార్కుల నిబంధన లేదు.

లోకల్ లాంగ్వేజ్ టెస్ట్

అభ్యర్థులు ఎంచుకున్న రాష్ట్ర స్థానిక భాషలో చదవడం, రాయడం, మాట్లాడటం, అవగాహన చేసుకోవడం వచ్చి ఉండాలి. సదరు ప్రాంతీయ భాషపై అభ్యర్థికి ఉన్న అవగాహనను పరీక్షించేలా లోకల్ లాంగ్వేజ్ టెస్ట్‌ను నిర్వహిస్తారు.

అసెస్‌మెంట్ టెస్ట్

ఆన్‌లైన్ రాత పరీక్షలో మెరిట్‌తోపాటు లోకల్ లాంగ్వేజ్ టెస్ట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి అప్రెంటిస్‌షిప్‌కు ఎంపిక చేస్తారు. ఇలా ఎంపికైన వారికి బ్యాంక్ బ్రాంచ్‌ల్లో బ్యాంకింగ్ ప్రొడక్ట్స్, ప్రాక్టీసెస్, ప్రాసెస్‌లపై 12 నెలలపాటు శిక్షణ ఇస్తారు. ఈ శిక్షణ పూర్తయిన తర్వాత అసెస్‌మెంట్ టెస్ట్‌ను నిర్వహిస్తారు. అసెస్‌మెంట్ టెస్ట్‌లో ఉత్తీర్ణులకు నిబంధనల మేరకు సర్టిఫికెట్ జారీచేస్తారు.



ముఖ్య సమాచారం

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ముందుగా నాట్స్ పోర్టల్ ద్వారా తమ పేరు నమోదు చేసుకోవాలి. అనంతరం సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అప్రెంటిస్ లింక్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలి.

- ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేది: 23.06.2025
- ఆన్‌లైన్ రాత పరీక్ష తేదీ: 2025, జూలై మొదటి వారం
- పూర్తి వివరాలు, దరఖాస్తుకు వెబ్‌సైట్: https://nats.education.gov.in/, www.centralbankofindia.co.in/en

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం– సోషల్ మెథడ్స్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–రీజనింగ్

ఇడ్లీలు, దోసెల వంటి అల్పాహారానికి కావాల్సిన పిండిని ఇంట్లోనే తయారు చేసుకుంటాం. ఇప్పుడు అలా కాకుండా దుకాణం నుంచి కొని తెచ్చుకునే వారి సంఖ్య పెరిగింది. రెడీమేడ్ పిండి కొనుక్కోవడం ఎప్పటి నుంచో ఉంది. ఇదేం కొత్త విషయం కాదంటారా? నిజమే.. రుబ్బిన పిండి వంటి రెడీ టు కుక్ మిశ్రమాలను గడిచిన రెండేళ్లలో కొత్తగా 1.8 కోట్ల కుటుంబాలు కొనుగోలు చేయడమే ఇక్కడ సరికొత్త విషయం. అంతర్జాతీయ పరిశోధన సంస్థ కాంటార్ 'ఎఫ్‌ఎంసీజీ పల్స్' నివేదికలో ఇలాంటి అనేక ఆసక్తికర విషయాలు వెల్లడయ్యాయి.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఇడ్లీ పిండి కూడా షాపు నుంచే!



ఇంటికి కావాల్సిన సరుకుల కోసం భారతీయులు ఒక ఏడాదిలో దుకాణాలకు 156 సార్లు వెళ్లారట. అంటే 56 గంటలకు ఒకసారి లేదా ప్రతి రెండు రోజులకోసారి సరుకులు కొనుగోలు చేశారని కాంటార్ తన 'ఎఫ్‌ఎంసీజీ పల్స్' నివేదికలో వెల్లడించింది. 2023–24లో సైతం భారతీయులు ఇదే స్థాయిలో షాపింగ్ చేశారని తెలిపింది. అంతేకాదు, వినియోగదారులు ఖర్చు చేసిన మొత్తం, కొనుగోలు చేసిన ఉత్పత్తుల సంఖ్య పెరిగిందని వివరించింది. 2025 జనవరి–మార్చి కాలంలో ఫాస్ట్ మూవింగ్ కంజ్యూమర్ గూడ్స్ (ఎఫ్‌ఎంసీజీ) అమ్మకాల్లో 3.5% వృద్ధి నమోదైంది.

అన్‌బ్రాండెడ్ హవా..

స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయిన 22 కంపెనీల పరిమాణ వృద్ధి రేటు కేవలం 3.6% మాత్రమే. కానీ, ప్రముఖ కంపెనీలవి కాని అన్‌బ్రాండెడ్ ఉత్పత్తులు ఏడాదిలో 6.1% వృద్ధి సాధించాయి. 2023–24తో పోలిస్తే గత ఆర్థిక సంవత్సరంలో వినియోగదారుడు కొనుగోలు చేసిన సగటు ప్యాక్ పరిమాణం 16% పెరిగింది. అంటే పావుకిలో బదులు అరకిలో.. అరకిలో బదులు కిలో ఇంటికి తెచ్చుకున్నారన్న మాట. అలాగే ప్యాక్‌ల సంఖ్య 13% పెరిగింది. 2023–24లో వినియోగదార్లు సగటున 200 ప్యాక్‌లు కొనుగోలు చేస్తే.. 2024–25కు వచ్చే సరికి ఇది 226కి చేరింది.

వాషింగ్ లిక్విడ్స్..

దుస్తులు ఉతికేందుకు వాడే సబ్బుల అమ్మకాలు క్రమంగా తగ్గుతున్నాయి. సబ్బులకు బదులు కస్టమర్లు లిక్విడ్స్‌ను ఎంచుకుంటున్నారు. ఎఫ్‌ఎంసీజీ రంగంలో వాషింగ్ లిక్విడ్స్ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న విభాగంగా అవతరించాయి. రెండు ఆర్థిక సంవత్సరాల్లో వీటి పరిమాణం 2.7 రెట్లు దూసుకెళ్లింది. వాషింగ్ లిక్విడ్స్ కొనుగోలు చేస్తున్న గృహాల సంఖ్య 2022–23 నుంచి కొత్తగా 2.4 కోట్లు పెరిగింది. 20 శాతం కుటుంబాలే దేశంలో వీటిని వినియోగిస్తున్నాయి. ఇందుకు ప్రధాన కారణం.. గత 5 ఏళ్లలో దేశంలో వాషింగ్ మెషీన్ల అమ్మకాలు పెరగడమే.

అంతా రెడీమేడ్..

రెడీ–టు–కుక్ మిశ్రమాల అమ్మకాలు రెండింతలై కొత్తగా 1.8 కోట్ల కుటుంబాలకు ఇవి చేరాయి. ప్రధానంగా దోసె, ఇడ్లీల తయారీకి వాడే రుబ్బిన పిండ్లు ఎక్కువగా కొంటున్నారు. రెడీ–టు–కుక్ కూరలను నూతనంగా 6 లక్షల గృహాలు ఆస్వాదించాయి. మ్యూస్లీ, పారిజ్, ఓట్స్‌తో తయారైన అల్పాహార ఉత్పత్తులు రెండు సంవత్సరాలలో 1.5 రెట్లు వృద్ధి చెందాయి. కార్బోనేటేడ్ శీతల పానీయాలు, పండ్ల రసాలు, పాల ఆధారిత పానీయాలు, చాక్లెట్స్, బిస్కట్స్, సాల్టీ స్నాక్స్, ఐస్ క్రీమ్స్ వంటి ఉత్పత్తుల విక్రయాలు 2.4% పెరిగాయి. బిస్కట్స్ వినియోగం ఇంటి వెలుపల తగ్గితే, ఇళ్లల్లో పెరిగింది.

చిన్న ప్యాక్‌లవైపు..

దేశంలోని ఉత్తర, తూర్పు, దక్షిణ ప్రాంతాల్లో 10–40 లక్షల మధ్య జనాభా ఉన్న మినీ మెట్రో పట్టణాల్లో.. వినియోగ వస్తువులు, ఇతర విభాగాల ధరల పెరుగుదల, వేతన వృద్ధి స్తబ్దుగా కొనసాగుతుండడం కొనుగోళ్లను తగ్గిస్తోంది. దుకాణాలకు వెళ్తున్న సంఖ్యలో మార్పు లేనప్పటికీ చిన్న, మరింత చవకైన ప్యాక్ పరిమాణాల వైపు కస్టమర్లు మళ్లుతున్నారు. అంటే ధరను కచ్చితంగా పరిగణలోకి తీసుకుంటున్నారన్నమాట. ఇక 2024–25లో సూపర్ మార్కెట్స్‌లో అమ్మకాల పరిమాణం 43% ఎగిసింది. కిరాణా దుకాణాల వ్యాపారం మాత్రం స్థిరంగా ఉంది.

పట్టణ మార్కెట్లు మెరుగ్గా..


పట్టణ మార్కెట్లు 2025 జనవరి–మార్చి త్రైమాసికంలో 4.4% వృద్ధిని సాధించగా, గ్రామీణ మార్కెట్లు 2.7% పెరిగాయి. పట్టణ మార్కెట్.. గ్రామీణ ప్రాంతాల కంటే వేగంగా వృద్ధి చెందడం ఇది వరుసగా మూడో త్రైమాసికం. చాలా లిస్టెడ్ కంపెనీల అమ్మకాల్లో పట్టణ మార్కెట్ల నుంచి 50–70% సమకూరుతోంది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, వేతనాల్లో పెరుగుదల తక్కువగా ఉండటం, ఇంటి అద్దెలు పెరగడం గత సంవత్సరంలో పట్టణాల్లో రోజువారీ కిరాణా, ప్రధాన వస్తువుల డిమాండ్‌పై ప్రభావం చూపాయి. హిందూస్తాన్ యూనిలీవర్, గోద్రేజ్ కంజ్యూమర్ ప్రొడక్ట్స్, టాటా కంజ్యూమర్ ప్రొడక్ట్స్, మారికో వంటి ఎఫ్‌ఎంసీజీ కంపెనీలు మిశ్రమ ఫలితాలను అందుకున్నాయి. వాటి అమ్మకాల్లో పెరుగుదల గరిష్ఠంగా 7 శాతాన్ని మించలేదు. ఖరీదైన వస్తువులు, పెద్ద ప్యాక్‌ల వైపు కస్టమర్లు ఆకర్షితులవుతున్నందున రాబోయే రోజుల్లో పట్టణ ఎఫ్‌ఎంసీజీ రంగంలో బలమైన వృద్ధి కనిపించే అవకాశం ఉందని కాంటార్ నివేదిక పేర్కొంది.

సరుకుల కోసం ఒక ఏడాదిలో 156సార్లు వెళ్లారు. అంటే 56 గంటలకోసారి అన్నమాట.	ప్యాక్ సైజు 16 శాతం, ప్యాక్‌ల సంఖ్య 13 శాతం పెరిగింది.	జాతీయ సగటుతో పోలిస్తే దక్షిణ ఢిల్లీ వాసుల ఎఫ్‌ఎంసీజీ వినియోగం రెండింతలు అధికం.	పశ్చిమ ఢిల్లీవాసులు గరిష్ఠంగా ఏటా రూ.39,325 ఖర్చు చేశారు.	వ్యయాల పరంగా నైరుతి బెంగళూరు ప్రీమియం ఎఫ్‌ఎంసీజీ మార్కెట్‌గా నిలిచింది.

వచ్చేనెల 6న బీఎస్సీ నర్సింగ్ ప్రవేశ పరీక్ష

లబ్బీపేట (విజయవాడ తూర్పు): బీఎస్సీ నర్సింగ్ కోర్సుల్లో 2025–26కి గాను ప్రవేశాల కోసం డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జూలై 6న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు మే 27న నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 20 సాయంత్రం 6 గంటల వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. బీఎస్సీ నర్సింగ్ కోర్సులో చేరదలచిన వారు వర్సిటీ వెబ్‌సైట్ https://dmtr.uhsap.in/ ను సంప్రదించవచ్చునని తెలిపారు.

ఆర్జీయూకేటీ ప్రవేశాలకు 50,541 దరఖాస్తులు



నూజివీడు: రాష్ట్రంలోని నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 2025–26 ప్రవేశాల్లో భాగంగా ఈనెల 10వ తేదీ గడువు ముగిసే సమయానికి 50,541 దరఖాస్తులు వచ్చినట్టు ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ మంగళవారం తెలిపారు. గత నెల 20తోనే దరఖాస్తు గడువు ముగిసినప్పటికీ ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ 10 వరకు గడువు పొడిగించారు. గతంలో వచ్చిన వాటికి అదనంగా 1,340 దరఖాస్తులు వచ్చినట్టు ఆయన తెలిపారు. అభ్యర్థుల ఎంపిక జాబితాను ఈనెల 20లోగా విడుదల చేస్తామని పేర్కొన్నారు.

గిరిజన గురుకుల ఔట్‌సోర్సింగ్ టీచర్ల సమస్య పరిష్కరించండి

- ఏపీ ప్రభుత్వానికి జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశం
- మెగా డీఎస్సీ నుంచి 1143 పోస్టులు మినహాయించండి
- కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్పుచేసి ఉద్యోగ భద్రత కల్పించండి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లోని గిరిజన గురుకులాల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ టీచర్ల సమస్య పరిష్కరించాలని కూటమి ప్రభుత్వానికి జాతీయ ఎస్టీ కమిషన్ ఆదేశించింది. ఈ విషయమై విచారణ చేపట్టిన కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ సోమవారం ఏపీ ప్రభుత్వానికి పలు సూచనలు చేస్తూ తీర్పు ఇచ్చారు. రాష్ట్రంలోని 190 గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల (ఏపీటీడబ్ల్యూఆర్ఈఐఎస్)లో 1659 మంది ఉపాధ్యాయులు ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వారిని కాంట్రాక్ట్ విధానంలోకి మార్చి ఉద్యోగ భద్రత కల్పిస్తామని కూటమి నేతలు చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్, గుమ్మిడి సంధ్యారాణి ఎన్నికల ముందు హామీలు గుప్పించారు. తీరా అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం డీఎస్సీ ద్వారా గిరిజన గురుకులాల ఔట్ సోర్సింగ్ పోస్టులకు ఎసరు పెడుతూ, ఆ పోస్టులనూ డీఎస్సీ నోటిఫికేషన్‌లో చూపించడంతో వారంతా ఉద్యోగం కోల్పోయి రోడ్డున పడే పరిస్థితి ఏర్పడింది. దీంతో ఆందోళన చెందిన ఔట్ సోర్సింగ్ టీచర్లు తమను డీఎస్సీ నుంచి మినహాయించాలని, కాంట్రాక్ట్ విధానంలోకి మార్పు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలంటూ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేశ్, గుమ్మిడి సంధ్యారాణితోపాటు అధికారులను అనేక పర్యాయాలు కలిసి వినతులు అందించారు. ఫలితం లేకపోవడంతో ఈ ఏడాది ప్రారంభంలో దాదాపు 46 రోజుల పాటు నిరవధిక సమ్మె చేపట్టారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడంతో జాతీయ ఎస్టీ కమిషన్‌ను ఆశ్రయించారు. దీనిపై కమిషన్ విచారణ చేపట్టింది. మూడు వాయిదాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎవరూ విచారణకు హాజరు కాకపోవడంతో కమిషన్ సోమవారం తీర్పునిచ్చింది. గిరిజన ఔట్ సోర్సింగ్ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలంటూ కూటమి ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇతర శాఖల్లో లేని విధంగా గిరిజన ఔట్ సోర్సింగ్ పోస్టులను డీఎస్సీలో చూపించడం సరికాదని కమిషన్ అభిప్రాయపడింది. వారిని డీఎస్సీ నుంచి మినహాయించి, కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్పు చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆదేశిస్తూ జాతీయ ఎస్టీ కమిషన్ తీర్పు చెప్పింది.

గ్రూప్–1 మెయిన్స్ ఫలితాలు విడుదల

ఇంటర్వ్యూలకు 224 మంది ఎంపిక
17 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన..
23 నుంచి ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: గ్రూప్–1 మెయిన్స్ ఫలితాలను ఏపీపీఎస్సీ మంగళవారం విడుదల చేసింది. మొత్తం 224 మంది ఇంటర్వ్యూలకు ఎంపికైనట్టు ప్రకటించింది. ఇందులో 182 మంది జనరల్ కేటగిరీలో, మరో 42 మంది స్పోర్ట్స్ కోటా కింద ఎంపికయ్యారు. వీరికి ఈనెల 17 నుంచి సర్టిఫికెట్ల పరిశీలన చేసి 23 నుంచి 30వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్టు సర్వీస్ కమిషన్ కార్యదర్శి రాజాబాబు తెలిపారు. కాగా, 89 గ్రూప్–1 పోస్టుల భర్తీకి 2023 డిసెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేశారు. గతేడాది మార్చి 17న ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించి ఏప్రిల్‌లో ఫలితాలను వెల్లడించారు. 1:50 నిష్పత్తి ప్రాతిపదికన 4,496 మందిని మెయిన్స్‌కు ఎంపిక చేశారు. వీరికి, మే నెలలో పరీక్షలు నిర్వహించగా, 75 శాతం మంది హాజరైనట్టు ఏపీపీఎస్సీ ప్రకటించింది. ఈ ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. ఎంపికైన అభ్యర్థులకు వ్యక్తిగతంగా కాల్‌లెటర్లు పంపిస్తామని, వివరాలను కమిషన్ వెబ్‌సైట్ www.psc.ap.gov.in లో చూడవచ్చని ఏపీపీఎస్సీ తెలిపింది.

యోగా ప్రచారానికి రెండు సాంకేతిక సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందాలు

ఏయూక్యాంపస్ (విశాఖ): 'యోగాంధ్ర' కార్యక్రమాలు, అంతర్జాతీయ యోగా దినోత్సవానికి విస్తృత ప్రచారం కల్పించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత యోగా శిక్షణలకు ప్రభుత్వం రెండు సాంకేతిక సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఏయూ కన్వెన్షన్ సెంటర్ సాగరిక హాల్‌లో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో సంబంధిత సంస్థల ప్రతినిధులు, ఆయుష్ విభాగం రాష్ట్ర స్థాయి అధికారులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పందం ప్రకారం, కర్నూలులోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, డిజైన్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ కృత్రిమ మేధస్సు ఆధారంగా రూపొందించిన యాప్‌తో యోగా శిక్షణ అందించనుంది. అలాగే మహారాష్ట్రకు చెందిన హాబిల్డ్ హెల్త్‌టెక్ ప్రైవేట్ లిమిటెడ్ 21 రోజుల ఆన్‌లైన్ లింక్‌తో ఉచిత యోగా శిక్షణ అందించే ప్రత్యేక కోర్సును రూపొందించింది. ఈ ఒప్పంద పత్రాలపై ఏపీ ఆయుష్ విభాగం డైరెక్టర్ దినేశ్ కుమార్ సంతకాలు చేశారు. కార్యక్రమంలో మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, అనగాని సత్యప్రసాద్, వంగలపూడి అనిత,, గుమ్మిడి సంధ్యారాణి, ఎంపీ ఎం.శ్రీ భరత్, ఐఐఐటీడీఎం కర్నూలు ఆచార్యులు కృష్ణ నాయక్, ఎం.నరేష్ బాబు, హాబిల్డ్ సాంకేతిక ప్రతినిధి అన్షుల్ అగర్వాల్, ఏపీ ఆయుష్ విభాగం డైరెక్టర్ దినేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐఐఐటీ డీఎం, ఆయుష్ మధ్య ఒప్పందం

ఆర్జీయూకేటీ, యూడబ్ల్యూహెచ్ మధ్య అవగాహన ఒప్పందం



ఒప్పందం కుదుర్చుకున్న ఆర్జీయూకేటీ, సంస్థ ప్రతినిధులు

నూజివీడు: రాష్ట్రంలోని ఆర్జీయూకేటీ, యునైటెడ్ వే ఆఫ్ హైదరాబాద్ (యూడబ్ల్యూహెచ్) సంస్థలు మంగళవారం అవగాహన ఒప్పందాన్ని మంగళవారం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేయనున్నారు. సాఫ్ట్ స్కిల్స్, అర్థమెటిక్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. యూడబ్ల్యూహెచ్ సంస్థ మేనేజర్ రేఖ శ్రీనివాసన్, సీనియర్ మేనేజర్ భరత్ మాట్లాడుతూ.. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్ రంగాల్లో విద్యార్థులకు ఇంటర్న్‌షిప్, ఉద్యోగావకాశాలు కల్పించేందుకు పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఆచార్య సండ్ర అమరేంద్రకుమార్ మాట్లాడుతూ..ఈ సంస్థ ప్రోత్సాహంతో ఈ విద్యాసంవత్సరం నుంచి విద్యార్థులకు ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు.

ఎస్సీ వర్గీకరణలో గ్రూప్ ఎంపిక చేసుకోవాలి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి ఆయా వర్గాలు ఏ గ్రూప్ కిందకు వస్తారో ఏపీపీఎస్సీకి సమర్పించిన వివరాల్లో మార్పులు చేసుకోవాలని సర్వీస్ కమిషన్ కార్యదర్శి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇటీవల జరిగిన ఎస్సీ వర్గీకరణలో ఎస్సీలను 3 గ్రూపులుగా విభజించి, ఉప కులాలను ఈ గ్రూపుల్లో చేర్చింది. ఎవరు ఏ వర్గంలోకి వస్తారో చూసి కమిషన్ వెబ్‌సైట్‌లో వోటీపీఆర్ ఆధారంగా గ్రూప్‌ను ఎంపిక చేయాలని విజ్ఞప్తి చేశారు.

వెబ్‌సైట్‌లో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టుల సిలబస్

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ పోస్టుల పరీక్షల సిలబస్‌ను సర్వీస్ కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచినట్టు కార్యదర్శి తెలిపారు. మొత్తం 791 పోస్టులు భర్తీ చేయనున్నామని, జూలై తర్వాత పరీక్షలు ఉంటాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు వెబ్‌సైట్‌లో సిలబస్ పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.



కొండపైన లక్ష్మీనరసింహస్వామి ఆలయ గోపురం




పెనుకొండలోని మహామంత్రి తిమ్మరుసు జైలు

అబ్బురపరుస్తున్న పెనుకొండ అందాలు

విజయనగర రాజుల రెండవ రాజధానిగా ఖ్యాతిగాంచిన శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలోని పురాతన కట్టడాల సౌందర్యాలు పర్యాటకులను అబ్బుర పరుస్తున్నాయి. చరిత్రకు సాక్షిగా నిలిచిన వందలాది కట్టడాలు ఇక్కడున్నాయి. వారాంతంలో ఇక్కడికి పెద్దఎత్తున పర్యాటకులు తరలివస్తుంటారు. -పెనుకొండ



కొండపైకి వెళ్లేందుకు ఏర్పాటు చేసిన రహదారి



పెనుకొండ కోట సింహద్వారం



అబ్బుర పరుస్తున్న గగన్‌మహల్

క్లుప్తంగా...

జేడీ, డీడీ, ఏడీల బదిలీ

సాక్షి, అమరావతి: పశుసంవర్ధక, మత్స్య, మార్కెటింగ్, వ్యవసాయ శాఖల్లో పలువురిని బదిలీ చేస్తూ ఆ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులిచ్చారు. జాయింట్ డైరెక్టర్లు కే.బేబీరాణి (ఒంగోలు)కి విజయవాడలోని పారా వెటర్నరీ అండ్ ఎలైడ్ కౌన్సిల్‌లో పోస్టింగ్ ఇచ్చారు. వై. వెంకటేశు (ఎన్‌కేబీసీ–చింతలదీవి)ను మండపేట ఎస్‌పీహెచ్‌టీసీ జేడీగా బదిలీ చేశారు. ఎల్.రత్న కుమారి(వీబీఆర్‌ఐ–విజయవాడ)ని సామర్లకోట వీబీఆర్‌ఐకు, బీ.చంద్రమౌళి నాయక్ (వీబీఆర్‌ఐ–సామర్లకోట)ను విజయవాడ వీబీఆర్‌ఐకు బదిలీ చేశారు. డిప్యూటీ డైరెక్టర్లకు సంబంధించి క్లాస్ –ఏ కేటగిరిలో పదిమంది, క్లాస్–బీ కేటగిరిలో ఇద్దరిని వివిధ జిల్లాలకు బదిలీ చేశారు. మత్స్యశాఖలో ఇరువురు డిప్యూటీ డైరెక్టర్లను బదిలీ చేశారు. మార్కెటింగ్ శాఖలో 14 మంది అసిస్టెంట్ డైరెక్టర్లతో పాటు ఒక స్పెషల్ గ్రేడ్ సెక్రటరీని బదిలీ చేశారు.ఇదే శాఖలో 13 మంది డిప్యూటీ డైరెక్టర్లతో పాటు మరో 13 మంది స్పెషల్ గ్రేడ్ సెక్రటరీలను రాష్ట్రంలోని వివిధ ఏఎంసీలకు బదిలీ చేశారు.

ఈహెచ్‌ఎస్ సేవల్లో లోపాలు ఆందోళనకరం

సాక్షి, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల ఆరోగ్య భద్రత ప్రశ్నార్థకంగా మారిందని 'అసోసియేషన్ ఫర్ ఏపీ పెన్షనర్స్ సెటిల్డ్ అట్ హైదరాబాద్' ఆందోళన వ్యక్తం చేసింది. ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్(ఈహెచ్‌ఎస్) అమలులో లోపాలు సరిదిద్దడంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేస్తూ సంఘం అధ్యక్షులు కె. నళిని మోహన్‌కుమార్, ప్రధాన సలహాదారు మాజీ ఐఏఎస్ బి.లక్ష్మీకాంత్ మంగళవారం వైద్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబుకు లేఖ రాశారు. వైద్య సేవా ట్రస్ట్ ద్వారా ఈహెచ్‌ఎస్ సేవలు అందించే నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్సలకు నిరాకరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ట్రస్ట్ ద్వారా సేవల అమలు, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వ్యవస్థను నెలకొల్పాలని సూచించారు. ముఖ్యంగా ప్రస్తుత విధానం నుంచి ఆరోగ్య బీమా విధానంలోకి ఈహెచ్‌ఎస్‌ను మార్చడం ఉత్తమం అని వారు విజ్ఞప్తి చేశారు.

ఎరువుల వినియోగం 34 లక్షల టన్నులకు మించకూడదు

వ్యవసాయశాఖ డైరెక్టర్ ఢిల్లీరావు



సాక్షి, అమరావతి: ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ఎరువుల సగటు వినియోగం 34 లక్షల టన్నులకు మించకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ శాఖ డైరెక్టర్ సేనాపతి ఢిల్లీరావు అధికారులను ఆదేశించారు. ఎరువుల సరఫరా–పంపిణీపై మంగళవారం జరిగిన ఉన్నత స్థాయి సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ సీజన్‌కు సంబంధించి 39 లక్షల టన్నుల ఎరువుల వినియోగం ఉంటుందని అంచనా వేశామని, ఆ మేరకు ఏర్పాట్లు చేశామని, ఈ ఏడాది కనీసం 4 లక్షల టన్నుల ఎరువులను ఆదా చేయాలన్నారు. తగ్గించిన ఎరువుల సబ్సిడీ మొత్తంలో 50% నిధులు పీఎం ప్రనామ్ ద్వారా పొందే అవకాశం ఉందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడంలో ఏపీ ముందుండాలన్నారు. ఇందుకోసం సాంప్రదాయ ఎరువుల వినియోగాన్ని తగ్గించి నానో ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలన్నారు.

గనుల శాఖలో పలువురు డీడీలు, ఏడీల బదిలీ

సాక్షి, అమరావతి: గనుల శాఖలో పలువురు డిప్యూటీ డైరెక్టర్లు, అసిస్టెంట్ డైరెక్టర్లను ప్రభుత్వం బదిలీ చేసింది. కడప డీడీగా ఉన్న సూర్య చంద్రరావు విజయనగరానికి బదిలీ అయ్యారు. గుంటూరు డీడీగా ఉన్న డి.శ్రీవెంకట సాయి కడపకు బదిలీ అయ్యారు. అనంతపురంలో డీడీ జి.వెంకటేశ్వర్లు డైరెక్టర్ కార్యాలయానికి బదిలీ అయ్యారు. వెయిటింగ్‌లో ఉన్న డిప్యూటీ డైరెక్టర్ ఎస్.చంద్రశేఖర్‌ను గుంటూరు డీడీగా నియమించారు. బాపట్లలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న ఆర్.రాజేష్ కుమార్‌ను రాయచోటికి బదిలీ చేశారు. విజయవాడలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న ఎ.శ్రీనివాసరావును పార్వతీపురం బదిలీ చేశారు.

గుండెల్లో గాయాలు.. ఆ గ్రానైట్ పేలుళ్లు..!

- పంట పొలాలకు నష్టాలు / • గ్రామాల్లో ఇళ్లకు బీటలు
- చోద్యం చూస్తున్న అధికారులు / • ప్రకాశం జిల్లాలో దారుణ పరిస్థితులు




రామాంజనేయపురం వద్ద బ్లాస్టింగ్ రాయి పడి చనిపోయిన కార్మికుడు (ఫైల్)

ప్రకాశం జిల్లా బల్లికురవ, సంతమాగులూరు, మార్టూరు, అద్దంకి మండలాల్లో అనధికారికంగా నిర్వహిస్తున్న గ్రానైట్, మెటల్ క్వారీల బ్లాస్టింగ్ కార్యకలాపాలు కార్మికులు, సమీప గ్రామాల ప్రజలు, పొలాలు, ఇళ్లకు ముప్పుగా మారాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ సమస్యపై దృష్టి సారించి తక్షణం పరిష్కార చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. - బల్లికురవ

రైతులకు కష్టం.. ఇళ్లకు నష్టం

బ్లాస్టింగ్ కారణంగా కొండల సమీపంలోని పంట పొలాల్లోకి రాళ్లు కుప్పలుగా పడిపోతున్నాయి. పొలాల్లో మొక్కజొన్న, కంది, సుబాబుల్, జామాయిల్ వంటి పంటలు దెబ్బతింటున్నాయి. రైతులు దీనిపై ప్రశ్నిస్తే, ''మేమూ బతకాలి కదా!'' అంటూ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా స్పందిస్తున్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇక బ్లాస్టింగ్ ధాటికి పక్కా ఇళ్లకు గోడల్లో పగుళ్లు వస్తున్నాయి. ''రోజూ మా ఇల్లు కంపించిపోతుంది. ఎప్పుడేం జరుగుతుందోనని భయంగా ఉంది'' అని ఒక మహిళ వాపోయారు.



ధర్మవరం గ్రామ సమీపంలోని కొండ వద్ద బ్లాస్టింగ్

మ్యాగ్‌జైన్ వ్యవస్థే పరిష్కారం?

అధికారిక అనుమతులతో మ్యాగ్‌జైన్‌లు ఏర్పాటు చేసి, బ్లాస్టింగ్ మెటీరియల్ నిల్వ చేసే విధానం ఉంటే, ప్రమాదాల తీవ్రత తగ్గే అవకాశం ఉందని పోలీసులు సూచిస్తున్నారు. కానీ అక్రమ నిల్వలు, అశ్రద్ధతో క్వారీలు నడిపితే ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడతాయని హెచ్చరిస్తున్నారు. కొన్ని గ్రానైట్ క్వారీల యాజమాన్యాలు అధికార అనుమతులతో మ్యాగ్‌జైన్‌లు ఏర్పాటు చేసుకుని బ్లాస్టింగ్ మెటీరియల్‌ను నిల్వ చేసుకుంటున్నా, మెజారిటీ క్వారీల విషయంలో అక్రమంగా బ్లాస్టింగ్ మెటీరియల్‌ను నిల్వ చేసుకుంటూ, మొబైల్ వ్యాన్‌ల ద్వారా వాటిని రోజువారీ సరఫరా చేస్తుండడం గమనార్హం.

కార్మికుల ప్రాణాలు పోతున్నా.. స్పందన శూన్యం

గ్రానైట్, మెటల్ క్వారీల్లో పనిచేస్తున్న కార్మికులు తమిళనాడు, ఒడిశా, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ వంటి రాష్ట్రాల నుంచి వలస వస్తున్నారు. సరైన భద్రతా చర్యలు లేకుండా ప్రమాదాల బారిన పడుతున్నారు. గత పదేళ్లలో బల్లికురవ, సంతమాగులూరు మండలాల్లో 60 మంది పైగా కార్మికులు మరణించినట్లు సమాచారం. అయినప్పటికీ యాజమాన్యాలపై ఎటువంటి చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. చనిపోయిన కార్మికులను గుట్టుచప్పుడు కాకుండా స్వస్థలాలకు తరలించి, సెటిల్మెంట్లతో వ్యవహారాన్ని ముగిస్తున్నారని స్థానిక వలస కార్మికులు ఆరోపిస్తున్నారు.



బ్లాస్టింగ్‌తో మల్లాయపాలెంలో పగుళ్లు ఇచ్చిన భవనం

విస్తరించిన క్వారీలు

- బల్లికురవ మండలంలోని ఈర్లకొండ పరిసర గ్రామాల్లో 30కి పైగా గ్రానైట్ క్వారీలు ఉన్నాయి.
- సనకొండ, ఎస్‌ఎల్‌గుడిపాడు, రామాంజనేయపురం, కొండల్లో 250 మెటల్ క్వారీలు నడుస్తున్నాయి.
- సంతమాగులూరులోని గురిజేపల్లిలో 30కి పైగా, ఏల్చూరులో 140 మెటల్ క్వారీలు ఉన్నాయి.
- మార్టూరు మండలంలోని నాగరాజుపల్లి, అద్దంకి మండలంలో ధర్మవరం, జంగమహేశ్వరపురం కొండల్లో 400కి పైగా మెటల్ క్వారీలు కొనసాగుతున్నాయి.

బ్లాస్టింగ్ మోతతో నా ఇంటికి పగుళ్లు



రూ.లక్షలు ఖర్చు చేసి పక్కా ఇల్లు నిర్మించుకున్నా. బ్లాస్టింగ్ మోతలతో ఇంటి గోడలు పగుళ్లు ఇస్తున్నాయి. ప్రజలు గ్రామాలు వదిలి వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.
– బండి ఏసు, పాతమల్లాయపాలెం


పొలాలకు వెళ్లాలంటే భయమేస్తోంది...



పంట పొలాలకు వెళ్లాలన్నా భయపడుతున్నాం. ఏ సమయంలో ఎక్కడి క్వారీలో నుంచి రాయివచ్చి పడుతుందోనని ఆందోళన చెందుతున్నాం. క్వారీలతో పంట భూములు రాతి నేలలుగా మారుతున్నాయి.
– బూసా వెంకటేశ్వర్లు, రైతు, రామాంజనేయపురం

ఎఫ్‌డీఐల ఆకర్షణలో 14వ స్థానంలో ఏపీ

- రూ.1,64,875 కోట్ల పెట్టుబడులతో మొదటి స్థానంలో మహారాష్ట్ర
- రూ.56.030 కోట్లతో రెండోస్థానంలో కర్ణాటక
- రూ.4.21 లక్షల కోట్ల పెట్టుబడుల్లో 50 శాతంపైగా ఈ రెండు రాష్ట్రాలకే
- డీపీఐఐటీ తాజా గణాంకాల్లో వెల్లడి



సాక్షి, అమరావతి: విదేశీ పెట్టుబడుల ఆకర్షణలో ఏపీ 14వ స్థానంలో నిలిచింది. గత ఆర్థిక సంవత్సరంలో రూ.1,957.04 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించింది. ఇందులో శ్రీసిటీలో ఏర్పాటు చేసిన డైకిన్, పానాసోనిక్ ,ఏటీసీ టైర్స్ వంటి సంస్థల నుంచి ఈపెట్టుబడులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ (డీపీఐఐటీ) తాజాగా విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2024–25 ఆర్థిక సంవత్సరంలో దేశవ్యాప్తంగా రూ.4,21,929 కోట్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు వచ్చాయి. అందుకు ముందు ఏడాదితో పోలిస్తే 15 శాతం వృద్ధి నమోదైంది. మొత్తం విదేశీపెట్టుబడుల్లో 50 శాతానికి పైగా పెట్టుబడులు మహారాష్ట్ర, కర్ణాటకకే రావడం గమనార్హం. మొత్తం పెట్టుబడుల్లో 39.07 శాతం వాటా రూ.1,64,875 కోట్లతో మహారాష్ట్ర మొదటిస్థానంలో నిలిచింది. 13.27 శాతం వాటా రూ.56,030 కోట్లతో కర్నాటక రెండవస్థానం సాధించింది.

అత్యధికంగా మారిషస్, సింగపూర్ నుంచే..

మన దేశంలోకి వస్తున్న విదేశీ పెట్టుబడుల్లో అత్యధికంగా 49 శాతం మారిషస్, సింగపూర్ దేశాల నుంచే వస్తున్నాయి. డాలర్ల పరంగా చూస్తే మారిషస్ మొదటి స్థానంలో ఉంటే అదే రూపాయల పరంగా చూస్తే సింగపూర్ మొదటిస్థానంలో ఉంది. ఏప్రిల్–2000 నుంచి ఇప్పటివరకు మారిషస్ నుంచి రూ.10,92,900 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. మొత్తం వచ్చిన పెట్టుబడుల విలువలో ఇది 25 శాతం. ఇదే సమయంలో 24 శాతం వాటాతో సింగపూర్ నుంచి రూ.12,18,108 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆ తర్వాత అమెరికా, నెదర్లాండ్స్, జపాన్, బ్రిటన్ నుంచి అత్యధికంగా పెట్టుబడులు వచ్చాయి. సర్వీసు, కంప్యూటర్స్, ట్రేడింగ్, టెలికమ్యూనికేషన్స్, ఆటోమొబైల్ రంగాల్లోకి అత్యధికంగా పెట్టుబడులు వస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

కరెన్సీ 'రూపి'ణి జై

డిజిటల్ లావాదేవీలు పెరిగినా కరెన్సీపై తగ్గని మోజు



- భారీగా పెరిగిన చలా'మనీ'
- 86 శాతంతో రూ. 500 నోటుదే అగ్రస్థానం
- 16.4 శాతంతో రెండో స్థానంలో రూ.10 నోటు
- ఆర్‌బీఐ తాజా నివేదికలో వెల్లడి

ఒకపక్క డిజిటల్ లావాదేవీలు పెరుగుతున్నా.. భారతీయులకు కరెన్సీ వినియోగంపై మోజు తగ్గడం లేదు. 2023–24తో పోలిస్తే దేశవ్యాప్తంగా 2024–25లో కరెన్సీ వినియోగం భారీగా పెరిగినట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తాజాగా విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. కరెన్సీ చలామణీ విలువ పరంగా 6 శాతం పెరిగితే నోట్ల సంఖ్య పరంగా 5.6 శాతం పెరిగినట్లు పేర్కొంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా రూ. 34.9 లక్షల కోట్ల విలువైన నగదు చలామణీలో ఉంటే అన్ని డినామినేషన్స్ కలిపి రూ. 15,500 కోట్ల నోట్లు చలామణీలో ఉన్నాయి. దీనిలో 86శాతం వినియోగంతో రూ.500నోటు అగ్రస్థానంలో నిలిచింది. నోట్ల సంఖ్యాపరంగా చూస్తే 40.9 శాతం వాటాను కలిగి ఉంది. ఆ తర్వాతి స్థానాన్ని 16.4 శాతంతో పది రూపాయల నోటు ఆక్రమించింది. మొత్తం బ్యాంకు నోట్లలో పది, ఇరవై, యాభై రూపాయల నోట్ల సంఖ్య వాటా 31.7 శాతంగా ఉన్నట్లు ఆర్‌బీఐ పేర్కొంది. – సాక్షి, అమరావతి

నాణేల వినియోగమూ పై'పైకం'టూ..!



చిన్న నోట్ల స్థానే నాణేల వినియోగం పెంచడంపై ఆర్‌బీఐ దృష్టిసారించింది. అత్యధికంగా చలామణీలో ఉండే చిన్న నోట్ల కాలపరిమితి తక్కువ ఉంటుండటంతో వీటి స్థానంలో నాణేల వినియోగాన్ని ప్రోత్సహిస్తోంది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో విలువ పరంగా నాణేల వినియోగం 9.6 శాతం, సంఖ్య పరంగా 3.6 శాతం పెరిగినట్లు ఆర్‌బీఐ పేర్కొంది. గత రెండేళ్ల కాలంలో 238.7 కోట్ల పది రూపాయల నాణేలను ఆర్‌బీఐ చలామణిలోకి తీసుకురావడమే కాకుండా 85 కోట్ల పది రూపాయల నోట్లను చలామణి నుంచి తప్పించడమే దీనికి నిదర్శనం. ఆర్‌బీఐ చర్యలతో నకిలీ నోట్ల చలామణీ గణనీయంగా తగ్గుతోంది. రూ.200, రూ. 500 నోట్లలో నకిలీలు కొద్దిగా పెరిగినా మొత్తం మీద నకిలీ నోట్ల చలామణీ తగ్గింది. 2023–24లో 2,22,639 నకిలీ నోట్లు పట్టుపడగా ఆ సంఖ్య 2024–25లో 2.4 శాతం తగ్గి 2,17,396కు క్షీణించినట్లు ఆర్‌బీఐ తెలిపింది.

సంవత్సరాల వారీగా చలామణీలో ఉన్న నోట్ల సంఖ్య (కోట్లల్లో)


నోట్లు	2020	2021	2022	2023	2024	2025
100 లోపు	7,840	7,740	7,680	7,650	7,890	8,290
200	540	580	600	630	770	870
500	2,940	3,870	4,550	5,160	6,020	6,340
2000	270	250	210	180	--	--



శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ పెరిగింది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ ఏటీ సీ షెడ్ వద్దకు చేరింది. సోమవారం అర్ధరాత్రి వరకు 84,258 మంది స్వామివారిని దర్శించుకోగా 33,502 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామి వారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.90కోట్లు సమర్పించారు. టైంస్లాట్ భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది.

గజ వాహనం.. భక్తజన పావనం



శ్రీ పద్మావతి అమ్మవారి వార్షిక తెప్పోత్సవాల్లో భాగంగా నాల్గవ రోజైన మంగళవారం రాత్రి అమ్మవారు గజ వాహనంపై తిరువీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం దివ్యాలంకార శోభితురాలైన శ్రీ పద్మావతి అమ్మవారు తెప్పపై ఆశీనులై ఐదు మార్లు పుష్కరిణిలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. రాత్రి అమ్మవారు గజ వాహనాన్ని అధిష్ఠించి తిరువీధుల్లో ఊరేగుతూ కనువిందు చేశారు. ఇదిలావుండగా తెప్పోత్సవాల్లో చివరి రోజైన బుధవారం రాత్రి గరుడ వాహనంపై అమ్మవారు ఊరేగనున్నారు. – చంద్రగిరి

తెప్పోత్సవం..పరిపూర్ణం



తిరుపతిలోని శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో ఈనెల 2 నుంచి పది రోజుల పాటు చేపట్టిన స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా చివరి రోజైన మంగళవారం చక్రస్నానాన్ని వేడుకగా చేపట్టారు. రాత్రి ధ్వజావరోహణం చేపట్టడంతో స్వామివారి బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. పెద్దజీయర్ స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డెప్యూటీ ఈవో వీఆర్.శాంతి, ఏఈవో మునికృష్ణారెడ్డి పాల్గొన్నారు. – తిరుపతి కల్చరల్



పాఠశాలకు డిక్షనరీలు అందజేస్తున్న ప్రకృతి సంరక్షణ సేవాసమితి సభ్యులు(ఫైల్)



పాఠశాల కంప్యూటర్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈవో రాందాస్

దొరకునా ఇటువంటి 'సేవ'

- యువతను చైతన్యపరిచే కార్యక్రమాలు
- ప్రభుత్వ పాఠశాలలకు బ్లాక్ బోర్డులు, డిక్షనరీల అందజేత
- సెలవుల్లో పిల్లలకు కంప్యూటర్ శిక్షణ
- ప్రకృతి సంరక్షణ సేవాసమితి స్వచ్ఛంద సంస్థ కార్యక్రమాలు

నెల్లికుదురు: గ్రామ యువత భవిత బాగుండాలి.. సన్మార్గంలో పయనించేలా వారిలో చైతన్యపరచాలి.. ఇదే తపనతో ఏడుగురితో కలిసి ప్రకృతి సంరక్షణ సేవా సమితి స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. సొంత సొమ్ముతో గ్రామంలో మూడేళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆదర్శ సంఘసేవకుడు బండారి ఉప్పలయ్యపై ప్రత్యేక కథనమిది.

అక్షరాస్యత కోసం..

మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం నర్సింహులగూడెం గ్రామంలో సంస్థ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. నిరక్ష్యరాసులను అక్షరాస్యులుగా మార్చాలనే తపనతో ఇంటింటికీ తిరుగుతున్నారు. నిరక్ష్యరాసులను ఒకే వేదిక వద్దకు తీసుకొచ్చి.. సాయంత్రం పూట వారు అక్షరాలు తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టారు.

300 పుస్తకాలతో మినీ గ్రంథాలయం

గ్రామ పంచాయతీ కార్యాలయం గదిలో 300 పుస్తకాలతో మినీ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. గ్రామ పాఠశాలలో పనిచేస్తున్న 9 మంది ఉపాధ్యాయులకు ప్రకృతికి సంబంధించిన ఆయుర్వేద వైద్యశాస్త్రం పుస్తకాలు, హెచ్ఎం పద్మావతికి ఇంగ్లిష్ డిక్షనరీలను అందజేశారు.

రూ.15 వేలతో బ్లాక్ బోర్డులు

గ్రామ ప్రభుత్వ పాఠశాలలో పిల్లల కోసం సుమారు రూ.15 వేలు వెచ్చించి బ్లాక్ బోర్డులను ఏర్పాటు చేశారు. ఒకటి నుంచి 7వ తరగతి వరకు ఇంగ్లిష్, తెలుగు, హిందీ డిక్షనరీలను మూడేళ్లుగా అందజేస్తున్నారు. గ్రంథాలయం నుంచి నీతికథలు, వేమన శతకాలు తదితర పుస్తకాలను పాఠశాలకు బహూకరించారు.



సంస్థ ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో కమిటీ సభ్యులు

25 రోజుల పాటు కంప్యూటర్ శిక్షణ

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సెలవులను సద్వినియోగం చేసుకునేలా.. రూ.లక్ష వ్యయంతో 4 నూతన కంప్యూటర్లపై 25 రోజుల శిక్షణ ఇస్తున్నారు. ఈ శిక్షణ నిరంతరాయంగా కొనసాగేందుకు గ్రామంలో తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

ప్లాస్టిక్ వ్యతిరేక ప్రచారం

ప్లాస్టిక్ వాడకం ప్రాణాంతకమని, ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తాయని, భూగర్భ జలాలు అడుగంటిపోవడంపై గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు వాడవద్దని, నల్ల ఖాదీ వస్త్రంతో సంచులు తయారు చేయించి ఇంటింటికీ అందజేస్తున్నారు.

యువత ఉన్నతికి కృషి



నేను సూరత్‌లో ప్రభుత్వ హిందీ ఉపాధ్యాయునిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేశాను. అప్పటి నుంచి పుట్టిన ఊరి కోసం ఏదో ఒకటి చేయాలనే తపనతో ప్రకృతి సంరక్షణ సేవా సమితి సంస్థను గ్రామస్తులు యాతం ఉప్పలయ్య, గద్దె అంబరీష, పిల్లి లింగయ్య, చలమల్ల వెంకటేశ్వర్లు, వనగండ్ల ఉపేందర్, వనగండ్ల చిన్న ఉపేందర్‌తో కలిసి ఏర్పాటు చేశాను. సంస్థ సేవలకు కమిటీ సభ్యుల సహకారం మరువలేనిది. యువత ఉన్నతికి కృషి చేస్తున్నాను.

– బండారి ఉప్పలయ్య,
వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రకృతి సంరక్షణ సేవాసమితి

సేవాసమితి సేవలు భేష్



నిరుపేదలు చదువుకునే ప్రభుత్వ పాఠశాలకు బ్లాక్ బోర్డులు, పిల్లలకు నీతి కథల పుస్తకాలు, 6, 7 తరగతుల పిల్లలకు డిక్షనరీలు అందజేశారు. ఉపాధ్యాయులకు ప్రకృతి ఆయుర్వేద వైద్య శాస్త్రం పుస్తకాలను అందజేశారు. విద్యార్థులకు 25 రోజుల పాటు కంప్యూటర్ శిక్షణ ఇప్పించడం మరువలేనిది.

– పద్మావతి, హెచ్ఎం, ప్రాథమికోన్నత పాఠశాల, నర్సింహులగూడెం

అదృష్టంగా భావిస్తున్నా..



ప్రకృతి సంరక్షణ సేవాసమితి స్వచ్ఛంద సంస్థ సభ్యునిగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, గ్రామ యువత, గ్రామస్తులకు సహాయ సహకారాలు, అవగాహన కల్పించడం అదృష్టంగా భావిస్తున్నా. గ్రామస్తులు, విద్యార్థులు, యువకుల సౌకర్యార్థం కమిటీ హాల్ ఏర్పాటుకు ప్రభుత్వం, అధికారులు చొరవ చూపితే.. ఇంకా గ్రామాన్ని ముందుకు తీసుకెళ్లగలం.

– చలమల్ల వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీ

ప్రభుత్వం సహకరించాలి



గ్రామానికి, పాఠశాలకు ఎన్నో సేవలందిస్తున్న స్వచ్ఛంద సంస్థకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలి. మినీ గ్రంథాలయ భవనం, కంప్యూటర్ శిక్షణకు కమిటీ హాల్ మంజూరు చేస్తే బాగుంటుంది.

– రమేశ్, గ్రామస్తుడు

72 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశాం

కాంగ్రెస్ ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: ధాన్యం కొనుగోళ్ల విషయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్ చేస్తున్న ఆరోపణలకు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి కౌంటర్ ఇచ్చారు. 2021–22 నుంచి 2024–25 వరకు జరిగిన ధాన్యం కొనుగోళ్ల గణాంకాలతో ఎక్స్ వేదికగా ఆయన ట్వీట్ చేశారు. 'రాష్ట్రంలో 8,378 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ద్వారా ఈ ఏడాది జూన్ 7వ తేదీ వరకు 72 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయడం గర్వంగా ఉంది. సీఎం రేవంత్, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నాయకత్వంతో రైతుల కోసం అంకిత భావంతో ప్రభుత్వం పనిచేస్తోంది. ట్రాక్ రికార్డు చెత్తగా ఉన్నా బీఆర్ఎస్ పార్టీ అర్థంలేని మాటలు మాట్లాడుతోంది. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా జూన్ 7 నాటికి 59 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారు. ఈ ఏడాది జూన్ 8 నాటికి 12.33 లక్షల మంది రైతులకు రూ.15,121 కోట్లు చెల్లించాం. 2022–23లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ సమయానికి 9.81 లక్షల మంది రైతులకు చెల్లించింది రూ.5,932 కోట్లు మాత్రమే'అని ట్వీట్‌లో ఎంపీ చామలవెల్లడించారు.


కేసీఆర్‌కు నోటీసులు కక్ష సాధింపే..

మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి కక్ష సాధింపు ధోరణిలో భాగంగానే.. మాజీ సీఎం కేసీఆర్‌కు కాళేశ్వరం కమిషన్‌తో నోటీసులు ఇప్పించారని మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆరోపించారు. కేసీఆర్‌ను నేరుగా ఎదుర్కోలేక నోటీసుల పేరుతో ఇబ్బంది పెట్టాలని కాంగ్రెస్, బీజేపీ కూడబలుక్కొని కుట్రలు చేస్తున్నాయని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేసీఆర్ వెంట తెలంగాణ సమాజం ఉందని పేర్కొన్నారు. కుట్రలను ఛేదించి ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీని దోషిగా నిలబెడతామని, ప్రజా కోర్టులో శిక్ష వేస్తామని హెచ్చరించారు. కేసులు, విచారణలకు భయపడమని, ధైర్యంగా ఎదుర్కొంటామని ప్రశాంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

కౌశిక్‌రెడ్డి కేసులో హైకోర్టు తీర్పు రిజర్వు



సాక్షి, హైదరాబాద్: హనుమకొండ జిల్లా సుబేదారి పోలీసు స్టేషన్‌లో తనపై నమోదైన కేసును కొట్టివేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు చేసింది. రూ.50 లక్షలు ఇవ్వాలని తన భర్తను ఎమ్మెల్యే డిమాండ్ చేశారంటూ.. క్వారీ యజమాని మనోజ్ భార్య ఉమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. కేసు ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని కోరుతూ కౌశిక్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ మంగళవారం విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది టీవీ రమణరావు వాదనలు వినిపిస్తూ.. రాజకీయ కక్షలతోనే కేసు నమోదు చేశారని చెప్పారు. పోలీసుల తరఫున ఏపీపీ వాదనలు వినిపిస్తూ.. క్వారీ యజమానిని గతంలోనే బెదిరించి డబ్బు వసూలు చేశారన్నారు. మళ్లీ డబ్బు డిమాండ్ చేయడంతో పోలీసులను ఆశ్రయించాల్సి వచ్చిందన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. తీర్పు రిజర్వు చేశారు.

సామాజిక న్యాయానికి పెద్దపీట

టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దయాకర్



సాక్షి, హైదరాబాద్: పార్టీ కోసం పనిచేసిన వారికి, అన్ని సామాజిక వర్గాల నాయకులకు టీపీసీసీ కమిటీల్లో ప్రాధాన్యమిచ్చి సామాజిక న్యాయానికి పెద్ద పీట వేశారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ చెప్పారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడారు. కులగణనతో కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో మంచి ఆదరణ వచ్చిందని, ఇప్పుడు టీపీసీసీ కమిటీల నియామకంతో కేడర్‌లో మరింత జోష్ వచ్చిందని వ్యాఖ్యానించారు. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, సీఎం రేవంత్‌రెడ్డిల నాయకత్వంలో ఇటు పార్టీ, అటు ప్రభుత్వం సమన్వయంతో ముందుకెళ్తున్నాయని స్పష్టం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. తనను ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు ఏఐసీసీ, టీపీసీసీ పెద్దలకు దయాకర్ కృతజ్ఞతలు తెలిపారు.

చేనేత సంఘాలకు ఎన్నికలెప్పుడు?

ఏడేళ్లుగా పర్సన్ ఇన్‌చార్జ్‌లతో కొనసాగింపు

రాష్ట్రవ్యాప్తంగా 375 సంఘాలు



మగ్గంపై వస్త్రం నేస్తున్న చేనేత కార్మికుడు

సాక్షి, యాదాద్రి: చేనేత వృత్తిని బలోపేతం చేయడానికి ఏర్పాటు చేసిన సహకార సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. చేనేత సహకార సంఘాల ఎన్నికలపై ప్రభుత్వం స్పందించడం లేదు. 2013లో జరిగిన ఎన్నికల పదవీ కాలం 2018లో ముగిసింది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎన్నికలు నిర్వహించలేదు. చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి వృత్తి పరిరక్షణకు రాష్ట్ర స్థాయిలో ఏర్పాటైన 'టెస్కో' పాలకవర్గం ఉనికిలో లేకుండా పోయింది. క్షేత్ర స్థాయిలో చేనేత వృత్తిదారులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు అవసరమైన చేనేత సంఘాలు లేవు. దీంతో రాష్ట్ర స్థాయిలో సైతం పాలకవర్గం లేక సమస్యలు ఎక్కడికక్కడ పెండింగ్‌లో ఉన్నాయి. గత ప్రభుత్వం టెస్కోకు ప్రత్యామ్నాయంగా ఏర్పాటు చేసిన తెలంగాణ హ్యాండ్లూమ్ కార్పొరేషన్, పవర్‌లూమ్ కార్పొరేషన్‌లు కేవలం చైర్మన్ల నియామకానికే పరిమితమయ్యాయి. గత ప్రభుత్వం జియో ట్యాగింగ్, త్రిఫ్ట్ ఫండ్, చేనేత బీమా, నేతన్నకు చేయూత వంటి పథకాలను అమలు చేసినా అవి అందరికీ అందడం లేదు.

ఆరు నెలలకోసారి పొడిగింపు

నూలు, సిల్క్, మరమగ్గాలు, ఉన్ని పారిశ్రామిక సహకార సంఘాలు రాష్ట్రవ్యాప్తంగా 375 వరకు ఉన్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోనే 85 సహకార సంఘాలున్నాయి. వీటి పాలక వర్గాలకు చివరిగా 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించారు. ఆ పాలక వర్గాల పదవీ కాలం 2018 ఫిబ్రవరి 9తో ముగిసింది. నిబంధనల ప్రకారం ఎన్నికలు నిర్వహించాలి. కానీ, పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించిన ప్రభుత్వం ఆరునెలలకోసారి పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తున్నారు. అయితే అప్పట్లో ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం ఓటరు జాబితాలను సిద్ధం చేసింది. 2018లోనే అన్ని చేనేత సహకార సంఘాల్లో ఓటు హక్కుకు అర్హత ఉన్న సభ్యుల జాబితాలను చేనేత, జౌళి శాఖ అధికారులు సిద్ధం చేశారు. కానీ, గత ప్రభుత్వంలో ఎన్నికలు జరగలేదు.

పాలక వర్గాల్లేక..

ప్రభుత్వం అమలు చేస్తున్న చేనేత సంక్షేమ పథకాలు సొసైటీల ద్వారా అందించడానికి అవకాశం ఉంటుంది. బాధ్యత కలిగిన పాలకవర్గ సభ్యులు చేనేత సమస్యలను, ప్రభుత్వం ఇచ్చే క్యాష్ క్రెడిట్‌తో సభ్యులకు ఉపాధి కల్పిస్తారు. పాలకవర్గాలు లేకుండా పోవడంతో పర్సన్ ఇన్‌చార్జ్‌లు పూర్తిస్థాయిలో బాధ్యతలను నిర్వహించలేకపోతున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో 45 సహకార సంఘాలు ఉండగా.. కేవలం గుండాల, భువనగిరి, పోచంపల్లి, నారాయణపురం చౌటుప్పల్, కొయ్యలగూడెం, కుంట్లగూడెం, సిరిపురం సహకార సంఘాలు పనిచేస్తున్నాయి. వీటికి మాత్రమే క్యాష్ క్రెడిట్ మంజూరైంది.

టెస్కో పాలక వర్గం ఎప్పుడు..

చేనేత వృత్తిదారుల ఉత్పత్తుల క్రయ విక్రయాల కోసం ఏర్పాటు చేసిన ఆప్కో.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 'టెస్కో'గా అవతరించింది. టెస్కోకు ఇంత వరకు పాలక వర్గం లేదు. సహకార సంఘాల ఎన్నికలు జరిగితే ప్రతి జిల్లా నుంచి ఒక డైరెక్టర్‌ను ఎన్నుకొని వారిలోంచి రాష్ట్రస్థాయి చైర్మన్, వైస్ చైర్మన్‌తోపాటు ప్రతి జిల్లా డైరెక్టరు పాలకవర్గ సభ్యులుగా ఉండేవారు. ప్రస్తుతం పాలకవర్గాలు లేవు. దీంతో చేనేత సమాజంలో రాజకీయంగా ఎదగాలనుకున్న వారికి సైతం నిరాశే మిగులుతోంది. పాలకవర్గం లేకపోవడంతో అధికారుల చేతిలో పాలన కొనసాగుతోంది. పెరిగిన ముడిసరుకుల ధరలు, పేటెంట్ సమస్యలు, టై అండ్ డై డూప్లికేట్ చీరల తయారీ, ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలకు ఇచ్చే పరిహారం, జియో ట్యాగింగ్ వంటి సమస్యలు రోజురోజుకు పెరుగుతున్నాయి.

పథకాల పర్యవేక్షణకు పాలకవర్గం

కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఎన్నికలు నిర్వహించాలని చేనేత వృత్తిదారులు కోరుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని 85 సొసైటీల్లో 32 వేల మంది కార్మికులు ఉన్నారు. వీరు తయారుచేసే వస్త్రాల కొనుగోలు, చనిపోయిన చేనేత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించడం, చేనేత సంక్షేమ పథకాలైన తెలంగాణ నేతన్నకు పొదుపు పథకం, తెలంగాణ నేతన్నకు భద్రత, తెలంగాణ నేతన్న భరోసా, క్యాష్ క్రెడిట్, బ్లాక్ లెవల్ క్లస్టర్ల పనితీరు అమలు వంటి పథకాలను ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తోంది. సహకార సంఘాల పాలకవర్గాలు లేకపోవడంతో పథకాల అమలు పక్కదారి పట్టిందన్న విమర్శలు ఉన్నాయి.

కలువల సోయగం

చెరువంతా తనదే అన్నట్లు కలువపూల సోయగం ప్రకృతిని శోభాయమానం చేసింది. నీళ్లలో పుట్టినా.. నీటి బిందువును దరిచేరనీయని ఆకులన్నీ చెరువును ముంచెత్తాయి.. పెద్దపల్లి జిల్లా ధర్మారం శివారులో కలువలతో కనువిందు చేస్తున్న ఓ చెరువు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి



మాసబ్‌ట్యాంక్ సంక్షేమ భవన్‌లోని ట్రైబల్ మ్యూజియం ఆవరణలో కొత్తగా నిర్మించిన గిరిజన కెఫెటేరియా



సాగుబడి

మృగశిర కార్తె:
జూన్ 8 నుంచి

ఇంగువ.. మన ఆహార సంస్కృతితో విడదీయరాని అనుబంధం ఉన్న సుగంధ ద్రవ్యం. భారతీయ వంటకాల్లో ఇంగువకు విశిష్ట స్థానం ఉంది. ఏ వంటకంలో అయినా చిటికెడు వేస్తే చాలు. అతి తక్కువ పరిమాణంలో వినియోగించినా అత్యంత ప్రభావశీలతను చూపే విశిష్ట ద్రవ్యం. ఇది కూడా ఒక మొక్క నుంచే వస్తుంది. వేలకొలదీ పంటల జీవ వైవిధ్యానికి ఆలవాలమైన భారతదేశంలో ఇంగువ పంట మాత్రం లేదంటే ఆశ్చర్యం కలుగుతుంది. ఇది నిజం. ప్రతి ఏటా విదేశాల నుంచి దిగుమతి చేసుకుంటూ ఉన్నాం. 2022-23లో 1,442 టన్నుల (విలువ రూ. 1,504 కోట్లు) ఇంగువను దిగుమతి చేసుకుంటున్నాం. అయితే, సరికొత్త కబురేమిటంటే.. శీతల ఎడారుల్లో పండే ఈ పంటను ఇప్పుడు మన దేశంలోనూ పండించటం ప్రారంభించాం. భారతీయ ఇంగువ పంట సాగు చరిత్రలో 2025 మే 28 ఒక మైలురాయి. విదేశాల నుంచి విత్తనాలు తెప్పించి, మన దేశపు వాతావరణానికి మచ్చిక చేసుకొని, సాగు చేయటంలో విజయం సాధించినట్లు కేంద్ర ప్రభుత్వ సంస్థ సిఎస్ఐఆర్ అధికారికంగా ప్రకటించిన రోజిది. అన్నట్లు.. వంటకాల్లోనే కాదు, ఔషధంగానూ.. పంటలను ఆశించే తెగుళ్ల నివారణకూ ఇంగువ మందే! భారతీయ ఇంగువ పంటకు శుభారంభం జరిగిన సందర్భంగా ఆ విశేషాలేమిటో తెలుసుకుందాం..

ఇంగువ పండిందోచ్!



మనం వాడుతున్న ఇంగువ శాస్త్రీయ నామం 'ఫెరుల అస్స-ఫోటిడ'. ఇంగువ సాధారణ వాతావరణంలో పండదు. అతిశీతల ఎడారి ప్రాంతాల్లో పండుతుంది. ఆఫ్ఘనిస్తాన్, ఉజ్బెకిస్తాన్, ఇరాన్ దేశాల నుంచి మనం దిగుమతి చేసుకుంటున్నాం. ఇప్పుడు హిమాచల్‌ప్రదేశ్‌లో సాగు చేయటం ప్రారంభమైంది. కేంద్ర ప్రభుత్వ సంస్థ సిఎస్ఐఆర్‌కు అనుబంధంగా ఉన్న ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ బయోరిసోర్స్ సెంటర్ (ఐహెచ్‌బిటి)లోని శాస్త్రవేత్తలు ఐదేళ్ల శ్రమించి ఇంగువ పంటను ఎట్టకేలకు మచ్చిక చేసుకున్నారు. ఈ విషయాన్ని మే 28న ప్రకటించారు. ఐహెచ్‌బిటి పాలంపూర్ క్యాంపస్‌లో ఇంగువ విత్తనోత్పత్తి కేంద్రాన్ని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా మంత్రి డా. జితేంద్ర సింగ్ ఈ ఏడాది ఫిబ్రవరి 26న ప్రారంభించారు. మొదటి విడత ఇంగువ మొక్కల నుంచి విత్తనోత్పత్తి ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో, ఇక మన దేశంలో ఈ పంట పండించగలం అని శాస్త్రవేత్తలు ప్రకటించారు.



ఫలించిన ఐదేళ్ల శ్రమ

ఐహెచ్‌బిటి శాస్త్రవేత్తలు 2018లో తొలుత ఆఫ్ఘనిస్తాన్, ఇరాన్ దేశాల నుంచి ఇంగువ మొక్క విత్తనాలను అధికారికంగా జాతీయ మొక్కల జన్యు వనరుల సంస్థ (ఐసిఎఆర్-ఎన్‌బిపిజిఆర్) ద్వారా క్వారంటైన్ వ్యవస్థ ద్వారా దిగుమతి చేసుకున్నారు. ఆ విత్తనాలను ప్రత్యేక నియంత్రిత వాతావరణంలో సాగు చేసి, వాటి ద్వారా ప్రమాదకరమైన చీడపీడలేవీ దిగుమతి కావటం లేదని నిర్ధారణ అయిన తర్వాతే విత్తనాలను మన వాతావరణంలోకి ప్రవేశపెడతారు. ఈ ప్రక్రియ పూర్తి చేసిన తర్వాత టిష్యూకల్చర్ పద్ధతిలో ఇంగువ మొక్కలను అభివృద్ధి చేశారు. ఈ ప్రక్రియ మొత్తానికీ ఐదేళ్ల సమయం పట్టింది.

మహాభారత కాలంలోనే...

ఇంగువ ప్రస్తావన ఆయుర్వేద గ్రంథాలతో పాటు, మహాభారతం వంటి పురాతన గ్రంథాల్లోనే ఉంది. ఇంద్రియాలను, మానవ చేతనను శుద్ధి చేయటానికి ఇంగువను వాడేవారు. కడుపు నొప్పి, అజీర్తి నివారణకు.. వంటకం రుచిని పెంపొందించటం కోసం ఇంగువను ఉపయోగపడుతుందని చరక సంహిత చెబుతోంది. పిప్పాలడ సంహిత, పాణిని రచనల్లోనూ ఇంగువ ఉనికి ఉంది.

-4 డిగ్రీల నుంచి 40 డిగ్రీల వరకు

అతి తక్కువ వర్షపాతం పడే అతి శీతల ప్రాంతాల్లో ఇంగువ మొక్క పెరుగుతుంది. ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, మధ్య ఆసియా ప్రాంతాల్లో అనాదిగా సాగవుతోంది. నీరు నిలవని, తేమ తక్కువగా ఉండే ఇసుక నేలల్లో పెరుగుతుంది. ఏడాదికి 200 ఎం.ఎం. కన్నా తక్కువ వర్షపాతం ఉండాలి. 10-20 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రత నప్పుతుంది. 40 డిగ్రీల ఉష్ణోగ్రత వరకు తట్టుకుంటుంది. శీతాకాలంలో -4 డిగ్రీల చలిని కూడా తట్టుకుంటుంది. అతిశీతల, అతి వేడి వాతావరణ పరిస్థితుల్లో ఇంగువ మొక్క నిద్రావస్థకు వెళ్లిపోతుంది. వాతావరణం అనుకూలించాక మళ్లీ చిగురిస్తుంది. అందుకే హిమాచల్‌ప్రదేశ్‌లోని లహాల్-స్పిటి జిల్లాల్లో ఈ పంట సాగుపై శాస్త్రవేత్తలు ఐదేళ్లుగా చేసిన ప్రయోగాలు ఫలించాయి.

ఇంగువ మొక్కకు తల్లి వేరు నేలలోపలికి వేరూనుకుంటుంది. మందపాటి ఆ వేరు నుంచి, దుంప నుంచి సేకరించిన జిగురు వంటి పదార్థాన్ని సేకరిస్తారు. దాన్ని ఎండబెట్టి, ప్రాసెస్ చేస్తే.. జిగురు పరిమాణంలో 40-64% మేరకు ఇంగువ వస్తుంది. ఔషధంగా వాడే ఇంగువ వేరు. వంటకు వాడే ఇంగువ వేరు. ఔషధంగా వాడే ఇంగువనే పంటలపై తెగుళ్ల నివారణకూ వాడుతుంటారు. ఇంగువ మొక్క పెరిగి పూత దశకు ఎదగడానికి ఐదేళ్ల సమయం పడుతుంది.

2018లో విదేశాల నుంచి తెచ్చిన విత్తనాలను క్వారంటైన్ లాంఛనాలన్నీ పూర్తి అయ్యాక 2020 అక్టోబర్ 15న మన దేశ వాతావరణంలో నాటారు. హిమాచల్‌ప్రదేశ్‌లోని లాహోల్ లోయలోని క్వారింగ్ గ్రామంలో మొదట నాటడం ద్వారా భారతీయ ఇంగువ పంట సాగు ప్రారంభం అయ్యింది. ఐహెచ్‌బిటి పాలంపూర్‌లో ఏర్పాటైన జెర్మ్‌ప్లాజమ్ రీసోర్స్ సెంటర్‌లో ఇంగువ విత్తనోత్పత్తి, శిక్షణ, ఇంగువ ఉత్పత్తి తదితర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇక్కడే టిష్యూ కల్చర్ యూనిట్ కూడా ఏర్పాటు కావటంతో విస్తృతంగా ఇంగువ మొక్కల ఉత్పత్తి ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో ఈ పంట సాగుకు అనువైన ప్రాంతాలను గుర్తించడానికి జీపిఎస్ డేటా ఆధారంగా పెద్ద కసరత్తే జరిగింది. ఎకలాజికల్ నిచే మోడలింగ్ పద్ధతిలో అనువైన స్థలాలను గుర్తించటం, సాగు చేయటంలో శాస్త్రవేత్తలు విజయం సాధించారు. వారి ఐదేళ్ల కృషికి గుర్తింపుగా గత నెల 28న అధికారికంగా ఇంగువ పంటను మన నేలలకు అలవాటు చేసి, విత్తనోత్పత్తి ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.



అతిశీతల ఎడారి ప్రాంతాల్లో పెరిగే ఇంగువ మొక్కల్ని సముద్రతలానికి 1,300 మీటర్ల ఎత్తులో ఉండే పాలంపూర్ వంటి ప్రాంతాల్లో సాగు చేయటంలో విజయం సాధించటమే మనం సాధించిన ఘన విజయంగా శాస్త్రవేత్తలు సంబరంగా చెబుతున్నారు. సుసంపన్నమైన వ్యవసాయక జీవవైవిధ్యానికి ఒకానొక కేంద్ర బిందువైన భారతావని సిగలో మరో కొత్త పంట సరికొత్త ఘుమఘుమలతో చేరటం మనందరికీ సంతోషదాయకం. ఆ విధంగా హిమాచల్ రైతులు పండించే ఇంగువను ముమ్ముందు మనం రుచి చూడబోతున్నామన్నమాట!

బ్యాంకు నుండి ఆధునిక సేద్యంలోకి..!



చీకూ చింతా లేని మంచి బ్యాంకు ఉద్యోగం వదిలి ఆధునిక వ్యవసాయాన్ని చేపట్టాలంటే చక్కటి ప్రణాళికతో పాటు గుండెలు నిండుగా ధైర్యం, పట్టుదల, లక్ష్యసాధనకు అవసరమైన వనరులను సమకూర్చుకొని గొప్ప ఫలితాలు సాధించే తెలివితేటలు ఉండాలి. మహారాష్ట్రలోని పుణేకు చెందిన సంకేత్ మెహతాకు అదృష్టవశాత్తూ ఇవన్నీ ఉన్నాయి. బ్యాంకు ఉద్యోగం వదిలేసి రసాయనిక పురుగుమందుల అవసరం లేని ఆధునిక హైడ్రోపోనిక్ వ్యవసాయంలోకి దిగారు. ఆరోగ్యదాయకమైన ఆహారం కోసం వెదుకుతూ పురుగుమందుల్లేని ఆహారోత్పత్తి వైపు దృష్టి సారించారు. పూర్తి ఆర్గానిక్ కాకపోయినా రసాయనిక పురుగుమందుల్లేకుండా హైడ్రోపోనిక్స్ పద్ధతుల్లో కూరగాయ, ఆకుకూర పంటలు పండించి విక్రయించటం ద్వారా మంచి ఆహారాన్ని అందిస్తున్నామన్న తృప్తితో పాటు మంచి ఆదాయం కూడా వస్తుందని సంకేత్ భావించారు. చాలా కాలం నుంచి తెలిసిన గణేష్ నికం అనే వ్యక్తితో కలిసి న్యూట్రిఫ్రెష్ పేరిట స్టార్టప్‌ను ఆరేళ్ల క్రితం నెలకొల్పి చక్కని ఆదాయం పొందుతున్నారు.

హైడ్రోపోనిక్స్ అంటే పోషకాలతో కూడిన నీటిలో, నియంత్రిత వాతావరణంలో (అంటే పాలీహౌస్‌లలో) పంటలు పండించటం. ఈ పద్ధతిలో కూరగాయలు, సాధారణ ఆకుకూరలతో పాటు సలాడ్లలో నగరవాసులు తినే లెట్యూస్ వంటి విదేశీ జాతుల ఆకుకూరలు మొత్తం 42 రకాలను పెంచి, విక్రయించటం ద్వారా సంకేత్, గణేష్ మంచి ఆదాయం పొందుతున్నారు. పుణే ప్రాంతంలో చల్లని వాతావరణం పాలీహౌస్‌లలో హైడ్రోపోనిక్ సేద్యానికి అనువుగా ఉండటంతో ఈ యువకుల కలల పంట పండుతోంది. కాసులు కురిపిస్తోంది.







పురుగుమందులు వాడకుండా పండించటమే కాదు, పంట కోతలో ప్రత్యేక జాగ్రత్త తీసుకోవటం, కోసిన 24 గంటల్లోగా వినియోగదారుల ఇళ్లకు చేర్చటం వీరి విజయరహస్యం. సాధారణ గ్రామీణ మహిళలకు పంటల కోతలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి పనులు చేయిస్తున్నారు. ఆ ఫామ్‌లో పనిచేసేవారిలో 80% వీరే. దేశంలోని అనేక నగరాల్లో పురుగుమందుల్లేని ఆహారం కావాలనుకునే 40 వేల ఇళ్లకు న్యూట్రిఫ్రెష్ హైడ్రోపోనిక్ కూరగాయలు,ఆకుకూరలు, ఔషధ మొక్కల్ని అనుకున్న సమయానికి సరఫరా చేయగలుగుతోంది. నమ్మిన పనిని త్రికరణశుద్ధిగా చేస్తే ఫలితాలు ఎలా ఉంటాయనేదానికి ఈ స్టార్టప్ పనితీరును నిదర్శనంగా చెప్పొచ్చు. శుద్ధిచేసిన నీటిని పంటల సాగుకు వాడటం, మొక్క పెట్టటం, పంట కోత, ప్యాకింగ్ వంటి పనులన్నీ ఖచ్చితత్వంతో నిర్వహిస్తూ నాణ్యమైన ఉత్పత్తుల్ని అందిస్తున్నారు.



పాలీహౌస్‌లలో పెంచే లెట్యూస్, బసిల్ నుంచి వ్యవసాయ క్షేత్రంలో పెంచే అవొకాడోలు, బ్లూబెర్రీల వరకు వినియోగదారులకు నేరుగా అమ్మటంతో పాటు పెద్ద రిటైలర్లు, ఫుడ్ డెలివరీ సంస్థలకు కూడా విక్రయిస్తున్నారు. ఆప్, వెబ్‌సైట్, గూగుల్ ఫామ్స్ ద్వారా విక్రయించటం ద్వారా నగరవాసుల ఆదరణ పొందుతున్నారు. నాణ్యమైన సరుకును ఇష్టపడే వినియోగదారులు కొంచెం ఎక్కువ ధర చెల్లించడానికి వెనుకాడటం లేదని ఈ సంస్థ పురోగతిని బట్టి అర్థం చేసుకోవచ్చు.

మామిడి మొక్కలు ఉచితం!



మామిడి సీజన్‌లో బోలెడన్ని మామిడి విత్తనాలు కనిపిస్తాయి. అయితే, వాటిని వృథాగా పోనీయకుండా రైతులకు ఉపయోగపడేలా సద్వినియోగం చేద్దామని కోల్‌కత్తా నగరానికి చెందిన డాక్టర్ జస్మిత్ సింగ్ అరోరా నిర్ణయించుకొని ఆ దిశగా స్ఫూర్తిదాయక కృషి చేస్తున్నారు. నష్టదాయకంగా మారిన వరి వంటి పంటలను ఏటేటా రసాయనిక పద్ధతుల్లో పండించి నష్టపోతున్న రైతులు దీర్ఘకాలిక పండ్ల తోటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించుకుంటే జీవితం బాగుపడుతుందని ఆయన సూచిస్తున్నారు.

డా. అరోరా వైద్యవృత్తి నిపుణుడు అయినప్పటికీ వ్యాపారవేత్తగా మారారు. ఐటి, ఫార్మా రంగాల్లో మూడు దశాబ్దాలుగా కృషి చేసి ఉన్నత స్థాయికి ఎదిగారు. 'గుట్లీ మాన్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచారు. ఎంత ఎదిగినా మనసులో ఏదో వెలితి. ప్రజలకు, పర్యావరణానికి ఉపయోగపడే పనులు చేస్తే ఈ వెలితి తీరుతుందని భావించారు. గ్రామీణ ప్రాంతాల్లో పర్యటిస్తూ వృద్ధ రైతులు దశాబ్దాలుగా వరి సాగు చేస్తూ నానా బాధలు పడుతుండటం గమనించారు. వరి సాగుతో చాలీ చాలని ఆదాయంతో యాతన పడేకన్నా పండ్ల సాగు చేపడితే రైతుల భవిష్యత్తు బాగుంటుందని భావించారు. 2019 నుంచి అనేక రకాల పండ్ల మొక్కలు పెంచి రైతులకు ఉచితంగా ఇస్తున్నారు. ఆ క్రమంలో ఎక్కువ ఆదాయం వచ్చే మామిడి మొక్కలను పెంచి, రైతులకు పంచిపెట్టాలని గత ఏడాది తలపెట్టారు. మామిడి పండ్లు తింటున్నారా అయితే విత్తనాలు మాకివ్వండి అని కోరుతూ గత ఏడాది అతని కుమార్తె ఒక వీడియో చేసి, సోషల్ మీడియాలో షేర్ చేశారు. 'ఆ వీడియో వైరల్ అయ్యింది. అనూహ్యమైన ఒక అద్భుతమే జరిగింది. దేశం నలుమూలల నుంచి ఏకంగా 11 లక్షల విత్తనాలు వచ్చిపడ్డాయి! ఆ దెబ్బకు ఆయనకు 'గుట్లీస్ మాన్' అని పేరు పడిపోయింది. గుట్లీస్ అంటే మామిడి విత్తనాలు అని అర్థం. ఈ విత్తనాలతో నాలుగైదు అడుగుల చెట్లు పెంచి, లంగ్డ లేదా గులాబ్ ఖాస్ వంటి రకాలతో గ్రాఫ్టింగ్ చేసి రైతులకు పంచుతాను అంటున్నారు డా. జస్మిత్ సింగ్ అరోరా.

బిజినెస్ రీల్

బ్రాండ్ బలోపేతానికి స్కోడా ఆటో ప్రణాళికలు



ముంబై: చెక్ వాహన సంస్థ స్కోడా ఆటోకు ఈ ఏడాది(2025) కీలక మైలురాయిగా నిలవనుంది. ప్రపంచవ్యాప్తంగా 130 ఏళ్లు, భారత్‌లో 25 ఏళ్ల ప్రయాణాన్ని పూర్తి చేయనుంది. ఈ సందర్భంగా కస్టమర్లకు మరింత చేరవయ్యేలా, భారత్ మార్కెట్‌లో దూసుకెళ్లే దిశగా ఉత్పత్తి, నెట్‌వర్క్, కస్టమర్ కేంద్రీకృత ప్రణాళికలు ప్రకటించింది. స్కోడా ఆటో ఇండియా బ్రాండ్ డైరెక్టర్ అశిష్ గుప్తా మాట్లాడుతూ.. ''యూరప్ వెలుపల స్కోడా ఆటోకు భారత్ అత్యంత కీలకమైన మార్కెట్. దూరదృష్టితో భవిష్యత్తుకు సరిపోయే ఉత్పత్తులను కస్టమర్లకు అందిస్తున్నాము. వ్యూహాత్మకంగా నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్నాము. స్కోడా వారసత్వ సంపదలైన నాణ్యత, భద్రత, విలువలను మరింత బలోపేతం చేస్తున్నాము. బ్రాండ్‌ను గణనీయంగా బలోపేతం చేసి ఈ ఏడాది భారత్‌లో స్కోడా పాతికేళ్ల ప్రయాణ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకుంటాము'' అన్నారు.

హైదరాబాద్‌లో హైల్యాండ్ కార్యాలయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కంటెంట్ ఇన్నోవేషన్ క్లౌడ్ సంస్థ హైల్యాండ్ తాజాగా హైదరాబాద్‌లో తమ కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. హైదరాబాద్‌లో అమెరికా కాన్సుల్ జనరల్ జెన్నిఫర్ లార్సన్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇందులో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ ప్రొఫెషనల్స్, సర్వీసెస్ స్పెషలిస్టులు, కస్టమర్ సక్సెస్ కోఆర్డినేటర్లు, క్లౌడ్. టెక్నికల్ సపోర్ట్ నిపుణులను నియమించుకోనున్నట్లు సంస్థ



సీఈవో టిమ్ మెకింటైర్ తెలిపారు. కార్యకలాపాలను క్రమబద్ధీకరించుకోవడానికి, ఉత్పాదకత పెంచుకోవడానికి కస్టమర్లకు అవసరమైన అధునాతన సాధనాలను అందించేందుకు ఇది తోడ్పడగలదని వివరించారు. కంపెనీకి ఇప్పటికే కోల్‌కతాలో ఒక కార్యాలయం ఉంది.

ఐవోబీ లొకేషన్ సెర్చ్ సర్వీసు

చెన్నై: ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ (ఐవోబీ) కస్టమర్ల కోసం సౌకర్యవంతమైన 'లొకేట్ ఐవోబీ' సదుపాయాన్ని తీసుకొచ్చింది.



దీని ద్వారా సమీపంలో ఐవోబీ శాఖ, ఏటీఎం ఎక్కడ ఉన్నదీ తెలుసుకోవచ్చు. ఐవోబీ డాట్ ఇన్ పోర్టల్ లేదా లొకేట్.జాబ్.ఇన్ పోర్టల్ సాయంతో ఐవోబీ శాఖ, ఏటీఎం లొకేషన్‌ను తెలుసుకోవచ్చని బ్యాంక్ ప్రకటించింది. వెబ్‌సైట్ నుంచే నేరుగా ఐవోబీ శాఖకు కాల్ సదుపాయం వినియోగించుకోవచ్చని తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

11-6-2025

విశాఖ	550-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	550-00
రిటైల్ ధర (డజను)	78.00
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
GRASIM	2,704.00	3.66
TECHM	1,612.90	2.14
DRREDDY	1,346.80	2.1
TATAMOTORS	732.7	2.08
ADANIENT	2,618.00	1.39

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
TRENT	5,816.00	-1.65
MARUTI	12,472.00	-1.31
BAJFINANCE	9,490.00	-1.22
TATASTEEL	155.65	-1.06
BAJAJFINSV	1,997.50	-0.99

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	9,436
ఎన్ఎస్ఈ	1,15,863
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,29,951
ఎఫ్ఐఐ	+ 2,302
డీఐఐ	+ 1,113

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	65.33 (రాత్రి 11.30కు)	$ 65.29 (క్రితం ముగింపు)
బ్రెంట్	67.20 (రాత్రి 11.30కు)	$ 67.04 (క్రితం ముగింపు)

ఈక్విటీ ఫండ్స్ డీలా..!



గణనీయంగా తగ్గిన పెట్టుబడులు

- మే నెలలో రూ.19,013 కోట్లు
- ఏప్రిల్ నెల కంటే 22 శాతం తక్కువ
- చెక్కుచెదరని సిప్ పెట్టుబడులు

న్యూఢిల్లీ: ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లోకి పెట్టుబడుల రాక మే నెలలో గణనీయంగా తగ్గింది. 13 నెలల కనిష్ట స్థాయిలో రూ.19,013 కోట్లకు పరిమితమయ్యాయి. ముఖ్యంగా లార్జ్‌క్యాప్, మిడ్ క్యాప్, స్మాల్‌క్యాప్ పథకాల్లో పెట్టుబడుల రాక తగ్గింది. ఈ ఏడాది ఏప్రిల్ నెలలో ఈక్విటీల్లోకి వచ్చిన రూ.24,269 కోట్ల పెట్టుబడలతో పోల్చి చూస్తే మే నెలలో పెట్టుబడుల రాక 22 శాతం క్షీణించింది. ఈక్విటీ పథకాల్లోకి పెట్టుబడులు క్షీణించడం వరుసగా ఐదో నెలలోనూ చోటు చేసుకుంది. సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్) ద్వారా ఇన్వెస్టర్లు మ్యూచువల్ ఫండ్స్ పథకాల్లో చేసే పెట్టుబడులు బలంగా నమోదయ్యాయి. ఏప్రిల్‌లో సిప్ పెట్టుబడులు రూ.26,632 కోట్లుగా ఉంటే, మే నెలలో రూ.26,688 కోట్లకు పెరిగాయి. ఈ మేరకు మే నెల గణాంకాలను మ్యూచువల్ ఫండ్స్ సంస్థల అసోసియేషన్ (యాంఫి) విడుదల చేసింది.


- మ్యూచువల్ ఫండ్స్ పరిశ్రమ వ్యాప్తంగా అన్ని రకాల పథకాల్లోకి కలిపి (ఈక్విటీ, ఈక్విటీయేతర) మే నెలలో రూ.29,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఏప్రిల్‌లో ఇలా వచ్చిన పెట్టుబడుల మొత్తం రూ.2.77 లక్షల కోట్లుగా ఉంది.
- మే చివరికి మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ రూ.72.2 లక్షల కోట్లకు చేరింది. ఏప్రిల్ చివరికి ఇది రూ.70 లక్షల కోట్లుగా ఉంది.
- ఈక్విటీ విభాగంలో ఫ్లెక్సీక్యాప్ ఫండ్స్‌లోకి అత్యధికంగా రూ.3,841 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.
- లార్జ్‌క్యాప్ పథకాలు రూ.1,250 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. ఏప్రిల్‌లో వచ్చిన రూ.2,671 కోట్లతో పోల్చితే సగంపైనే తగ్గాయి.
- మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి ఏప్రిల్‌లో రూ.3,313 కోట్లు రాగా, మే నెలలో రూ.2,808 కోట్లకు పరిమితమయ్యాయి.
- స్మాల్‌క్యాప్ పథకాలు రూ.3,214 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి. ఏప్రిల్‌లో ఈ విభాగంలోకి వచ్చిన పెట్టుబడులు రూ.3,999 కోట్లుగా ఉన్నాయి.
- లార్జ్ అండ్ మిడ్‌క్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,656 కోట్లు, మల్టీక్యాప్ ఫండ్స్‌లోకి రూ.2,518 కోట్లు, సెక్టోరల్/థీమ్యాటిక్ ఫండ్స్‌లోకి రూ.5,712 కోట్ల చొప్పున పెట్టుబడులు వచ్చాయి.
- ఈఎల్ఎస్ఎస్ ఫండ్స్ నుంచి రూ.678 కోట్లు, వ్యాల్యూ/కాంట్రా ఫండ్స్ నుంచి రూ.92 కోట్ల పెట్టుబడులను ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారు.
- ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్‌ల్లోకి 73 శాతం తక్కువగా రూ.5,525 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఏప్రిల్‌లో ఈ రెండు ప్యాసివ్ ఫండ్స్ విభాగాల్లోకి రూ.20,229 కోట్ల పెట్టుబడులు రావడం గమనార్హం.
- మే నెలలో మొత్తం 19 ఎన్ఎఫ్‌వోలు మార్కెట్లోకి రాగా, ఇవి ఉమ్మడిగా రూ.4,170 కోట్లను సమీకరించాయి.
- గోల్డ్ ఈటీఎఫ్‌ల్లోకి రూ.292 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఏప్రిల్‌లో గోల్డ్ ఈటీఎఫ్‌ల నుంచి ఇన్వెస్టర్లు రూ.6 కోట్లను ఉపసంహరించుకున్నారు.
- డెట్ ఫండ్స్ నుంచి మే నెలలో నికరంగా రూ.15,908 కోట్ల పెట్టుబడులు బయటకు వెళ్లిపోయాయి. ఏప్రిల్ నెలలో ఇదే విభాగం రూ.2.2 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం గమనార్హం.
- డెట్‌లో కార్పొరేట్ బాండ్ ఫండ్స్ విభాగం రూ.11,983 కోట్లు, మనీ మార్కెట్ ఫండ్స్ రూ.11,223 కోట్ల చొప్పున మెరుగ్గా పెట్టుబడులను ఆకర్షించాయి.
- లిక్విడ్ ఫండ్స్ నుంచి రూ.40,205 కోట్లను ఇన్వెస్టర్లు వెనక్కి తీసుకున్నారు.
- ఈక్విటీ, డెట్‌లో పెట్టుబడులు పెట్టే హైబ్రిడ్ ఫండ్స్ 46 శాతం అధికంగా రూ.20,765 కోట్ల పెట్టుబడులను ఆకర్షించాయి.
- ఆర్బిట్రేజ్ ఫండ్స్‌లోకి రూ.15,702 కోట్ల పెట్టుబడులు వచ్చాయి.

రిస్క్ ధోరణి తగ్గింది..

''ఈక్విటీ ఫండ్స్‌లోకి పెట్టుబడులు తగ్గడం వెనుక ఎన్నో కారణాలున్నాయి. ముందటి నెలలతో పోల్చిచూస్తే మే నెలలో ఈక్విటీలు మంచి పనితీరు చూపించాయి. స్థిరీకరణ నేపథ్యంలో ఇన్వెస్టర్లు లాభాల స్వీకరణకు మొగ్గు చూపించి ఉంటారు. పాకిస్థాన్‌పై ఆపరేషన్ సిందూర్ అనంతరం భౌగోళిక ఉద్రిక్తతలు పెరగడం, అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణం పట్ల ఆందోళనలతో ఇన్వెస్టర్లలో రిస్క్ తీసుకునే సెంటిమెంట్ బలహీనపడి ఉంటుంది''అని ఐటీఐ మ్యూచువల్ ఫండ్ సీఈవో జతీందర్ పాల్ సింగ్ తెలిపారు. మార్నింగ్ స్టార్ రీసెర్చ్ మేనేజర్ హిమాన్షు శ్రీవాస్తవ సైతం ఇదే విధమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేవారు. అంతర్జాతీయంగా ఆర్థిక సవాళ్ల నేపథ్యంలో ఇన్వెస్టర్లు దేశీ మార్కెట్లో లాభాల స్వీకరణకు మొగ్గు చూపించి ఉంటారని పేర్కొన్నారు.

చిన్న ఎగుమతిదార్లకు కేంద్రం చేయూత

- కొత్త మార్కెట్లలో ఎంట్రీకి ప్రత్యేక పథకం యోచన
- మంత్రి పీయుష్ గోయల్ వెల్లడి



బెర్న్ (స్విట్జర్లాండ్): కొత్త మార్కెట్లలో కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడంలో లఘు, చిన్న, మధ్య తరహా ఎగుమతిదార్లకు (ఎంఎస్ఎంఈ) చేయూతనివ్వడంపై కేంద్రం దృష్టి పెడుతోంది. ఇందుకోసం ప్రత్యేక స్కీమును ప్రవేశపెట్టే యోచనలో ఉంది. స్విట్జర్లాండ్ పర్యటనలో భాగంగా భారతీయ వ్యాపార వర్గాల బృందంతో భేటీ అయిన సందర్భంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయుష్ గోయల్ ఈ విషయాలు తెలిపారు. 'ఏ ఎంఎస్ఎంఈ అయినా ప్రపంచంలో ఎక్కడైనా తమ ఉత్పత్తులను నమోదు చేయించుకోవడానికి ఖర్చు చేయాల్సి వస్తే, ఆ మొత్తం భారాన్ని ప్రభుత్వమే భరించే విధంగా ఒక స్కీమును ప్రవేశపెట్టే ఆలోచన ఉంది. ముఖ్యంగా కొత్త ఉత్పత్తులు, కొత్త మార్కెట్లు, కొత్త ఎగుమతిదార్లకు దీన్ని వర్తింపచేయొచ్చు' అని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే పలు దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏ) ఉండగా, మరిన్ని దేశాలతో కుదుర్చుకునే ప్రక్రియ వేగంగా ముందుకెళ్తోందని చెప్పారు. బడ్జెట్‌లో ప్రకటించిన ఎగుమతుల ప్రోత్సాహక మిషన్‌లో (ఈపీఎం) మంత్రి పేర్కొన్న స్కీము భాగంగా ఉంటుందని అంచనా. దీనితో ఎంఎస్ఎంఈలు.. ఈ-కామర్స్ ఎగుమతిదార్లకు సులభతర రుణ పథకాలు, విదేశాల్లో వేర్‌హౌసింగ్ సదుపాయాలు, అంతర్జాతీయంగా బ్రాండింగ్ మొదలైన 12 అంశాల్లో సదరు సంస్థలకు మద్దతు లభిస్తుంది. 2023-24లో 778 బిలియన్ డాలర్లుగా ఉన్న ఎగుమతుల పరిమాణం 2024-25లో 825 బిలియన్ డాలర్లకు పెరిగింది. ఎగుమతుల్లో ఎంఎస్ఎంఈల వాటా 40 శాతం పైగా ఉంటోంది.

ఎస్‌పీఎంసీఐఎల్ త్వరలో నవరత్న హోదా!

పనితీరుపై ఆర్థిక మంత్రి ప్రశంసలు



న్యూఢిల్లీ: సెక్యూరిటీ ప్రింటింగ్ అండ్ మింటింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌పీఎంసీఐఎల్) పనితీరు భేషుగ్గా ఉందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశంసించారు. త్వరలోనే నవరత్న హోదాను దక్కించుకోగలదని ధీమా వ్యక్తం చేశారు. కరెన్సీ నోట్లు, నాణేల ముద్రణ తదితర కార్యకలాపాలు నిర్వహించే ఎస్‌పీఎంసీఐఎల్ కార్పొరేట్ ఆఫీసును ప్రారంభించిన సందర్భంగా ఆమె ఈ విషయాలు తెలిపారు. 2015లో పునర్వ్యవస్థీకరణ అనంతరం 2016-17లో కంపెనీ మొత్తం రుణాన్ని వడ్డీతో సహా చెల్లించేయడంతో పాటు పటిష్టమైన రాబడులు అందిస్తోందని మంత్రి పేర్కొన్నారు. కేంద్ర ఆర్థిక వ్యవహారాల విభాగంలో భాగమైన ఈ సంస్థకు ప్రస్తుతం షెడ్యూల్ 'ఏ' మినీరత్న కేటగిరీ-వన్ హోదా ఉంది. లాభాలు, నికర విలువ వంటి ఆర్థిక విషయాలతో పాటు నిర్దిష్ట అర్హతా ప్రమాణాలను బట్టి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలకు కేంద్రం మహారత్న, నవరత్న, మినీరత్న హోదాలు ఇస్తుంది. 2022-23లో ప్రభుత్వానికి రికార్డు స్థాయిలో రూ. 534 కోట్ల డివిడెండ్ చెల్లించిన కంపెనీ ఆ తర్వాత సంవత్సరంలో (2023-24) రూ. 364 కోట్లు అందించింది. 2024-25లో 1,200 కోట్ల బ్యాంక్ నోట్లు, 150 కోట్ల నాణేలు, 1.5 కోట్ల పాస్‌పోర్ట్ బుక్‌లెట్స్, 700 కోట్ల పైగా ఎక్సైజ్ అడ్హెసివ్ లేబుల్స్ మొదలైనవి కంపెనీ ఉత్పత్తి చేసింది. కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ స్వాధీనం చేసుకున్న పసిడిని శుద్ధి చేయడం ద్వారా 3.4 మెట్రిక్ టన్నుల బంగారాన్ని రిజర్వ్ బ్యాంక్‌కి బదలాయించింది. అలాగే, తిరుమల తిరుపతి దేవస్థానం, వైష్ణోదేవీ బోర్డు నుంచి వచ్చిన వెండి, బంగారాన్ని కూడా రిఫైన్ చేసింది.

డియల్ డిఫెన్స్‌తో ఆర్ఇన్‌ఫ్రా డీల్

- హెల్మెట్ రాచ్‌తో అనిల్ అంబానీ చర్చలు
- భాగస్వామ్య పటిష్టతపై ప్రత్యేక దృష్టి



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ సంస్థ రిలయన్స్ డిఫెన్స్ తాజాగా జర్మన్ ఆయుధ తయారీ కంపెనీ డియల్ డిఫెన్స్‌తో వ్యూహాత్మక సహకరా ఒప్పందాన్ని కుదుర్చుకుంది. దీంతో ఆధునిక ఆర్టిలరీ షెల్స్ తయారీని చేపట్టనుంది. ఈ భాగస్వామ్యం ద్వారా స్థానికంగా అత్యంత ఆధునిక వుల్కనో 155 ఎంఎం ప్రెసిషన్ గైడెడ్ మ్యునిషన్ సిస్టమ్(ఆర్టిలరీ షెల్స్)ను రూపొందించనున్నట్లు రిలయన్స్ డిఫెన్స్ ఒక ప్రకటనలో పేర్కొంది. ఇవి దేశీ సాయుధ దళాలకు ఉపయోగపడనున్నట్లు తెలియజేసింది. బిల్టిన్ ఈసీసీఎం సామర్థ్యాలతో రూపొందించనున్న 155 ఎంఎం టీటీఎంలు శత్రువుల ఎలక్ట్రానిక్ జామింగ్ ప్రయత్నాలను తప్పించుకోగలవని వివరించింది. 10 సెకన్లలోనే లక్ష్యాలను చేరుకోగలవని వెల్లడించింది. దేశీయంగా రక్షణ రంగ పరికరాల తయారీలో ప్రయివేట్ రంగ ముందడుగును తాజా భాగస్వామ్యం ప్రతిఫలిస్తున్నట్లు పేర్కొంది. తదుపరి తరం లేజర్, జీపీఎస్ గైడెడ్ టార్గెటింగ్ టెక్నాలజీతో ఈ ఆధునిక మ్యునిషన్ సిస్టమ్స్ రూపొందనున్నట్లు రిలయన్స్ డిఫెన్స్ తెలియజేసింది. 2019లోనే వ్యూహాత్మక భాగస్వామ్యానికి తెరతీసిన సంస్థల మధ్య మరింత అవగాహన కోసం డియల్ డిఫెన్స్ సీఈవో హెల్మట్ రాచ్‌తో రిలయన్స్(అడాగ్) గ్రూప్ వ్యవస్థాపకుడు అనిల్ డి.అంబానీ చర్చలు నిర్వహించినట్లు సంయుక్త ప్రకటనలో రెండు సంస్థలు తెలియజేశాయి. కాగా.. ఒప్పందంలో భాగంగా కొత్త హైటెక్ తయారీ ప్లాంటును మహారాష్ట్రలోని రత్నగిరిలోగల వటాడ్ పారిశ్రామికవాడలో ఏర్పాటు చేయనున్నట్లు రిలయన్స్ డిఫెన్స్ వెల్లడించింది. తద్వారా దేశీ సాయుధ దళాలకు అవసరమైన ఉత్పత్తులను అందించనున్నట్లు తెలియజేసింది. వార్షికంగా 2 లక్షల ఆర్టిలరీ షెల్స్, 10,000 టన్నుల పేలుడుపదార్థాలు, 2,000 టన్నుల ప్రొపెల్లంట్ తయారీ సామర్థ్యంతో ఈ ప్లాంటును నెలకొల్పనున్నట్లు వివరించింది.

ప్రీమియర్ ఎనర్జీస్‌లో వాటా విక్రయం

- డీల్ విలువ రూ. 2,629 కోట్లు
- 5.55 శాతం వాటా అమ్మకం

న్యూఢిల్లీ: ఓపెన్ మార్కెట్ లావాదేవీల ద్వారా సోలార్ ఫొటోవోల్టాయిక్ సెల్స్, మాడ్యూల్స్ తయారీ కంపెనీ ప్రీమియర్ ఎనర్జీస్‌లో 5.55 శాతం వాటాను యూఎస్ సంస్థ జీఈఎఫ్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ విక్రయించింది. కంపెనీలో 5.55 శాతం వాటాకు సమానమైన 2.5 కోట్ల షేర్లను బల్క్‌డీల్స్ ద్వారా అమ్మివేసింది. ఎన్ఎస్ఈ గణాంకాల ప్రకారం షేరుకి రూ. 1,051.6 సగటు ధరలో అనుబంధ సంస్థ సౌత్ ఏషియా గ్రోత్ ఫండ్ 2 హోల్డింగ్స్ ఎల్ఎల్‌సీ ద్వారా రూ. 2,629 కోట్లకు వాటాను విక్రయించింది.



తాజా లావాదేవీ తదుపరి ప్రీమియర్ ఎనర్జీస్‌లో సౌత్ ఏషియా గ్రోత్ ఫండ్ 2 హోల్డింగ్స్ వాటా 11.1 శాతం నుంచి 5.55 శాతానికి క్షీణించింది. కాగా.. వీటిలో 0.97 శాతం వాటాకు సమానమైన 43.55 లక్షల షేర్లను క్వాంట్ మ్యూచువల్ ఫండ్ కొనుగోలు చేసింది. ప్రేమ్‌జీ ఇన్వెస్ట్ సంస్థ పీఐ అపార్చునిటీస్ ఏఐఎఫ్ 33.28 లక్షల షేర్ల(0.74 శాతం వాటా)ను సొంతం చేసుకుంది. వెరసి వాటాల కొనుగోలుకి రెండు సంస్థలు సంయుక్తంగా రూ. 808 కోట్లు వెచ్చించాయి. ఇతర కొనుగోలుదారుల వివరాలు వెల్లడికాలేదు.

ఈ నేపథ్యంలో ప్రీమియర్ ఎనర్జీస్ షేరు ఎన్ఎస్ఈలో 2% బలపడి రూ. 1,083 వద్ద ముగిసింది.

ఐపీవో స్ట్రీట్

4 కంపెనీలు రెడీ

ఇటీవల తిరిగి కళకళలాడుతున్న ప్రైమరీ మార్కెట్ ప్రభావంతో పలు కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌వైపు చూస్తున్నాయి. విభిన్న పంపుల తయారీ కంపెనీ ఓస్వాల్ పంప్స్ ఐపీవో ఈ నెల 13న ప్రారంభంకానుండగా.. క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి 4 కంపెనీలు పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు తాజాగా అనుమతి పొందాయి. జాబితాలో కెంట్ ఆర్‌వో, కరమ్‌టరా ఇంజినీరింగ్, మంగళ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్, విద్యా వైర్స్ చేరాయి.



- జాబితాలో కెంట్ ఆర్‌వో సిస్టమ్స్
- కరమ్‌టరా ఇంజినీరింగ్, విద్యా వైర్స్
- మంగళ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్

న్యూఢిల్లీ: వాటర్ ప్యూరిఫయర్ కంపెనీ కెంట్ ఆర్‌వో సిస్టమ్స్‌తోపాటు.. ట్రాన్స్‌ఫార్మర్ల తయారీ కంపెనీ మంగళ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్, వైండింగ్, కండక్టివిటీ ప్రొడక్టుల కంపెనీ విద్యా వైర్స్, కరమ్‌టరా ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూకి రానున్నాయి. ఇందుకు సెబీ నుంచి తాజాగా అనుమతులు పొందాయి. ఈ 4 సంస్థలు సెబీకి జనవరిలో ప్రాస్పెక్టస్ దాఖలు చేయగా.. ఈ నెల 3-6 మధ్య గ్రీన్ సిగ్నల్ లభించింది. ప్రాస్పెక్టస్‌ల ప్రకారం ఈ సంస్థలు ఉమ్మడిగా కనీసం రూ. 2,500 కోట్లు సమీకరించనున్నట్లు తెలుస్తోంది. కాగా.. సాయి ఇన్ఫినియం ఈ నెల 4న సెబీ నుంచి ప్రాస్పెక్టస్‌ను వెనక్కి తీసుకుంది.

కోటి షేర్ల విక్రయం



ఐపీవోలో భాగంగా కెంట్ ఆర్‌వో సిస్టమ్స్ కోటి ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. వీటిని ప్రమోటర్లు ఆఫర్ చేయనున్నారు. తద్వారా ఇష్యూ నిధులు ప్రమోటర్లకు చేరనున్నాయి. కరమ్‌టరా ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూకింద రూ. 1,350 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. వీటికి జతగా మరో రూ. 400 కోట్ల విలువైన షేర్లను కంపెనీ ప్రమోటర్లు విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఐపీవో ద్వారా కంపెనీ రూ. 1,750 కోట్లు సమీకరించే యోచనలో ఉంది. ఈక్విటీ జారీ నిధుల్లో రూ. 1,050 కోట్లు రుణ చెల్లింపులకు వెచ్చించనుంది. మిగిలిన నిధులను సాధారణ కార్పొరేట్ అవసరాలకు కేటాయించనుంది.

రూ. 450 కోట్లపై కన్ను



ఐపీవోలో ద్వారా మంగళ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ రూ. 450 కోట్లు సమకూర్చుకోనుంది. ఇందుకు అనుగుణంగా ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. ఈ నిధులలో రూ. 120 కోట్లు వర్కింగ్ క్యాపిటల్ అవసరాలకు, మరో రూ. 120 కోట్లు రాజస్తాన్‌లోని శికార్ యూనిట్ విస్తరణతోపాటు జైపూర్ ప్రధాన కార్యాలయ నిర్మాణ పనులకు వినియోగించనుంది. మిగిలిన నిధులలో రూ. 96 కోట్లు రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కాగా.. విద్యా వైర్స్ ఐపీవోలో భాగంగా రూ. 320 కోట్ల విలువైన ఈక్విటీని కొత్తగా జారీ చేయనుంది. అంతేకాకుండా కంపెనీ ప్రమోటర్లు కోటి షేర్లను ఆఫర్ చేయనున్నారు. ఈక్విటీ జారీ నిధులను అనుబంధ సంస్థ ఏఎల్‌సీయూలో కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుతోపాటు.. రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

ఓస్వాల్ పంప్స్ @ రూ. 584-614

- ఈ నెల 13-17 మధ్య ఐపీవో
- రూ. 1,387 కోట్ల సమీకరణ



న్యూఢిల్లీ: సబ్‌మెర్సిబుల్, మోనోబ్లాక్ పంపుల తయారీ కంపెనీ ఓస్వాల్ పంప్స్ షేరుకి రూ. 584-614 ధరల శ్రేణిలో పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఇష్యూ ఈ నెల 13న ప్రారంభమై 17న ముగియనుంది. ఐపీవోలో భాగంగా రూ. 890 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా రూ. 497 కోట్ల విలువైన మరో 81 లక్షల షేర్లను ప్రమోటర్ వివేక్ గుప్తా విక్రయానికి ఉంచనున్నారు. తద్వారా కంపెనీ మొత్తం రూ. 1,387 కోట్లు సమీకరించాలని భావిస్తోంది. ఈక్విటీ జారీ నిధులను సొంత అనుబంధ సంస్థ ఓస్వాల్ సోలార్‌లో పెట్టుబడి వ్యయాలకు కేటాయించనుంది. అంతేకాకుండా హర్యానాలోని కర్నాల్‌లో కొత్తగా తయారీ యూనిట్లను ఏర్పాటుతోపాటు రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు సైతం వెచ్చించనుంది.

భారత్ వృద్ధి 6.3 శాతమే

- మరోసారి ప్రకటించిన ప్రపంచబ్యాంక్
- జనవరి అంచనాల కంటే 0.4% తక్కువ



వాషింగ్టన్: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2025-26) భారత జీడీపీ 6.3 శాతం వృద్ధి నమోదు చేస్తుందన్న గత అంచనాలను ప్రపంచ బ్యాంక్ కొనసాగించింది. అంతర్జాతీయంగా అనిశ్చితులు భారత ఎగుమతులపై చూపిస్తున్న ప్రభావాన్ని పరిగణనలోకి తీసుకుంది. భారత్ ఇప్పటికీ వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా పేర్కొంది. 2025-26లో భారత వృద్ధి రేటు 6.7 శాతం ఉండొచ్చని జనవరిలో ప్రపంచబ్యాంక్ అంచనా వేయగా.. అమెరికా టారిఫ్‌లు, అంతర్జాతీయంగా అనిశ్చితుల నేపథ్యంలో దీన్ని 6.3 శాతానికి తగ్గిస్తున్నట్లు ఏప్రిల్‌లో ప్రకటించింది. ఇప్పుడు మరోసారి ఏప్రిల్ అంచనానే కొనసాగిస్తున్నట్లు తెలిపింది. వాణిజ్య ఉద్రిక్తతలు, విధానపరమైన అనిశ్చితులతో ఈ ఏడాది అంతర్జాతీయ వృద్ధి 2.3 శాతానికి క్షీణిస్తుందంటూ తన తాజా నివేదికలో ప్రపంచబ్యాంక్ పేర్కొంది. ఈ ఏడాది ఆరంభంలో వేసిన అంచనా కంటే ఇది అర శాతం తక్కువ. ప్రపంచవ్యాప్తంగా 70 శాతం ఆర్థిక వ్యవస్థల వృద్ధి అంచనాల తగ్గింపునకు అంతర్జాతీయ అనిశ్చితులను కారణంగా ప్రపంచబ్యాంక్ ప్రస్తావించింది.

ఎగుమతులకు అడ్డంకులు

ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 2025-26 సంవత్సరానికి భారత్ 6.3 శాతంతో వేగవంతమైన వృద్ధి రేటును కొనసాగిస్తుందని అంచనా వేస్తున్నట్లు ప్రపంచబ్యాంక్ తెలిపింది. అయినప్పటికీ జనవరి అంచనాలతో పోల్చి చూస్తే 0.4% తగ్గించడాన్ని గుర్తు చేసింది. కీలక భాగస్వామ్య దేశాలలో బలహీన కార్యకలాపాలు, అంతర్జాతీయంగా పెరుగుతున్న అవరోధాలతో ఎగుమతులు క్షీణిస్తాయని అంచనా వేసింది. 2024-25లో భారత వృద్ధి రేటు మోస్తరు స్థాయికి దిగిరావడాన్ని నివేదికలో ప్రస్తావించింది. ముఖ్యంగా పారిశ్రామికోత్పత్తి క్షీణించినట్లు తెలిపింది. నిర్మాణ రంగం, సేవల రంగంలో కార్యకలాపాలు స్థిరంగా ఉంటే, వ్యవసాయ రంగం బలంగా పుంజుకున్నట్లు గుర్తు చేసింది.

2026-27 అంచనాలూ తగ్గింపు

వచ్చే ఆర్థిక సంవత్సరంలో భారత్ 6.5 శాతం వృద్ధి సాధించొచ్చని ప్రపంచబ్యాంక్ అంచనా వేసింది. జనవరి అంచనాలతో పోల్చి చూస్తే 0.2 శాతం తక్కువ. పెట్టుబడుల వృద్ధి కూడా నిదానించొచ్చని పేర్కొంది. మరోవైపు చైనా 2025లో 4.5 శాతం, 2026లో 4 శాతం చొప్పున వృద్ధి చెందొచ్చని అంచనా వేసింది.

ప్రపంచ వృద్ధి 2.3 శాతం

వాణిజ్య వివాదాల కారణంగా యూఎస్‌సహా ప్రపంచ వృద్ధి మందగించనున్నట్లు ప్రపంచ బ్యాంక్ తాజాగా పేర్కొంది. యూఎస్ ప్రెసిడెంట్ ట్రంప్ వాణిజ్య సుంకాలకు తెరతీసిన నేపథ్యంలో ఆర్థిక పురోభివృద్ధి కుంటుపడనున్నట్లు అభిప్రాయపడింది. వెరసి ప్రపంచ ఆర్థిక వృద్ధి 2.3 శాతానికి పరిమితంకానున్నట్లు అంచనా వేసింది. ట్రంప్ పేరు ప్రస్తావించని ప్రపంచ బ్యాంక్ వాణిజ్య ప్రతిబంధకాల కారణంగా యూఎస్ ఆర్థిక వ్యవస్థ ఈ ఏడాది 1.4 శాతం పుంజుకోవచ్చని పేర్కొంది. 2024లో సాధించిన 2.8 శాతం వృద్ధిలో ఇది సగంకాగా.. 2025 జనవరిలో వేసిన 2.3 శాతం అంచనాలను దిగువ ముఖంగా సవరించింది. ఈ బాటలో ప్రస్తుత ఏడాది(2025) ప్రపంచ వృద్ధి అంచనాలను సైతం 0.4 శాతం కుదించి 2.3 శాతానికి చేర్చింది. 2024లో 2.8 శాతం వృద్ధి నమోదైంది.

సాక్షి ప్లస్
బుధవారం: 11-6-2025

స్క్వాష్ కోహి'నూర్'



- ఎనిమిది సార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ నెగ్గిన నూర్ ఎల్ షెర్బిని
- మరోసారి గెలిస్తే కొత్త చరిత్ర సృష్టించనున్న ఈజిప్ట్ స్టార్ ప్లేయర్

'పువ్వు పుట్టగానే పరిమళిస్తుంది' అన్నట్లు... ఆరేళ్లకే రాకెట్ పట్టిన ఆ చిన్నారి పదేళ్లు తిరిగేసరికి వరల్డ్ టాప్-10లో చోటు దక్కించుకుంది. మరో నాలుగేళ్లకే ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్ కైవసం చేసుకుంది. ఇక అక్కడి నుంచి వెనక్కి తిరిగి చూసుకోని ఆ అమ్మాయి స్క్వాష్‌లో రికార్డులు తిరగరాస్తూ ఎనిమిది సార్లు ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలుచుకుంది. మనం ఇంతసేపు చెప్పుకున్నది ఈజిప్ట్ దేశానికి చెందిన నూర్ ఎల్ షెర్బిని గురించే! అద్దాల గోడల్లోకి అడుగు పెడితే అదర గొట్టడమే పనిగా పెట్టుకున్న ఈ 'వారియర్ ప్రిన్సెస్' ప్రస్థానాన్ని ఓసారి పరిశీలిస్తే...

– సాక్షి క్రీడావిభాగం

ఉత్తర ఆఫ్రికాలోని ఈజిప్ట్ దేశం... మానవ నాగరికత మూలాలకు నిదర్శనం. 'పిరమిడ్'లు, 'మమ్మీ'లు ఇలా ప్రాచీన ఆనవాళ్లకు నెలవు. అలాంటి దేశం ఇప్పుడు స్క్వాష్‌కు పెట్టింది పేరుగా మారింది. గత పదేళ్ల ఫలితాలు చూసుకుంటే పురుషుల ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఎనిమిది సార్లు ఈజిప్ట్ ఆటగాళ్లే టైటిల్ గెలిస్తే... మహిళల విభాగంలో అయితే పదికి పదిసార్లు ఈజిప్ట్ ప్లేయర్లే చాంపియన్‌గా నిలిచారు. అందులో పదిసార్లూ నూర్ ఎల్ షెర్బిని ఫైనల్ ఆడటం మరో విశేషం. ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) ఆధ్వర్యంలో 2015లో కౌలాలంపూర్‌లో జరిగిన వరల్డ్ చాంపియన్‌షిప్‌లో తొలిసారి విజేతగా నిలిచిన నూర్ 2016లో రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఆ తర్వాత వరుసగా 2017, 2018-19, 2019-20, 2020-21, 2022, 2023లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచింది. గతేడాది ఫైనల్లో ఈజిప్ట్‌కే చెందిన నౌరన్ గోహర్ చేతిలో ఓడిన 29 ఏళ్ల నూర్ గత నెలలో చికాగో వేదికగా జరిగిన టోర్నీలో టైటిల్ హస్తగతం చేసుకొని ఆ సంఖ్యను ఎనిమిదికి పెంచుకుంది. మహిళల విభాగంలో అత్యధిక సార్లు (8) ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్స్ నెగ్గిన మలేసియా మాజీ స్క్వాష్ ప్లేయర్ నికోల్ డేవిడ్ సరసన చేరింది. మరోసారి విశ్వవిజేతగా నిలిస్తే నూర్ కొత్త చరిత్రను లిఖిస్తుంది.

13 ఏళ్లకే ప్రపంచ జూనియర్ చాంపియన్...

ప్రపంచ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతున్న నూర్... కుటుంబ నేపథ్యం ఆసక్తికరం. తండ్రి మంచి ఫుట్‌బాల్ ప్లేయర్ కాగా... తల్లి అథ్లెట్. చిన్నప్పుడే స్క్వాష్‌పై ఆసక్తి కనబర్చిన ఆమె సోదరుడి ప్రోత్సాహంతో ప్రొఫెషనల్‌గా మారింది. ఎనిమిదేళ్లు రాకముందే సీనియర్ ప్లేయర్లను కంగుతినిపించడం అలవాటు చేసుకున్న ఈ పొడగరి... నైపుణ్యాలు పెంచుకుంటూ అంచెలంచెలుగా ఎదిగింది. 13 ఏళ్లకే ప్రపంచ జూనియర్ చాంపియన్‌గా అవతరించిన నూర్... ఈ ఘనత సాధించిన పిన్న వయస్కురాలిగా రికార్డు సృష్టించింది. పద్నాలుగేళ్ల వయసులోనే ప్రపంచ టాప్-50లో చోటు దక్కించుకున్న ఈ చిన్నది... 2016లో తన 19 ఏళ్ల వయసులో వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచింది. ఏ క్రీడలో అయినా... ఉన్నత శిఖరాలను అధిరోహించడం ఒక ఎత్తు అయితే దాన్ని కొనసాగించడం మరో ఎత్తు. నూర్ రెండో కోవకే చెందుతుంది. నిలకడకు మారుపేరైన ఈ ఈజిప్ట్ ప్లేయర్ విజయగర్వం తలకెక్కించుకోకుండా ఎప్పటికప్పుడు ఆటకు మెరుగులు దిద్దుకుంటూ అత్యుత్తమ ప్లేయర్‌గా పరిణతి సాధిస్తోంది.

ఫెడరర్ స్ఫూర్తితో...

పొరబాటున కూడా ప్రత్యర్థి ప్లేయర్‌ను పల్లెత్తు మాట అనని నూర్ తన ఆరాధ్య ఆటగాడు రోజర్ ఫెడరర్ బాటలోనే ముందుకు సాగుతోంది. నూర్‌కు స్క్వాష్‌తో పాటు టెన్నిస్ అంటే వల్లమాలిన ప్రేమ. అందులోనూ స్విట్జర్లాండ్ దిగ్గజం రోజర్ ఫెడరర్ ఆటకు వీరాభిమాని. ఆధునిక టెన్నిస్‌లో మేరునగధీరుడిగా గుర్తింపు తెచ్చుకున్న ఫెడరర్‌ను అమితంగా ఆరాధించే నూర్... కోర్టు బయట కూడా ఫెడరర్ వ్యవహార శైలిని అనుసరిస్తుంది. చిన్నప్పటి నుంచి స్క్వాష్ ఆడే అలవాటు ఉన్న ఫెడరర్... కొన్ని ప్రత్యేకమైన స్క్వాష్ స్ట్రోక్‌లను టెన్నిస్ కోర్టులో ప్రయోగించి ఫలితాలు రాబట్టాడు. 20 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు చేజిక్కించుకున్న ఫెడరర్ నడవడికను అనుకరించే నూర్ ... ఫెడరర్‌లాగే మృదుస్వభావి. 'స్క్వాష్‌లో కాకుండా నేను ఆరాధించే ఏకైక ప్లేయర్ టెన్నిస్ దిగ్గజం ఫెడరర్. అతడి నుంచి ఎప్పుడూ స్ఫూర్తి పొందుతా. టెన్నిస్ కోర్టులో అతడు బ్యాక్ హ్యాండ్ స్ట్రోక్స్ కొడుతుంటే స్క్వాష్ ఆడినట్లే అనిపిస్తుంది. ప్రత్యర్థు



లతో అతడు తలపడే తీరు, వ్యవహరించే విధానం నాకెంతో ఇష్టం. జొకోవిచ్, నాదల్ వంటి వాళ్ల కంటే ఫెడరర్ శైలి భిన్నమైంది' అని నూర్ పేర్కొంది.

టీమ్ విభాగంలోనూ 5 స్వర్ణాలు

32x21 ఫీట్ల అద్దాల గదిని రెండో ఇంటిలా భావించే నూర్... అటు సింగిల్స్‌తో పాటు ఇటు టీమ్ విభాగాల్లోనూ ఆధిపత్యం కనబరుస్తోంది. ప్రపంచ చాంపియన్‌షిప్ సింగిల్స్‌లో 8 స్వర్ణాలు, 3 రజతాలు నెగ్గిన నూర్... టీమ్ విభాగంలో మరో 5 పసిడి పతకాలు, ఒక కాంస్యం గెలుచుకుంది. అభిమానులంతా ముద్దుగా 'ది వారియర్ ప్రిన్సెస్' అని పిలుచుకునే షెర్బిని అందుకు తగ్గట్లే పోరాట యోధురాలుగా గుర్తుంపు తెచ్చుకుంది. ఎలాంటి స్థితిలోనూ సానుకూల దృక్పథాన్ని వీడకపోవడం... చివరి క్షణం వరకు ఓటమిని అంగీకరించకపోవడం



ఎనిమిదో ప్రపంచ చాంపియన్‌షిప్ టైటిల్ గెలిచిన సందర్భంలో తల్లిదండ్రులతో నూర్ ఎల్ షెర్బిని

... తప్పుల నుంచి పాఠాలు నేర్చుకోవడం ఆమెను ఇతర ప్లేయర్ల కంటే భిన్నంగా నిలిపింది. 'నా ముద్దు పేరంటే ఇష్టం. నా ఆటతీరుకు అది సరిగ్గా నప్పుతుంది. కోర్టు బయట నేను పూర్తి భిన్నంగా ఉంటా. ప్రతి మ్యాచ్‌ను నా తొలి పోరుగానే భావిస్తా. ప్రపంచ చాంపియన్‌షిప్ అయినా మామూలు టోర్నమెంట్ అయినా సమానమైన ప్రాధాన్యతనిస్తా. ఒత్తిడిని దరిచేరనివ్వక పోవడమే నా ప్రధాన బలం. నాపై అంచనాలు పెంచేసుకొని వాటిని అందుకోవాలని తపన పడను. మానసికంగా ఎలాంటి ఒత్తిడి లేకుండా బరిలోకి దిగేందుకు ప్రయత్నిస్తా. దాని వల్లే మెరుగైన ఫలితాలు వస్తున్నాయి' అని నూర్ తెలిపింది.

2028 లాస్ ఏంజెలెస్ ఒలింపిక్స్‌లో స్క్వాష్‌ను భాగం చేయడంతో ఈసారి ఈజిప్ట్ ప్లేయర్లు పతకాలు కొల్లగొట్టడం ఖాయమని విశ్లేషకులు అంచనా వేస్తుంటే... వరుసగా పదేళ్లుగా ప్రపంచ చాంపియన్‌షిప్ ఫైనల్ ఆడిన నూర్ మాత్రం విశ్వక్రీడలకు చాలా దూరం ఉందని అప్పటి వరకు పరిస్థితులు ఎలా ఉంటాయో అని వినమ్రతతో బదులిచ్చింది. 'ప్రతి ఒక్కరూ ఒలింపిక్స్ పతకాల గురించే ఆలోచిస్తున్నారు. అదంత సులభం కాదు. వచ్చే మూడేళ్లు ఎలా ఉంటుందో చెప్పలేం. విశ్వక్రీడల్లో పతకం నెగ్గడం ప్రతి ఒక్కరి కల. దాని కోసం ఇతర దేశాల ప్లేయర్లు కూడా గట్టి ప్రయత్నాలు చేస్తుంటారు' అని నూర్ చెప్పుకొచ్చింది.

మెకింటోష్ మరో ప్రపంచ రికార్డు



విక్టోరియా (కెనడా): మూడు రోజుల వ్యవధిలో కెనడా స్టార్ స్విమ్మర్ సమ్మర్ మెకింటోష్ రెండో ప్రపంచ రికార్డు సృష్టించింది. ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే కెనడా జట్టును ఎంపిక చేసేందుకు నిర్వహిస్తున్న సెలెక్షన్ ట్రయల్స్‌లో 18 ఏళ్ల మెకింటోష్ ఈ ఘనత సాధించింది. మంగళవారం జరిగిన మహిళల 200 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ రేసును మెకింటోష్ 2 నిమిషాల 5.7 సెకన్లలో ముగించి విజేతగా నిలిచింది. ఈ క్రమంలో 2015లో కటింక హొసుజు (హంగేరి) 2ని:06.12 సెకన్లతో నెలకొల్పిన ప్రపంచ రికార్డును మెకింటోష్ బద్దలు కొట్టింది. శనివారం 400 మీటర్ల ఫ్రీస్టయిల్ విభాగంలో కొత్త ప్రపంచ రికార్డు సృష్టించిన మెకింటోష్... గత ఏడాది పారిస్ ఒలింపిక్స్‌లో మూడు స్వర్ణ పతకాలు (200, 400 మీటర్ల వ్యక్తిగత మెడ్లీ; 200 మీటర్ల బటర్‌ఫ్లయ్) సాధించింది.

భారత్ X అర్జెంటీనా

అమ్‌స్టెల్వీన్ (నెదర్లాండ్స్): అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్‌ఐహెచ్) ప్రొ లీగ్‌లో భారత పురుషుల జట్టు మరో సమరానికి సిద్ధమైంది. యూరప్ అంచె పోటీల్లో ఆడిన తొలి రెండు మ్యాచ్‌ల్లో నెదర్లాండ్స్ చేతిలో ఓడిన హర్మన్‌ప్రీత్ సింగ్ నాయకత్వంలోని భారత జట్టు నేడు అర్జెంటీనాతో తలపడనుంది. నెదర్లాండ్స్‌తో మ్యాచ్‌ల్లో తొలుత ఆధిక్యంలో ఉండి... ఆ తర్వాత పట్టు చేజార్చుకున్న టీమిండియా ఈసారి అలాంటి తప్పులు చేకుండా పూర్తి ఆధిపత్యం కనబర్చాలని చూస్తోంది. ముఖ్యంగా పెనాల్టీ కార్నర్‌లను గోల్స్‌గా మలచడంపై మన జట్టు దృష్టి పెట్టాల్సిన అవసరముంది. డచ్ జట్టుతో రెండో మ్యాచ్‌లో టీమిండియాకు మొత్తం 9 పెనాల్టీ కార్నర్‌లు వచ్చినా అందులో కేవలం ఒక్క దాన్నే గోల్‌గా మలచగలిగింది. మరో ఆరు మ్యాచ్‌లు మిగిలి ఉన్న ఈ లీగ్‌లో ప్రస్తుతం భారత జట్టు 15 పాయింట్లతో పట్టిక నాలుగో స్థానంలో ఉంది. వచ్చే ఏడాది హాకీ ప్రపంచ కప్‌నకు నేరుగా అర్హత సాధించేందుకు భారత జట్టు సమష్టిగా సత్తా చాటాలని భావిస్తోంది. 'అర్జెంటీనాతో మ్యాచ్ మాకు చాలా కీలకం. అందుకు తగ్గట్లే సన్నద్ధమయ్యాం. మెరుగైన ప్రదర్శన చేస్తామనే నమ్మకముంది. అర్జెంటీనా కఠిన ప్రత్యర్థి. ఇటీవలి కాలంలో వారితో ఆడిన మ్యాచ్‌లే ఇందుకు నిదర్శనం. అర్జెంటీనాపై మాకు మంచి రికార్డే ఉంది. అయితే గతాన్ని పట్టించుకోకుండా మ్యాచ్‌పైనే దృష్టి పెడతాం. దాని కోసమే సాధన చేస్తున్నాం' అని హర్మన్‌ప్రీత్ సింగ్ అన్నాడు.

కౌంటీలకు రుతురాజ్ గైక్వాడ్

యార్క్‌షైర్‌కు ఆడనున్న భారత బ్యాటర్



లీడ్స్: భారత బ్యాటర్ రుతురాజ్ గైక్వాడ్ ఇంగ్లండ్‌లో కౌంటీ క్రికెట్ ఆడనున్నాడు. యార్క్‌షైర్ తరఫున అతను డివిజన్-1 కౌంటీ చాంపియన్‌షిప్‌తో పాటు వన్డే కప్‌లో ఆడతాడని తెలిసింది. వచ్చేనెల సర్రే జట్టుతో జరిగే మ్యాచ్ నుంచి సీజన్ ముగిసే దాకా జట్టుకు అందుబాటులో ఉంటాడని యార్క్‌షైర్ కౌంటీ జట్టు తెలిపింది. ఈ 28 ఏళ్ల టాపార్డర్ బ్యాటర్ ప్రస్తుతం ఇంగ్లండ్‌లోనే ఉన్నాడు. ఇంగ్లండ్ పర్యటనకు వచ్చిన భారత్ 'ఎ' జట్టులో సభ్యుడైన గైక్వాడ్‌కు రెండు అనధికారిక టెస్టుల్లోనూ ఆడే అవకాశమైతే రాలేదు. ఇంగ్లండ్ లయన్స్‌తో జరిగిన ఆ రెండు టెస్టులు 'డ్రా'గానే ముగిశాయి. ఇక 13 నుంచి 16 వరకు బెకెన్‌హామ్‌లో భారత సీనియర్ జట్టుతో జరిగే నాలుగు రోజుల వార్మప్ మ్యాచ్‌లో భారత్ 'ఎ' ఆడనుంది. ఇందులోనైనా రుతురాజ్‌కు అవకాశం లభిస్తుందేమో చూడాలి. ఐపీఎల్‌లో చెన్నై సూపర్‌కింగ్స్ కెప్టెన్, రంజీల్లో మహారాష్ట్ర జట్టు కెప్టెన్ కూడా అయిన రుతురాజ్ గైక్వాడ్ ఇప్పటి వరకు టీమిండియా తరఫున ఆరు వన్డేలు, 23 టి20లు ఆడాడు. కౌంటీల్లో కీలకమైన మ్యాచ్‌లు ఉన్న తరుణంలో రుతురాజ్‌లాంటి టాపార్డర్ బ్యాటర్ ఆడనుండటం తమకు లాభిస్తుందని యార్క్‌షైర్ హెడ్ కోచ్ ఆంథోని మెక్‌గ్రాత్ అన్నారు. అతని చేరిక తమ జట్టుకు అదనపు బలాన్ని చేకూరుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. యార్క్‌షైర్‌లాంటి ప్రముఖ ఇంగ్లండ్ కౌంటీ జట్టుకు ఆడటాన్ని గౌరవంగా భావిస్తున్నానని గైక్వాడ్ చెప్పాడు. దిగ్గజ భారత క్రికెటర్ సచిన్ టెండూల్కర్ కూడా టీనేజ్‌లో యార్క్‌షైర్‌కు ప్రాతినిధ్యం వహించాడు. 1992లో 19ఏళ్ల ప్రాయంలో సచిన్ యార్క్‌షైర్ తరఫున బరిలోకి దిగాడు.

ఆస్ట్రియా రేస్ వాకింగ్ విజేత ప్రియాంక



న్యూఢిల్లీ: భారత మేటి రేస్ వాకర్ ప్రియాంక గోస్వామి ఈ సీజన్‌లో తొలి విజయాన్ని అందుకుంది. ఆస్ట్రియన్ రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్‌లో ఆమె విజేతగా నిలిచింది. ఇన్స్‌బ్రుక్‌లో జరిగిన మహిళల 10 కిలోమీటర్ల ఈవెంట్‌లో ఆమె అగ్రస్థానంలో నిలిచింది. భారత కాలమానం ప్రకారం సోమవారం రాత్రి జరిగిన పోటీని ఆమె అందరికంటే ముందుగా 47 నిమిషాల 54 సెకన్లలో పూర్తి చేసింది. ఆమెకు ఎంతో ఇష్టమైన 20 కి.మీ. రేస్ వాక్‌లో 1 గంట 28.45 సెకన్ల టైమింగ్‌తో జాతీయ రికార్డు సృష్టించింది. అయితే 10 కిలోమీటర్ల ఈవెంట్‌లో ఆమె వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన 45 నిమిషాల 47 సెకన్ల టైమింగ్ 2022లోనే నెలకొల్పింది. 'నాకు ఒక నిమిషం పెనాల్టీ విధించినా కూడా విజేతగా నిలవడం ఈ సుదీర్ఘ పరుగులో అంత సులభం కాదు. విజయం కోసం ఎంతగానో శ్రమించాను' అని 29 ఏళ్ల ప్రియాంక గోస్వామి తెలిపారు. గత నెల మెల్‌బోర్న్‌లో జరిగిన అథ్లెటిక్స్ విక్టోరియా వాకింగ్ చాంపియన్‌షిప్‌లో ఆమె రెండో స్థానంలో నిలిచింది. అయితే 35 కిలోమీటర్ల రేస్ వాక్‌లో పోటీపడింది.


నాదల్ రాకెట్‌కు రూ. 1 కోటీ 34 లక్షలు



మాడ్రిడ్: టెన్నిస్ దిగ్గజం, 22 గ్రాండ్‌స్లామ్ సింగిల్స్ టైటిల్స్ విజేత రాఫెల్ నాదల్ 2017లో ఫ్రెంచ్ ఓపెన్‌ను గెలుచుకున్నాడు. ఇది అతని కెరీర్‌లో 10వ ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్. ఈ టోర్నీ ఫైనల్ మ్యాచ్‌లో అతను ఉపయోగించిన రాకెట్‌కు వేలంలో రికార్డు స్థాయి ధర పలికింది. నాదల్ అభిమాని ఒకరు దీనిని 1,57,333.20 డాలర్లు (రూ. 1 కోటీ 34 లక్షలు) చెల్లించి దీనిని సొంతం చేసుకున్నాడు. 2017 రోలండ్ గారోస్‌లో నాదల్ ఒక్క సెట్ కూడా ఓడిపోకుండా ట్రోఫీని సాధించాడు. ఫైనల్లో అతను 6-2, 6-3, 6-1తో వావ్రింకా (స్విట్జర్లాండ్)ను చిత్తు చేశాడు. 'బబోలాట్' కంపెనీకి చెందిన ఈ రాకెట్‌ను 2017 సీజన్‌లో నాదల్ 24 మ్యాచ్‌లలో వాడాడు. ఇందులో ఆస్ట్రేలియన్ ఓపెన్ ఫైనల్లో ఫెడరర్‌తో తలపడి ఓడిన మ్యాచ్ కూడా ఉంది. రాకెట్‌పై 'రఫా' లోగోతో పాటు 'ఆర్‌జీ 2017 ఫైనల్' ముద్రించి ఉన్నాయి. గతంలో 2022 ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో విజేతగా నిలిచినప్పుడు (నాదల్ ఆఖరి గ్రాండ్‌స్లామ్ టైటిల్) వాడిన రాకెట్ వేలంలో 1,39,700 డాలర్లకు (రూ. 1 కోటీ 19 లక్షలు) అమ్ముడుపోయింది. ఇప్పుడు అంతకంటే ఎక్కువ ధరతో కొత్త రికార్డు నమోదైంది. నాదల్ గత ఏడాది సెప్టెంబరులో ఆటకు గుడ్‌బై చెప్పాడు.

అరిజీత్‌కు జూనియర్ హాకీ జట్టు పగ్గాలు

4 దేశాల టోర్నీకి భారత జట్టు ఎంపిక ● ఈ నెల 21 నుంచి జర్మనీలో ఈవెంట్



న్యూఢిల్లీ: భారత జూనియర్ పురుషుల హాకీ జట్టు కెప్టెన్‌గా డ్రాగ్ ఫ్లికర్ అరిజీత్ సింగ్ హుందల్‌ను నియమించారు. జర్మనీలో జరిగే నాలుగు దేశాల టోర్నమెంట్‌లో పోటీపడే జట్టును మంగళవారం హాకీ ఇండియా (హెచ్‌ఐ) సెలక్టర్లు ఎంపిక చేశారు. ఈ జట్టుకు రెండు ఒలింపిక్ కాంస్యపతకాల విజేత పీఆర్ శ్రీజేశ్ కోచ్‌గా వ్యవహరిస్తున్నాడు. మొత్తం 24 మంది సభ్యుల బృందంలో ఒక స్టాండ్‌బైతో కలుపుకొని ముగ్గురు గోల్‌కీపర్లకు అవకాశమిచ్చారు. బిక్రమ్‌జీత్ సింగ్, వివేక్ లక్రా సహా ఆదర్శ్ (స్టాండ్‌బై)లు జట్టుకు ఎంపికయ్యారు. డిఫెండర్ అమీర్ అలీ వైస్ కెప్టెన్‌గా వ్యవహరిస్తాడు. బెర్లిన్‌లో ఈ నెల 21 నుంచి 25 వరకు జరిగే ఈ జూనియర్ టోర్నమెంట్‌లో ఆతిథ్య జర్మనీ సహా భారత్, స్పెయిన్, ఆస్ట్రేలియా జట్లు పాల్గొంటాయి. ఒక్కో జట్టు లీగ్‌దశలో ఇతర ప్రత్యర్థులతో ఒక్కో మ్యాచ్‌లో ఆడుతుంది. పాయింట్ల పట్టికలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్‌కు అర్హత సాధిస్తాయి. మూడు, నాలుగో స్థానంలో నిలిచిన జట్లు వర్గీకరణ పోరులో తలపడతాయి. అరిజీత్ సింగ్ అనుభవజ్ఞుడైన డ్రాగ్ ఫ్లికర్. అతను రెండేళ్ల క్రితం 2023లో జూనియర్ ఆసియా కప్‌లో స్వర్ణం గెలిచిన భారత జట్టులో సభ్యుడిగా ఉన్నాడు. ఆ సీజన్‌లో ప్రొ లీగ్‌లోనూ ఆడి రాణించాడు. ఈ సందర్భంగా దిగ్గజ గోల్‌కీపర్, టీమ్ కోచ్ శ్రీజేశ్ మాట్లాడుతూ ఈ టోర్నీ ఈ ఏడాది జరిగే ఎఫ్‌ఐహెచ్ జూనియర్ ప్రపంచకప్‌కు సన్నాహకంగా ఉపయోగపడుతుందని చెప్పాడు. హాకీ చరిత్రలోనే మేటి ప్రత్యర్థులైన జట్లతో టోర్నీ జరగనుండటం మన యువ ఆటగాళ్లకు మేలుచేస్తుందని వివరించాడు.

భారత జూనియర్ హాకీ జట్టు: అరిజీత్ సింగ్ హుందల్ (కెప్టెన్), అమిర్, బిక్రమ్‌జీత్, వివేక్, తాలెమ్ ప్రియోబర్తా, శర్దానంద్ తివారీ, సునీల్, అన్‌మోల్, రోహిత్, రణ్‌వీత్, సుఖ్‌విందర్, అంకిత్, మన్‌మీత్, రోషన్, రోహిత్ కులు, తొక్‌చోమ్ కింగ్సన్, తౌనజామ్ లువాంగ్, అద్రోహిత్, జీత్‌పాల్, గుర్‌జోత్, సౌరభ్ ఆనంద్, దిల్‌రాజ్, అర్ష్‌దీప్, అజీత్ యాదవ్.

మాడ్రిడ్ వీధుల్లో కొత్త ఎఫ్1 సర్క్యూట్



వచ్చే సీజన్‌లోనే రయ్... రయ్..!

లండన్: స్పెయిన్‌లో కొత్త ఫార్ములావన్ ట్రాక్ సిద్ధమవుతోంది. మాడ్రిడ్ వీధుల గుండా పయనించే కొత్త సర్క్యూట్ వచ్చే ఏడాదే అందుబాటులోకి రానుంది. 2026 క్యాలెండర్‌లో జరిగే ఫార్ములావన్ రేసుల్లో సెప్టెంబర్ 13న కొత్త సర్క్యూట్‌పై స్పానిష్ గ్రాండ్‌ప్రి జరుగుతుందని ఎఫ్1 వర్గాలు తెలిపాయి. దీంతో వచ్చే ఏడాది స్పెయిన్‌లో రెండు ఫార్ములావన్ రేసులు నిర్వహిస్తారు. ఏళ్ల క్రితమే కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం బార్సిలోనా గ్రాండ్‌ప్రి కూడా నిర్వహిస్తారని ఎఫ్1 ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. అప్పట్లో కుదుర్చుకున్న ఒప్పందం గడువు 2026 వరకు ఉండటం వల్ల బార్సిలోనా రేస్ యథాతథంగా జరుగనుంది. అయితే ఓవరాల్‌గా మాత్రం ఫార్ములావన్ సీజన్‌లో మొత్తం 24 రేసుల్లో ఏమాత్రం మార్పుండదు. స్పెయిన్ రెండు రేసుల కోసం ఇటలీ రేసును వచ్చే ఏడాది తప్పించనున్నారు. ఇమోలాలో ఎమిలియా-రొమాగ్నా గ్రాండ్‌ప్రి వచ్చే సీజన్‌లో కనిపించదు. దీని స్థానంలో మాడ్రిడ్ వీధుల్లో కొత్త సర్క్యూట్‌పై రేసును నిర్వహిస్తారు. జన సంచారం ఉండే వీధుల గుండా రయ్... రయ్...మనే ఫార్ములావన్ కార్ల రేసులు కొత్తేం కాదు. ఇదివరకే మొనాకో, సింగపూర్ దేశాల్లో వీధుల్లోనే ఎఫ్1 సర్క్యూట్ ఉంది. అయితే రేసు జరిగే సమయంలో మాత్రం సాధారణ జనసంచారం కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తారు. వచ్చే మార్చి 8న ఆస్ట్రేలియన్ గ్రాండ్‌ప్రితో 2026 సీజన్ మొదలవుతుంది. పవిత్ర రంజాన్ నేపథ్యంలో బహ్రెయిన్, సౌదీ అరేబియాలలో జరిగే రేసులను ఏప్రిల్‌కు మార్చారు. డిసెంబర్‌లో జరిగే అబుదాబి గ్రాండ్‌ప్రితో వచ్చే సీజన్ ముగుస్తుంది.



పాక్ వైఖరిని ఎండగట్టడానికి వివిధ దేశాల్లో పర్యటించి వచ్చిన అఖిలపక్ష బృందంతో ప్రధాని మోదీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు

'డిప్యూటీ స్పీకర్ పదవి'పై ప్రధానికి మల్లికార్జున ఖర్గే లేఖ

కేంద్రం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని విమర్శ

- లోక్‌సభ వర్షాకాల సమావేశాల్లో డిప్యూటీ స్పీకర్ పదవికి ఎన్నిక జరపాలని డిమాండ్

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ మళ్లీ లేవనెత్తింది. డిప్యూటీ స్పీకర్ పదవికి ఎన్నికల ప్రక్రియను ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మంగళవారం ప్రధాని మోదీకి లేఖ రాశారు. ఈ పదవిని ఖాళీగా ఉంచడం భారత ప్రజాస్వామ్య రాజకీయాలకు మంచి సంకేతం కాదని, ఇది రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించడమేనని కాంగ్రెస్ అధ్యక్షుడు అన్నారు. జూలై 21 నుంచి ప్రారంభమయ్యే పార్లమెంటు వర్షాకాల సమావేశాలకు ముందు ఖర్గే ఈ డిమాండ్ చేశారు. 'లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ పదవి ఖాళీకి సంబంధించిన ఆందోళనకరమైన విషయంపై మీ దృష్టిని ఆకర్షించడానికే నేను ఈ లేఖ రాస్తున్నాను'అంటూ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రధానికి రాసిన తన లేఖలో పేర్కొన్నారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 93 లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ



స్పీకర్ ఇద్దరినీ ఎన్నుకోవడానికి వీలు కల్పిస్తుంది. రాజ్యాంగపరంగా, డిప్యూటీ స్పీకర్ లోక్‌సభ స్పీకర్ తర్వాత రెండవ అత్యున్నత ప్రిసైడింగ్ అధికారి. సంప్రదాయంగా లోక్‌సభ రెండవ లేదా మూడవ సమావేశంలో డిప్యూటీ స్పీకర్ ఎన్నికవుతారని... లోక్‌సభలో కార్యనిర్వహణ, విధాన నియమాలలోని 8(1) నిబంధన ప్రకారం డిప్యూటీ స్పీకర్ ఎన్నిక తేదీని స్పీకర్ నిర్ణయిస్తారు అనేది ఒకే తేడా అని ఖర్గే తెలిపారు. మొదటి లోక్‌సభ నుంచి పదహారవ లోక్‌సభ వరకు ప్రతి సభలో ఒక డిప్యూటీ స్పీకర్ ఉన్నారని ఖర్గే అన్నారు. ప్రధాన ప్రతిపక్ష పార్టీ సభ్యుల నుంచి డిప్యూటీ స్పీకర్‌ను నియమించడం ఒక ఆనవాయితీ అని... స్వతంత్ర భారతదేశ చరిత్రలో తొలిసారిగా, ఈ పదవి వరుసగా రెండు లోక్‌సభ పర్యాయాలు ఖాళీగా ఉందని ఖర్గే విమర్శించారు. పదిహేడవ లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ ఎన్నిక కాలేదని.. ఇదే విధానం పద్దెనిమిదవ లోక్‌సభలో కూడా కొనసాగుతోందన్నారు. ఇది భారతదేశ ప్రజాస్వామ్య రాజకీయాలకు మంచి సంకేతం కాదని.. ఇది రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించడమే అని ఖర్గే ప్రధానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. అందువల్ల సభ సంప్రదాయాలను, పార్లమెంటు ప్రజాస్వామ్య విలువలను దృష్టిలో ఉంచుకుని, లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ప్రక్రియను ఇక ఆలస్యం చేయకుండా ప్రారంభించాల్సిన అవసరం ఉందని కాంగ్రెస్ అధ్యక్షుడు కోరారు.

రక్షణలో స్వావలంబన

ఆధునీకరణపై దృష్టి: మోదీ

న్యూఢిల్లీ: రక్షణ రంగంలో పూర్తి స్వావలంబనే తమ ప్రభుత్వ లక్ష్యమని ప్రధాని నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. అదే సమయంలో ఆ రంగాన్ని పూర్తిస్థాయిలో ఆధునీకరించడంపై ప్రధానంగా దృష్టి సారించినట్టు వెల్లడించారు. ''గత 11 ఏళ్లలో రక్షణ రంగంలో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. వాటికి దీటుగా 11 ఏళ్ల పాలనలో రక్షణ రంగంలో అద్భుత ప్రగతి సాధించి చూపాం. ఇటు ఆధునీకరణకు, అటు రక్షణ ఉత్పత్తుల్లో పూర్తి స్థాయి స్వావలంబనకు పెద్దపీట వేయడమే అందుకు కారణం. దేశాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దుకోవడంలో ప్రజలంతా కలసికట్టుగా ముందుకొస్తున్న తీరు నిజంగా స్ఫూర్తిదాయకం''అంటూ హర్షం వెలిబుచ్చారు. ఈ మేరకు ప్రధాని మంగళవారం ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కేంద్రం ఏర్పాటు చేసిన పౌర భాగస్వామ్య ఆన్‌లైన్ వేదికలో ప్రజల స్పందనలకు సంబంధించిన లింకును ఆయన షేర్ చేశారు. '11 ఏళ్లలో భారత ఉత్థానం: అధికారం, భాగస్వామ్యాలు, ప్రగతి'పేరిట పలు అంశాలను అందులో ప్రభుత్వం పొందుపరిచింది. ''మోదీ సారథ్యంలో దేశ రక్షణ పాటవం 11 ఏళ్లలో ఎన్నో రెట్లు పెరిగింది. వ్యూహాత్మక అంతర్జాతీయ ఒప్పందాలు, భాగస్వామ్యాల వంటివి మన రక్షణ రంగాన్ని మరింత బలోపేతం చేశాయి. అంతరిక్ష రంగంలోనూ చరిత్రాత్మక మైలురాళ్లను అధిగమించాం. ప్రధాని ఆత్మనిర్భర్ భారత్ ప్రతినకు అనుగుణంగా అన్ని రంగాలూ అద్భుతాలు చేసి చూపాయి. వర్తకం మొదలుకుని టెక్నాలజీ దాకా స్వయంసమృద్ధి దిశగా ఎంతో ప్రగతి సాధించాయి. ఐఎన్ఎస్ విక్రాంత్ రూపంలో తొలి దేశీయ విమాన వాహక నౌకను సమకూర్చుకునే స్థాయికి ఎదిగాం. 2014లో కేవలం రూ.1,940 కోట్లుగా ఉన్న మన రక్షణ ఎగుమతులు 2024 కల్లా ఏకంగా రూ.23,622 కోట్లకు పెరిగాయి. ప్రగతి విషయంలో భారత్ కనబరిచిన స్ఫూర్తిదాయ ప్రస్థానమిది. శక్తిమంతమైన భారత్ కోసం మోదీ కన్న కలలు, ఆయన విజన్, చిత్తశుద్ధి కారణంగా మన దేశం ఇప్పుడు గ్లోబల్ లీడర్‌గా ఎదుగుతోంది. బ్రహ్మోస్ మొదలుకుని మన దేశీయ క్షిపణుల అద్భుత పాటవాన్ని ఇటీవలే ప్రపంచమంతా చూసింది. ఆర్థిక రంగంలోనూ ఈ 11 ఏళ్లలో దేశం అద్భుతాలు సాధించింది. అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా పరుగులు తీస్తోంది. బ్రిటన్, యూఏఈ తదితర దేశాల్లో కుదిరిన కీలక స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందాలు అందుకు మరింతగా ఊతమివ్వనున్నాయి. ప్రపంచ శాంతికి భారత్ కట్టుబడ్డ తీరు, ఆ దిశగా చేస్తూ వస్తున్న కృషి దేశాల మన్నన అందుకుంది'' అని పేర్కొంది.

నాలుగో తరగతి గొడవకు...

50 ఏళ్ల తర్వాత రీయూనియన్‌లో ప్రతీకారం

చిన్ననాటి స్కూలు నేస్తాలంతా ఏ 50 ఏళ్లకో జీవితపు చివరి మలుపులో తిరిగి కలుసుకుంటే ఏం చేస్తారు? మధురానుభూతులను ఒక్కొక్కటిగా నెమరేసుకుంటారు. నాటి అల్లరిని గుర్తుకు తెచ్చుకుని మురిసిపోతారు. తోటి వారితో పడ్డ గొడవలను తలచుకుని నవ్వుకుంటారు. కదూ! కానీ అప్పటి గొడవలను ఇప్పటికీ గుర్తు పెట్టుకుంటే? నాడు తిన్న దెబ్బలకు ఇప్పుడు కసిదీరా ప్రతీకారం తీర్చుకుంటే? కేరళలో అచ్చం అలాంటి వింత సంఘటనే జరిగింది. కాసర్‌గోడ్‌లో 50 ఏళ్ల కింద ఒకే స్కూల్లో చదివిన వాళ్లంతా ఇటీవల సరదాగా తిరిగి కలుసుకున్నారు. ఆ సందర్భంగా వీజే బాబు (62)ను చూడగానే బాలకృష్ణన్ అనే వ్యక్తికి నాలుగో తరగతిలో తమ నడుమ జరిగిన గొడవ గుర్తొచ్చింది. తనను బాబు చితక్కొట్టిన తీరు మదిలో మెదిలింది. అంతే! అప్పట్లో నన్నెందుకు కొట్టావంటూ కాలర్ పట్టుకుని మరీ నిలదీశాడు. దాంతో మాటామాటా పెరిగింది. తోటివాళ్లంతా సర్దిచెప్పడంతో అప్పటికి అయిష్టంగా వెనక్కు తగ్గిన బాలకృష్ణన్ జూన్ 2న మాథ్యూ అనే మిత్రునితో కలిసి బాబుపై దాడి చేశాడు. అతను కాలర్ పట్టుకోగా మాథ్యూ రాయితో బాబు ముఖంపైనా, వీపుపైనా విచక్షణారహితంగా చితకబాదాడు. గాయాలపాలైన బాబు కన్నూర్ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనిచ్చిన ఫిర్యాదు చూసి పోలీసులు తొలుత తెల్లబోయినా, తేరుకుని బాలకృష్ణన్, మాథ్యూ ఇద్దరినీ అరెస్టు చేశారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

కెన్యాలో రోడ్డు ప్రమాదం...

ఐదుగురు భారతీయులు మృతి

దోహా: ఖతార్‌లో నివసిస్తున్న ఐదుగురు భారతీయులు కెన్యాలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఈ వివరాలను దోహాలోని భారత రాయబార కార్యాలయం మంగళవారం వెల్లడించింది. విహారయాత్రలో భాగంగా 28 మంది ప్రవాసభారతీయుల బృందం ఖతార్ నుంచి కెన్యాకు వెళ్లింది. కెన్యాలోని నయాందారూ కౌంటీలో ఒల్ జొరోరోక్-న కూరూ రోడ్డులో వీళ్ల ప్రయాణిస్తున్న బస్సు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఐదుగురు చనిపోయారు. విషయం తెల్సుకున్న నైరోబీలోని భారత హైకమిషన్ అధికారులు హుటాహుటిన ఘటనాస్థలికి వెళ్లారు. మృతదేహాల తరలింపు, క్షతగాత్రులకు సహాయక కార్యక్రమాల్లో అధికారులు నిమగ్నమయ్యారని దోహాలోని ఇండియన్ ఎంబసీ తెలిపింది. రోడ్డుపై అదుపు తప్పిన పర్యాటకుల బస్సు పక్కనే ఉన్న లోయలో పడిపోయిందని ది గల్ఫ్ టైమ్స్ వార్తాసంస్థ తన కథనంలో పేర్కొంది. చనిపోయిన ఐదుగురి పూర్తి వివరాలు తెలియరాలేదు. గాయపడిన 27 మంది ప్రవాసభారతీయులను దగ్గర్లోని ఆస్పత్రుల్లో చేర్పించి చికిత్సనందిస్తున్నారు.

నదిలో మునిగి...

ఎనిమిది మంది మృతి

జైపూర్: రాజస్తాన్‌లోని టోంక్ జిల్లాలో మంగళవారం ఎనిమిది మంది బనస్ నదిలో మునిగి చనిపోయారు. మొత్తం 11 మంది బృందం బనస్ నదిలో స్నానం చేయడానికి దిగింది. తొలుత కొందరు లోతుగా ఉన్న జలాల్లోకి వెళ్లి మునిగిపోగా.. మిగతావారు వారిని కాపాడే యత్నంలో ప్రాణాలు కోల్పోయారు. ముగ్గురిని రక్షించామని.. వీరి పరిస్థితి నిలకడగా ఉందని టోంక్ ఎస్పీ వికాస్ సంగ్వాన్ తెలిపారు. నౌషాద్ (35), కాసిం (26), రిజ్వాన్ (26), నవాబ్‌ఖాన్ (28), సాజిద్ (20), నక్కూ (30), బల్లూ, ఫర్హాన్‌లు నీట మునిగి చనిపోయారు. ఆసుపత్రికి తరలించేసరికే వీరు చనిపోయినట్లు వైద్యులు తెలిపారు. వీరందరూ మంగళవారం జైపూర్ నుంచి బనస్ నదికి విహారయాత్రకు వచ్చినట్లు పోలీసులు వెల్లడించారు.

కర్ణాటకలో మళ్లీ కులగణన

సీఎం సిద్ధరామయ్యను ఆదేశించిన కాంగ్రెస్ అధిష్టానం

- 60–80 రోజుల్లోపు పూర్తిచేయాలని సూచన
- గత గణాంకాలపై అభ్యంతరాలు రావడంతో మళ్లీ గణన

శివాజీనగర/న్యూఢిల్లీ: కన్నడనాట మళ్లీ కులగణన క్రతువు మొదలుకాబోతోంది. గతంలో చేపట్టిన కులగణనలోని అంశాలపై పలు వర్గాల నుంచి తీవ్ర స్థాయిలో అభ్యంతరాలు వెల్లువెత్తడంతో మరో 60–80 రోజుల్లోపు కులగణన చేయాలని కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పార్టీ అధిష్టానం కోరింది. పదేళ్ల క్రితం నిర్వహించిన కులగణనలో తమ వర్గాలకు లెక్కలోకి తీసుకోలేదని కొన్ని కులాల నుంచి అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో మరోసారి కులగణనకు మొగ్గుచూపామని కాంగ్రెస్ పార్టీ మంగళవారం ప్రకటించింది. మంగళవారం ఢిల్లీలో పార్టీ నూతన ప్రధాన కార్యాలయం 'ఇందిరాభవన్'లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర పీసీసీ చీఫ్ డీకే శివకుమార్‌లతో పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే, మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ విస్తృతంగా చర్చలు జరిపారు. మూడు గంటలపాటు జరిగిన ఈ చర్చల్లో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(వ్యవస్థాగతం) కేసీ వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి(కర్ణాటక ఇన్‌చార్జ్) రణ్‌దీప్ సూర్జేవాలా సైతం పాల్గొన్నారు. భేటీ వివరాలను వేణుగోపాల్ తర్వాత మీడియాకు వెల్లడించారు. ''కర్ణాటకలో కులగణన అంశం ప్రధానంగా ప్రస్తావనకు వచ్చింది. గత కులగణనను పార్టీ సూత్రప్రాయంగా అంగీకరిస్తోంది. కానీ కొన్ని కులాలు, తెగల నుంచి అభ్యంతరాలున్నాయి. వీటిని నివృత్తిచేసేందుకు మరింత నిష్పక్షపాతంగా మరోసారి కులగణన చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి పార్టీ అధిష్టానం సూచించింది. సమగ్ర వివరాలను సీఎం వెల్లడిస్తారు''అని వేణుగోపాల్ చెప్పారు. దేశవ్యాప్తంగా కులగణనకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల షెడ్యూల్ ప్రకటించిన వేళ కర్ణాటకలో విడిగా కులగణనకు కాంగ్రెస్ సిద్ధమవడం గమనార్హం.

కేబినెట్ భేటీ తర్వాత షెడ్యూల్..

''తదుపరి కులగణన ఎప్పుడు చేపట్టబోయేది త్వరలో జరగబోయే కేబినెట్ భేటీలో నిర్ణయిస్తాం. 90 రోజుల్లోపు సర్వే పూర్తిచేస్తాం. సమాజంలోని అన్ని వర్గాల ప్రయోజనాలను కాపాడుతూ అత్యంత పారదర్శకంగా కులగణన చేపడతాం. తేదీలను సీఎం ప్రకటిస్తారు'' అని కర్ణాటక డెప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. పలువురు మంత్రులు, వర్గాల నుంచి వచ్చిన అభ్యంతరాలను హైకమాండ్ పరిగణనలోకి తీసుకుని మళ్లీ కులగణన చేయాలని సూచించిందని సిద్ధరామయ్య చెప్పారు. మరోవైపు, కేంద్ర నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధుల విషయంలోనూ కర్ణాటకకు బీజేపీ సర్కార్ అన్యాయం చేస్తోందని వేణుగోపాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కులగణన అంశంతోపాటు ఇటీవల బెంగళూరులో ఆర్సీబీ జట్టు విజయోత్సవ కార్యక్రమంలో 11 మంది అమాయకులు ప్రాణాలుకోల్పోయిన ఘటన సైతం ప్రస్తావనకు వచ్చినట్లు విశ్వసనీయ వర్గాలు వెల్లడించాయి. తొక్కిసలాట జరిగి పలువురు ప్రాణాలు కోల్పోవడంపై సీఎం, డెప్యూటీ సీఎంలపై రాహుల్ గాంధీ అసహనం వ్యక్తంచేసినట్లు సమాచారం. ''ప్రాణాలకు పార్టీ చాలా విలువ ఇస్తుంది. ప్రజల విషయంలో ప్రభుత్వం ఎంతో బాధ్యతాయుతంగా ఉండాలి. ఉత్తర ప్రదేశ్‌లో కుంభమేళాలో తొక్కిసలాట విషయంలో బీజేపీ, శబరిమల దుర్ఘటనలో కేరళ సర్కార్‌ల మాదిరి మీరు వ్యవహరించకూడదు''అని రాహుల్ వ్యాఖ్యానించినట్లు తెలుస్తోంది. చిన్నస్వామి స్టేడియం వద్ద జూన్ 4వ తేదీన తొక్కిసలాట అంశంలో నిజానిజాలు నిగ్గుతేల్చేందుకు జ్యుడీషియల్ విచారణకు ఆదేశించారు.

'ఆర్సీబీ వేడుక'లో ఆద్యంతం...

బాధ్యతారాహిత్యమే!

- సర్కారుపై కర్ణాటక హైకోర్టు ధ్వజం
- తొక్కిసలాట ఉదంతంపై ప్రశ్నల వర్షం

బెంగళూరు: ఆర్సీబీ విజయోత్సవాల్లో తొక్కిసలాట విషయంలో సిద్ధరామయ్య ప్రభుత్వ వ్యవహార శైలిని కర్ణాటక హైకోర్టు తూర్పారబట్టింది. అభిమానులు భారీగా పోటెత్తుతారని తెలిసి కూడా ఏ దశలోనూ బాధ్యతాయుతంగా ప్రవర్తించలేదని ఆక్షేపించింది. ఈ ఉదంతానికి సంబంధించి సర్కారుకు తొమ్మిది కీలక ప్రశ్నలు సంధించింది. 11 మంది మృతికి కారణమైన తొక్కిసలాట ఘటనను కోర్టు సుమోటోగా స్వీకరించడం తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి వి.కామేశ్వర్‌రావు, న్యాయమూర్తి సి.ఎం.జోషి ధర్మాసనం మంగళవారం దీనిపై విచారణ జరిపింది. ప్రభుత్వం తరఫున హాజరైన అడ్వకేట్ జనరల్ శశికిరణ్ షెట్టిని పలు అంశాలపై నిలదీసింది. ''విజయోత్సవాలు జరపాలన్న నిర్ణయం ఎవరిది? వాటిని ఎప్పుడు, ఎలా జరపాలని నిర్ణయించారు? ట్రాఫిక్‌ను, భారీగా పోటెత్తిన అభిమానులను నియంత్రించేందుకు ఏం చర్యలు తీసుకున్నారు? వాళ్లు ఏ మేరకు వస్తారో ముందస్తు అంచనాలు వేయలేదేం? 50 వేలు, అంతకుమించి జనం వచ్చే ఎలాంటి క్రీడా కార్యక్రమానికైనా విధిగా అనుసరించాల్సిన పద్ధతులను (ఎస్‌ఓపీ) పాటించారా? వేదిక వద్ద వైద్య తదితర సదుపాయాలేమైనా కల్పించారా? క్షతగాత్రులకు తక్షణం వైద్యసాయం అందిందా? అందకపోతే కారణమేమిటి? వారిని ఆస్పత్రికి తరలించేందుకు ఎంత సమయం పట్టింది? కార్యక్రమ నిర్వహణకు అసలు అనుమతి తీసుకున్నారా?''అంటూ ప్రశ్నించింది. వాటికి బదులిచ్చేందుకు గడువు కావాలని ఏజీ కోరారు. దర్యాప్తును సీఐడీకి బదలాయించిన విషయాన్ని ధర్మాసనానికి నివేదించకపోవడం తప్పిదమేనని అంగీకరించారు.

ఆహ్వానించింది ముఖ్యమంత్రే: రాజ్‌భవన్

ఆర్సీబీ విజయోత్సవ వేడుకకు గవర్నర్‌ను స్వయంగా ముఖ్యమంత్రి సిద్ధరామయ్యే ఆహ్వానించినట్టు రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. ఈవెంట్ ఆర్గనైజర్ అయిన డీఎన్ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్ కూడా తన పిటిషన్లో ఈ మేరకు పేర్కొంది.

అక్రమ ప్రవేశాలను

సహించబోం

భారత విద్యార్థి నిర్బంధంపై అమెరికా

- అతని ప్రవేశం ఎలా అక్రమమో వెల్లడించని వైనం

న్యూఢిల్లీ: భారత విద్యార్థిని నేలపై పడేసి, పెడరెక్కలు వెనక్కు విరిచి కట్టి బేడీలు వేయడాన్ని అమెరికా సమర్థించుకుంది. ''అతనిపై అలాంటి చర్యలు తీసుకోవడంలో తప్పేమీ లేదు. అమెరికాలోకి అక్రమ ప్రవేశాలను, వీసా ఉల్లంఘనలను సహించే ప్రసక్తే లేదు''అని ఢిల్లీలోని అమెరికా దౌత్య కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. కాకపోతే బాధిత విద్యార్థి ఎటువంటి వీసా ఉల్లంఘనకు పాల్పడిందీ వివరించలేదు. శనివారం రాత్రి భారత్‌కు తిప్పి పంపించే క్రమంలో సదరు విద్యార్థి పట్ల నెవార్క్ విమానాశ్రయంలో పోలీసులు, భద్రతా సిబ్బంది అత్యంత అనుమానంగా వ్యవహరించడం తెలిసిందే. తాను నేరగాన్ని కాదని బాధితుడు అరుస్తున్నా పట్టించుకోలేదు. కునాల్ జైన్ అనే ప్రవాస భారతీయుడు దీన్నంతటినీ వీడియో తీసి ఎక్స్‌లో పంచుకోవడంతో విషయం వెలుగులోకి వచ్చింది. నిస్సహాయుడైన ఒక అమాయకున్ని కరడుగట్టిన నేరస్తునిలా చూశారంటూ ఆయన ఆవేదన వెలిబుచ్చారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నా అమెరికా మాత్రం సమర్థించుకోవడం గమనార్హం. ''చట్టబద్ధంగా అమెరికాకు వచ్చే పర్యాటకులకు ఎప్పుడూ స్వాగతం పలుకుతాం. కానీ ఎవరికై నా సరే, మా దేశంలోకి ప్రవేశం ఒక హక్కు కాదని గుర్తుంచుకోవాలి''అంటూ దౌత్య కార్యాలయం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. ఈ ఉదంతంపై న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్ స్పందించింది. ''దీనికి సంబంధించిన సోషల్ మీడియా పోస్టులను చూశాం. దీనిపై స్థానిక అధికారులతో సంప్రదిస్తున్నాం''అని భారత కాన్సులేట్ జనరల్ ఎక్స్‌లో పేర్కొన్నారు. భారతీయుల సంక్షేమానికి కాన్సులేట్ కట్టుబడి ఉంటుందని చెప్పారు. అంతర్జాతీయ విద్యార్థులపై ట్రంప్ సర్కారు కొన్నాళ్లుగా కొరడా ఝుళిపిస్తుండటం తెలిసిందే. ట్రాఫిక్ ఉల్లంఘనల వంటి చిన్నాచితకా కారణాలకు కూడా కనీసం ముందస్తు నోటీసులైనా ఇవ్వకుండానే వీసాలు రద్దు చేసి స్వదేశాలకు పంపించేస్తోంది. వీటిపై అక్కడి కోర్టులో న్యాయ పోరాటాలు కూడా సాగుతున్నాయి.

ట్రంప్‌తో మోదీ మాట్లాడాలి: కాంగ్రెస్

ఈ ఉదంతంపై కాంగ్రెస్ పార్టీ స్పందించింది. భారత విద్యార్థులపై అమెరికాలో నిర్బంధం నానాటికీ పెరిగిపోతోందంటూ ఆందోళన వ్యక్తం చేసింది. విదేశీ గడ్డపై భారత్, భారతీయుల గౌరవ మర్యాదలను కాపాడటంతో మోదీ ప్రభుత్వం వరుసగా విఫలమవుతూ వస్తోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. ''ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలి. తక్షణం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడి వీటికి ఫుల్‌స్టాప్ పెట్టించాలి'' అని డిమాండ్ చేశారు.



విమానంలో గ్రెటా థన్‌బర్గ్

థన్‌బర్గ్‌ను తిప్పిపంపిన ఇజ్రాయెల్

మరో ఎనిమిది మంది నిర్బంధంలోనే

జెరుసలేం: అంతర్జాతీయ పర్యావరణవేత్త గ్రెటా థన్‌బర్గ్‌కు ఆమె స్వదేశం స్వీడన్‌కు ఇజ్రాయెల్ తిప్పి పంపించేసింది. యూరోపియన్ పార్లమెంటు సభ్యులు తదితరులతో కూడిన డజను మంది హక్కుల కార్యకర్తలతో కలిసి పడవలో గాజాలో ప్రవేశించేందుకు ఆమె విఫలయత్నం చేయడం తెలిసిందే. పాలస్తీనావాసులకు మానవతా సహాయ సామగ్రి అందజేయడంతో పాటు వారి దుస్థితిని బయటి ప్రపంచానికి తెలిపే లక్ష్యంతో ఎనిమిది రోజుల క్రితం సిసిలీ నుంచి వారి బృందం బయల్దేరింది. ఆ పడవను సోమవారం గాజాకు 200 కి.మీ. దూరంలో అంతర్జాతీయ జలాల్లో ఇజ్రాయెల్ నేవీ అడ్డుకుంది. వారిని నిర్బంధించి ఇజ్రాయెల్‌లోని అష్దోద్ పోర్టుకు తరలించింది. మంగళవారం థన్‌బర్గ్‌తో పాటు మరో ఇద్దరు కార్యకర్తలు, ఒక జర్నలిస్టును విమానంలో ఫ్రాన్స్ రాజధాని పారిస్‌కు తిప్పిపంపినట్టు ఇజ్రాయెల్ విదేశాంగ శాఖ పేర్కొంది. విమానంలో కూచుని ఉన్న థన్‌బర్గ్ ఫొటోను ఎక్స్‌లో పోస్టు చేసింది. మిగతా ఎనిమిది మంది తిరిగి వెళ్లేందుకు నిరాకరించడంతో నిర్బంధ కేంద్రాలకు తరలించారు. అనంతరం అధికారులు వారిని కోర్టులో హాజరుపరిచారు. మరో మూడు రోజుల్లో వారందరినీ బలవంతంగా స్వదేశాలకు పంపుతారని సమాచారం. పర్యావరణవేత్త అయిన థన్‌బర్గ్ విమాన ప్రయాణాలకు వ్యతిరేకి. పారిస్ చేరగానే విమానాశ్రయంలో ఆమె మీడియాతో మాట్లాడారు. ఎనిమిది మంది కార్యకర్తలనూ తక్షణం విడుదల చేసి వారి దేశాలకు పంపేయాలని ఇజ్రాయెల్‌ను డిమాండ్‌చేశారు. తమను విడివిడిగా నిర్బంధించారని, పలువురిని లాయర్లను కలుసుకునే అవకాశం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. ''ఇజ్రాయెల్ నిర్బంధంలో గడిపినంతసేపు మేమంతా అత్యంత అయోమయ పరిస్థితులను ఎదుర్కొన్నాం. అయితే ఇవి ఊహించనివేమీ కాదు. పైగా గాజావాసుల దైన్యంతో పోలిస్తే లెక్కలోకే రావు. వారి హక్కుల కోసం ఇకముందు కూడా అన్ని మార్గాల్లోనూ గళమెత్తుతూనే ఉంటాం''అని ప్రకటించారు.

బెంగాల్ సీఎం మమత ధ్వజం

- పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను వెనక్కితీసుకునే సువర్ణావకాశాన్ని జారవిడిచారు

జాతీయ భద్రతలో బీజేపీ వైఫల్యం

కోల్‌కతా: పహల్గాం ఉగ్రదాడి ఎదుర్కొనడంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. దేశ ప్రజలకు భద్రతను కల్పించలేకపోయిన కేంద్ర ప్రభుత్వం రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)ను భారత్ స్వాధీనం చేసుకొనే అవకాశం ఉన్నా.. కేంద్రం నిర్ణయాత్మకంగా వ్యవహరించలేకపోయినందని ఆమె అన్నారు. 'పీవోకేను వెనక్కితీసుకునే బదులు ఉగ్రవాదంపై ఐక్యరాజ్యసమితి కమిటీలో పాక్‌కు సభ్యత్వం ఇవ్వడాన్ని అనుమతించాం. మన విదేశాంగ విధానంలో లోపముందా?'అని ఆమె నిలదీశారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత బలగాలు చూసిన ధైర్యసాహసాలను, దాడుల్లో కచ్చితత్వాన్ని బెంగాల్ అసెంబ్లీ మంగళవారం కొనియాడింది. ఈ సందర్భంగా మమత మాట్లాడారు. పహల్గాం ఉగ్రఘటనకు కేంద్రప్రభుత్వ వైఫల్యమే పూర్తి కారణమని బెంగాల్ సీఎం ఆరోపించారు. ఉగ్రదాడి జరిగిన ప్రాంతంలో భద్రతా బలగాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. ఒక్కఉగ్రవాదిని కూడా ఎందుకు పట్టుకోలేకపోయామని నిలదీశారు. హై సెక్యూరిటీ జోన్‌లో ఇలాంటి ఉగ్రదాడి జరగడమేమిటన్నారు. దీనికి కేంద్రం జవాబుదారీతనం వహించాలన్నారు. ఏప్రిల్ 22న జరిగిన పహల్గాం ఉగ్రదాడిలో 26 మంది మృతి చెందిన విషయం తెలిసిందే. ఉగ్రవాదానికి మతం, కులం ఏమీ లేవని, పహల్గాం దాడులకు బాధ్యులైన వారికి వెంటనే చట్టం ముందు నిలబెట్టాలన్నారు. 'ఉగ్రవాదులకు గుణపాఠం నేర్పాల్సిన అవసరం ఏర్పడింది. మన సాయుధ బలగాల ధైర్యసాహసాలకు వారికి శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను'అని మమత అన్నారు. ప్రధాని తనను తాను గొప్పగా చెప్పుకోవడంలో బిజీగా ఉన్నారని మోదీపై పరోక్షంగా ఆరోపణ చేశారు. అంతర్జాతీయంగా బోనులో నిలబడినా పాకిస్తాన్‌కు ఐఎంఎఫ్ లాంటి సంస్థల నుంచి రుణాలు అందుతున్నాయని, భారత్ విదేశాంగ విధానం, వ్యూహరచనలోనే ఏదో లోటు ఉందని మమత అన్నారు.



జీవించే హక్కును వివరించే అధికరణ?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ పాలిటీ

ప్రాథమిక హక్కులు - ఆదేశిక సూత్రాలు

వ్యక్తి పరిపూర్ణ అభివృద్ధికి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రాథమిక హక్కులు పెట్టని కోట. భారత ప్రజాస్వామ్యానికి ఇవి పునాదిరాళ్లు. ప్రాథమిక హక్కులను మన రాజ్యాంగానికి మాగ్నాకార్టాగా పేర్కొంటారు. వీటికి, ఆదేశిక సూత్రాలకు మధ్య సంబంధం విషయంలో.. న్యాయ శాస్త్రవేత్తలకు, రాజ్యాంగ నిపుణులకు, రాజనీతిజ్ఞులకు మధ్య భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. న్యాయ సంరక్షణ లేని హక్కులుగా బి.ఎన్.రావు వర్ణించిన ఆదేశిక సూత్రాల స్థితిగతులపై అనేక వాదనలున్నాయి. రాజ్యాధికార దుర్వినియోగం, నియంతృత్వ చట్టాల నుంచి పౌరుల ప్రాథమిక హక్కులకు రక్షణ కల్పించే బాధ్యతను మన రాజ్యాంగం సుప్రీం కోర్టు, హైకోర్టులకు అప్పగించింది. తద్వారా ప్రాథమిక హక్కులకు న్యాయ సంరక్షణ లభించింది. వీటి రక్షణ కోసం సుప్రీంకోర్టు 32వ అధికరణ ప్రకారం, హైకోర్టులు 226వ అధికరణ ప్రకారం రిట్లను జారీ చేస్తాయి. రాజ్యాంగంలోని 37వ అధికరణను అనుసరించి ఎలాంటి న్యాయ సంరక్షణ లేని ఆదేశిక సూత్రాలు అంతగా పట్టించుకోదగినవి కావని కె. సంతానం వ్యాఖ్యానించడం గమనార్హం. నిర్దేశిక నియమాలకు న్యాయసంరక్షణ లేకపోయినప్పటికీ సామాజిక మద్దతు ఉందని డా.బి.ఆర్. అంబేద్కర్ పేర్కొన్నారు. ప్రభుత్వాలు సమాజానికి, ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు ఈ విషయాన్ని విస్మరించడానికి అవకాశం లేదని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రాథమిక హక్కులు – ఆదేశిక సూత్రాల మధ్య సంబంధం

ప్రాథమిక హక్కులు– ఆదేశిక సూత్రాల మధ్య వైరుధ్యాలు, తేడాలు మాత్రమే ఉన్నాయని, ఎలాంటి సంబంధం, సమన్వయం లేదనే అభిప్రాయం రాజకీయ విశ్లేషకుల్లో ఉంది. 19(1)(ఎ) అధికరణ వ్యక్తి భావ ప్రకటన, వాక్ స్వాతంత్ర్యాల గురించి పేర్కొంటోంది. 21వ అధికరణ వ్యక్తి స్వేచ్ఛను తెలుపుతోంది. సాధారణంగా అన్ని రకాల ఆర్థిక వనరులను కలిగి రాజ్యాంగం, హక్కుల గురించి అవగాహన ఉన్నవారు వాటిని పొందడం పెద్ద సమస్య కాదు. కానీ పేదలు, నిరక్షరాస్యులు, ప్రాథమిక హక్కుల గురించి అవగాహనలేనివారు ఈ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందడానికి ఆదేశిక సూత్రాల్లోని 39–ఎ అధికరణ ఉచిత న్యాయ సేవా సహాయ కేంద్రాల ద్వారా అవకాశం కల్పిస్తోంది. పేదలకు, దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి ఉచిత న్యాయసేవా సహాయం అందించడానికి 1987లో లీగల్ ఎయిడ్ అథారిటీని ఏర్పాటు చేశారు. రాజ్యాంగంలోని 21వ అధికరణ జీవించే హక్కును వివరిస్తోంది. 41వ అధికరణ, 48ఎ అధికరణలు ప్రాథమిక హక్కులకు, ఆదేశిక సూత్రాలకు మధ్య అవినాభావ సంబంధాన్ని తెలుపుతున్నాయి. రాజ్యాంగంలోని 46వ అధికరణ వెనుకబడిన వర్గాలకు విద్య, ఉద్యోగపరంగా ప్రత్యేక అవకాశాలను కల్పించాలని పేర్కొంటోంది. రిజర్వేషన్ల అమలు కోసం ప్రభుత్వాలు రూపొందించిన చట్టాలను 15(4), 15(5), 16(4), 16(4ఎ) అధికరణలు సమర్థిస్తాయి. ఆదేశిక సూత్రాలు, ప్రాథమిక హక్కుల అమలులో ఒకదానికి మరొకటి సహకరించడంతో పాటు ఒక అంశాన్ని మరొక అంశం పటిష్టపరిచేందుకు దోహదపడటం గమనార్హం.



ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల మధ్య భిన్నత్వం

ప్రాథమిక హక్కులు ప్రధానంగా వ్యక్తి ప్రాతిపదికపై రూపొందించినవి. ఆదేశిక సూత్రాలు సమాజ సమష్టి ప్రయోజనం కోసం ఉద్దేశించినవి. హక్కులు వ్యక్తి స్వేచ్ఛను, రాజకీయ ప్రజాస్వామ్యాన్ని పెంపొందించేందుకు తోడ్పడతాయి. ప్రాథమిక హక్కుల సంరక్షణ, అమలు కోసం పౌరులు ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించేందుకు అవకాశం ఉండగా, వాటి సంరక్షణ కోసం న్యాయస్థానాలు కూడా ఆజ్ఞలు జారీ చేసే అధికారాన్ని కలిగి ఉంటాయి. ఆదేశిక సూత్రాలకు అలాంటి న్యాయ సంరక్షణ లేకపోవడం గమనార్హం. ప్రాథమిక హక్కులు ఎల్లప్పుడూ పౌరులకు అందుబాటులో ఉంటాయి. జాతీయ అత్యవసర పరిస్థితిని విధించిన సందర్భంలో మాత్రమే భారత రాష్ట్రపతి వాటిని తాత్కాలికంగా సస్పెండ్ చేయొచ్చు. కానీ నిర్దేశిక నియమాలు ఎల్లప్పుడూ సుప్తచేతనావస్థలో ఉంటాయి. అంటే వాటికి జీవం పోయాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలను చేసి అమలు పర్చాలి. ప్రాథమిక హక్కుల సంరక్షణ బాధ్యత న్యాయస్థానాలపై, నిర్దేశిక నియమాల అమలు బాధ్యత ప్రభుత్వాలపై ఉంటుంది. ఆదేశిక సూత్రాలు ప్రభుత్వాలకు సకారాత్మక దృక్పథాన్ని కల్పిస్తాయి. అంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మార్గదర్శకాన్ని చూపుతాయి. ప్రాథమిక హక్కులు ప్రధానంగా ఏ పనులు చేయకూడదో తెలుపుతాయి. అంటే కొన్ని హక్కులు తప్ప మిగతావన్నీ నకారాత్మక దృక్పథాన్ని తెలుపుతాయి.

ఆదేశిక సూత్రాలు రాజ్యాంగ సంక్షేమ లక్ష్యాలను తెలిపితే... ప్రాథమిక హక్కులు ఆ లక్ష్యాలను సాధించే సాధనాలు, మార్గాలుగా ఉపయోగపడతాయి.

సంక్షేమ రాజ్యస్థాపనలో నిమగ్నమైన మన దేశంలో నిర్దేశిక నియమాలు.. ప్రభుత్వ శాసనాల రూపకల్పనలో, పరిపాలనా విషయంలో మాత్రమే కాకుండా న్యాయస్థానాల న్యాయ నిర్వహణలోనూ అధిక ప్రాధాన్యతను కలిగి ఉంటాయి.

ప్రాథమిక హక్కులు - ఆదేశిక సూత్రాల మధ్య వైరుధ్యం:

ఆదేశిక సూత్రాలను అమలు పర్చాల్సిన బాధ్యత కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలపై ఉంది. ఆదేశిక సూత్రాల అమలుకు ప్రభుత్వాలు రూపొందించే చట్టాలు... ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉన్నప్పుడు ఉన్నత న్యాయస్థానాలు న్యాయ సమీక్ష నిర్వహించి ఆ చట్టాలు చెల్లవని ప్రకటిస్తున్నాయి.

- ★ 1950లో భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన సందర్భంలో మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం 46వ అధికరణను అమలు జరపడంలో భాగంగా ఎస్సీ, ఎస్టీలకు విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు కల్పిస్తూ ప్రత్యేక చట్టాన్ని రూపొందించింది. సమానత్వపు హక్కుకు రిజర్వేషన్లు విరుద్ధమని పేర్కొంటూ చంపకం దొర్రై రాజన్ మద్రాస్ హైకోర్టులో సవాల్ చేశారు. దీనిపై మద్రాస్ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీల్ చేసింది. సుప్రీంకోర్టు కూడా రిజర్వేషన్ల చట్టం 13వ అధికరణ ప్రకారం ప్రాథమిక హక్కులకు విరుద్ధమని తీర్పునిచ్చింది.
- ★ 1950 లో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు 39(బి), 39(సి) అధికరణలను అమలు పర్చడంలో భాగంగా భూ సంస్కరణల చట్టాలను రూపొందించాయి. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ హైకోర్టులు భూ సంస్కరణల చట్టాలను సమర్థించగా... బీహార్,పశ్చిమబెంగాల్ హైకోర్టులు ఈ చట్టాలు రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించాయి. కారణం అప్పట్లో ఆస్తిహక్కు ప్రాథమిక హక్కుగా ఉండడమే. అంతేకాకుండా దేశంలోని వివిధ హైకోర్టుల్లో వందలాది కేసులు విచారణలో ఉన్నాయి.
- ★ రిజర్వేషన్లు, భూ సంస్కరణల చట్టాల విషయంలో ఉన్నత న్యాయస్థానాలిచ్చిన తీర్పులను దృష్టిలో ఉంచుకొని 1951 లో నెహ్రూ ప్రభుత్వం మొదటి రాజ్యాంగ సవరణను చేసింది. ఈ సవరణ ద్వారా భూ సంస్కరణల చట్టాలకు రాజ్యాంగపరమైన రక్షణ కల్పిస్తూ 9వ షెడ్యూల్‌ను రాజ్యాంగంలో చేర్చారు. ప్రైవేట్ ఆస్తులను చట్టబద్ధంగా ప్రభుత్వాలు స్వాధీనం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తూ 31(ఎ), 31(బి) అధికరణలను మన రాజ్యాంగంలో పొందుపర్చారు.
- ★ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధతను కల్పిస్తూ 15(4) అనే అధికరణను కూడా చేర్చారు. మొదటి రాజ్యాంగ సవరణ కూడా ప్రాథమిక హక్కులకు విరుద్ధంగా ఉందనే కారణంతో శంకరీ ప్రసాద్ సుప్రీంకోర్టులో సవాల్ చేశారు.
- ★ 1951లో శంకరీ ప్రసాద్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు... మొదటి రాజ్యాంగ సవరణను, తద్వారా రాజ్యాంగంలో చేర్చిన అంశాలను సమర్థించింది. ఈ కేసులో ఒక ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించింది. 13వ అధికరణ ప్రకారం సాధారణ చట్టాలను మాత్రమే న్యాయ సమీక్షకు గురిచేయొచ్చని, 368 అధికరణ ప్రకారం చేసిన రాజ్యాంగ సవరణలను న్యాయ సమీక్షకు గురిచేసే అవకాశం లేదని పేర్కొంది.
- ★ బేలా బెనర్జీ వర్సెస్ పశ్చిమ బెంగాల్, కామేశ్వరీ సింగ్ వర్సెస్ బీహార్ మధ్య జరిగిన వ్యాజ్యాల్లో సుప్రీంకోర్టు... ప్రైవేట్ వ్యక్తుల వద్ద ఉన్న వ్యక్తిగత ఆస్తులను సమాజ ప్రయోజనం కోసం జాతీయం చేసినప్పుడు వారికి నష్టపరిహారం న్యాయబద్ధంగా చెల్లించాలని, అంటే మార్కెట్ విలువ ప్రకారం చెల్లించాలని తీర్పునిచ్చింది. దీంతో పార్లమెంట్ 4వ రాజ్యాంగ సవరణ చేసింది. వ్యక్తులకు చెల్లించే నష్టపరిహారాన్ని చట్టబద్ధంగా మాత్రమే చెల్లించాలని పేర్కొంది.
- ★ సజ్జన్‌సింగ్ వర్సెస్ రాజస్థాన్ మధ్య జరిగిన వ్యాజ్యంలో కూడా సుప్రీంకోర్టు 1965లో 4వ సవరణను సమర్థించింది. కానీ, 1967లో గోలక్‌నాథ్ వర్సెస్ పంజాబ్ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు... గత తీర్పులకు భిన్నమైన తీర్పునిచ్చింది. ఆదేశిక సూత్రాలను అమలు పర్చడానికి ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు లేదని స్పష్టం చేసింది. అంతేకాకుండా ప్రాథమిక హక్కులను సవరించినట్లయితే.. ఆ సదరు సవరణలను కూడా న్యాయసమీక్షకు గురిచేస్తామని కోర్టు పేర్కొంది.
- ★ 1969లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 14 బ్యాంకులను జాతీయం చేసిన అంశాన్ని, 1970లో రాజభరణాలను రద్దు చేస్తూ రాష్ట్రపతి జారీ చేసిన ఆర్డినెన్స్‌లు కూడా రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టు తీర్పులనిచ్చింది. దీంతో ఇందిరాగాంధీ ప్రభుత్వం 24, 25, 26వ రాజ్యాంగ సవరణలను చేపట్టింది.
- ★ 24వ సవరణ ప్రకారం... ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉంటుంది.
- ★ 25వ సవరణ ప్రకారం ప్రైవేట్ వ్యక్తుల ఆస్తులను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నప్పుడు చెల్లించే నష్టపరిహారం అనే పదానికి బదులుగా కొంత మొత్తం చెల్లించాలని, ఈ అంశాన్ని ఏ న్యాయస్థానంలో కూడా సవాల్ చేసే అవకాశం లేదని పేర్కొంటూ 'సి' క్లాజును చేర్చారు.
- ★ 26వ సవరణ ప్రకారం రాజభరణాల రద్దుకు రాజ్యాంగబద్ధతను కల్పించారు.
- ★ పై మూడు రాజ్యాంగ సవరణలను 1973లో కేశవానంద భారతి వర్సెస్ కేరళ మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. 24వ రాజ్యాంగ సవరణను సమర్థిస్తూ ప్రాథమిక హక్కులను సవరించే అధికారం పార్లమెంట్‌కు ఉందని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. కానీ రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని మాత్రం సవరించే అధికారం లేదని పేర్కొంది.
- ★ 25వ సవరణను సమర్థించినప్పటికీ అందులోని సి క్లాజు చెల్లదని తీర్పునిచ్చింది.
- ★ 26వ రాజ్యాంగ సవరణను సుప్రీంకోర్టు సమర్థించింది.
- ★ 1976లో ఇందిరాగాంధీ ప్రభుత్వం 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆదేశిక సూత్రాలను అమలు పర్చడానికి రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా పార్లమెంట్ సవరిస్తుందని, అలా సవరించిన అంశాన్ని ఏ న్యాయస్థానం ముందు ప్రశ్నించొద్దని, ఆ అంశాన్ని న్యాయ సమీక్షకు గురిచేసే అధికారం కూడా న్యాయస్థానాలకు లేదని పేర్కొంది.
- ★ 42వ సవరణ ద్వారా చేర్చిన అంశాలను 1980లో జరిగిన మినర్వా మిల్స్ కేసులో ప్రశ్నించారు. మినర్వామిల్స్ కేసులో సుప్రీంకోర్టు తీర్పునిస్తూ ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు రెండూ పరస్పరం విరుద్ధమైనవి కావు, భారత ప్రజాస్వామ్యానికి రెండు రథచక్రాల వంటివి, ఈ రెండింటి మధ్య సమన్వయం సాధించాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొంది. అంతేకాకుండా ఆదేశిక సూత్రాలన్నింటికీ కాకుండా 39(బి), 39(సి) అధికరణలకు మాత్రమే న్యాయ సంరక్షణ ఉంటుందని పేర్కొంది. ప్రాథమిక హక్కులు మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని వెల్లడిస్తూ ఆదేశిక సూత్రాలపై ప్రాథమిక హక్కుల ప్రాధాన్యతను చాటి చెప్పింది.
- ★ ఎం.హెచ్. హోస్కాట్ వర్సెస్ మహారాష్ట్ర మధ్య జరిగిన వ్యాజ్యంలో సుప్రీంకోర్టు ఉచిత న్యాయ సేవా సహాయాన్ని అందించడం కూడా ప్రాథమిక హక్కుగా గుర్తించాలని తీర్పునిచ్చింది.
- ★ 1992లో మోహినీజైన్ కేసులో, ఉన్నికృష్ణన్ కేసులో ప్రాథమిక విద్యను ప్రాథమిక హక్కుగా సుప్రీంకోర్టు గుర్తించింది. ఇందిరాసహానీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా మధ్య వ్యాజ్యంలో సంక్షేమ స్వభావం కూడా మన రాజ్యాంగ మౌలిక స్వరూపంలో అంతర్భాగమని పేర్కొంది.
- ★ ఆదేశిక సూత్రాల్లో పర్యావరణ పరిరక్షణ అనే అంశాన్ని కూడా సమర్థిస్తూ ఎం.సి.మెహతా కేసులో తాజ్‌మహల్ చుట్టూ కాలుష్యాన్ని వెదజల్లే 18 రకాల పరిశ్రమలను మూసివేయాలని సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.
- ★ 2006లో భారత పార్లమెంట్ 93వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్యాసంస్థల్లో ఇతర వెనుకబడిన తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించడాన్ని అశోక్‌కుమార్ ఠాకూర్ కేసులో సుప్రీంకోర్టు సమర్థించింది.

విద్య, ఉద్యోగ సమాచారం

చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్‌లో వివిధ పోస్టులు

చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్(సీఎంఆర్ఎల్) ఒప్పంద ప్రాతిపదికన చీఫ్ జనరల్ మేనేజర్, జనరల్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 02.
- » పోస్టుల వివరాలు: చీఫ్ జనరల్ మేనేజర్–01, జనరల్ మేనేజర్–01.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: 45 నుంచి 55 ఏళ్లు ఉండాలి.
- » వేతనం: నెలకు చీఫ్ జనరల్ మేనేజర్ పోస్టుకు రూ.2,70,000, జనరల్ మేనేజర్ పోస్టుకు రూ.2,25,000.
- » ఎంపిక విధానం: ఇంటర్వ్యూ, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- » దరఖాస్తులకు చివరితేది: 23.06.2025.
- » వెబ్‌సైట్: https://chennaimetrorail.org


ఇర్కాన్‌లో సివిల్ ఇంజనీర్ పోస్టులు



ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్(ఇర్కాన్) ఒప్పంద ప్రాతిపదికన ఇంజనీర్/సివిల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » మొత్తం పోస్టుల సంఖ్య: 02.
- » అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి 60 శాతం మార్కులతో డిగ్రీ (సివిల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులవ్వాలి. దీంతోపాటు పని అనుభవం ఉండాలి.
- » వయసు: 01.05.2025 నాటికి 30 ఏళ్లు ఉండాలి.
- » వేతనం: నెలకు రూ.36,000.
- » ఎంపిక విధానం: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
- » దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును జీజీఎం, హెచ్ఆర్ఎం, ఇర్కాన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, సీ–4, డిస్ట్రిక్ సెంటర్, సాకెట్, న్యూఢిల్లీ–110017 చిరునామకు పంపించాలి.
- » దరఖాస్తులకు చివరితేది: 18.06.2025.
- » వెబ్‌సైట్: https://ircon.org

చర్చలో ఉండాల్సిన ప్రధానాంశాలేవి?



బోధనా పద్ధతులు

1. కుదించిన బోధనా ఉద్యమం అని దేనికి పేరు?
   1) పరిహార బోధన 2) సూక్ష్మబోధన
   3) స్థూల బోధన 4) జట్టు బోధన
2. డేవిడ్ వార్విక్ ప్రకారం జట్టు బోధనకు అవసరమైన నాలుగు ఉపగమాల్లో రెండోది?
   1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం
   2) సంచయన క్రమానుగతం
   3) ఏకకేంద్ర ఉపగమం
   4) సమవర్తిత విషయాలు
3. విద్యార్థి ఒక దినపత్రిక నుంచి జూన్‌లో కురిసిన వర్షపాతానికి సంబంధించిన వివరాలను సేకరించాడు. వాటిని సుదీర్ఘంగా పరిశీలించి యథార్థాలను చెప్పగల్గడం అనేది ఏ రకమైన దృక్పథం?
   1) నిగమనాత్మక 2) సంశ్లేషణాత్మక
   3) విశ్లేషణాత్మక 4) ఆగమనాత్మక
4. 'గోల్కొండ కోట' అనే మూలాధారం ఏ రకానికి సంబంధించింది?
   1) వాఙ్మయ 2) సాంప్రదాయ
   3) పురావస్తు 4) శాసన
5. 'బిల్లు చట్టంగా మారడం' అనే పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉత్తమ పద్ధతి?
   1) పానెల్ చర్చ 2) సింపోజియం
   3) స్వయం అధ్యయనం
   4) అనుకరణ పార్లమెంట్
6. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
   1) చర్చ 2) సంశ్లేషణ
   3) విశ్లేషణ 4) వాగ్వాదం
7. ప్రత్యక్ష, పరోక్ష సమాచారాన్ని పొందడానికి అవకాశమిచ్చే దృక్పథాలు వరుసగా?
   1) ఆగమన, నిగమన దృక్పథాలు
   2) ఆగమన, విశ్లేషణ దృక్పథాలు
   3) నిగమన, సంశ్లేషణ దృక్పథాలు
   4) నిగమన, ఆగమన దృక్పథాలు
8. సమస్యా పరిష్కారంలో సమస్యను నిర్వచించిన తర్వాత చేయాల్సిన పని?
   1) సమస్యను విశ్లేషించి పరిష్కారం కనుగొనడం
   2) సమాచారాన్ని సేకరించి, సమస్యను విశ్లేషించడం
   3) సమాచారాన్ని సేకరించి, అన్వయించడం
   4) సమస్యను విశ్లేషించి, సమాచారాన్ని సేకరించడం
9. 'బ్రౌడీ' ప్రకారం బోధనా పద్ధతి అంటే?
   1) కృత్యాలను తరగతి గదిలో నిర్వహించే విధానం
   2) సామాన్యంగా పిలిచే వరుస క్రమ చర్యల లాంఛన స్వరూపం
   3) అభ్యసన ప్రక్రియను నిర్దేశించడానికి ఉపాధ్యాయుడు అనుసరించే విధానం
   4) విద్యార్థులకు విజ్ఞానాన్ని అందజేయడానికి ఉపాధ్యాయుడు అనుసరించే మార్గం
10. విషయ సామగ్రి సేకరణలో ద్వితీయ ఆకారానికి చెందినవి?
    1) దస్తావేజులు 2) పాఠ్యపుస్తకాలు
    3) పత్రికలు 4) నాణేలు
11. విద్యార్థులతో పంచదార ఫ్యాక్టరీని సందర్శింపజేయడం అనే ప్రక్రియ ఏ బోధనా పద్ధతిలో ఒక భాగం?
    1) సమస్యా పరిష్కార పద్ధతి
    2) సాంఘిక ఉద్గార పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
12. కిందివాటిలో 'నాటకీకరణ' ద్వారా బోధించడానికి అత్యంత అనువైన పాఠ్యాంశం ఏది?
    1) వేములవాడ 2) ఆకాశవాణి
    3) మన దేశం 4) ఉత్తరాల బట్వాడ
13. 'ప్రాజెక్టు పద్ధతి' సోపానాల్లో మూడోది?
    1) ప్రాజెక్టు నిర్వహణ
    2) ప్రాజెక్టు ప్రణాళికా రచన
    3) నమోదు చేయడం
    4) ప్రాజెక్టు ఎంపిక, ఉద్దేశ వివరణ
14. ఏ పాఠాన్ని బోధించడానికి పరిసరాన్ని ఒక ఉపగమంగా ఉపయోగించవచ్చు?
    1) సేవాసంస్థలు 2) శీతోష్ణస్థితి
    3) ఆర్యుల నాగరికత
    4) హక్కులు బాధ్యతలు
15. 'రామాయణం' ఏ రకానికి చెందిన ఆధారం?
    1) ద్వితీయ 2) ప్రధాన
    3) తృతీయ 4) చతుర్థ
16. జట్టు బోధన రూపకల్పనకు డేవిడ్ వార్విక్ సూచించిన ఉపగమాలేవి?
    1) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, పరిసర ఉపగమం, క్రమానుగత ఉపగమం, సమవర్తిత విషయాలు
    2) యూనిట్ ఉపగమం, వర్తులాకార ఉపగమం, క్రమానుగత ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం
    3) వర్తులాకార ఉపగమం, ఏకకేంద్ర ఉపగమం, సమవర్తిత విషయాలు, క్రమానుగత ఉపగమం
    4) విషయ స్వభావంపై ఆధారపడిన ఉపగమం, సమవర్తిత విషయాలు, సంచయన క్రమానుగతం, ఏకకేంద్ర ఉపగమం
17. సూక్ష్మ బోధనా ప్రక్రియలోని సోపానాల క్రమం?
    1) పరిపుష్టి, నియోజనం, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
    2) నియోజనం, పరిపుష్టి, బోధించడం, పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి
    3) పునఃయోజన, పునఃబోధన, పునఃపరిపుష్టి, నియోజనం, బోధించడం, పరి పుష్టి
    4) నియోజనం, బోధించడం, పరిపుష్టి, పునఃయోజన, పునఃబోధన, పునః పరిపుష్టి
18. 'బెల్లార్డ్' అభిప్రాయంలో ప్రాజెక్టు పద్ధతి అంటే?
    1) పాఠశాల వాతావరణంలోకి తీసుకు వచ్చిన జీవితాశయమే ప్రాజెక్టు
    2) సహజ పరిస్థితిలో ఒక సమస్యాత్మక క్రియను జయప్రదంగా పూర్తిచేయడమే ప్రాజెక్టు
    3) నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు
    4) సాంఘిక పరిసరాల్లో, హృదయ పూర్వకంగా, ఉద్దేశపూర్వకంగా కొనసాగే కార్యకలాపమే ప్రాజెక్టు
19. చర్చలో ఉండాల్సిన ప్రధానాంశాలేవి?
    1) సమస్య, విషయం, గ్రూపు
    2) సమస్య, విషయం
    3) నాయకుడు, గ్రూపు, విషయం
    4) సమస్య, విషయం, నాయకుడు, గ్రూపు
20. రాష్ట్ర మంత్రిమండలి బాధ్యతలను బోధించడానికి స్థానిక గ్రామ పంచాయతీ పనిచేసే విధానం గురించి చర్చించడం అనేది ఏ బోధనా సూత్రానికి సంబంధించింది?
    1) తెలిసినదాని నుంచి తెలియనిదానికి
    2) సంక్లిష్టత నుంచి సరళతకు
    3) అమూర్తం నుంచి మూర్తానికి
    4) భాగాల నుంచి మొత్తానికి
21. ట్రాఫిక్ ఐలాండ్ అనే పాఠాన్ని బోధించడానికి ఉత్తమ యుక్తి?
    1) చర్చ 2) క్షేత్ర పర్యటన
    3) పాత్రాభినయం 4) నాటకీకరణ
22. సమస్యా పరిష్కార పద్ధతిలో ఉన్న సోపానాల్లో రెండోది?
    1) సమస్య అధ్యయనం
    2) సమాచార సేకరణ
    3) సమస్యను గుర్తించడం
    4) సమస్య పరిష్కారం
23. 'నిజజీవిత సన్నివేశంలో పథకం ప్రకారం విద్యార్థులు సాధించిన లక్ష్యాత్మక కృత్యమే ప్రాజెక్టు' అని నిర్వచించిన వ్యక్తి?
    1) స్టీవెన్సన్ 2) కిల్ పాట్రిక్
    3) అండర్‌సన్ 4) బైనింగ్ & బైనింగ్
24. 'అయిదో తరగతి పరిసరాల విజ్ఞానం' అనే పాఠ్యపుస్తకం ఏ ఆకారానికి ఉదాహరణ?
    1) ద్వితీయ 2) ప్రధాన
    3) తృతీయ 4) చతుర్థ
25. శివాజీ జీవిత చరిత్రను బోధించడానికి అనువైన పద్ధతి?
    1) అంశ పద్ధతి 2) కథనా పద్ధతి
    3) వివరణ 4) సంభాషణ
26. స్వయంగా విద్యార్థులు పాల్గొనడానికి అవకాశం లేని పద్ధతి?
    1) ఉపన్యాస 2) చర్చా
    3) అంశాల పద్ధతి 4) జీవిత చరిత్ర
27. సాంఘికశాస్త్ర బోధనా పద్ధతుల్లో విద్యావేత్తలు దేన్ని ఉత్తమమైందిగా భావిస్తారు?
    1) ప్రణాళికా పద్ధతి 2) సమస్యా పద్ధతి
    3) ప్రశ్నోత్తర పద్ధతి 4) చర్చా పద్ధతి
28. బోధనా పద్ధతుల్లో అతి ప్రాచీనమైంది?
    1) లెక్చరు పద్ధతి 2) చర్చా పద్ధతి
    3) సంఘీకృత ఉద్గార
    4) సమస్యా పద్ధతి
29. తక్కువ కాలంలో ఎక్కువ విషయాలను బోధించడానికి అనువైన పద్ధతి?
    1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) సంఘీకృత ఉద్గార
    4) వనరుల పద్ధతి
30. విద్యార్థులకు స్వానుభవం ద్వారా విషయ జ్ఞాన సంపాదనకు తోడ్పడేది?
    1) సమస్యా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
31. బోధించిన విషయాలను తక్కువ సమయంలో సమీక్షించడానికి ఉపయోగపడే బోధనా పద్ధతి?
    1) ఉపన్యాస పద్ధతి 2) వివరణ పద్ధతి
    3) కథనా పద్ధతి 4) ప్రాకల్పనా పద్ధతి
32. బోధనలో ఉపన్యాస పద్ధతికి దేన్ని మేళవిస్తే బోధన మరింత మెరుగ్గా ఉంటుంది?
    1) వివరణ పద్ధతి 2) ప్రదర్శనా పద్ధతి
    3) సమస్యా పద్ధతి 4) వనరుల పద్ధతి
33. విద్యార్థికి ప్రాముఖ్యంలేని బోధనా పద్ధతి?
    1) చర్చా పద్ధతి 2) ఉపన్యాస పద్ధతి
    3) సమస్యా పద్ధతి 4) ప్రాకల్పనా పద్ధతి
34. సాంఘికశాస్త్ర బోధనలో విద్యార్థులకు కలిగే సంశయాలను తీరుస్తూ పాఠ్యాంశాన్ని బోధించడానికి ఉపయోగించే పద్ధతి?
    1) ఉపన్యాస 2) పర్యవేక్షణ
    3) చర్చాపద్ధతి 4) సమస్యా పద్ధతి
35. ఉపాధ్యాయుని పర్యవేక్షణలో విద్యార్థులందరూ శ్రమించి నేర్చుకోవడాన్ని ఏ బోధనా పద్ధతి అనవచ్చు?
    1) ప్రాజెక్టు 2) వనరుల పద్ధతి
    3) సంఘీకృత 4) పర్యవేక్షణాధ్యయన
36. రాజ్‌ఘాట్ అనేది ఏ రకమైన ఆధారం?
    1) తృతీయ 2) చతుర్థ
    3) ప్రాథమిక 4) ద్వితీయ
37. రెండు వరుస పీరియడ్ల పథకంలో బిల్ ఐ.సింప్సన్ ప్రకారం 'నియోజిత అధ్యయనం' అనే కార్యకలాపానికి కేటాయించిన వ్యవధి?
    1) 35 నిమిషాలు 2) 25 నిమిషాలు
    3) 20 నిమిషాలు 4) 30 నిమిషాలు
38. సామూహిక ఆలోచన, సమష్టి నిర్ధారణకు సంబంధించిన ప్రక్రియ ఏది?
    1) వాగ్వాదం 2) చర్చ
    3) సంశ్లేషణ 4) విశ్లేషణ
39. ఏ బోధనా పద్ధతిలో 'మోడరేటర్' ఆవశ్యకత ఉంది?
    1) జట్టుబోధన 2) సమస్యా పద్ధతి
    3) ప్రాజెక్టు పద్ధతి 4) చర్చా పద్ధతి
40. 'జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రం ఆధారంగా రూపొందించిన పద్ధతి?
    1) జట్టు బోధన 2) చర్చ
    3) సమస్యా పరిష్కారం 4) ప్రాజెక్టు
41. జట్టు బోధన రూపకల్పనలో నాలుగు ఉపగమాలను సూచించినవారు?
    1) కిల్ పాట్రిక్ 2) మాక్స్‌వెల్
    3) కిల్లర్ 4) డెవిడ్ వార్విక్
42. ప్రాజెక్టుల రకాలను సూచించిన వారెవరు?
    1) జాన్ డ్యూయి 2) కిల్ పాట్రిక్
    3) బైనింగ్ 4) బెల్లార్డ్
43. ఒక అంశానికి ఉన్న పూర్వచరిత్ర చెప్పడానికి ఏ పద్ధతి ప్రయోజనకరంగా ఉంటుంది?
    1) ప్రాజెక్టు
    2) సమస్యా పరిష్కార
    3) ఉపన్యాస 4) ప్రాకల్పనా
44. ఉపన్యాస పద్ధతిని ఎప్పుడు ఉపయోగించాలి?
    1) సింహావలోకనం చేయడానికి
    2) సారాంశాన్ని తయారుచేసి పాఠ్యాంశాన్ని సమీక్షించడానికి
    3) అభిమానులను ఉద్దీపించడానికి
    4) పైవన్నీ
45. విద్యార్థులు 'జీవించడానికి నేర్చుకోకుండా జీవిస్తూ నేర్చుకోవాలి' అనే సూత్రంపై ఆధారపడే పద్ధతి ఏది?
    1) ప్రక్షేపణ పద్ధతి 2) సమస్యా పద్ధతి
    3) అన్వేషణా పద్ధతి
    4) మూలాధార పద్ధతి
46. ప్రాకల్పనా పద్ధతిలోని ప్రధాన సూత్రాల్లో చివరిది?
    1) స్వేచ్ఛా సూత్రం
    2) వాస్తవికతా సూత్రం
    3) ఉద్దేశ సూత్రం
    4) ఉపయుక్తతా సూత్రం

సమాధానాలు

1) 2	2) 4	3) 4	4) 3	5) 4
6) 1	7) 1	8) 2	9) 2	10) 3
11) 3	12) 4	13) 2	14) 2	15) 1
16) 4	17) 4	18) 1	19) 4	20) 1
21) 2	22) 2	23) 4	24) 2	25) 2
26) 1	27) 4	28) 1	29) 2	30) 3
31) 1	32) 2	33) 2	34) 2	35) 1
36) 3	37) 1	38) 2	39) 4	40) 4
41) 4	42) 2	43) 3	44) 4	45) 1
46) 4				

ఆరోగ్యకరమైన చర్మానికి అవసరమయ్యే విటమిన్?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

బయాలజీ

జీవ రసాయనాలు

జీవుల్లో మాత్రమే తయారయ్యే రసాయనాలను జీవ రసాయనాలు (Biochemicals) అంటారు. వీటి అంతర చర్యల ద్వారా మాత్రమే జీవి మనుగడ సాధ్యమవుతుంది. ప్రస్తుతం మానవుడు వీటిని కృత్రిమంగా తయారు చేయగలుగుతున్నాడు. పిండి పదార్థాలు, కొవ్వులు, ప్రోటీన్లు, విటమిన్లు, కేంద్రకామ్లాలు ముఖ్యమైన జీవ రసాయనాలు.

పిండి పదార్థాలు

పిండి పదార్థాలు(Carbohydrates) జీవులకు ప్రధాన శక్తి వనరులు. ఇవి C, H, D లాంటి పదార్థాలతో నిర్మితమై ఉంటాయి. వీటి ని సాధారణంగా చక్కెరలు (Sugars) అంటా రు. అన్ని చక్కెరలు తియ్యగా ఉండవు. అత్యంత సరళమైన పిండి పదార్థాలు మోనోశాకరైడ్స్.

ఉదా: గ్లూకోజ్, ఫ్రక్టోజ్, గాలక్టోజ్.

ఈ మూడింటిలోనూ ఆరు కార్బన్లు ($C_6H_{12}O_6$) ఉంటాయి. కాబట్టి వీటిని హెక్సోజ్‌లు అంటారు. రెండు మోనోశాకరైడ్‌ల మధ్య బంధం ఏర్పడటం ద్వారా డై శాకరైడ్ తయారవుతుంది.

ఉదా: సుక్రోజ్, లాక్టోజ్, మాల్టోజ్.

సుక్రోజ్ చెరకురసంలో ఉంటుంది. దీన్ని కేన్ షుగర్ అంటారు. దీన్ని Invert Sugar and Table Sugar అని కూడా అంటారు. అనేక మోనోశాకరైడ్‌ల మధ్య బంధం ఏర్పడటం ద్వారా లభించేది పాలీశాకరైడ్.

ఉదా: స్టార్చ్, సెల్యులోజ్, గ్లైకోజన్.

సాధారణంగా పాలీశాకరైడ్‌లు తియ్యగా ఉండవు. మోనో, డై శాకరైడ్‌లు తియ్యగా ఉంటాయి.

ప్రోటీన్లు

శరీర అభివృద్ధికి కీలకమైన జీవ రసాయనాలు ప్రోటీన్లు. వీటినే మాంసకృత్తులు అంటారు. ఇవి అమైనో ఆమ్లాలు అనే ప్రమాణాల పాలిమర్లు. అమైనో ఆమ్లాల మధ్య పెప్టైడ్ బంధాలు ఏర్పడటం ద్వారా ప్రోటీన్ తయారవుతుంది. ప్రోటీన్లు మానవ శరీరంలో అనేక విధులను నిర్వర్తిస్తాయి. శరీరంలో అత్యధిక ప్రోటీన్లు ఎంజైమ్‌లుగా వ్యవహరిస్తాయి. శరీరంలో జరిగే రసాయనిక చర్యల్లో ఇవి ఉత్ప్రేరకాలుగా వ్యవహరించి, చర్యలు తక్కువ శక్తి వద్ద వేగంగా జరిగేలా తోడ్పడతాయి. జీర్ణక్రియ, శ్వాసక్రియ, కండర సంకోచం, రక్తస్కంధనం లాంటి శరీర క్రియలన్నీ రసాయనిక చర్యల ద్వారానే సాధ్యమవుతాయి. ఎంజైమ్‌లు ఈ రసాయనిక చర్యలను నిర్వహిస్తూ, శరీర పెరుగుదలకు దోహదపడతాయి.

ఉదా: పెప్సిన్, ట్రిప్సిన్.

కొన్ని ప్రోటీన్లు హార్మోన్‌లుగా కూడా వ్యవహరించి, శరీర జీవక్రియలను నియంత్రిస్తాయి.

ఉదా: పెరుగుదల హార్మోన్.

ఇది పెరుగుదలను ప్రేరేపిస్తుంది. ఇన్సులిన్, గ్లూకగాన్ రెండూ కలిసి రక్తంలో చక్కెర శాతాన్ని నియంత్రిస్తాయి. మరికొన్ని ప్రోటీన్లు నిర్మాణ ప్రమాణాలుగా వ్యవహరిస్తాయి.

ఉదా: కెరాటిన్. ఇది గోర్లు, రోమాలు, కొమ్ములు లాంటి నిర్మాణాల్లో ఉంటుంది.

కొవ్వులు

కొవ్వులు శక్తి వనరులుగా, రిజర్వు ఆహారంగా ఉపయోగపడతాయి. సరళ కొవ్వులను ట్రై గ్లిసరైడ్స్ అంటారు. ఒక ట్రై గ్లిసరైడ్‌లో ఒక గ్లిసరాల్ అణువుకు మూడు కొవ్వు ఆమ్లాలు ప్రత్యేక ఎస్టర్ బంధాల ద్వారా బంధితమై ఉంటాయి. అన్ని రకాల వంట నూనెల్లో ఈ ట్రై గ్లిసరైడ్‌లు ఉంటాయి. ఒక కొవ్వు ఆమ్లంలోని కార్బన్లన్నింటి మధ్య ఏకబంధాలు ఉంటే దాన్ని సంతృప్త(Saturated) కొవ్వు ఆమ్లం అంటారు. ఒక కొవ్వు ఆమ్లంలోని కార్బన్ల మధ్య కనీసం ఒక ద్వి బంధం లేదా త్రి బంధం ఉన్నట్లయితే దాన్ని అసంతృప్త (Unsaturated) కొవ్వు ఆమ్లం అంటారు. ఇలాంటి ద్వి బంధాలు, త్రి బంధాలు ఎక్కువగా ఉంటే దాన్ని Poly Unsaturated Fatty Acids (PUFA) అంటారు. ఇవి ఆరోగ్యానికి, ముఖ్యంగా గుండె పనితీరును మెరుగుపరచడానికి తోడ్పడతాయి. సంక్లిష్ట కొవ్వులకు కొలెస్టరాల్ మంచి ఉదాహరణ. శరీరంలో కొవ్వు నిల్వ ఉన్న కణజాలం అడిపోజ్. స్టీరాయిడ్‌లు, మైనం (Waxes) కూడా కొవ్వు పదార్థాలే.



విటమిన్లు

మానవుడికి పోషణలో కేవలం స్వల్ప మోతాదులో మాత్రమే అవసరమయ్యే కర్బన పోషకాలనే విటమిన్లు అంటారు. ఇవి శక్తి వనరులు కావు. ఒక విటమిన్ లేదా విటమిన్‌లోని భాగం లేదా దాని ఉత్పాదకం సహ ఎంజైమ్‌గా వ్యవహరిస్తూ రసాయనిక చర్యల్లో ఎంజైమ్‌లకు దోహదం చేస్తాయి. ఇవి ముఖ్యంగా శక్తి విడుదలయ్యే ప్రక్రియల్లో సహ ఎంజైమ్‌లుగా వ్యవహరిస్తాయి. రసాయనిక స్వభావం ఆధారంగా విటమిన్లను రెండు రకాలుగా విభజిస్తారు. అవి..

1. కొవ్వుల్లో కరిగేవి: A, D, E, K
2. నీటిలో కరిగేవి: బి-కాంప్లెక్స్, C.

ఆరోగ్యకరమైన దృష్టికి విటమిన్ A అవసరం. B_1 (థయామిన్), B_2 (రైబోఫ్లేవిన్), B_3 (నియాసిన్) లాంటివి ప్రధానంగా శక్తి విడుదల ప్రక్రియకు, ప్రోటీన్, పిండి పదార్థం, కొవ్వుల జీవక్రియల్లో అవసరమవుతాయి. B_9 (ఫోలిక్ ఆమ్లం), B_{12} (సయనకోబాలమిన్) విటమిన్లు హిమోగ్లోబిన్ ఏర్పడటానికి, ఎర్ర రక్త కణాల పరిపక్వతకు తోడ్పడతాయి. బలమైన ఎముకలు, దంతాలకు, కాల్షియం, ఫాస్ఫరస్ జీవక్రియ నియంత్రణకు విటమిన్ D అవసరమవుతుంది. ఇది సూర్యరశ్మి నుంచి లభిస్తుంది. విటమిన్ K ఒక అనుబంధ రక్తస్కంధన కారకంగా వ్యవహరిస్తుంది.

ఆరోగ్యకరమైన చర్మానికి, ప్రత్యుత్పత్తి వ్యవస్థ అభివృద్ధికి విటమిన్ E అవసరం. నోటి ఆరోగ్యానికి, బలమైన చిగుళ్లకు విటమిన్ C అవసరం. విటమిన్ E, విటమిన్ C యాంటీ ఆక్సిడెంట్లుగా వ్యవహరిస్తాయి.

కేంద్రకామ్లాలు

కేంద్రకామ్లాలు అనే జీవ రసాయనాలు జన్యు పదార్థంగా వ్యవహరిస్తాయి. ఇవి రెండు రకాలు. 1) డీ ఆక్సీ రైబో న్యూక్లిక్ యాసిడ్ (DNA), 2) రైబో న్యూక్లిక్ యాసిడ్ (RNA). వీటిలో ప్రధాన జన్యు పదార్థం DNA.

కేవలం కొన్ని వైరస్‌లలో RNA ప్రధాన జన్యు పదార్థంగా ఉంటుంది. జీవుల లక్షణాలకు సంబంధించిన సమాచారాన్ని పొందుపరుచుకోవడమే కాకుండా వాటిని కొత్త తరానికి సంక్రమింపజేసే విధులను DNA నిర్వర్తిస్తుంది. DNA, RNA రెండూ న్యూక్లియోటైడ్ అనే ప్రమాణాల పాలిమర్లు..

విటమిన్	రసాయనిక నామం	దాని లోపం ద్వారా వచ్చే వ్యాధులు
A	రెటినాల్	రేచీకటి, కెరటోమలేసియా, జీరాఫ్తాల్మియా
D	కాల్సిఫెరాల్	రికెట్స్, ఆస్టియోమలేసియా
E	టోకోఫెరాల్	లోపం అరుదు. పక్షుల్లో వ్యంధ్యత్వం, నవజాత శిశువుల్లో హీమోలైటిక్ అనీమియా
K	ఫిల్లోక్వినోన్/ మినాక్వినోన్	డయాథెసిస్, ఆలస్యంగా రక్తస్కంధనం
B_1	థయామిన్	బెరిబెరి, పాలీ న్యూరిటిస్, వెర్నికె-కోర్సకాఫ్ సిండ్రోమ్
B_2	రైబోఫ్లేవిన్	ఎరైబోఫ్లేవినోసిస్, గ్లాసిటిస్, కీలోసిస్
B_3	నియాసిన్/ నికోటినమైడ్	పెల్లాగ్రా/ 4డి సిండ్రోమ్
B_5	పాంటోథెనిక్ ఆమ్లం	పారెస్తీసియా
B_6	పైరిడాక్సిన్/ పైరిడాక్సామైన్	న్యూరోపతి
B_7	బయోటిన్	డెర్మటైటిస్, ఎంటిరైటిస్
B_9	ఫోలిక్ ఆమ్లం/ ఫొలాసిన్	మెగలోబ్లాస్టిక్ అనీమియా
B_{12}	సయనకోబాలమిన్	పెర్నీసియస్ అనీమియా
C	ఆస్కార్బిక్ ఆమ్లం	స్కర్వీ

మాదిరి ప్రశ్నలు

1. చెరకురసం నుంచి ప్రత్యేకంగా తయారుచేసే మత్తు పానీయం?
   ఎ) విస్కీ బి) వోడ్కా
   సి) రమ్ డి) ఫెన్నీ
2. డీఎన్ఏలో ఏ రకమైన చక్కెర ఉంటుంది?
   ఎ) హెక్సోజ్ బి) పెంటోజ్
   సి) టెట్రోజ్ డి) ట్రయోజ్
3. సహజ చక్కెరల్లో తియ్యనిది ఏది?
   ఎ) సుక్రోజ్ బి) గ్లూకోజ్
   సి) స్టార్చ్ డి) ఫ్రక్టోజ్
4. మధుమేహ రోగుల కోసం ప్రత్యేకంగా ఉపయోగించే కృత్రిమ తీపి రసాయనం?
   ఎ) సుక్రలోజ్ బి) ఆస్పర్టేం
   సి) శాకరిన్ డి) అన్నీ
5. ఒక గ్రాము ఆల్కహాల్ ద్వారా ఎన్ని కిలో క్యాలరీల శక్తి లభిస్తుంది?
   ఎ) 4 బి) 7
   సి) 9 డి) 12
6. ఖడ్గమృగం కొమ్ముల్లో ప్రధానంగా కన్పించే ప్రోటీన్?
   ఎ) కెరాటిన్ బి) సెరిసిన్
   సి) థైబ్రోమిన్ డి) కొల్లాజెన్
7. కిందివాటిలో ఆవశ్యక అమైనో ఆమ్లం?
   ఎ) ఫినైల్ అలనిన్ బి) ఆస్పర్టిక్ ఆమ్లం
   సి) గ్లుటమిక్ ఆమ్లం డి) గ్లైసిన్
8. ఒమెగా-3 ఫ్యాటీ యాసిడ్స్ అనే ఆరోగ్యకరమైన కొవ్వు ఆమ్లాలు ఏ చేపలో లభిస్తాయి?
   ఎ) హిల్సా బి) సాల్మన్
   సి) మెకరల్ డి) అన్నీ
9. కిందివాటిలో స్యాచురేటెడ్ కొవ్వు ఆమ్లం?
   ఎ) పామిటిక్ ఆమ్లం
   బి) లినోలిక్ ఆమ్లం
   సి) లినోలెనిక్ ఆమ్లం
   డి) అరాకిడోనిక్ ఆమ్లం
10. ఆహారంలో ప్రోటీన్ల లోపం వల్ల పిల్లల్లో అభివృద్ధి కుంటుపడటాన్ని ఏమంటారు?
   ఎ) మరాస్మస్ బి) క్వాషియోర్కర్
   సి) మరుగుజ్జుతనం డి) విల్సన్ డిసీజ్
11. ప్రోటీన్ కర్మాగారాలు ఏవి?
   ఎ) మైటోకాండ్రియా బి) లైసోజోమ్‌లు
   సి) రైబోజోమ్‌లు డి) గాల్జీ సంక్లిష్టం
12. మనిషి కండరాల్లో అత్యధిక మోతాదులో కన్పించే ప్రోటీన్ ఏది?
   ఎ) ఆక్టిన్ బి) మయోసిన్
   సి) కొల్లాజెన్ డి) కెరాటిన్
13. బ్రౌన్ ఫ్యాట్ అంటే?
   ఎ) రక్త సరఫరా లేని కొవ్వు
   బి) రక్త సరఫరా ఉన్న కొవ్వు
   సి) కుళ్లుతున్న కొవ్వు
   డి) పిండి పదార్థంతో కలిసిన కొవ్వు
14. కిందివాటిలో ఎంజైమ్ కానిది ఏది?
   ఎ) పెప్సిన్ బి) టయలిన్
   సి) గ్యాస్ట్రిన్ డి) స్టియాప్సిన్
15. ఆంగ్ల అక్షరాల ఆధారంగా విటమిన్లను సంబోధించే విధానాన్ని ప్రవేశపెట్టిందెవరు?
   ఎ) కాసిమర్ ఫంక్ బి) జె.సి.డ్రామండ్
   సి) జేమ్స్ లిండ్ డి) ఐజక్‌మన్
16. ఎల్లో ఎంజైమ్ అని ఏ విటమిన్‌ను పిలుస్తారు?
   ఎ) రెటినాల్ బి) రైబోఫ్లేవిన్
   సి) బయోటిన్ డి) నియాసిన్
17. ఏ విటమిన్ లోపం ద్వారా నోటి అంచుల వద్ద పగుళ్లు ఏర్పడే కీలోసిస్ అనే వ్యాధి వస్తుంది?
   ఎ) B_1 బి) B_2
   సి) B_3 డి) B_5

సమాధానాలు

1) సి 2) బి 3) డి 4) డి 5) బి
6) ఎ 7) ఎ 8) డి 9) ఎ 10) బి
11) సి 12) బి 13) ఎ 14) సి 15) బి
16) బి 17) బి.

How many steps will be...

BANK EXAMS

REASONING

INPUT-OUTPUT

In Input-Output problems an aspirant is asked to imagine a kind of computer or a word processing machine which performs some operations repeatedly on a given input as per a pre-fixed manner and subsequently different output are given in different steps.

Arrangement: The words or the numbers are arranged as per a fixed order.

Generally the order can be alphabetical order incase of words, increasing or decreasing incase of numbers. Arrangement ends as soon as the desired order is achieved.

In case of arrangement a word that comes alphabetically first (or last) in a dictionary will go to first (or last) place, in the first step. Similarly a word which comes second (or second last) in alphabetical order which go to second (or second last) place and so on.

If the input consists of numbers, the smallest (or largest) number going to the first (or last) place in first step. Similarly the second smallest (or second largest) will go to second (or second last) place in the second step.

Directions (Q.No: 1–5): ***Study the following information carefully and answer the questions given below:***

A word and number arrangement machine when given an input line of words and numbers rearranges them following a particular rule in each step. The following is an illustration of input and various steps of rearrangement. (All the numbers are two digit numbers).

Input: plan more vacation 35 56 92 nice holiday tours 84 61 12
Step I: 92 plan more vacation 35 56 nice tours 84 61 12 holiday
Step II: 92 84 plan vacation 35 56 nice tours 61 12 more holiday
Step III: 92 84 61 plan vacation 35 56 tours 12 nice more holiday
Step IV: 92 84 61 56 vacation 35 tours 12 plan nice more holiday
Step V: 92 84 61 56 35 vacation 12 tours plan nice more holiday
Step VI: 92 84 61 56 35 12 vacation tours plan nice more holiday

And Step VI is the last step of the rearrangement as the desired arrangement is obtained.

As per the rules followed in the above steps, find out in each of the questions the appropriate step for the given input.

Analysis: On observing the last step it can be concluded that numbers are arranged in the descending order from left end and the words are arranged in the alphabetical order from the right end. The first five steps reveal that one number and one word are arranged in the respective order in each step. Each time the remaining numbers are pushed to the right.

Questions:

Input: hard work pays 96 42 in 79 long run 18 25 57

1. Which step number is the following output?
96 79 57 42 work run 18 25 pays long in hard
1) Step II 2) Step III
3) Step IV 4) Step V
5) There is no such step

A: 3
As four numbers 96, 79, 57 and 42 are arranged in descending order from left and four words viz. hard, in, long and pays are arranged in alphabetical order from right end, it can be established that the given step is the fourth step of the arrangement.

2. How many elements (words/ numbers) are there between "work" and "in" as they appear in Step III?
1) Six 2) Five
3) Seven 4) Four
5) Three

A: 1
In the III step the elements 96, 79 and 57 will take the first three positions and the word 'work' will take the fourth position from the left end. Similarly the word 'in' will occupy the second position from right end (i.e. eleventh position from the left end). Therefore there are 11– 4– 1 = 6 elements (words/numbers) between 'work' and 'in'.



3. Which of the following represents the positions of "pays" in the Step II?
1) Seventh from right
2) Sixth from left
3) Eighth from right
4) Fourth from left
5) Fifth from left

A: 4
In II step 96 and 79 will occupy the first and second positions respectively followed by the words 'work' and 'pays' in the next two positions. Therefore the word 'pays' represents the fourth position from the left end in step II.

4. Which word/ number would be at the seventh position from the right in the Step IV?
1) work 2) run 3) long
4) 18 5) 25

A: 2
In Q. No. 1, the IV step is given. It can be seen that the word 'run' takes seventh position from the right end.

5. Which word/number would be third to the left of the fourth element from the right in the Step III?
1) pays 2) 42 3) run
4) 18 5) work

A: 2;
The element third to the left of fourth element from the right will be 4+3=7th element from the right.Therefore the same element will occupy13–7=6th position from the left end. In step III 96, 79 and 57 will occupy the first three positions followed by 'work', 'pays' and 42 in the subsequent three positions. Therefore the number 42 will take the sixth position from the left end in step III.

Directions (Q.No: 6-10): ***Study the given information and answer the following questions:***

When a word and number arrangement machine is given an input line of words and numbers, it arranges them following a particular rule. The following is an illustration of input and rearrangement. (All the numbers are two digit numbers).

Input: 40 made butter 23 37 cookies salt extra 52 86 92 fell now 19
Step I: butter 19 40 made 23 37 cookies salt extra 52 86 92 fell now
Step II: cookies 23 butter 19 40 made 37 salt extra 52 86 92 fell now
Step III: extra 37 cookies 23 butter 19 40 made salt 52 86 92 fell now
Step IV: fell 40 extra 37 cookies 23 butter 19 made salt 52 86 92 now
Step V: made 52 fell 40 extra 37 cookies 23 butter 19 salt 86 92 now
Step VI: now 86 made 52 fell 40 extra 37 cookies 23 butter 19 salt 92
Step VII: salt 92 now 86 made 52 fell 40 extra 37 cookies 23 butter 19

Step VII is the last step of the above arrangement as the intended arrangement is obtained. As per the rules followed in the given steps, find out the appropriate steps for the given input.

Analysis: It is observed from the last step, numbers and words are arranged alternately, words in the reverse dictionary order and numbers in the descending order from the left end or the words in the dictionary order and the numbers in the ascending order from the right end. From the first six steps it can be concluded that every time a word and a number are arranged in dictionary order and ascending order respectively from the left end but they are pushed to right in the subsequent steps.

Questions:

Input: 32 proud girl beautiful 48 55 97 rich family 61 72 17 nice life

6. How many steps will be required to complete the given input?
1) Five 2) Six 3) Seven
4) Eight 5) Nine

A: 3
There are fourteen elements in the given input. In each step a word and a number (two elements) are arranged in the respective order, it will take 14 by 2 i.e. 7 steps to complete the arrangement.

7. Which of the following is the third element from the left end of Step VI?
1) beautiful 2) life 3) 61
4) nice 5) 17

A: 4
In V step, the word 'nice' will take the first position and the number 61 will take the second position. In the subsequent VI step they are pushed towards right taking third and fourth positions respectively. Therefore the word 'nice' will take the third position from the left end in the VI step.

8. Which of the following is Step III of the given input?
1) proud 72 girl 48 family 32 beautiful 17 55 97 rich 61 nice life
2) life 55 girl 48 family 32 beautiful 17 proud 97 rich 61 72 nice
3) girl 48 family 32 beautiful 17 proud 55 97 rich 61 72 nice life
4) family 32 beautiful 17 proud girl 48 55 97 rich 61 72 nice life
5) girl 48 life 55 family 32 beautiful 17 proud 97 rich 61 72 nice

A: 3
In III step, the word 'girl' will take the first position and the number 48 will take the second position. Since the word 'family' and the number 32 take the first and second positions in the previous step, will occupy the third and fourth positions respectively in Step III. Only option 3 will satisfy the above two conditions.

9. What is the position of nice from the left end in the final step?
1) Fifth 2) Sixth 3) Seventh
4) Eighth 5) Ninth

A: 1
The word 'nice' takes the first position in Step V and in each of subsequent VI and VII steps two elements precede this word. Therefore a total of four elements precede the word 'nice' that means the word 'nice' will take the fifth position from the left end in the final step.

10. Which element is third to the right of 'family' in Step V?
1) beautiful 2) 17 3) proud
4) 97 5) 32

A: 2
In step II the word 'family' takes the first position, the number 32 the second position, the word 'beautiful' the third position and the number 17 the fourth position from the left end.
In every subsequent steps the elements 'family 32 beautiful 17' will be pushed to the right with no element coming in between them. Therefore the element third to the right of 'family' will be 17 in each of the steps from II to VII. .